# సాయి దేశం - గాంధీ మార్గం

(ఆధ్యాత్మిక పునాదులపై బాలబాలికలతో నైతిక విలువల నిర్మాణ వేదిక)



## బోసిపోతోన్న
## బాలుర భవితవ్యం



చెరుకూరి రామారావు

సాయి దేశం - గాంధీ మార్గం

(ఆధ్యాత్మిక పునాదులపై బాలబాలికలతో నైతిక విలువల నిర్మాణ వేదిక)

# బోసిపోతోన్న బాలుర భవితవ్యం

చెరుకూరి రామారావు

# BOSIPOTHONNA BALURA BHAVITHAVYAM

By

## CHERUKURI RAMA RAO


---


| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ | - | ఫిబ్రవరి 2008 |
| కాపీలు | - | 1000 |
| వెల | - | రూ॥ 100/- |
| ప్రతులకు | - | చెరుకూరి రామారావు,<br>రచయిత<br>హెడ్ ఆఫీస్ - ప్లాట్ నెం. 29,<br>ఫేజ్-1, మెయిన్ రోడ్,<br>వనస్థలిపురం, హైదరాబాద్ - 500070.<br>ఆంధ్ర ప్రదేశ్.<br>ఫోన్ - 040-24125356, 24120399 |

---

Printed at : **SRI SHIRDI SAI GRAPHICS,**
Offset Process, Multicolour Printers
H.No. 35-377, Vittalwadi Centre,
Narayanguda, Hyderabad-29.
Ph : 040-23220767

# పిల్లలను గూర్చి పెద్దల మాటలు



## పిల్లల్లోనే నిజాయితీ ఎక్కువ

"పెద్ద వారికన్నా పిల్లల్లోనే ఎక్కువ నిజాయితీ కనిపిస్తుంది. పెద్దరికాన్ని విడిచి, ఒద్దికగా ఉండగలిగితే.. అజ్ఞానులైన పిల్లల ద్వారానే మనం జీవితంలో గొప్ప పాఠాలు నేర్చుకోవచ్చు.


ఈ ప్రపంచంలో నిజమైన శాంతిని సాధించాలంటే, యుద్ధాలకు వ్యతిరేకంగా నిజమైన యుద్ధం చేయాలంటే ముందుగా దానిని పిల్లలతోనే ప్రారంభించాలి.

దుష్ట సంప్రదాయాల ప్రభావాలపై విజయం సాధించిన చిన్నారులను కూడా నేను చూశాను. అది వారిలోని నిష్కల్మషమైన మనస్సు వల్లనే సాధ్యమైంది.

జాతిపిత

**మహాత్మా గాంధీ**

******




# విద్యా విధానమంతటికీ ప్రాథమిక విద్యయే గట్టి పునాది

విద్య అంటే కేవలం పుస్తకాలను బట్టీ పట్టడం, పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం కాదు. వాస్తవానికి ఉత్తమ విద్యా విధాన మంటే తక్కువ పుస్తకాలతో ఉత్తమ ప్రత్యక్ష శిక్షణ గరపడటమే. ఏ విధమైన విద్యావిధానంలో నైనా దృఢమైన నిశ్చయం, ధైర్యసాహసాలతో జీవితాన్ని ఎదుర్కొనే విధంగా తీర్చి దిద్దడమే ప్రధాన లక్ష్యం.

దేశాన్ని దృఢంగా నిర్మించేందుకు అవసరమైన విద్యావిధాన మంతటికీ "ప్రాథమిక విద్య"యే గట్టి పునాదిగా నిలవాలి.

**జవహర్ లాల్ నెహ్రూ**
భారత ప్రధాని (మాజీ)

******



# పిల్లలకు ప్రేమను పంచే ప్రపంచం కావాలి


నిజంగా పిల్లలే సహజ శైలిలో జీవిస్తుంటారు. పెద్దలంతా తమ చుట్టూ అలవాట్లు అనే కవచాలు నిర్మించుకొని అదే తమ లోకమని అనుకుంటారు. అందువల్ల పిల్లల మానసిక ఆరోగ్యం, అభివృద్ధి కోసం కేవలం పాఠాలు బోధించే బడులుంటే సరిపోదు. ప్రేమను పంచే ప్రపంచం కావాలి.

పిల్లలు ఏదైనా త్వరగా నేర్చుకుంటారు. అది వారికి ప్రకృతి ఇచ్చిన వరం. కానీ ఈ సహజ గుణాన్ని వదిలేసి తమను చూసి నేర్చుకోమని పెద్దవాళ్లు పిల్లలను బలవంతం చేస్తుంటారు. అది అన్నింటికన్నా క్రూరమైన నేరం.

**రవీంద్రనాథ్ ఠాగూర్**

విశ్వకవి

******




# పిల్లలకు సైన్స్‌తో పాటు అహింసా విలువలు ముఖ్యం

మాట్లాడే అవకాశం, గొప్ప సాహిత్యాన్ని చదువుకోవడం, అహింసా విలువలను చర్చించడంతో పాటు సైన్స్, ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్ఠికాహారం వంటి వాటి ప్రాథమిక సూత్రాలు అందరు పిల్లలూ తెలుసుకోవాలి.

**ఆచార్య వినోబాభావే**

******



# సద్గుణాలను పాదుకొల్పడం ఇంటి నుంచే జరగాలి

పిల్లలు దేనినైనా అతి తొందరలో గ్రహిస్తారు. మంచిని అయినా, చెడును అయినా - పిల్లలు తల్లిదండ్రుల దగ్గరే ఎక్కువగా మెదులుతూంటారు కాబట్టి తల్లిదండ్రులు చెప్పేవన్నీ, చేసేవన్నీ వారిలో ముద్రను వేస్తాయి. నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న అవినీతి నిర్మూలనకు పాఠాలు ఇంట్లోనే తల్లిదండ్రుల ద్వారానే జరగాలి. ఆ తరువాత పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలకు బోధించి వారిని సక్రమమైన మార్గంలో నడిచేలా చెయ్యాలి.

**డా॥ అబ్దుల్ కలాం**

(మాజీ రాష్ట్రపతి)

******



# చదువును సమాజ సేవకు వినియోగించాలి

గ్రామీణ పేదల అభ్యున్నతికి విద్యావంతులు, వివేకశీలురు, ఆత్మ విశ్వాసం గల మహిళలు కృషి చెయ్యాలి.

సమాజ చైతన్యం ద్వారా దేశానికి సేవ చేసే అవకాశాన్ని పొందాలి. చదువుకోని, చదువుకోలేని వారిలో నైపుణ్యాన్ని వెలికి తీసే బాధ్యత విద్యావంతులదే. చదువుద్వారా సమాజాభివృద్ధికి పాటు పడడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.

**ప్రతిభా పాటిల్**

భారత రాష్ట్రపతి

******



# బాలలకు విద్యా హక్కు కల్పించండి

పాఠశాలల్లో "డ్రాప్ ఔట్లు" తగ్గక పోవడంపై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ విచారం వ్యక్తం చేస్తూ, బాలలకు విద్యాహక్కు కల్పించేలా రాష్ట్రాలు చట్టాలు చేయాలని కోరారు.

పాఠశాలల్లో బాలలు అధికంగానే ఒక పక్క చేరుతున్నప్పటికీ, అదే స్థాయిలో మరో పక్క బడిమానివేస్తున్నారనీ, కనీసం ప్రాథమిక విద్యను కూడా పూర్తి చేయడం లేదనీ సోనియా విచారం వ్యక్తం చేశారు.

"అంతర్జాతీయ చైల్డ్ డే" సందర్భంగా బాలల హక్కులపై ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్‌ను సోనియా ప్రారంభిస్తూ అన్నమాటలివి.

బాలల చదువుకునే హక్కుపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయా రాష్ట్రాలకు ముసాయిదా ప్రతిపాదనలను పంపించింది. ఈ విషయమై జాప్యం తగదని, రాష్ట్రాలు వెంటనే బాలలకు విద్యాహక్కును కల్పించాలని సోనియా కోరారు.

ప్రాథమిక విద్యను మరింత ఆసక్తికరంగా బోధిస్తే బాలల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మక శక్తి పెంపొందుతాయి. పౌష్టికాహార లోపం, భ్రూణహత్యలు, బాలలపై అత్యాచారాలు వంటి సవాళ్లను దేశం ఎదుర్కొంటోంది. ఆడ పిల్లలను పుట్టిన నాటి నుంచి తక్కువగా చూస్తూ సమానావకాశాలను కల్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**సోనియా గాంధీ**

భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలు

******



# భావి సవాళ్లను ఎదుర్కొనే యోధులుగా బాలబాలికలను తీర్చిదిద్దాలి

అందరికీ విద్యను అందించి, సృజనాత్మకతను, ప్రావీణ్యతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ లక్ష్య సాధనకు సంస్కరణలు, పెట్టుబడులు విద్యారంగంలో అవసరం.

గత కాలపు జ్ఞాపకాలకు బందీలు కాకుండా, భావి సవాళ్ల నెదుర్కొనే యోధులుగా బాల బాలికలను తీర్చి దిద్దే నవీన విద్యా విధానం ఎంతో అవసరం.

సృజనాత్మకతను అణచివేసే విధంగా కాకుండా ముందు చూపుతో కూడిన "మానవీయ విద్య" నేటి సమాజానికి కావాలి.

అడవులు అంతరించకుండా, కార్బన్ వ్యర్థాల సమస్య నెదుర్కొనే విధంగా బాలాబాలికలు రూపొందాలి.

**డాక్టర్ మన్మోహన్ సింగ్**
భారత ప్రధాని

******



# బాలల అభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయం

పుట్టిన పిల్లలకు విద్యా, పౌష్టికాహారం, వృత్తి వంటి సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులపైన ఉంది.

"బాల్యం మీ హక్కు" - విద్యార్థి బాల్య దశలో ప్రతీ ఒక్కరు చింత లేకుండా అన్ని రకాల నేర్పరితనం, మంచి చదువు, క్రమ శిక్షణను అలవర్చుకోవాలి.

బాలల సమగ్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం పని చేస్తూనే ఉంటుంది.

**డా॥ వై.యస్. రాజశేఖర రెడ్డి**

ముఖ్య మంత్రి (ఆం.ప్ర.)




# ప్రామాణిక విద్య ఆవశ్యకత

సమాజంలోని అనేక దుష్టాచారాల నిరోధానికి విద్య ద్వారానే పరిష్కారం లభిస్తుంది. విలువలతో కూడిన విద్యను విద్యార్థుల కందిచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్య అనంతరం స్వయం ఉపాధి అవకాశాలు కలిగించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**దగ్గుబాటి పురంధరేశ్వరి**
కేంద్ర మానవ వనరుల సహాయ
మంత్రి

******

## నా మాట



ప్రతి వ్యక్తికీ బాల్య, యౌవన, కౌమార్య, వృద్ధ దశలుంటాయి. ఈ దశల్లో అన్నింటి కంటే ముఖ్యమైనదీ, జీవితాన్ని ప్రభావితం చేసేదీ బాల్యమే. అందువల్ల ఈ బాల్య దశను ఎంతో పదిలంగా కాపాడుకోవాలి. ఈ బాల్యాన్ని సరియైన రీతిలో జాగ్రత్తగా పెంచి పోషించాలి.

పిల్లలకు ఇల్లే మొదటి బడి. తల్లిదండ్రులే మొదటి గురువులు – ఇల్లే పవిత్రమైన వేదిక – ఓ పవిత్రమైన ఆలయం లాంటిది. ఈ పవిత్రమైన ఆలయంలోనే పిల్లల భావి జీవితానికి బాటలు పడాలి.

పిల్లల్లో అనుకరించే శక్తి తీక్షణంగా ఉంటుంది. వారు మంచినీ అనుకరిస్తారు. చెడునూ అనుకరిస్తారు. అందువల్ల పిల్లలు మంచినే అనుకరించి అలవర్చుకోడానికి తల్లిదండ్రులు దోహదపడాలి. అందుకు వారు పిల్లల ముందు ఎంతో ఆదర్శంగా మెదలాలి. వారి లేత మనస్సులపై చెడు ప్రభావం పడకుండా చూసుకోవాలి. వారి మనస్సులూ, జీవితాలూ మంచి దారిలో పయనించేలా చెయ్యాలి. వారికి నీతి శతకాలూ, ఆదర్శ పురుషుల జీవితాలూ, దేశభక్తుల ఆదర్శ జీవితాలను గూర్చి తెలియజెయ్యాలి.

తమ పిల్లల్ని పాఠశాలల్లో చేర్చడం కంటే ముందూ, పాఠశాలల్లో చేర్చిన తరువాత కూడా తల్లిదండ్రుల ప్రయత్నాలు జరుగుతూనే ఉండాలి. 12 సంవత్సరాల లోపు పిల్లల తీరుతెన్నులు అగమ్యగోచరంగా ఉంటూ ఉంటాయి. ఒక విధంగా ప్రమాదకరంగా ఉంటూ ఉంటాయి. అందువల్ల వారిని ఈ వయస్సులోనే చెడు విషయాల పట్ల ఆకర్షితులు కాకుండా చూడాలి.

ప్రస్తుతం సమాజం తీరుతెన్నులు ఎంతో ప్రమాదకరంగా, అరాచకంగా, అశాంతికరంగా, హింసాత్మక ధోరణులతో కూడి ఉంటున్నాయి. విప్లవాత్మక ధోరణులతో ఈనాటి సమాజం ప్రశాంతతను కోల్పోతూన్నది. ఈ దశలోనే తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలల్లో చేర్చి, ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నారు.

తమ పిల్లల భవిష్యత్తును ఒక విధంగా ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్ది మంచి పౌరులనుగా తయారు చేసి ఈ సమాజానికి అందించవలసిన బాధ్యత ముమ్మాటికీ ఉపాధ్యాయులదే. వారిని ఆదర్శ పౌరులనుగా – గొప్ప శాస్త్ర వేత్తలను, గొప్ప నాయకులను, గొప్ప దేశ సేవకులను, గొప్ప సంఘ సంస్కర్తలను తయారు చేయవలసిన బాధ్యత ఉపాధ్యాయులదే. సమాజాన్ని మలుపు తిప్పిన పూజ్య బాపూజీ, నెహ్రూ, ఠాగోర్ లాంటి మరెందరో శాస్త్రవేత్తలను, మేధావులను, మరెందరో మహా పురుషులను అందించింది ఉపాధ్యాయులు, విద్యాలయాలే అని మనం మరువరాదు.

ఆనాటి పరిస్థితులు వేరు. ఆనాటి విద్యాలయాల, ఉపాధ్యాయుల తీరుతెన్నులు వేరు. ఈనాటి పరిస్థితులు వేరు – విద్యాలయాల తీరుతెన్నులూ, ఉపాధ్యాయుల తీరుతెన్నులూ వేరు. ఇప్పుడు స్కూలు కెళ్లిన విద్యార్థులు బాగా చదువుకొని బుద్ధిమంతులుగా తయారై, దేశానికి/ సమాజానికి ఉపయోగపడతారనే ఆశ సన్నగిల్లిపోతూన్నది అందరిలో.

ఈనాటి ప్రభుత్వాల తీరు తెన్నులకు అద్దం పట్టేలా విద్యాలయాలుంటున్నాయి. ఈనాటి ఉపాధ్యాయులు ఒకప్పటి ఆదర్శ ఉపాధ్యాయులు కారు. (అందరూ అని అనలేం) పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి అపకీర్తిని ఆపాదించే తీరులో మెదలుతున్నారు. పెరుగుతున్న జనాభాకు, అవసరాలకు అనుగుణంగా ఈనాటి పాఠశాలలు ఉండడంలేదు.

ముఖ్యంగా ప్రాథమిక విద్యారంగాన్ని తీసుకుంటే అంతా అయోమయం. అగమ్య గోచరికం – ప్రభుత్వాలు ఎంతో నిష్ఠతో, శ్రద్ధతో ప్రాథమిక విద్యారంగాన్ని తీర్చి దిద్దడానికి పథకాలూ, ప్రణాళికలూ వేసి కార్యక్రమాలను రూపొందిస్తున్నాయి. అయితే కార్య రూపంలో అవి భ్రష్టుపట్టిపోతున్నాయి. ప్రభుత్వాలు ప్రజల ధనంతో చేకూర్చే పథకాలన్నీ ప్రజలకు చేరడం లేదు. అవి స్వార్థపరుల, అవినీతి పరుల కోరల్లో చిక్కుకుంటున్నాయి. అన్ని రంగాలలోనూ ఇపుడు అవినీతి రాజ్యమేలుతోంది.

మరో వైపు ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో కీలకమైన విషయాల్లో ఉదాసీన వైఖరి అవలంభిస్తోంది. ప్రైవేటు భాగస్వామ్యంతో గ్రామీణ ఆవాస పాఠశాలలను ఏర్పాటు చేయడానికి తయారవుతోంది. పాఠశాలల్లో కొరవడిన సౌకర్యాలు, ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల కారణంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. పాఠశాలల సంఖ్యకు అనుగుణంగా పర్యవేక్షణ సిబ్బంది ఉండడం

లేదు. అధికారుల్లో, ఉద్యోగుల్లో అంకిత భావం కొరవడుతోంది. స్కూళ్ల సంఖ్యకు అనుగుణంగా పర్యవేక్షక సిబ్బంది లేకపోవడంతో అరకొర వసతులతో కొనసాగుతున్న పాఠశాలలు, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలు అధ్వాన్నంగా తయారవుతున్నాయి. ఒక్కొక్క పాఠశాలల్లో రెండు, మూడు రోజులుండి పనితీరును పర్యవేక్షించాలి. ఇపుడు ఏండ్లు గడిచినా స్కూళ్లను పర్యవేక్షించే అధికారులు లేరు. దీని వల్ల కూడా విద్యా ప్రమాణాలు క్షీణించి పోతున్నాయి. విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది.

రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవు. సరిపడే గదులు లేవు. మరుగుదొడ్లు లేవు. క్రీడా మైదానాలైతే అసలే ఉండవు. ఇకనైనా ప్రభుత్వాలు పాఠశాలల్లో మౌలిక వసతులపై శ్రద్ధ తీసుకోవాలి.

ఏ ఒక్కరూ సమాజం తీరు పట్ల స్పందించడం లేదు. తమను గూర్చే ఆలోచించుకుంటున్నారు. ఇతరుల ఆకలి ఎలా ఉంటే మనకేంటిలే మన కడుపులు నిండితే చాలనుకుంటున్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడే ఇల్లు సర్దుకోవాలని తాము పని చేసే శాఖల నోళ్లు కొట్టి తమ కడుపులు నింపుకుంటున్నారు. ఎవరికి వీలైనంత వారు ఈ సమాజాన్ని దోచుకుంటున్నారు. ప్రభుత్వోద్యోగులకు తమ జీతాలు సరిపోవు. తమ శాఖలను కొల్లగొట్టాలి. కాంట్రాక్టర్లకు నాణ్యతతో పని లేదు. తమ జేబులు నిండితే చాలు. వాటి వల్ల వచ్చే ప్రమాదాలు తమకు పట్టవు. తల్లిదండ్రులకు తాము పెడదారి పడుతున్నప్పుడు తమ సంతానాన్ని గూర్చిన పట్టింపులుండవు. వాటి వల్ల వచ్చే పరిణామాలు పట్టవు.

మరో వైపు సమాజంలో హింస, ఉగ్రవాదం, తీవ్రవాదం ఎక్కడ చూసినా భయంకరమైన వాతావరణమే నెలకొంటోంది. ఇలాంటి భయభ్రాంతుల మధ్య చిన్నారులుంటున్నారు. అడుగడుగునా అకలా వికలమే – అడుగడుగునా అవినీతి తాండవిస్తోంది.

మరి ఇలాంటి అనిశ్చిత వాతావరణంలో పెరుగుతూన్న మన చిన్నారులను కాపాడుకోవలసి ఉంది. వారిపై ఇలాంటి నీడలు పడకుండా చూడవలసి ఉంది. వారిని మంచి పౌరులనుగా తీర్చి దిద్ది ఈ సమాజానికి అందించవలసి ఉంది. ఇది మనందరి బాధ్యత. గాంధీజీ ఆచరించి చూపించిన మార్గాలే వీటన్నింటికీ నివారణోపాయాలు – అలాగే సత్యసాయి బాబాగారు ప్రవచిస్తున్న ఆధ్యాత్మిక మార్గాలే అనుసరణీయం. అందువల్ల గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలను సత్యసాయి

మార్గాన్ని చిన్ననాడే బాల బాలికలకు నూరి పొయ్యాలి. వారిచేత ఆచరింప చెయ్యాలి. ఈ రంగంలో మనమంతా కృషి చెయ్యవలసి ఉంది. ఈ కోవలో జరిగే ప్రయత్నాలలో నాదొక ప్రయత్నం.

ఇందుకు ఆచరణ యోగ్యమైన కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకై, ప్రయత్నిద్దాం.

నేను జరుపుతూన్న ఈ ప్రయత్నం కొంత మేరకు ఫలించినా ధన్యుణ్ణిగా భావిస్తాను. నాకు అన్ని విధాలుగా సహకరించిన ప్రముఖ రచయిత శ్రీ ఎ. పండరినాథ్ గారికీ, నాకు అత్యంత ఆత్మీయులైన శ్రీ తారా మనోహర్ గారికీ అడిగినంతనే పుస్తకానికి ముందు మాట రాసి పెట్టిన ప్రొ॥ ఆర్. వెంకట రెడ్డి గారికీ, కోరినంతనే నా మాటను మన్నించి "స్పందన" లను అందజేసిన ప్రముఖులందరికీ, చక్కగా డి.టి.పి. చేసిపెట్టిన శ్రీ షబ్బీర్ అహ్మద్ గారికీ, పుస్తకాన్ని చక్కగా ప్రచురించిన షిరిడీ సాయి గ్రాఫిక్స్ (విఠల్‌వాడీ, నారాయణగూడ) గారికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**చెరుకూరి రామారావు**

రచయిత



శ్రీ చెరుకూరి సూర్యారావు

# అంకితం

మా నాన్న శ్రీ చెరుకూరి సూర్యారావు గారికీ -

మా మామయ్య శ్రీ పోలిన రామచంద్ర రావు గారికీ

మా నాన్నగారు నీతి నిజాయితీలతో, ధర్మ మార్గంలో నడిచిన ఆదర్శ పురుషుడు.

ఆయన ఆ మార్గంలో నడవడమే కాదు అందరినీ ఆ మార్గంలో నడవాలని ప్రబోధించిన మార్గదర్శకుడు.

ఆయనది నిండైన విగ్రహం. మంచికి మారుపేరాయన. ఆయనతో మాట్లాడిన వారంతా, ఆయన మాటల్లో ఎంతో నిండుతనం, ఉత్తేజం ఉంటుందని అన్నవారే.

"కష్టపడి నిజాయితీతో సంపాదించిందే అసలైన సంపాదన - దానికే విలువ ఉంటుంది. కష్టపడి సంపాదించిన దానిని వృధా కాకుండా చూసుకోవడంలోనే ఉంది గొప్పతనం".

మనమే కాదు మన ఎదటి వారు కూడా బాగా ఉండాలని కోరుకోవాలి. వీలైనంత వరకు అసహాయులకు సహాయం అందించాలి. అయితే అపాత్రదానం మాత్రం పనికి రాదు.

క్రమ శిక్షణకు మారు పేరుగా నిలిచిన మా నాన్నగారి వయస్సిప్పుడు 95 సంవత్సరాలు. 60 సంవత్సరాలుగా బ్రహ్మచారిగానే ఉంటున్నారాయన.

ఆయన మా పట్ల కనబరుస్తున్న ప్రేమకూ, ఆప్యాయతలకూ బ్రతుకు బాట చూపి ఇలా తీర్చిదిద్దినందుకూ-

కృతజ్ఞతగా ఈ చిన్ని పుస్తకాన్ని అంకితం ఇచ్చుకుంటున్నా.

******



శ్రీ పోలిన రామచంద్రా రావు

మా మామయ్య కీ.శే. శ్రీ పోలిన రామ చంద్రారావు గారు.

పిల్లలంటే ఎంతో యిష్టం ఆయనకు. పిల్లల పట్ల ప్రేమానురాగాలను చూపించడమే కాదు వారికి బ్రతుకు బాటను చూపించిన కార్యదీక్షాపరుడు, కర్తవ్య పరాయణుడాయను.

నిజాయితీ ఆయన ప్రాణం.

నీతిని ఊపిరిగా చేసుకొని జీవించిన గొప్ప పురుషుడాయన.

మా నాన్న నాకు జన్మనిస్తే మా మామగారు నాకు మంచి జీవితాన్ని ప్రసాదించారు.

నా జీవిత చరిత్ర పుటలలో ఆయనకు కెటాయించిన పేజీని సువర్ణాక్షరాలలో రాసుకున్నాను.

సంతానం కోసం, వారి అభివృద్ధి కోసం ఎంతగానో పరితపించిన మహోన్న త్యాగశీలి ఆయన.

కష్టపడి పనిచేస్తూ నిజాయితీగా బ్రతికే వారిని చూసి ఆయన ఎంతో సంతోషించేవారు.

నాకు జీవిత గమ్యాన్ని చూపించిన మా మామ గారికి చిరుకానుకగా ఈ పుస్తకం అంకితం.

******

## ఆకాంక్ష

శ్రీ చెరుకూరి రామారావు గారి "బోసిపోతోన్న బాలుర భవితవ్యం" గ్రంధాన్ని సమగ్రంగా పరిశీలించాను. ఈ శీర్షికపై ప్రస్తావించిన వారు అరుదు. ఈ గ్రంథం చదువుతుంటే ఎంతో ఆసక్తి, సంతృప్తి కలిగింది.

పిల్లల సంక్షేమం గురించి ఎన్ని పథకాలను ప్రవేశపెట్టినా పసి బ్రతుకులకు ఆసరాగా నిలబడలేక పోతున్నాయని రచయిత తన ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాలుర సంక్షేమానికై ఎన్నెన్నో పథకాలను ప్రతిపాదించిందే గాని వాటిని పరిపూర్ణంగా అమలు పరచక పోవడం పట్ల రచయిత తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చారు. పిల్లల పౌష్ఠికాహారలోపాన్ని తీర్చలేక పోతున్నామని వాపోయారు శ్రీ రావు గారు. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపి, నిర్బంధ విద్యను అమలు పరచాలనేది రచయిత ముఖ్యోద్దేశం.

ఈనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ దుస్థితి కాబోలు శ్రీ రావు గారి మనస్సును కలవర పరచింది. అందుకే ఈ సమాజ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని భావి భారత బాల బాలికల ప్రవర్తనలో, నడతలో తగినంత మార్పు తీసుకు రావాలన్న రచయిత వేదన, ఆవేదన, ఎంతేనీ శ్లాఘనీయం. దాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ గ్రంథ రచన సాగింది.

గత కాలపు జ్ఞాపకాలకు బందీలు కాకుండా, భావి సవాళ్లను ఎదుర్కొనే యోధులుగా బాలబాలికలను తీర్చిదిద్దే నవీన విద్యా విధానం, సృజనాత్మకతను, ప్రావీణ్యతను ప్రోత్సహించే మానవీయ విద్య ఈనాటి బాల బాలికలకు ఎంతేనీ అవసరమన్నారు ఇటీవలే భారత ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ గారు. ఇది ఎంతేనీ నిజం.

**1989**లో ఐక్య రాజ్య సమితి ప్రతిపాదించిన బాలల హక్కుల చట్టం గురించి మనందరి కను విప్పు చేశారు రచయిత. పిల్లలకు ఎయిడ్స్ (AIDS)

గురించిన అవగాహన ఉండాలనీ, ఈ విషయంలో పెద్దలు, ఉపాధ్యాయులు ఆలోచించి స్వచ్ఛందంగా కృషి చెయ్యాలన్నదే రచయిత కోరిక.

బాల్యంలోనే పిల్లలను సచ్ఛీలురుగా తీర్చిదిద్దడం ఇటు తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులపైన ఆధారపడిందని రచయిత ఆశయం. అయితే దీని బీజారోపణ ప్రాథమిక విద్యా స్థాయిలోనే జరగాలంటారు. నిరక్షరాస్యతా నిర్మూలన సామాజికోద్యమంగా ఎదగాలంటారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నా అక్షరాస్యత సాధనలో ఆశించిన ఫలితాలు రాకపోవడం విచారకరం. ప్రభుత్వ పాఠశాలల దుస్థితి, కొన్ని లోటుపాట్లను ఎత్తి చూపారు. ఈ రంగంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కూడా కృషి చెయ్యాలంటారు. అప్పుడే ఫలితాలు మెరుగైతా వంటారు.

బాలుర సర్వతో ముఖాభివృద్ధిని లక్ష్యంగాను, వారిలో మత సామరస్య భావాలను, మంచి అలవాట్లను పెంపొందించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందంటారు. బాలబాలికల్లో మాతృదేశం పట్ల భక్తిని, జాతీయయ గీతాల పట్ల గౌరవ భావాన్ని ప్రదర్శించాలంటారు. బాలురు సన్మార్గం వైపు పయనించాలనీ, సజ్జన సాంగత్యాన్ని, విశాల దృక్పథాన్ని అలవరచుకోవాలంటార రచయిత.

అంతే కాదు మంచి స్నేహితుల్ని ఎంచుకోవాలని, సంఘ శ్రేయస్సుకై పాటు పడాలన్న భావన బాలబాలికల్లో ఉద్భవించాలని హితవు పలికారు. దైవభక్తితో నైతిక విలువలు పెంపొందుతాయంటారు.

గ్రంథం చివరి అధ్యాయాలలో ప్రపంచ ప్రశాంతతకు, నేటి తరానికి, ఏ తరానికైనా గాంధీజీ బోధనలు ముఖ్యంగా వాటి ఆచరణ అపూర్వ ఉపశమ నాలవుతాయంటారు. గాంధీజీ ప్రబోధించి పాటించిన సత్యం, అహింస, శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవ అనే మౌలికమైన విలువలు ఏ ఒక్క జాతికి, మతానికి, కులానికి, కాలానికి సంబంధించినవి కావు. అవి మానవాళి సంస్కృతి సారాంశం.

ఈ విలువలను పిల్లలు తమ జీవితంలో రంగరించుకుంటూ సమాజ శ్రేయస్సుకు మూలస్తంభాలుగా నిలవాలంటారు.

చెరుకూరి రామారావు గారు ఒక ప్రముఖ వ్యాపార వేత్త అయినా వారి మనస్సు మాత్రం సునిశితం, ఆధ్యాత్మికం, ఆవేశ పూరితం. తాత్వికత, బాలల చిత్త ప్రవృత్తిని అవగాహన చేసుకున్న బాల మనో విజ్ఞాన శాస్త్రవేత్త కూడా.

వీరిది తొలిరచనే అయినా ఎంతో ఉద్విగ్నంగా, హృద్యంగా సాగింది. రచన సుందరం, సరళం. ఈ గ్రంథాన్ని చదివిన ప్రతి వారిలో మార్పు తప్పకుండా వస్తుందని ఆకాంక్షిస్తాం. రచయిత కోరుకున్న ఈ మార్పు బాలబాలికల్లో వస్తే గ్రంథ రచన సఫలీకృతం అయినట్లే. శ్రీ రావు గారు అందిస్తున్న ఈ గ్రంథానికి భావి తరాల బాలబాలికలకు ఒక మార్గ దర్శక స్థాయిలో నిలువగల సత్తా ఉంది.

ఈ గ్రంథం ప్రశంసార్హం.

రచయిత శ్రీ చెరుకూరి రామారావు గారిని మనసారా అభినందిస్తున్నాను.

**ఆచార్య ఆర్. వెంకట రెడ్డి**
ఎమిరిటస్ ప్రొఫెసర్
తత్వ శాస్త్ర విభాగం
ఉస్మానియా విశ్వ విద్యాలయం

వనస్థలిపురం
తేదీ - 12/2/2008

# అలవాటు మార్చుకోండి

సాధారణంగా తల్లిదండ్రులు తాము అనుభవించిన జీవితం కన్నా మెరుగైన జీవితాన్ని, సౌకర్యాలను పిల్లలకు అందించాలనుకుంటారు. ఆ ప్రయత్నంలో అతి గారాబం చేస్తారు.

తన చిన్ననాటి జీవితాన్ని తలుచుకొని బాధపడి తన పిల్లలు అలా బాధపడ కూడదని పిల్లలు అడుగకుండానే అన్నీ కొనిస్తారు.

తాను కోల్పోయిన స్వేచ్ఛను తన ముద్దుల కూతురుకి ఇవ్వాలనుకుంటారు తల్లులు.

చిట్టి తండ్రి అలిగి ఆడకుండా ములక్కూర్చున్నా, చిన్నారి లేత బుగ్గల మీద జలజల కారే కన్నీరు చూసినా తల్లిదండ్రుల మనసులు గిలగిల్లాడిపోతాయి. వారికి బాధ్యత తెలువాలంటే ప్రేమతో పాటు క్రమ శిక్షణ, కష్టపడే తత్వం, మార్గదర్శకత్వం చూపించాలి.

కొట్టకుండా, తిట్టకుండా స్వేచ్ఛగా పెంచితే ఎప్పుడైనా ఒకసారి కోప్పడితేనే పిల్లలు తీవ్రంగా స్పందిస్తారు. అఘాయిత్యాలకు పూనుకుంటారు. ఈ పరిస్థితి రాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలి.

ఒక్కోసారి కన్న బిడ్డల కోసం తల్లిదండ్రులు తమ అలవాట్లను కూడా మార్చుకోవలసి ఉంటుంది.

## ఇందులో


* నా మాట
* ఆకాంక్ష

### పార్ట్ - ఎ

* ఆధ్యాత్మిక చింతన ద్వారా నైతిక విలువలు
* పిల్లలను సత్ప్రౌరులనుగా తయారు చెయ్యడానికి మనం గట్టి ప్రయత్నం చేస్తున్నామా?

### స్పందన

1. బావురు మంటున్న బాల్యం
2. శాపగ్రస్తులు నేటి బాలలు
3. ఆకలితో అల్లాడుతున్న బాలలు
4. కర్మాగారాల్లో నలిగిపోతోన్న బాల్యం
5. ఎయిడ్స్ కోరల్లో చిన్నారులు
6. ఆప్యాయతలకు దూరమవుతున్న చిన్నతనం
7. బాలలే మూలధనం
8. విద్యకు పునాధి ప్రాథమిక విద్య
9. ఇపుడు ప్రాథమిక విద్యాస్థాయి ఎలా ఉంటోంది?
10. బాలలు బడిబాట పట్టే కార్యక్రమాలు - ఫలించని తీరు
11. ప్రాథమిక విద్యా రంగంలో వైఫల్యాలెన్నో
12. ప్రాథమిక విద్యలో వేరుపురుగులు
13. అక్షరాస్యత సాధనలో పెరుగుతున్న వెనకబాటు తనం
14. ప్రభుత్వ పాఠశాలలను గూర్చి ప్రజలేమనుకుంటున్నారు?
15. మానవీయ విలువలు
16. పిల్లలను సత్ప్రౌరులనుగా తయారు చెయ్యడంలో తల్లిదండ్రుల పాత్ర
17. శాంతి భద్రతలు - పోలీసు వ్యవస్థ

18. త్యాగమే అన్నింటికి మూలం కావాలి.

19. మద్యం మహమ్మారికి దూరంగా బాలలు

20. బాలల సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా

21. చదువులో ధనిక, పేదవర్గ భేదాలు దేశ ప్రగతికే గొడ్డలిపెట్టు విధానాలు

22. పిల్లల్లో మత ప్రసక్తి లేని సమైక్యతా బీజాలు

23. ప్రకృతిని ప్రేమించు – కాలుష్యాన్ని తరిమికొట్టు

24. దేశభక్తిని పెంపొందిచుకో

25. జాతీయ గీతాల పట్ల ప్రదర్శిం చాల్సిన గౌరవ భావం

26. మన మువ్వన్నెల జండా (త్రివర్ణ పతాకం)తో స్ఫూర్తి

27. బాల్య వివాహాలు భవిష్యత్ జీవితానికి శాపాలు

28. విలువలను తెలుసుకో జాగ్రత్తగా మసలుకో

29. అన్నింటికీ మూలం ఇల్లే

30. మాతృ భాషపట్ల మమకారం

31. ప్రశాంత ప్రపంచానికి గాంధీజీ సిద్ధాంతాలే శరణ్యం

32. నేటి తరానికి గాంధీజీ బోధనలు

33. పిల్లల్లో ఆణిముత్యాలు

34. బాల మేధావులు – ఉన్నత లక్ష్యాలు

* దశసూత్ర కార్యాచరణ ప్రణాళిక
* సంస్థ ఆచరిస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలు

# PART - A

# ఆధ్యాత్మిక చింతన ద్వారా నైతిక విలువలు

భగవంతున్ని ఆద్యంత రహితుడని అంటూ ఉంటాం. ఎవరు ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు. భక్తి ముఖ్యం కానీ నామ రూపాలు ప్రాధాన్యం కాదు. అయితే మన సౌలభ్యం కోసం దేవున్ని ఏదో ఒక రూపంలో ఆరాధిస్తూ ఉంటాం. దైవారాధన అనేది మనిషి వ్యక్తి గతం. అందరూ ఇలాగే, ఈ దేవున్నే ఆరాధించాలనే నియమమేమీ లేదు. అది వ్యక్తికీ, ఆ భగవంతునికీ తప్ప మరొకరికి సంబంధ లేనిది ఉండవలసిన అవసరం కూడా లేదు.

కానీ దురదృష్టవశాత్తు మనవాళ్లు దేవున్ని హృదయ మందిరాల్లో ఉండ నివ్వకుండా బయటికి తీసుకు వస్తూ ఉంటారు. అందుకే మన దేశంలో మతపరమైన ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయంలో అందరూ అందరే – దేవుడి పేరుతో వ్యాపారం, రాజకీయం ఎక్కువవడం వల్లనే ప్రస్తుత పరిస్థితులు తలెత్తుతున్నాయి. మన దేశంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ఈ తీరు ప్రబలి పోయింది. అందువల్లనే మతం పేరిట మారణ హోమాలు సాగుతున్నాయి. "సర్వేజనా సుఖినోభవంతు" అనే అన్ని మతాలు కోరుతున్నాయి.

ఈ భూమ్మీద మనషులంతా కలిసిమెలిసి ఉండాలనీ, సహ జీవనం సాగించాలనీ ప్రతి మతం బోధిస్తుంది. కేవలం మనషులు మాత్రమే కాదు సకల ప్రాణికోటి వర్ధిల్లాలని మన మతాలు కోరుతున్నాయి. చాటుతున్నాయి. మన హిందూ మతం కూడా సర్వ మానవ సౌభ్రాతృత్వాన్నీ, విశ్వ మానవ కళ్యాణాన్నీ, సహ జీవన విధానాన్నీ ప్రబోధిస్తోంది.

## దేవుడు ఎక్కడున్నాడు?

దేవుడు ఎక్కడున్నాడు? అనే సందేహం చాలా మందికి కలుగుతుంది. సత్య మార్గంలోనే దైవమున్నాడనేది వాస్తవం. ఈ నిజాన్ని నిరూపించిన వారే భగ్‌వాన్ సత్య సాయిలాంటి వారు. సత్య సాయి బాబాలోనే "సత్యం" అనే పదం ఇమిడి ఉంది.

ప్రతి ఒక్కరూ సత్యమే భగవంతుడని తెలుసుకోవాలి. "సత్య" మార్గంపైనే నడవడానికి కృషి చెయ్యాలి. సత్య మార్గంపై నడవడం అంత తేలికైన పనికాదు. కాని ఎన్ని కష్టాలు, నష్టాలు ఎదురైనా ఆ మార్గాన్ని వదలకూడదు. సత్య మార్గం, అహింసా విధానం పై నడిచి నందు వల్లనే గాంధీజీ అంతటి గొప్పవాడు కాగలిగాడు. ఈ నాడు ప్రపంచమే ఆయనను ఆదర్శ పురుషునిగా భావిస్తోంది. ఆరాధిస్తోంది.

సత్య మార్గంపై నడిచేవారి పట్ల భగవంతుడు ఎప్పుడూ కరుణా కటాక్షాలను కనబరుస్తాడనేది వాస్తవం. సత్య మార్గంలో నడిచే వారికి ఎప్పుడూ మేలే కలుగుతుంది. కాని అంత తొందరగా ఫలితాన్ని పొందలేరు. అదంతా పరీక్షా సమయంగానే ఉంటుంది. సత్యమార్గాన్ని అనుసరిస్తూ మంచి పనులు చేసే వారిని భగవంతుడంటూ ఉంటాం. సత్యమే దేవుడు, సత్యమే ఐశ్వర్యం. సత్యాన్ని పాటించే వారిని లక్ష్మి కూడా కటాక్షిస్తుందంటారు. లక్ష్మి అంటే సంపద. అది ఎలాంటిదైనా కావచ్చు. కేవలం డబ్బే అనుకోగూడదు. మేధా సంపదే కావచ్చును. సేవా సంపదే కావచ్చును. ఎంతో మంది మేధావులను ఈ ప్రపంచం ఈనాటికీ గౌరవిస్తోంది. గాంధీజీ వెంట ఈ దేశమే కాదు ఈ ప్రపంచమే నిలిచింది. అదే ఆయన సాధించిన గొప్ప సంపద.

ప్రతి ఒక్కరూ ఏదో లాభాన్ని ఆశించే దేవున్ని కొలుస్తూ ఉంటారు. లాభాన్ని పొందిన తరువాత భగవంతున్ని మరచి పోతారు. వారంతా స్వార్థపరులు. తమ స్వార్థం కోసం, తమ బాగోగుల కోసమే అలాంటి వారు పరితపిస్తూ ఉంటారు. అలాంటి వారు నీతి నియమాలనూ, సత్యమార్గాన్నీ పాటించరు.

ప్రతి రోజూ భగవంతుని స్మరణ చేసేవారు పుణ్యాత్ములు. అలాంటి వారిని గ్రహదోషాలు బాధపెట్టవంటారు. సామాన్యంగా మనుష్యులు ఆపదలోనూ, బాధలలోనూ మాత్రమే భగవంతున్ని తలుస్తారు. "ఈ కష్టాల నుంచి గట్టెక్కించు తండ్రీ!" అంటూ వేడుకుంటారు. అది బొత్తిగా స్వార్థమే అవుతుంది.

కొందరు ఏదో ఒక సమయంలో కొద్ది సేపు భగవంతున్ని పూజించడమో, ధ్యానించడమో చేస్తూ ఉంటారు. అది అవసరమే. కానీ అదీ ఒక విధమైన స్వార్థమే. దాని వల్ల అనుకున్న ఫలితం పొందలేం. ఆ కొద్ది సేపు మాత్రమే భగవంతుని తలంపు ఉంటుంది. ఆ తరువాత భగవంతుని ధ్యాసే ఉండదు. ప్రతి నిత్యమూ భగవంతునితో సంబంధం ఉండి, ప్రతి పనీ భగవంతుని తలంపుతో చేస్తూ ఉండాలి. ఏ పని చేసినా అది భగవంతుడే చేస్తున్నాడనే తలంపుతో ఉండాలి. చేస్తున్నది

తాను అయినా చేయిస్తున్నది భగవంతుడు అన్న తలంపు ఉండాలి.

అలా ఉన్ననాడు చెడ్డ పనులు చెయ్యడానికి మానవుడు ఇష్టపడడు. మాట్లాతున్నా, ఆహారం తీసుకుంటున్నా, ఏ పని చేస్తున్నా భగవంతుడే చేస్తున్నాడన్న తలంపుతో ఉండాలి. అలా ఉన్నప్పుడు మంచి ఫలితాన్ని పొందగలుగుతాడు.

## శక్తికి మూలం భక్తే

భగవంచుని మెప్పించాలంటే భారీ ఎత్తున కానుకలు సమర్పించి ఆయనను ఆకట్టుకోలేం. కేవలం ఆర్భాటాలూ, అట్టహాసాలూ కాకుండా కేవలం భక్తి మాత్రమే బాగా పని చేస్తుంది. పరమాత్ముడి శక్తి, భక్తుడి భక్తి – రెండు సమ ఉజ్జీలుగానే తేలుతాయంటారు. ఇంకా చెప్పాలంటే భక్తి శక్తి కంటే అధిక మనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

## మౌలిక విలువలు

మనిషి ఎంత తెలివి కలవాడైనా, శౌర్యవంతుడైనా, ప్రతిభావ్యుత్పత్తులు కలిగిన వాడైనా ఈ లోకంలో ఏదో ఓ అతీతమైన శక్తి ఉందని నమ్మి ఆరాధించినప్పుడే సత్ఫలితాలను పొందగలుగుతాడు. పరిస్థితులు ఎన్ని మారినా, మౌలిక విలువలకు దూరం కానినాడు ఎవరూ ఎటువంటి హానిని తలపెట్టలేరు. ఒక వేళ తలపెట్టాలని చూసినా వారికి బెడిసి కొడుతుంది. అందుకే శాశ్వతమైన విలువలతో వాటిని మరింతగా పెంపొందిచుకోవాలి.

## ధర్మ మార్గం తప్పితే

ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. మానవుడు ఎంత అభివృద్ధి సాధించినా, నేల విడిచి సాము చేయలేడు. ఈ సృష్టిలో ప్రతి ప్రాణి కొన్ని ధర్మాలకు కట్టుబడి ఉంటుంది. ప్రకృతికి కూడా ధర్మం ఉంది. కనుకనే తప్పకుండా రుతువులు వస్తున్నాయి. నోరులేని జీవాలు సైతం ధర్మానికి కట్టుబడి పనిచేస్తున్నాయి. అంతెందుకు! అంతరిక్షంలో రోజులపాటు సంచరించి వచ్చిన వ్యోమగాములు సైతం నిర్ణీత ధర్మం (గడువు) ప్రకారంగానే నేలమీద దిగాల్సిందే.

చివరికి క్రిమి కీటకాలు క్రూర మృగాలు కూడా ధర్మం ప్రకారం నడుచుకుంటున్నాయి. నిజం చెప్పాలంటే అన్ని జీవులకన్నా, అన్ని ప్రాణుల కన్నా తాను గొప్పవాడిననుకునే మనిషే ధర్మాన్ని అతిక్రమిస్తున్నాడు. ధర్మాన్ని అతక్రమించే దోరణి పెరిగినప్పుడు సమాజం సంక్షుభితమౌతుంది. ఇప్పటి పరిస్థితులే ఇందుకు నిదర్శణం. ఎవరి ధర్మాన్ని వారు పాటిస్తే అసలు గొడవలనేవే ఉండవు.

ధర్మాన్ని అతిక్రమించడం అంటే మనకు మహా యిష్టం. వద్దన్న పని చేయడం అనేది చిన్న పిల్లల్లో మనం చూస్తూ ఉంటాం. ఇప్పుడు ఆ రీతిలో పెద్దలు కూడా ఉంటున్నారు. చిన్న పిల్లల కంటే చెప్పినా అర్థం కాకపోవచ్చు కానీ అన్ని తెలిసిన పెద్దలే వద్దన్న పని చేస్తూ ఉంటారు. మంచి మాట ఎవరైనా చెబితే ఆయనెవరు? మనకు చెప్పడానికి? అని అడిగే వారిని కూడా చూస్తూ ఉంటాం.

అసలు మనం ఆచరించినప్పుడు మాత్రమే ఇతరులకు బోధించాలి. ఆచరించి చూపిన వారే మహాత్ములవుతారు. అయ్యారు కూడా. మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ కూడా మన వంటి వాడే. ఆయ ధర్మానికి కట్టుబడి ఉన్నాడు. నీతి, నిజాయితీకి కట్టుబడి ఉన్నాడు. అంతే కాదు ఆయన చెప్పిన, బోధించిన ప్రతి దాన్నీ ఆచరణలో పెట్టాడు. కనుకనే మహాత్ముడయ్యాడు.

ఆధునిక సమాజంలో ప్రేమ అనే రెండు అక్షరాలు కనుమరుగవడం వల్లనే సమాజం కల్లోల భరితం అవుతోంది. స్వార్థం, ఈర్ష్యా ద్వేషాలు పెరిగి పోతున్నాయి. అందువల్లనే మనుష్యుల మధ్య నానాటికీ కల్లోలం పెరుగుతున్నది. పరస్పర అవగాహన కొరవడటం, ఎదటి వ్యక్తి గురించి వ్యతిరేక దృష్టితో ఆలోచించడం వల్ల మనిషి అపోహలనే సాలెగూడులో చిక్కుకు పోతున్నాడు.

అసలు ఇతరుల గురించి చెడు ఆలోచించడం మానేస్తే ఈ అపోహలుండవు. సానుకూల దృక్పథం అనేది చాలా గొప్పది. ఈ దృక్పథాన్ని అలవర్చుకుంటే మనిషిలో వివేకం పెరుగుతుంది. ముందు ఆలోచన, ముందుచూపును పెంచుతుంది. ప్రేమను అంకురింపజేస్తుంది. మానసిక ఆనందాన్ని కలుగజేస్తుంది. అసలు ప్రేమలోనే దైవం ఉన్నాడు. అందుకే దేవున్ని ప్రేమ స్వరూపుడంటారు.

ఆధునిక కాలంలో సాయి బాబాలాంటి సద్గురువులు కొందరు మనిషికి ప్రేమతత్వాన్ని, ఆధ్యాత్మిక అమృతాన్ని పంచిపెట్టి మానసిక ఆనందాన్ని

కలిగిస్తున్నారు. సన్మార్గంలో నడిపిస్తున్నారు. పైపై ఆచారాలకన్నా, మానసిక నైర్మల్యాన్ని కలిగి ఉంటూ నిరంతరం బాబాని మదిలో తలుచుకుంటే చాలు ఆయనే మనలను సన్మార్గంలో పయనింపజేస్తాడు. ఎంతో మంది సాయీ భక్తులు ఈ మాదిరిగా ధ్యానించి ఆరాధించి తరిస్తున్నారు.

సాయి అంటే స్వామి. బాబా అంటే తండ్రి. సాయిబాబా అంటే ఎంతో గొప్ప అర్థం. సాయిబాబా అందరికీ తండ్రి లాంటివాడు. నిత్య రక్షకుడైన యజమాని వంటివాడు. మానవాతీతమైన అద్భుతాలను బాబా ప్రదర్శించి ప్రపంచ మానవాళిని దిగ్భ్రాంతిలో ముంచాడు. ఆయన మహిమలు ఊహకందనివి. అందుకే బాబా ఇలా అన్నాడు. "నా లీల చాలా నిగూఢమైనది. తర్కానికి, శాస్త్రానికి అందనిది. అనూహ్యమైనది. దైవశక్తిని నిత్యం సాక్షాత్కరింప జేసేది."

## సద్గురువుల బోధ

మనిషిలో సహజంగా ఉండే క్షమా గుణం శాంతి, సౌమనస్యాలను పెంచి పెద్దవయ్యే టట్టు చేసేవారే సద్గురువులు. సద్గురువుని ఆశ్రయించిన వారు ముందుగా వినయ, సౌశీల్యాలను అలవర్చుకుంటారు. "నేను", "నాది" అనే భ్రమల నుంచి మనిషిని విముక్తం చేసే వారే సద్గురువులు.

అయితే సద్గురువుల బోధలను వినడం వరకే పరిమిత మవుతున్న ఆధునిక మానవులు కోర్కెల వలయంలో కొట్టుమిట్టాడుతూ క్రోధాన్ని పెంచుకుంటూ కలహాలకూ, పోట్లాటలకూ సిద్ధపడుతున్నారు. ఈ ధోరణులకు అడ్డుకట్ట వేయకపోతే మొత్తం వ్యవస్థే ప్రమాదంలో పడుతుంది. విన్నది ఆచరణలో పెట్టాలి.

## వాగ్భూషణ సుభూషణం

మనిషిలోని సద్గుణాలకన్నా వాక్కే అత్యంత ముఖ్యమైనది. చేసేవన్నీ మంచి పనులే అయినా మాట్లాడే పద్ధతి బాగాలేక పోతే వాడికి మాట్లాడటం రాదంటారు. ఎదటి వారికి ఏమీ పెట్టక పోయినా శాంతంగా మాట్లాడితే వారు కరిగి పోతారు. నా మనస్సులోని బాధను పోగొట్టావనీ, నాలోని బాధంతా తొలగిపోయిందనీ సంతోషపడతారు.

అయితే హృదయంలో కల్మషం లేనప్పుడే మనిషిలో నుండి మంచి మాటలు వస్తాయి. అలా నిష్కల్మషంగా ఉండడాన్ని, ఇతరులు మెచ్చుకునే మంచిగా మాట్లాడడాన్ని పిల్లలకు చిన్ననాడే నాటాలి. మనం మాటలను జాగ్రత్తగా, అందంగా మాట్లాడ గలగాలి. అందుకు సరైన శిక్షణ కావాలి. ఆ శిక్షణ ఉగ్గుపాలతో రంగరించి ఇస్తూ ఉంటే వయసుతో పాటు మాటల మంచితనం పిల్లల్లో కాని, పెద్దల్లో కాని ఎదుగుతూ ఉంటుంది.

అలాగే మాటల్లో మంచి మాటలనే ఉపయోగించాలని పిల్లలకు నేర్పాలి. అలాగే మనం ఎదటి వారితో ఎలా మాట్లాడితే సమాధానం అలాగే వస్తుంది. విత్తనం ఏది నాటితే దానికి సంబంధించిన మొలకే వస్తుంది కదా!

## మంచి అలవాట్లే అభివృద్ధికి మెట్లు

మన అలవాట్లు సాటి వారికి ఇబ్బంది కలిగించ కూడదు. అలాగే ఆ వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అవి దెబ్బతీయకూడదు. అలాంటి వాటినే మంచి అలవాట్లు అని అనవచ్చును. నిర్వచించుకోవచ్చును. మన అలవాట్లు సమాజానికి, లోక కళ్యాణానికి ఉపయోగపడేలా ఉంటే ఇంకా ఉత్తమమైనవే.

దైవ ప్రార్థన అనేది మంచి అలవాటు. అది ప్రతి ఒక్కరికీ బాల్యం నుండే అలవాటు కావాలి. ప్రాత కాలానికి ముందే కాలకృత్యాలు తీర్చుకుని స్నానమాచరించి దైవ ప్రార్థన చేయడం తరతరాలుగా మన కుటుంబాల్లో వస్తున్న మంచి అలవాటు, ఆచారం. అయితే ఆధునిక కాలంలో రాత్రి బాగా పొద్దు పోయేవరకు మెలకువగా ఉండటం వల్ల తెల్లవారు జామున లేచే అలవాటు తప్పిపోతున్నది. నిద్ర నుంచి లేస్తూ దేవుని స్మరించుకునే అలవాటుకి కూడా దూరం అవుతున్నారు.

ఎన్ని ఉన్నా, ఎన్ని ఒత్తిడులు ఉన్నా మన పెద్దలు చూపే ఆచారాలను, అలవాట్లను మానకుండా పాటించాలి. ఈ విషయంలో పిల్లలు పెద్దలను అనుసరించాలి. పెద్దలు కూడా పిల్లలకు ఇలాంటి సదాచారాలను పాటించేలా చెయ్యాలి.

## అంతటా భగవంతుడే

పుట్టుకతోనే అందరూ పరిశుద్ధ హృదయులే. కానీ ఆ తర్వాతే ఈ సంఘంలోని పరిసరాలు, వాటి ప్రభావానికి లోనై అంతరాత్మను కాదని ప్రవర్తిస్తుంటారు. పాపాలను క్షణ క్షణం మూట గట్టుకుంటారు. అలాగే ధనానికిచ్చే ప్రాధాన్యం నానాటికీ పెరిగిపోతోంది. పాపభీతి లేకపోవడం, దైవం పట్ల భక్తి శ్రద్ధలు లేకపోవడం - మానవత్వపు ఛాయలు అంతరించడం మానవ జాతికే ఒక శాపంగా మారిపోతున్నాయి. మనిషిని మనిషి పీక్కుతినే మనస్తత్వం పెరిగిపోతోంది. స్వార్థం రాజ్యమేలుతోంది.

అలా కాక ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తూ దైవంపై నమ్మక ముంచి సాటి మనిషిని ఆదుకున్నప్పుడే మనిషి జన్మకు సార్థకత లభిస్తుంది. దైవం ఎక్కడో లేదు. తన దేహంలోనే ఉన్నాడని గ్రహించాలి. ఆ విధంగానే పాపం అంటే వేరే ఎక్కడో లేదు. కేవలం తాను చేసే పనుల్లోనే ఉంటుందని గ్రహించుకోవాలి.

బ్రతకడం కోసం తినాలి గాని తినడం కోసం బ్రతకాలనుకోగూడదు. దేహంపైని అభిమానాన్ని తగ్గించుకొని దైవాన్ని స్మరించకునేందు, దర్శించుకునేందుకు ప్రయత్నించాలి. సంకుచిత భావాలకు దూరంగా ఉండాలి. సర్వ మానవ సౌభాగ్యాన్ని కోరుకోవాలి. లోకమంతా నా వారేనన్న విశాలమైన భావాన్ని పెంపొందించుకోవాలి. మంచినే చెయ్యాలి. మంచినే తలపెట్టాలి.

ఇదే దైవత్వానికి సులభమైన మార్గం. ఇంత సులభ మార్గాన్ని మనం వదులుకొని మంత్రాలనూ, తంత్రాలనూ గుడ్డిగా అనుసరిస్తున్నాం. ఇదంతా వృథా ప్రయాస.

## అహింసలో దైవ దర్శనం

హింసలో ఎన్నో రకాలున్నాయి. ఎదటి వారిని అవమాన పరచి మాట్లాడడం కూడా హింసే అవుతుంది. అబద్ధమాడి ఎదటి వారిని హింస పెట్టే వారున్నారు. మరొకరు భయపెట్టి ఎదటి వారిని హింసించే వారున్నారు. ఇలా ఎదటి వారిని ఏ విధంగా బాధపెట్టినా, మానసిక క్షోభకు గురి చేసినా హింస కిందే వస్తుంది.

సాటి మనుష్యులనే కాదు పశుపక్ష్యాదులను, జంతువులు ఏ ఇతర ప్రాణులను బాధపెట్టినా, వాటికి ప్రాణ హాని తలపెట్టినా అది హింస కిందికే వస్తుంది. ఇలాంటి సున్నిత విధానాన్ని తల్లిదండ్రులు చిన్ననాడే నాటవలసి ఉంటుంది. సర్వజీవులు పరమాత్మ స్వరూపులు అని తెలియజెయ్యాలి.

ప్రతి మనిషి ఎదటి వారిని ప్రేమించాలి. గౌరవించాలి. ఆదరించాలి. మంచి చేసిన వారిని చూసి వ్యక్తులు దేవుడిలాంటి వాడని అంటూ ఉంటారు. అంటే ఆ మనిషిని దైవంగా భావించాడనీ, దైవంతో సమానంగా చూస్తున్నాడనీ అనుకోవాలి. అంటే మనష్యుల్లోనే దేవుడున్నాడన్నమాట. మనిషి అంటే మానవత్వం, అతని గొప్పతనంలోనే దైవం ఉన్నాడన్నమాట.

కాని మనిషి స్వార్థానికి పోయి జంతువులను హింసిస్తున్నాడు. బలి కావిస్తున్నాడు. ఇలాంటి హింసా విధానానికి మానవులు పాల్బడకుండా ఉండాలంటే జీవహింస కూడదనీ, చేయరాదనీ పిల్లలకు చిన్నప్పుడే బాగా నూరిపోయాలి. మాంసాహారులంతా హింసకు పూనుకుంటున్నారనే విషయాన్ని తెలియజేసి మాంసాన్ని ఆరగించడాన్ని ఆపు చెయ్యాలి. మాంసాహారం బదులు శాఖాహారమే ఎంతో మేలైనదని పిల్లలకు తెలియజెయ్యాలి.

ఆహారం కోసం ఇతర ప్రాణులను సంహరించి తాము విందారగిస్తే, మనస్ఫూర్తిగా తింటున్నామని ఎవరైనా అంటే అది రాక్షసత్వమే అవుతుంది.

## సహ జీవన విధానం

సహ జీవన విధానం మనుష్యులకే కాక సకల ప్రాణి కోటికీ అవసరమే. చీమలలో ఉండే సహ జీవన విధానం ఎంతో గొప్పది. ఎక్కడో ఒక బియ్యపు గింజను చూసిన ఒక చీమ ఆహారం కోసం అలమటిస్తున్న తోటి చీమలను కలుపుకుని వెళ్లి దాన్ని తీసుకు పోతుంది. అంటే తనతో పాటు తోటి చీమలు కూడ బతకాలన్న నీతి సూత్రాన్ని పాటిస్తూ ఉండడం వల్లనే చీమలు ఆ విధంగా సమష్టి జీవనాన్ని సాగించ గలుగుతున్నాయి.

ఎంతో తెలివైన వాళ్లమనీ, ఎంతో మేధో సంపన్నులమని గొప్పలు చెప్పుకునే మనుష్యులు మాత్రం సాటి వారిని గౌరవించరు. సాటి వారితో సహజీవనం సాగించడానికి ఇష్టపడరు. దీనికి ప్రధాన కారణం ఈర్ష్య, ద్వేషం, అసూయ –

వీటిని తొలగించుకోనిదే మనిషి మనిషిగా బతకలేడు.

## దైవమే నీకు తోడూ నీడా

మనిషి దైనందిన జీవితం ఇపుడు ఎంతో వేగాన్ని పుంజుకుంది. తిండి, నిద్ర, ఇరత సుఖాలకు తగిన సమయాన్ని కెటాయిస్తూనే ఉన్నాడు. దైవ చింతనకు మాత్రం సమయం లేదని తప్పించుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

అయితే ఉదయం లేచిన దగ్గర్నుంచీ రాత్రి నిద్రపోయే వరకు మనిషి పడే పాట్లు అన్నీ ఐహికమైన సుఖం, ఆనందం కోసమే వెచ్చిస్తున్నాడు. కాని ఏమీ లేని నిరుపేదకు ఆహార సంపదే పరమావధి అవుతోంది. అన్న వస్త్రాలకు లోటులేని వారు ఐశ్వర్యం మీద, సుఖ సంపదల మీద మనస్సును, ధ్యాసను పెంచుకుంటారు. వాటి కోసమే శ్రమిస్తూ ఉంటారు. ఇవన్నీ సాధించిన వారు భవిష్యత్ ఆలోచనలో పడి తమ సంతతికి ఏలోటూ రాకుండా ఉండడానికి ఆస్తులను సంపాదించుకోడానికి ప్రయత్నిస్తాడు.

అందువల్ల ధన సంపాదనలో మనిషికి తృప్తి లేకుండా పోతోంది. ఎదటి వారి బ్రతుకును ఛిద్రం చేసి లెక్కలేనంత సంపాదనను కూడబెట్టడమే ఆధునిక మానవుని పరమావధిగా మారిపోయింది. అయితే సంపాదించిన ధనాన్ని దైవ సంభంధంమైన, పేదలకు సహాయపడే కార్యక్రమాలకు ఖర్చు చెయ్యడానికి వెనకాడుతుంటాడు. తమ హోదా పెంచుకోడానికి మాత్రమే ఖర్చు పెడుతుంటాడు.

దైవ సంబంధమైన, పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలకు చేసే ఖర్చు ఎన్నటికీ వృథా కాదు. మనిషి ఎంత ఆస్తి కూడబెట్టినా అది అతడి వెంట రాదు. అతడు గడించిన కీర్తి మాత్రమే కలకాలం నిలుస్తుంది. డబ్బుతో పాటు మనిషి అశాంతికి గురౌతున్నాడు. దైవ చింతనలోనే చిరశాంతి ఉందనే వాస్తవాన్ని తెలుసుకోలేక పోతున్నాడు.

## మానవ సేవే మాధవ సేవ

మనిషిలో రోజురోజుకూ స్వార్థం పెరిగి పోవడం వల్ల జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు చెప్పిన గురువుల పట్ల ఏ మాత్రం కృతజ్ఞతను కనబర్చడం

లేదు. తల్లిదండ్రులను గౌరవించడం ఎప్పుడో మానివేశారు. పైగా వాళ్లను ఎదిరించే వాళ్లూ ఉన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతను తప్పించుకోవడానికి అన్నదమ్ములు ఎన్నో సాకులు చెబుతుంటారు. వారిని ఏ శరణాలయంలోనో చేరిస్తే తప్ప తమ వాటా సాయాన్ని చేయమనే వారూ ఉంటున్నారు. ఇంతకన్నా కృతఘ్నత ప్రపంచంలో మరొకటుండదు. మాతాపితల సేవే మాధవ సేవ ని ఈనాటి తరానికి గుర్తు చేయవలసిన అవసరం ఏర్పడుతుంది.

మరో దారుణమైన విషయం! మనిషి సుఖ సౌఖ్యాలు అనుభవిస్తున్నప్పుడు అతనికి తల్లిదండ్రులు గుర్తుకురారు. కష్టాలు వచ్చినప్పుడు మాత్రమే తల్లిదండ్రులు గుర్తుకు వస్తారు. తల్లిదండ్రులను మరచిపోయే పరిస్థితి వస్తున్నందు వల్లే "తల్లిపాలు తాగి రొమ్ము గుద్దే తత్వం" అనే నానుడి వచ్చింది.

ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను సేవించడమే భగవత్సేవగా భావించాలి. వారే ప్రత్యక్ష దైవాలు. వారిని సేవిస్తే భగవంతుని సేవించినట్లే. ఈ విషయం పిల్లల్లో చిన్ననాడే నాటుకునేలా చెయ్యాలి.

## సత్సాంగత్యాన్ని వెతుక్కోవాలి

శ్రీ సాయి వంటి సద్గురువుపై భక్తి శ్రద్ధలు కలిగి ఉండడం ఎంతో అదృష్టం. మనకు ఆయన తోడుగా ఉండి సరియైన మార్గంలో నడిపించాలంటే ఏం చెయ్యాలి? "నాపై నీ దృష్టి నిలుపు, నీపై నేను దృష్టిని నిలుపుతాను" అని అన్నారు సాయి. ఆయన గురించి అమితంగా ధ్యానం, చింతన చేసిన వారి యోగక్షేమమూ ఆయన వహిస్తారు.

అయితే అనుకున్నవి నెరవేరనప్పుడు మన విశ్వాసం పొంగుతూ, లేనప్పుడు కుంగుతూ ఉంటుంది. సద్గురువు సాంగత్యం, సేవ వల్ల మాత్రమే స్థిరమైన శరణాగతి క్రమంగా కుదురుతుంది. అయితే ఆయన పట్ల శంకలు కలిగి మనస్సు ఆయన స్థితి నుండి మరలి చంచలం అవుతూ ఉంటుంది. ఎలాంటి ఒడుదొడుకులు లేనప్పుడు మనకు ఆయన సన్నిధి లభించినట్లు. అప్పుడే మనకు ఆయన నుండి సంపూర్ణ రక్షణ లభిస్తుంది.

కాగా మనపై సాటి వారి సాంగత్య ప్రభావం కూడా ఉంటుంది. సాంగత్యానికి మనపై మనం ఊహించలేనంత ప్రభావం ఉంటుంది. అందుకే

మనిషికి తన సాధనతో పాటు సత్సాంగత్యం కూడా అవసరమే. అయితే ఈ సత్సంగం అంత సులువుగా దొరకదు. దానిని తోటలా పెంచుకోవాలి. చెడు అనే కలుపును తీసివేయాలి. అందుకు మంచి కథలు వినాలి. ఇరుగు పొరుగు వారిని ప్రేమతో ఆహ్వానించాలి. సాయి పటానికి ధూపదీపాలు అర్పించి, సద్గురుని దివ్య గుణాలను స్మరించాలి.

## మన తెలివితేటలు - విద్వస్సంపద సమాజ పరం కావాలి

మనిషి తన బుద్ధి, తెలివి తేటలు తనకూ, తన సమాజానికి ఉపయోగ పడేటట్టు చూడాలి. అంతేకాని ఎవరినీ కించ పరచేటట్టుగా, బాధించే విధంగా, హాని కలిగించే విధంగా ఉపయోగించ కూడదు.

చాలా మంది తామే గొప్ప తెలివైన వాళ్లమన్న అహంకారంతో ఎదటి వారిని తేలిక, చులకన చేసి మాట్లాడే వారిని చూస్తూ ఉంటాం. అలాంటి వారు మనషులతోనే సరిపెట్టకుండా, దేవుళ్లను కించపరచేందుకు కూడా అతి తెలివిని ప్రదర్శిస్తూ ఉంటారు. అలాంటి వారికి భగవంతుడు సరైన సమయంలో తగిన శాస్తి చేస్తూ ఉంటాడు. ఇది తథ్యం.

అయితే మరి కొందరు తాను చేయవలసిన పనిని ఎగవేయడానికి ప్రయత్నిస్తూ, లోపం ఏదైనా జరిగితే ఎదటి వారిని లేదా భగవంతుణ్ణి నిందిస్తూ ఉంటారు. తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోడానికి అటువంటి వారు దేవుణ్ణి కూడా ఉపయోగించుకోడానికి వెనకాడరు.

అలాంటి వృత్తి ధర్మం, విద్యుక్త ధర్మం వంటి ధర్మాలకు కట్టుబడి ఉన్న వారిని చూసి ఎగతాళి చేస్తూ ఉంటారు. ధర్మానికి కట్టుబడి ఉండే వారూ లేదా ధర్మాన్ని, నీతిని తుచ తప్పకుండా పాటించే వారు తాత్కాలికంగా కష్టాలకు, అవమానాలకు గురి అయినా సమాజం దృష్టిలో, దేవుని దృష్టిలో ఉత్తమవారుగా పరిగణించబడతారు.

పాఠశాల విద్యాభ్యాసం జరిగే రోజులే, విద్యార్థులకు అమృతబీజాలను నాటవలసిన సమయం. తల్లి ఒడినే బడిగా భావించే పిల్లలకు, ఉగ్గుపాలతో నేర్పించవలసినవి చాలా ఉన్నవి - అవే జీవితానికి పునాది రాళ్ల వంటివి. మన పాఠ్య ప్రణాళికల్లో ఇవి చోటు చేసుకోనంత కాలం మంచి జరుగదు.

## ఆధ్యాత్మిక జీవనం ఉత్తమ జీవనం

నిత్య జీవితంలో అనేక సమస్యలతో కొట్టు మిట్టాడే మనిషికి అంతరంగాన్ని అద్దంలా ఉంచుకోవడం చాలా కష్టం. అలా ఉంచుకునేందుకు దోహదం చేసేందుకే ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించమన్నారు పెద్దలు.

ఆధ్యాత్మిక జీవనం అనేవి మన జీవిత నౌకకు చుక్కాని వంటిది. మనలను భవసాగరాన్ని దాటించడానికి ఎంతో ఉపకరిస్తుంది. కోర్కెలను అదుపులో ఉంచుతుంది. మంచి కోర్కెలను జనింపజేస్తుంది. సన్మార్గంలో మనలను పయనింపజేస్తుంది.

## పగ, ప్రతీకారాలు పతనానికి కారణాలు

ప్రతీకారం తీర్చుకోవాలన్న కాంక్ష ఎవరిలో ఉన్నా అది మంచిది కాదు. ప్రతీకారేచ్ఛ అనేది మానవత్వానికి ప్రతీక కాదు. పగ, ద్వేషం, అసూయ వంటివే మనుషులకు శత్రువులు. ఎవరైనా మనలను ద్వేషించినా లేక దూషించినా మారు మాట్లాడకుండా ఉండడమే మంచి సమాధానం.

సాయిబాబా తన వద్దకు వచ్చే భక్తులకు తరచు ఇదే బోధించే వారు.

## మనషుల్లో భక్తి విశ్వాసాలు లోపిస్తున్న తీరు

మనుషుల్లో భక్తి విశ్వాసాలు సన్నగిల్లుతుండడం వల్లనే ఎందరో కళాకారులు, నిపుణులు ఆదరణకు నోచుకోవడం లేదు. గతంలో పాపభీతి ఎక్కువగా ఉండేది. ఈ కారణంగా సంపన్న వర్గాలు నిరుపేద వర్గాలకు తమకున్న దానిలో ఎంతో కొంత సాయం చేస్తూ సఖ్యతతో ఉండేవారు.

ఆధునిక కాలంలో "ఇజా"ల పేరిట మనషుల మధ్య పెరిగిన అగాధం కారణంగా ఈ సఖ్యత మటుమాయమైనది. దానధర్మాల స్థానంలో, "దోపిడి" వచ్చి తిష్ఠ వేయడంతో మనుషుల మధ్య అపనమ్మకం ఏర్పడి, అంతరాలను పెంచింది. అంతరాలు పెరిగిన సమాజంలో ప్రేమలు, దయా దాక్షిణ్యాలు మటుమాయం కావడం సహజం.

## నియమాలతోనే నికరమైన జీవనం

నియమ బద్ధమైన జీవనం ఆధ్యాత్మిక చింతన వల్ల సాధ్యమౌతుంది. ఆధ్యాత్మిక జీవనం అంటే, సన్యాసాశ్రమాన్ని స్వీకరించడం కాదు. సంసారాన్ని సాగిస్తూనే ఆధ్యాత్మిక జీవనం సాగిస్తే అటు ఆర్థిక సమస్యల నుంచే కాకుండా అనారోగ్య సమస్యల నుంచి దూరం కావచ్చు.

తరాలు మారినా విలువలకు దూరం కాకుండా ఉంటే ఆధునిక కాలంలో కూడా అది సాధ్యమే.

## మంచిగా ఆలోచించే వారితోనే సాంగత్యం నెరపాలి

మంచిగా ఆలోచించే వారితో సాంగత్యం చెయ్యాలనీ, పరిసరాలు శుభ్రంగా ఉండే వాతావరణంలో జీవించమని విజ్ఞులు చెబుతూ ఉంటారు. అందుకే గుడికి, బడికి దగ్గరగా ఉండాలని కూడా చెబుతూ ఉంటారు. అందుకే గుడికి వెళ్లడం అలవాటు చేసుకుంటే మనిషిలో దైవచింతన అనేది అనుకోకుండానే ప్రవేశిస్తుంది. ఒక్క రోజులో అది సాధ్యం కాకపోయినా క్రమంగా అలవడుతుంది. దైవ చింతన ద్వారా మానసిక శాంతి కలుగుతుంది. దైవ భావన అయినా, మానసిక శాంతి అయినా స్వీయ అనుభవం ద్వారానే పొందాలి.

******

## తస్మాత్ జాగ్రత్త

చిన్నారులతో సాహసకృత్యాలు చేయించడం చాలా ప్రమాదం. ఇదో రకంగా వారి ప్రాణాలతో చెలగాటమే - లేత ప్రాయంలో అవిశ్రాంతంగా పరుగెత్తినా, లేక ఈత కొట్టినా హృదయ స్పందన వేగం అనూహ్యంగా పెరిగి పోతుంది. ఫలితంగా అదనపు ప్రాణ వాయువు అవసరమవుతుంది. గుండె వైపు, కిడ్నీ పైన ఒత్తిడి పెరుగుతుంది.

పసి పిల్లల గుండెలపై అదనపు భారం పడితే, హృదయ స్పందన విపరీతంగా పెరిగిపోతే గుండె ఆగిపోవడమో లేక కిడ్నీలు పనిచేయకపోవడమో జరిగే ప్రమాదం ఉంది.

డా॥ అపూర్వ ఘోష్

పిల్లల వైద్య నిపుణులు

******

# పిల్లలను సత్ప్రవర్తనలనుగా తీర్చి దిద్దడానికి మనం గట్టి ప్రయత్నం చేస్తున్నామా?

మనం ఎలాంటి సమాజంలో జీవిస్తున్నాం? సమాజంలో ఎలాంటి ఏహ్యమైన, జుగుప్సాకర సంఘటనలు జరుగుతున్నాయి? ఎలాంటి భేషజాల్లేకుండా ఇలాంటి సంఘటనలకు కారుకలెవరనేది మనకు మనమే ప్రశ్నించుకోవాలి.

భావి భారత పౌరులుగా ఎదిగే పిల్లల విషయంలో సముచిత న్యాయం జరుగుతోందా? నేటి పిల్లల్లో (ఎక్కువ శాతం) విచిత్ర వైఖరులకు కారణాలేంటి? ఇలాంటివన్నీ మన మెదడులను తొలితే సమస్యలే.

పిల్లల్లోని విచిత్ర మనస్తత్వాలను, ముఖ్యంగా నేరాలకు పాల్పడుతున్న పిల్లల నేపథ్యాన్ని గమనిస్తే అనేక వాస్తవాలు మన కళ్లముందు నిలబడతాయి. చిత్ర విచిత్రమైన సంఘటనలు మన కళ్లముందు కదలాడతాయి. నేరాలకు పాల్పడుతున్న పిల్లల నేపథ్యాన్ని గమనిస్తే - పేదరికం, నేర స్వభావం గల కుటుంబాలు, మద్యానికి బానిసలైన కుటుంబాల నుంచు వస్తున్న పిల్లలే ఎక్కువగా నేరాలకు పాల్పడుతున్నట్లు ద్యోతకమవుతుంది.

అయితే ఇవి ఎంత వరకు వాస్తవమనే విషయాన్ని పక్కకు పెడితే ఇందుకు పేదరికం, మరి కొన్ని కుటుంబ పరిస్థితులు కారణమని గట్టిగా చెబుతున్నాం. కాని ఇదే పేదరికాన్ని, నిరక్షరాస్యతను, ఇందుకు కారణమైన వాటిని రూపుమాపడానికి మనం ఎలాంటి పరిష్కార మార్గాలను చూపించి వాటిని అమలు పరుస్తున్నాం? అనే విషయాన్ని పట్టించుకోం.

పోతే పిల్లల్లో విచిత్రవైఖరులు నేర ప్రవృత్తి పెరగడానికి పేదరికమే కారణమా? అని తరచి చూడవలసి ఉంది. నేటి పిల్లల్లో (విద్యార్థుల్లో) విపరీత మనస్తత్వం పెరగడానికి పేదరికమే కారణమైతే మంచి ఆస్తిపాస్తులూ, అన్ని సౌకర్యాలూ ఉండి, ఎలాంటి లోటూలేని విద్యార్థుల్లో కూడా ఇలాంటి మనస్తత్వాలు చోటుచేసుకుంటున్నాయి. వారి సంగతేమిటి? కనీసం ఇలాంటి వారితోనైనా సమాజం బాగుపడాలికదా? ఇలా ఎందుకు జరగడం లేదు.

ఇపుడు మీరు ఏ విద్యార్థినైనా అడగండి - టెక్ట్స్ బుక్స్ కాకుండా మీరు చదివిన ఇతర పుస్తకాలేమైనా ఉన్నాయా చెప్పండి? అని అడిగితే ఏ విద్యార్థి కుడా దీనికి సమాధానం చెప్పలేడు. ఫలానా పుస్తకం చదివానని జవాబు చెప్పలేడు.

మీరు టీవీ ఎప్పుడూ చూస్తారా? టీవీ సీరియల్స్ చూస్తారా? అని అడిగితే దాదాపు అందరూ దీనికి సమాధానం చెబుతారు. లేత వయస్సులోనే లైంగిక కార్యకలాపాలకు, వేధింపులకు కారకులౌతున్న వారి విషయాన్ని తీసుకుంటే పిల్లలు టీవీ సీరియల్స్ ద్వారా "భవితవ్యాన్ని చెడగొట్టుకోవడం" కోసం సమాజపు మానసిక ప్రవృత్తిగా ఎందుకు తీసుకోగూడదు. ఈ విషయాన్నైతే మనం తప్పకుండా ఒప్పుకోవాలి. ఈ విషయంలో తప్పు పెద్దలదే. అంటే మనదే.

పిల్లల్ని పైకి తీసుకురావాలనే ఆరాటంలో మనమే వారికి లక్ష్యాలు పెడుతున్నాం. వారి ప్రాధాన్యతలను మనమే నిర్ణయిస్తున్నాం. వారిలో విపరీత మానసిక ప్రవృత్తులు ఏర్పడటానికి మనమే కారణమవుతున్నాం. అయితే మనకు మనం మారాల్సిన పరిస్థితి ఉంది. మనకు మనం మారితే తప్ప మన పిల్లలు మారరు.

కనీసం వారి చదువులు, పైకి వెళ్లే కొద్దీ అయినా ఇలాంటి వైఖరిని మనం మార్చుకోవాలి. ఇలాంటి ప్రయత్నం మనం చెయ్యాలి. స్కూలుకు పంపించడం మాత్రమే చేస్తే సరిపోదు. స్కూలు చదువుతో పాటు ఇతర విషయాలపై శ్రద్ధ తీసుకోవాలి. టెక్ట్స్ పుస్తకాలతో పాటు ఇతర మంచి పుస్తకాలను మనమే కల్పించాలి.

ఇలాంటివన్నీ ఏమీ చేయకుండా వారిలో విచిత్ర, విపరీత ప్రవర్తనలు ఏర్పడుతున్నాయంటే ఎలా? మానసిక సమతుల్యత లేని పిల్లలే విపరీతాలకు పాల్పడుతుంటారు. కనీసం మన పిల్లలు జనరల్, కామిక్ పుస్తకాలు చదువుకోడానికి కూడా మనం అవకాశం ఇవ్వడం లేదు. చందమామ, బొమ్మరిల్లు, శతకాల లాంటివి చదవటం అలవాటు చేసిచూడాలి. మహనీయుల, దేశభక్తుల జీవిత చరిత్రలను చదివించీ, వారి జీవితాల్లోని స్ఫూర్తి దాయక ఘట్టాలను వారు నెమరేసుకునేలా చెయ్యాలి. చిన్నప్పుడే ఇలాంటి పుస్తకాలను చదివిస్తే వారు తప్పకుండా ఆదర్శంగా తీసుకుంటారు. ఈనాటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే ఆదర్శ పురుషులు, మార్గదర్శకులు, స్ఫూర్తి ప్రదాతలు చాలా అవసరం. చాలా కీలకం.

ఇలాంటివి పెద్దల యెడ గౌరవభావాన్నీ, మహిళల పట్ల మనం చూపాల్సిన గౌరవభావాన్నీ వారిలో చిన్నతనం నుంచే ప్రోది చేస్తాయి. ఈనాడు పిల్లలు దేన్ని ఆదర్శంగా తీసుకోవాలో తెలియక, జీవన మార్గం గమ్యం ఏదో తెలియక, వాస్తవానికి విరుద్ధంగా, అశాశ్వతమైన విషయాలకు ప్రాధాన్యత నిస్తూ మన చేతుల నుంచి

జారిపోతున్నారు. ప్రపంచంతో పాటు వేగంగా పరుగెత్తుతున్నామనే ధ్యాసలో ఉండిపోతున్నాం. పిల్లలు సొంతంగా ఎదిగేందుకు అవసరమైన స్వేచ్ఛను వారికి ఇవ్వడంలేదు.

అలాగే జీవితంలో నిజమైన ప్రేమను, కనీస పద్ధతులను మనం వారికి తెలియజెయ్యడం లేదు. ఈ విషయంలో దేశంలో ఏ స్కూలూ సరైన విధంగా పని చేయడం లేదంటే అతిశయోక్తి కాదు. ఇపుడు దేశంలోని స్కూళ్లన్నీ విద్యార్థుల్లో ఒత్తిడిని పెంచే సిలబస్‌లను తయారుచేయటం, అమలు చేయటంలోనే మునిగి తేలుతున్నాయి.

అయితే ప్రకృతిపట్ల, జంతువుల పట్ల ప్రేమను పెంచే యత్నాలు కొన్ని జరుగుతున్నాయి. అవి ఆహ్వానించదగినవే.

ఇపుడు మనం చేయవలసినదల్లా మంచి మానవులుగా ఎలా రూపు దిద్దుకోగలం, మానవ సంబంధాలు ఎలా మెరుగుపరచుకోగలం, ప్రపంచాన్ని ఇంకా ఎంత నివాస యోగ్యంగా మార్చ గలం, మన వనరులను ఎలా కాపాడుకోగలం, వృధాకాకుండా ఎలా వినియోగించుకోగలం వంటి ప్రశ్నల్ని వారిలో రేకెత్తించగలగాలి. మంచిని పెంచుకునే పౌరులనుగా తయారు చేయగలిగేందుకు కృషి చేయవలసి ఉంది.

ఇపుడు చూస్తున్నదంతా వాస్తవమైన సమాజం కాదనీ ఆధ్యాత్మిక, నైతిక విలువలు చోటుచేసుకనే అసలైన సమాజాన్ని గూర్చి ఆలోచింప చెయ్యాలి. మంచిని వారి చేత అనుసరింప చెయ్యాలి. చెడును త్యజించేలా చెయ్యాలి.

ఈ బాధ్యత మనందరి పైనా ఉంది.

******

## మానవీయ విలువలు

నేటి బాలలకు పెద్దబాల శిక్ష, శతకాలలోని పద్యాలను ఒంటబట్టించక పోవడం నేటితరం పెద్ద శిక్ష వేసుకున్నట్టే అవుతుంది. కష్టాలు వచ్చినప్పుడు భారత, భాగవత, రామాయణాలను, శతకాలను చదివి కాస్త ధైర్యం తెచ్చుకుని తమాయించుకునేలా చెయ్యాలి పిల్లల్ని, ఏమైనా పిల్లలు నీతిని ఒంట బట్టించుకునేలా చెయ్యాలి. అసలు మానవీయ విలువలు పాఠ్యాంశాలు కావాలి. తద్వారా సమాజాన్ని మానవత్వంతో పరిమళింప చెయ్యాలి.

## మానవత లేని జాతి అసంపూర్ణ జాతి

మానవీయ విలువలుండినదే ఉత్తమ జాతిగా రాణిస్తుంది. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా అందుకు మన వంతు కర్తవ్యం నిర్వహించాలి. కష్టపడుతున్నాడని తెలిసి కూడా అందుకు మన వంతు కర్తవ్యం నిర్వహించాలి. ప్రక్క వాడికి సహాయం చేయలేక పోవడం మానవీయత కాదు. మానవుల్లో మానవత లేకపోతే అలాంటి జాతి అసంపూర్ణ జాతే.

## యువతకు మానవీయ విలువలను బాల్యం నుంచే నేర్పాలి

ఏ సమస్యనైనా మానవీయ దృక్కోణం నుంచి చూసినప్పుడు పరిష్కారాలు లభిస్తాయి. మానవీయ దృక్కోణంతో చూసినప్పుడే మానవులంతా సమానంగా కనిపిస్తారు. మనవంతు ఏదో ఓ సహాయం అసహాయులకు చేయాలన్న పట్టుదల వస్తుంది. మానవీయ విలువల గురించి యువతకు ప్రధానంగా బాల్యం నుంచే నేర్పాలి.

## తృప్తికి మించిన సంపద లేదు

దేనిలోనైనా సరే మంచి చెడులను విశ్లేషించుకుని మంచినే స్వీకరించాలి. తృప్తికి మించిన సంపద లేదు. భారతీయ సంస్కృతికి ఏకైక ప్రతినిధి వివేకానందుడు. దైవాన్ని నిత్య జీవితానికి అన్వయించి స్వశక్తిని బోధించాడు. వివేకానందుడు ఆధ్యాత్మికతనే బోధించలేదు. విద్య ప్రాముఖ్యాన్ని తెలియజెప్పాడు.

# స్పందన - ప్రముఖుల అభిప్రాయాలు

## ఆచార్య వాసుదేవ

## సాయి దేశం - గాంధీ మార్గం

ఈ బృహత్తర ప్రణాళిక నేటి ఆధునిక సమాజానికి ఎంతో ఆవశ్యకమయినది. ఇరువురు మహానుభావులు అనుసరించునది అధ్యాత్మిక విలువలుతో కూడిన సమాజ శ్రేయస్సుకు, దేశ అభ్యుదయానికి ఉపయోగపడే సత్య మార్గము. ఒకరు మహాత్ములుగా కీర్తింపబడినవారు కాగా, మరొకరు అవతార పురుషులుగా పూజింప పడువారు. ఇరువురి యందు కనిపించు సామ్య లక్షణాలు దేశభక్తి, త్యాగము, సేవా ధర్మము, భారతీయ సంస్కృతి మరియు ప్రజల పట్ల అపారమయిన స్వార్ధరహిత ప్రేమాభిమానాలు. చరిత్రలో ఏ వ్యక్తి అయిన చిరస్మరణీయంగా నిలవడానికి ఇవియే పునాది రాళ్ళు. భవిష్యత్ తరాల వారికి ఆదర్శాలు.

భారతీయ సత్య ధర్మాలకు విదేశీ పరిపాలనా ప్రభావం వలన ఆటంకము కలుగగా విదేశీ బహిష్కరణ, స్వదేశీ అనుసరణ నినాదంతో సత్యం కోసం ఆగ్రహం చెంది అహింసా మార్గంలో సత్యాగ్రహం నిర్వహించిన మహాత్ముడు గాంధీ కాగా, సత్యం ఎల్లప్పుడు ప్రతిష్ఠితమయి అధ్యాత్మిక కాంతితో శాంతిని ప్రసాదించే మార్గదర్శకులు సత్యసాయి. ఇంతకూ, "సత్యం" అనే పదానికి అర్ధం ఏమిటి? ఏమని నిర్వచింపవచ్చును అంటే "సశరీరం సహృదయం సత్యం" అని వేదము తెలుపుచున్నది. అనగా హృదయం కేంద్రమును కలిగి, ఒక ఆయతనం అనగా చుట్టూ ఒక పరిధి శరీరముతో కూడిన ప్రతి వస్తువు "సత్యమే". సత్య మార్గము, సత్య వాక్కు, సత్య పరిరక్షణ అంటే భగవంతుని సృష్టిలోని జడ, చేతన జీవుల నన్నింటిని శాంతి మార్గమున రక్షించుటకు గావించు ప్రయత్నమే. అది ఎప్పటి కయిననూ జయించును గావున "సత్యమేవ జయతే" అని మన పెద్దలు ప్రవచించిరి. సత్యముతో సన్నిహిత సంబంధము కలిగి వస్తు స్వరూప స్థితిని సంరక్షించునదే ధర్మము. వేదమంతా ధర్మమును మూలము నందు కలిగి "వేదోఖిలం ధర్మమూలం" అనబడినది కాని మత మూలము కాదు. ఎవరి స్వధర్మమును వారు ఆచరించుట

యందే శ్రేయస్సు కలదు గాని పరధర్మాచరణము వలన కాదు. "స్వధర్మో నిధనం శ్రేయ పర ధర్మో భయావహా" అని భగవద్గీత ధర్మగ్లానియే అవతార కారణమని భగవానుడు పేర్కొనెను. ధర్మము సుసూక్ష్మముగా ఉండుటచే "సూక్ష్మయా సూక్ష్మ దర్మిభి" అనియు తెలియజేసెను. ధర్మమును మనము రక్షించినచో అనగా వస్తు స్వరూప స్థితిని కాపాడే భౌతిక, రసాయన ధర్మములను రక్షించుకొన్నచో మనము రక్షింప బడుదుము అని "ధర్మో రక్షతి రక్షిత" అను దాని అర్ధము.

సత్య ధర్మములకై ఎన్ని పరీక్షల కయిననూ నిలిచి రాజ్యముతో పాటు భార్యా బిడ్డలను సహితము త్యాగము గావించి దేవతల మన్ననల నందుకొన్న సత్య హరిశ్చంద్ర చక్రవర్తి, ప్రాణం తీసినా కూడా చివరిలో ఆత్మ ధర్మాలకు విలువనిచ్చి ఆత్మారాముని హేరామ్! అని తలచుకున్న ప్రజాస్వామ్య వాది మహాత్మా గాంధీ. అనునిత్యమూ సత్య ప్రభోదము గావించే సత్యసాయి ఆదర్శాలు మానవ జాతికే మకుట మణిరత్నాలు.

"సాయి దేశం – గాంధీ మార్గం" అని శ్రీ చెరుకూరి రామారావు గారు చేపట్టిన ఒక వినూత్న ప్రయోగం సమాజ శ్రేయస్సుతో పాటు ప్రతి వ్యక్తిలోనూ అధ్యాత్మిక విలువలను నింపేదిగాను శాంతి స్థాపనకు ఉపకరించేది గాను ఉన్నది. గాంధీ మార్గం కేవలం ఒక రాజకీయ పార్టీకి చెందినదేమోనని భ్రమ పడరాదు. అదే విధంగా సాయి అధ్యాత్మిక విలువలు కేవలము ఒక వర్గమునకు చెందినవిగా పరిగణించరాదు. ఇరుమరి మార్గములు, విలువలు, ఆదర్శములు నేటి రాజకీయ, ఆర్ధిక, మారణ కాండాయుత, ధన – ఋణ భారయుత సంక్షోభ పరిస్థితులలో యావత్ప్రపంచానికే ఆచరణ యోగ్యమయినది. ప్రతి ఒక్కరికీ మనశ్శాంతిని అందించునవి.

శ్రీ చెరుకూరి రామారావు గారి కృషి ఫలించి, ఆయన నాటిన బీజం మహా వృక్షమయి అందరకీ వెలుగును, నీడను ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించుదును.

# స్పందన

## ఆధ్యాత్మిక - నైతిక విలువల సాధన

ప్రముఖ వ్యాపారవేత్త, సహృదయుడు, దాత అయిన శ్రీ చెరుకూరి రామారావుగారు, తాము చేపట్టిన, ఆధ్యాత్మిక పునాదులపై బాల బాలికలలో నైతిక విలువల నిర్మాణ వేదిక "సాయి దేశం – గాంధీ మార్గం" పిల్లలలో సానుకూల మార్పు తీసుకొని రాగలమనే ఆశాభావము వ్యక్తపరుస్తున్నారు.

భారత దేశానికి సంభవించిన ఉపద్రవమేమిటంటే, పరాయి దేశముల వారు, పరాయి సంస్కృతుల వారు మన దేశాన్ని కొన్ని శతాబ్దాల పర్యంతం పరిపాలించడం వల్ల వారి నాగరికత, వారి పరిపాలన, వారి విద్యావిధానం మొదలైనవి మన దేశపు ఆధ్యాత్మిక, నైతిక పునాదులను గట్టిగా దెబ్బతీశాయి. అప్పటి వరకు సనాతన సాంప్రదాయానికి అంటిపెట్టుకున్న వారు కూడా విదేశీ మోజులో, ప్రభు భక్తి పరాయణతలో, సాంకేతిక పరిజ్ఞానపు మత్తులో, పారిశ్రామికీ కరణ విధానంలో, ఇంద్రియములను ఉద్రేక పరచే వాతావరణం ఏర్పడం వలన, దాదాపుగా అందరూ నైతిక విలువలు, ధర్మాచరణలు వదలి ఆ వైపుకు పరుగులు పెట్టారు. సనాతన సంస్కృతి అపహాస్యం పాలైంది. అయితే సనాతన ఋషి సంప్రదాయం ఇప్పటికీ పరవిత్రంగానే ఉంది. వారసత్వంలోనే పొరపాట్లు జరిగాయి. మన సనాతన, సంస్కృతీ సంప్రదాయాలను పునరుద్ధరించుకోవలసిన సమయం ఆసన్నమైంది. అందులకు తగిన ప్రయత్నాలు, ఆచరణలు కొనసాగించవలసియుంది.

పెరిగి పెద్దవారైన నేటి మానవులలో పరాయి సంస్కృతీ ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల వారిలో నైతిక విలువల స్థాపన, ధర్మాచరణలు కలిగించటం సాధ్యం కాని పని అని భావించి, కనీసం తరువాత తరం వారు అనగా 10 సంవత్సరముల వయస్సులోపల ఉన్న బాలబాలికలలో నైతిక విలువలు, ధర్మాచరణలు స్థాపించటానికి "చంద్రునికోనూలుపోగు" చందాన తమ నూతన వేదిక ద్వారా కార్యాచరణకు పూనుకోనున్నట్లు తెలియజేశారు.

ఆధ్యాత్మికత అంటే తనను గురించి తాను తెలుసుకోవటం. తనను గురించి తాను అధ్యయనం చేసే వ్యక్తి, ఆధ్యాత్మికవేత్త అవుతాడు, ప్రపంచాన్ని

గురించి పరిశోధన చేసే వ్యక్తి శాస్త్రవేత్త అవుతాడు. ప్రస్తుతం విద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు, ప్రయోగశాలలు ఏదో ఒక క్రొత్త విషయం తెలుసుకోవాలి, కనుగొనాలి అని పరితపిస్తున్నందువలన మేధావులంతా కర్మబంధంలో చిక్కుకుని భరించలేనంత మానసిక వత్తిడిని అనుభవిస్తున్నారు. ఆధ్యాత్మికత అంటే శరీరంలో ఉన్న నేను "గురించి తెలుసుకోవటం. ఆ నేను అంటే శారీరక, మానసిక, బౌద్ధిక, హృదయ మట్టాలకు అతీతమైనది. అదే ఆత్మస్థితి. అదే దైవ స్థితి. అనగా దుర్గుణాలు లేని ఆనంద లోకంలో విహరించటం అన్న మాట. ఆధ్యాత్మిక జ్ఞానము చేత నిష్కామ కర్మ సాధ్యమగును.

క్రైస్తవ మత గ్రంథంలో ప్రబోధించిన ప్రేమ తత్వంవలె, భగవాన్ సత్యసాయి బాబా నైతిక విలువలకు సంబంధించిన సత్యం పలకటం, ధర్మ ఆచరణ, సర్వ జీవులను శాంతిగా బ్రతుకనీయటం, సర్వ ప్రాణి సేవ మొదలగు విషయాలు బోధించారు. స్వామి వివేకానందుడు (1)త్యాగము, సేవలే మహోత్తమాదర్శములనీ (2) జనులలో అంతః కలహముల పోగొట్టి ఐకమత్యమును పెంపొందింప వలయునని, (3) భారతీయ సనాతన ధర్మాచరణమును తప్పకుండా పాటించ వలయుననీ, వానిని పాశ్చాత్యులకు బోధించవలయుననీ (4) శుష్క వేదాంతమును వదిలి పరిశుద్ధ అద్వైత తత్వమును మన నిత్య జీవితములో అనుష్టించి చూపవలయుననీ, (5) సమస్త జీవులందును నిరుపమాన ప్రేమ, సానుభూతులు చూపుటయను అనుష్టాన వేదాంతమును పాటించవలయుననీ (6) ఆత్మ విశ్వాస పరులైన కొందరు మహానుభావుల చరిత్రే ప్రపంచ చరిత్రయనీ, అటువంటి ఆత్మ విశ్వాసముతో నీలోని దివ్యశక్తిని ఉపయోగించి విజయం సాధించమని ఇంకా ఎన్నో విలువగల నైతిక ధర్మాన్ని బోధించాడు.

మానవునిలో ఉత్తమ సంస్కారం కలిగించాలంటే "గురువు" తప్పనిసరి. తొలిగురువు అమ్మే. ఆ తరువాత తండ్రి, విద్యా బుద్ధులు నేర్పే గురువు. పిల్లలను ఉత్తమ పౌరులుగా పెంపొందిపజేసే గురువులను ఎంచుకొనే బాధ్యత తల్లిదండ్రులే వహించాలి. గురువు డబ్బుకు అమ్ముడుపోయే వ్యక్తి కారాదు. అతడు పరిపూర్ణుడు కావాలన్నాడు స్వామి వివేకానందుడు. ఒక ఆత్మను ప్రేరేపించే శక్తి, ఏ ఆత్మకు ఉంటుందో అతడే గురువు. అయితే నేటి విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టింది. విద్య వాణిజ్యం అంటే అమ్మకం ద్వారా కొనేది అయింది. విద్యను అమ్మకానికి పెట్టినందున మానవీయ విలువలు నశించిపోయాయి. విలువలు నశించిపోగా సమాజ విచ్చిత్తి

జరుగుతున్నది. ఇట్టి పరిస్థితులలో నీతిని బోధించే నీతి శతకాలు, మహానుభావుల జీవిత చరిత్రలు, చారిత్రక కథాంశాలు, మన దేశ మహోన్నత్యం, నైతిక విలువలు, ధర్మాచరణలు పెంపొందించే విధంగా ప్రాథమిక విద్యా స్థాయి నుంచి పాఠ్య ప్రణాళికలు రూపొందించబడాలి. సద్గ్రంధ పఠనం తప్పనిసరిగా చేయించాలి. గురువులు విద్యార్థులకు ఆదర్శప్రాయంగా ఉండాలి.

పరిశుభ్రత పాటించటం ఆధ్యాత్మిక సాధనలో తొలిమెట్టు. కనుకనే "Cleanliness is next to Godliness" అన్నారు పెద్దలు.

దుర్గుణాలను వదలివేస్తే సద్గుణాలు అక్కడ, ప్రవేశిస్తాయి. అలాంటి వాటిలో మొదటిది వృధా ప్రసంగం. వ్యర్థ సంభాషణలు, ఇతరులను వెనుక విమర్శించటం, చెడు ప్రచారం చెయ్యటం, ఇతరులను నిందిచటం, అత్యాశ, ఒకరినొకరు పొగడ్తలతో కాలక్షేపం చెయ్యటం ఇవన్నీ అనుచితమైన కార్యాలు. ఇవన్నీ శత్రువులుగా గుర్తుపెట్టుకోవాలి. “దోషాలు వెదకటం దుష్టుల లక్షణమైతే, చెప్పులు వెదకటం కుక్కల లక్షణం”.

మనస్సును నియంత్రించుకొనుటకు మానవులు పాటింపవలసిన కొన్ని విద్యుక్త ధర్మాలను స్వామి చెప్పారు. “మనసు వెంట మనిషి పో కూడదు. మనసును తనవెంట నడిపించాలి”.

మన సంస్కృతిలో ఉన్నంత అమూల్యమైన సంపద మరే యితర సంస్కృతిలోను లేదన్నది నా నిశ్చితాభిప్రాయం, కాని దాని విలువను మనం గుర్తించలేదని మహాత్మా గాంధీజీ అన్నారు. ఆహారాన్ని భుజించడం, నిద్ర, భయం, లైంగిక భోగానుభవం అనేవి మానవులకు, జంతువులకు సమాన లక్షణాలు. మనిషికి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే ధర్మాచరణ, ధర్మాచరణ చేయకపోతే మనిషి జంతువుతో సమానమన్న మాట.

స్త్రీల పట్ల గౌరవం అనేది మన సంస్కృతిలో అత్యంత ప్రాముఖ్యం ఇవ్వబడ్డ విషయం. తల్లిని దైవ సమానురాలు “మాతృదేవోభవ” అని చెప్పబడింది. భార్య తప్ప ఇతర స్త్రీలంతా తల్లితో సమానమని చెప్పబడింది. హిందూ సంస్కృతిలో స్త్రీ సంరక్షించబడుతుంది. అందుకు కారణం ఆమెను ఎంతో విలువైనదిగా భావించడమే.

ఆశ అనేది మానవులకు ఉండవలసిందే. అది లేకపోతే మానవుడు తన

మనుగడను సాగించలేదు. అయితే ఆశకు హద్దు ఉండాలి. ఆ హద్దు మీరితే పెరాశగా మారిపోతుంది. పెరాశ దురాశకు, దురాశ దుఖానికి దారితీయును. అందువలన "ఆశలపై అదుపు, ఆహార పదార్థాలపై పొదుపు" విజ్ఞతతో ఆచరించాలి.

ఆవేశం, విజ్ఞతను, విలక్షణమైన విశ్లేషణకు మరుగుపరుస్తుంది. మనస్సుపైన స్వాధీనం గల వ్యక్తులు ఆవేశాన్ని స్వాధీనం ఉంచుకోగలరు.

అహంకారం అన్ని అనర్థాలకు మూలం. అది వున్న వ్యక్తికి మనశ్శాంతి వుండదు. అది పెరిగే కొలదీ ఆనందం తరుగుతూ వుంటుంది. అది మానవ జాతికి ప్రపంచానికి అపకారం చేస్తుంది.

అహింస అంటే చంపటం, బాధించటం, దొంగతనం చెయ్యటం మొదలగువని చేయకుండా వుండటం. మహాత్మా గాంధీ అహింస ద్వారా ప్రపంచాన్నే జయించారు. యుగ పరుషుడయ్యాడు.

కోపం జ్ఞాన విచక్షణను మబ్బులాగా కమ్ముతుంది. కోపం వల్ల బుద్ధి నశిస్తుంది. చివరకు సర్వ భ్రష్టత్వం ప్రత్యక్షమవుతుంది. క్రోధం వలన రక్తం ఉడికిపోతుంది. నరముల బలహీనత, జ్ఞానప శక్తి సన్నగిల్లటం జరిగి మానవుడు అన్ని విధాల నాశనమవుతాడు.

మన సనాతన ధర్మం నిరాడంబర జీవనానికి ఎంతో ప్రాధాన్యత నిచ్చింది. ఆధునిక కాలంలో గాంధీజీ, వినోబా భావే వంటి వారు నిరాడంబర జీవన విధానం ఆచరించి చూపారు. దానం చేయడం అనేది నిజమైన త్యాగం. అది మానవునికి సద్గతులు కలుగజేస్తుంది.

మాట– మానవులకు బాహ్యమైన కర్మేంద్రియాలను రెండు చెవులు, రెండు కళ్ళు, ముక్కు రంధ్రాలు రెండు కలుగజేసి, సృష్టికర్త నాలుకను మాత్రం ఒకటే ఇచ్చాడు. కారణం నాలుకను, మాటను తక్కువగా ప్రయోగించమనేది ఆయన ఉద్దేశం కావచ్చును. నోటికి సత్యవాక్కే భూషణం. నోరు మంచిదయితే ఊరుమంచిదవుతుంది. నాలుకనుండి వెలువడే ప్రతి మాటా మధురంగా వుండాలని, నామకరణం రోజున శిశువుకి తేనే రుచి చూపిస్తారు.

రచనలో కూడా భావ వ్యక్తీ కరణను ఎంత తక్కువ పదాల్లో ఇమడ్చ గలిగితే అంత నేర్పరి అవుతాడు.

రామారావు గారి ప్రతిపాదన 10 సం॥ల లోపు పిల్లలకు ఆధ్యాత్మిక నైతిక విలువలు నేర్పడం, ధర్మాచరణ చేయించడం అన్నమాట విన్నప్పుడు దివ్య ఖురాన్ ప్రవక్త చెప్పిన మాటలు మనకు గుర్తుకు వస్తాయి. 7 సం॥ వయస్సులోనున్న మీ సంతానాన్ని నమాజు కొరకు పంపించండి. అప్పుడు వారు సంకోచరహితంగా నేర్చుకుంటారు. 10 సం॥ల వయస్సులోనయితే వారిని మందలించ వలసి వస్తుంది" అని. మందలించకుండా నేర్పే వయస్సును ఎంచుకున్నారు రామారావు గారు. ఆలోచనల్ని ఆచరణలో పెట్టగలిగిన వాడే విజయాన్ని సాధిస్తాడు. ఇతరులకు మేలు కలిగించే మార్గాన్ని నిర్మించే యత్నంలో, ప్రయత్న లోపం లేకపోతే ఫలితం తప్పక వస్తుంది. శ్రీ చెరుకూరి రామారావు గారి కృషి ఫలిస్తుంది. సత్యసాయి, మహాత్మా గాంధీ గార్ల పేర్ల మీద స్థాపించిన వేదిక తప్పనిసరిగా సఫలమవుతుంది.

భవదీయుడు

**పాండురంగ ప్రసాద్**

వనస్థలిపురం, హైదరాబాద్.

******

# స్పందన

పూజ్యులు శ్రీ చెరుకూరి రామారావు గారికి నమస్కరించి

మీరు ప్రచురించిన "సాయి దేశం - గాంధీ మార్గం" ధన్యమైంది.

మీరు చేస్తున్న కృషి అమోఘం. పిల్లలలో నైతిక విలువలు పెంపొందించుటకు చేయదలచిన మీ తలంపు ఎంతయు కొనియాడ దగినది. నైతిక విలవలు రోజు రోజుకూ దిగజారుతున్న ఈ సమాజములో మీరు తలంచిన కృషి ఎంతో సంతోషించ దగిన విషయం. ఈ కార్యక్రమంలో ఆ సాయినాధుని అండ మీ తోడు సదా వుండాలని, ఉంటుందని కోరుకుంటూ.

ఇట్లు
**వై. రామి రెడ్డి.**

******

# స్పందన

గౌరవనీయులైన శ్రీ చెరుకూరి రామారావు గార్కి

మీ అంతరంగంలో వున్న ఆవేశాదుర్దాలు "సాయి దేశం – గాంధీ మార్గం" ద్వారా బహిర్గతం చేసిన ఆధ్యాత్మిక పునాదులు, బాల బాలికల నైతిక విలువలు కరపత్రం చదివి చాలా సంతోషించినాను. ఆలోచన మంచిదైతే ఆచరణ బావుంటుంది. ఉత్తమ ఆచరణ వల్ల ఆనందం, సుఖం, శాంతి, తృప్తి లభిస్తాయి. మీ యొక్క సదుద్దేశం సమాజంలో మార్పు ఏ రకంగా, ఎన్ని విధాలుగా తేవాలి అనేది ముందుగా ఆలోచించ దగ్గ విషయం. నైతిక విలువలకి ఎవరెన్ని త్యాగాలు చేసినా ఈ రోజు సమాజంలో ఫలితం చాలా తక్కువ. కారణం ఎవరికి వారు ఆధ్యాత్మికంగా వారి మనస్సును మరల్చుకోకపోవటమే. ఆత్మజ్ఞాన ప్రాప్తి మానవుని ఉన్నత స్థితి ప్రధాన సోపానము.

భగవంతుడు సహస్ర నేత్రాలతో సృష్టిని గమనిస్తూ కాపాడుతుంటాడనేది జగమెరిగిన సత్యం. అవగతం కావాలంటే ముందు ఆయన గురించిన జ్ఞానం వుండాలి. అందుకు సహాయపడే శాస్త్రాలు సత్‌గురు బోధనలు ఇవి ఆధ్యాత్మిక క్రమ శిక్షణను అలవాటు చేస్తాయి. ఆధ్యాత్మిక పునాదులతో ఎవరు పైకి ఎదగ గల్గుతారో వారికి జ్ఞానం, భక్తి, నైతిక విలువలు అబ్బి మెల్లిగా సమాజంలో మార్పు తేగలిన శక్తి కూడా ఏర్పడుతుంది. కాబట్టి ముందు చిన్న వయస్సు నుండి బాల బాలికలకు ప్రాత కాలము నుండి, నిద్రలేచినప్పటి నుండి చేయవలసిన కార్యక్రమాలు స్నానమాచరించుట, పెద్దలకు గౌరవము ఇచ్చుట, భగవంతుని ధ్యానించుట, గీతా పఠనం, మొదలగు అనేక సంస్కారములను పుస్తకాల ద్వారా ఆం.ప్ర. పాన వర్గం నుండి అనుమతి పొంది మొదటి తరగతి నుండి ప్రతి స్కూల్‌లో ప్రారంభించిన ఎడల మెల్లమెల్లగా సమాజంలో మార్పు వస్తుందనటంలో ఏ మాత్రం సందేహము లేదు. ఐతే తల్లిదండ్రులకు పిల్లల మీద వున్నంత మమకారం చదువు మీద వుండదు. కాలం అనేది భగవంతుని స్వరూపం. కాలంలో ఇపుడు వచ్చిన మార్పులు వారిని బంధించి, ధనము సంపాదింపచేసి వారివారి పిల్లలను ఒకర్ని మించి ఒకరు వేల కి వేలు ఫీజులు చెల్లించి స్కూళ్ళలో చేర్పిస్తున్నారు. దీనివల్ల మానవతా విలువలు లేకుండా పోతున్నాయి.

కాబట్టి ప్రాథమిక పాఠశాల నుండి బాలబాలికలో మార్పు తేవటం, మన

చుట్టు ప్రక్కన వున్న పెద్ద వాళ్ళతో సత్సంగ సమావేశాలు జరపటం ధార్మిక సంస్థలను వృద్ధి చేయటం, ఇవి కష్టమైనప్పటికి ఈ రోజున నాటిన మొక్క తరువాత తరం వాళ్ళకి ఎంతో సహాయంగా వుంటుంది. మీరు చేయబోయే ఈ కార్యక్రమం అంత వృద్ధిలోకి వస్తుందని మనసారా నమ్ముతూ, ఈ బృహత్తర కార్యక్రమమునకు చంద్రునికో నూలు పోగులా, నాకు చేతనైనంత సహాయ సహకారాలు ఉంటాయని ఆశిస్తూ..

ఇట్లు

**కె.వి.ఎల్.ఎన్. నరసింహా రావు**

******

# స్పందన

## ఆశంస

శ్రీ చెరుకూరి రామారావు గారు స్థాపించిన "సాయి దేశం - గాంధీ మార్గం" ఉన్నత ఆశయాలతో కూడుకొన్న ఒక చక్కటి సంస్థ (వేదిక). ఈ సంస్థలో మనకు రెండు విషయాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఒకవైపు సాయి ఆధ్యాత్మికత, మరొక వైపు గాంధీజీ ఆచరణాత్మక సూత్రాలు. ఈ రెండూ ఒక నాణానికి బొమ్మ-బొరుసు లాంటివి. వాటిలో ఏ మాత్రం వైరుధ్యం లేదు. ఇవి ఒక దానితో ఒకటి పెనవేసుకున్న సార్వత్రిక, శాశ్వత సత్యాలు. ప్రస్తుతం మన దేశంలోనైతేనేమి పరాయి దేశాల్లోనైతేనేమీ పరిస్థితులు దిగజారిపోతున్నాయి. మన జాతి, మన భాషలు, సంస్కృతి, నాగరికత కలుషితమై మన మనస్సులను అపవిత్రం చేస్తూ, అశాంతిని కలుగు చేస్తున్నాయి.

ఈ తరుణంలో సమాజం సన్మార్గంలో నడవాలంటే మన యువతా-యువకుల ప్రవర్తనలో తగు విధంగా మార్పు రావాలి. ఈ సందర్భంగా మన యువతీ-యువకుల్లో హృదయ పరివర్తన రావాలంటే ఆదర్శ ప్రాయులైన మహా పురుషులు ముఖ్యంగా గాంధీజీ ఆత్మకథను తెలుపుతూ దానికి తోడు కొంత ఆధ్యాత్మికతను జోడించిన సాహిత్యం ఎంతేనీ అవసరం.

అలాగే ఎదిగే బాలబాలికల చిత్త వృత్తిపై ముద్ర వేసే నీతి సూత్రాలను తెలిపే శతక సాహిత్యం ఎంతో దోహద పడుతుంది. చిన్న పిల్లల మనస్సు ఒక "తెల్లని కాగితం"లాంటి దని, దానిపై ఎలాంటి మాలిన్యం లేదంటూ, స్వచ్ఛమైందని బ్రిటిష్ దార్శనికుడు జాన్‌లాక్ ఏనాడో చెప్పిన మాటలు సర్వదా సత్యములు. "మొక్కయి వంగనిది మ్రానై వంగునా" అన్న తెలుగు నానుడి జాన్‌లాక్ ప్రతిపాదించిన సూత్రానికి సామీపంగా వుంది. ఈ సందర్భంగా శ్రీ చెరుకూరి రామారావు గారు అభినందనీయులు. వీరొక పారిశ్రామిక వేత్త అయినా, వారి మనస్సు ఆ పారిశ్రామికం, చాలా సునిశితమైంది. అందుకే వారి ఆవేదన వారి కరపత్రంలోనే గోచరిస్తుంది.

శ్రీ చెరుకూరి రామారావు గారు వారి కరపత్రంలో పొందుపరచిన ఆవేదనలు, ఆశయాలు పరిపూర్తిగా ఆచరణాత్మకాలు కావాలని మనసారా కాంక్షిస్తూ.

మీ శ్రేయోభిలాషి

**ఆచార్య ఆర్. వెంకట రెడ్డి**

# స్పందన

గౌరవనీయులు శ్రీ చెరుకూరి రామారావు గారు, 'చెరుకూరి సంస్థల అధిపతి' గాంధేయ వాదాన్ని ప్రచారంలో వుంచి, ప్రాణం పోయడానికి – 'సాయి దేశం – గాంధీ మార్గం' అనే వేదికను ఏర్పాటు చేయడం ఎంతో ముదావహం – మఖలోపుట్టి పుబ్బలో పోయే పద్ధతిని గాకుండా – ఒక శాశ్వత వేదిక వారి ఆధ్వర్యంలో కొనసాగటం – సత్ఫలితాలను ఇస్తుందనే ఆశను కల్గిస్తున్నది. చిన్ననాట పడిన గొప్ప బీజాలు, ప్రేరణలు – పెద్దలై దేశభక్తులు గావటానికి ఎనలేని శక్తిని ఇస్తాయి. ఆదర్శ పురుషుల గాథలేకాదు. ఆదర్శ పురుషులు దగ్గరకు పిల్లలను కొనిపోయి – వారి నిజ జీవితాలను పిల్లలకు చూపడం ద్వారా – కొందరైనా 'గాంధీ మార్గాన్ని అనుసరిస్తారు – రామారావుగారు చేస్తున్న చేయనున్న పనులు తప్పక సంఘానికి మేలు ఒన గూర్చేవిగా వుంటాయని ఆశిస్తున్నాము – వారికి సహృదయుల ప్రోత్సాహము ఎల్లప్పుడూ వుంటుంది. 'వేదిక' ఆశయాలు దశదిశలా వ్యాపించాలని ఆకాంక్షిస్తున్నాను.

## గాంధీ మార్గం – బాలలకు బలం

గాంధీ మహాత్ముని ఆత్మకథ, వ్రాతలు, సంభాషణలు, సభలలో చెప్పిన ఉపన్యాసాలు, ఆయన తన జీవితంలో చివరి వరకు అనుసరించిన విధానాలు మనకు ఆయనలోని అనేక ఆదర్శాలను చూపించుతాయి. సత్యము, అహింస, త్యాగము, సహనము, సమానత్వము, ధైర్యము, పట్టుదల, నిరాడంబరత, సేవాభావము – ఇట్లా ఎన్నో సుగుణాలను తనలో ఇముడ్చుకున్న మహానుభావుడు.

అటువంటి ఉత్తమ గుణాలను దురదృష్టవశాత్తు ఈనాటి సంఘము ఆదరించడం లేదనే చెప్పవచ్చు. ఎక్కడైనా ఉత్తమ భావాలు కలవారు వుంటే దానికి మూల్యము చెల్లించాలి వస్తున్నది.

సమాజము పెడదారులలో పోతున్నప్పుడు – పెద్దలు, సమాజములో బాధ్యతాయుత స్థానాలలో వున్నవారు స్వార్థమువైపు, దోపిడీల వైపు మొగ్గు చూపుతున్నప్పుడు భావి పౌరులైన బాలలకు ఎవరి నుండి ప్రేరణ కల్గుతుంది? ఎవ్వరిని అనుకరించ గల్గుతారు? ఎన్ని నీతి కథలు చెప్పినా, ఎన్ని చాటువులు

చెప్పినా పసి హృదయాలను ఆకర్షించ గలిగేవిలా ఉండవు – మహావ్యక్తులు మాత్రమే వారిని ఆకట్టుకో గల్గుతారు.

ఈనాడు గూడ మహాత్మా గాంధేయ మార్గాన్ని అనుసరిస్తున్న మహాను భావులు వున్నారు. సమకాలనీన సమాజంలో ఇముడుతూ ఆచరిస్తున్నారు.

ఉదాహరణకు – మేథాపాట్కర్ స్వారజిక్– స్పృహకల్గిన సామ్యవాది, గాంధేయ వాది.

బాబా ఆమ్టే – గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేసి చూపిన గొప్ప వ్యక్తి.

అనంత్ కె.షా – శారీరక మానసిక లోపాలతో బాధపడే చిన్నారుల నేస్తం ఆయన. భావనగర్ గాంధీగా పేరు పొందిన గొప్ప వ్యక్తి.

సుధా మూర్తి (ఛైర్ పర్సన్ – ఇన్ఫోసిస్ ఫౌండేషన్) – "ముందు న్యాయ బద్ధంగా, ధర్మ బద్ధంగా సంపద సృష్టి జరగాలి. తర్వాత దానిని పంపిణీ చేయాలి" అంటారు ఆమె. గాంధీజీ ఆర్థిక పరమైన భావాలకు దగ్గరగా వున్నది ఆమె భావనా సరళి.

అజీమ్ ప్రేమ్‌జీ (విప్రో అధినేత) – ఆయన పేరుతో నెలకొల్పిన ఫౌండేషన్ – నాణ్యతాయుత ప్రాథమిక విద్యను అందించేందుకు ప్రయత్నించుతూ వుంది.

ఇట్లా ఎందరో పేరు తెచ్చుకుని మరియు అజ్ఞాతంగా గాంధీ మార్గములో సేవ చేసేవారు వున్నారు. వారిని వెతికి పిల్లలకు చూపాలి. అప్పుడే వారు మనం ఆశించిన విధంగా రూపుదిద్దుకుంటారు.

**చిగురుపాటి నరసింహం**

******

# స్పందన

## నవ్యమార్గ చైతన్యశీలి శ్రీ చెరుకూరి రామారావు

నిత్య సత్య పథాన్వేషి, నవ్యమార్గ శోధనా చైతన్యశీలి, సామాజిక ఋజువర్తనాభిలాషి, భారతీయ ఆధ్యాత్మిక బాటపై పయనించే పథకుడు. నైతిక విలువలపై సామాజిక పునాదులు నిర్మింపబడి భారతావని ఒక రసరమ్య స్వర్ణధామంగా పరివర్తన చెందాలనే తపనతో కలలుకనే ఒక గొప్ప ఆదర్శమూర్తి శ్రీ చెరుకూరి రామారావుగారు. విద్యా వ్యవస్థ సామాజిక సర్వంసహా చైతన్యాన్ని పెంపొందించటంలో అత్యంత కీలక స్థానం వహిస్తుందని ఆయన అభిప్రాయం. కానీ వాస్తవ పరిస్థితులలో తద్భిన్నంగా జరుగుతుంది. దానికి ప్రభుత్వం, తల్లిదండ్రులు, సమాజం కూడా కారణం కావచ్చు. ఏదైనా ప్రాథమిక దశలో విద్యాభ్యాసం చేస్తున్న పిల్లల మనోఫలకంలో నైతిక బీజాలు నాటాలి. వారి హృదయ స్పందన, సంస్కారం భావి తరాల వారికి ఆదర్శం కావాలి. దీని ఆలోచనా పర్యవసానమే – “సాయి దేశం – గాంధీ మార్గం” అనే ఒక చక్కని నిర్మాణ వేదిక యొక్క ఆవిష్కరణ. దీనికి అన్ని వర్గాల నుండి చక్కని సహకారం లభించింది. ఈ విశిష్టమైన భావన రూపుదాలిస్తే – రామారావుగారి ఆలోచనా స్రవంతి మానసిక సశ్యకేదారాలను పండిస్తుంది. భారతదేశం తిరిగి విశ్వగురు పీఠాన్ని అధిష్టిస్తుంది. నైతిక విలువలు ఆధ్యాత్మిక మార్గం యొక్క విశిష్టతను సమూలంగా గ్రహించి ప్రయోగ శీలంతో పరిక్రమిస్తున్న శ్రీ రామారావుగారి నూతన ఆవిష్కరణ జగత్ కల్యాణానికి నాంది కావాలని హృదయ పూర్వకంగా కోరుకుంటున్నాను.

**ధారా సత్యనారాయణ శర్మ**

Retd. Lecturer,
Vanasthalipuram, Hyderabad.

******

# స్పందన

"సాయి దేశం – గాంధీ మార్గం" ద్వారా అతి పురాతనమైన అతి విలువైన, భారతీయ సంస్కృతిని కాపాడుకొనుటకు ఆధ్యాత్మిక పునాదులపై బాలాబాలికలతో నైతిక విలువల నిర్మాణ వేదిక మన భావి భారత పౌరులలో మన సంస్కృతిని సంస్కారాన్ని ఇనుమడింపచేయాలనే తపన ఆలోచన ప్రయత్నము పార్షనీయం.

ఈ ఆధునిక యుగంలో తల్లిదండ్రులు తమ పిల్లలను మేధా సంపత్తిని డబ్బు సంపాదన కొరకు ఇతర దేశాలకు పంపించి ఇతర దేశాల వారికి ధారాదత్తం చేస్తున్నారు. పడిపోతున్న ఈ తరుణంలో మీరు చెప్పిన ఈ విలువలు అద్భుతమైనవి. కార్యక్రమం అభినందనీయం.

**పి. నాగేశ్వర రావు**

******

# స్పందన

గౌరవనీయులైన
శ్రీయుత చెరుకూరి రామారావుగారికి,
హృదయ పూర్వక నమస్కారములతో

పసి హృదయములలో "సాయి దేశం – గాంధీ మార్గం" ద్వారా ఆధ్యాత్మిక విలువలను నాటుటకు మీరు చేస్తున్న ప్రయత్నము శ్లాఘనీయము. ప్రశంసనీయము.

జన్మ ఎత్తిన ప్రతి మానవుడు సమాజములో గౌరవముగా జీవించుటకు విద్యతో పాటు ఈ రెండు సంపదలు అవసరము. మొదటిది అధ్యాత్మిక సంపద. రెండవది ఆర్థిక సంపద.

ప్రస్తుతము సమాజములో అధ్యాత్మిక సంపద పెంచుకొనుటకు ఎటువంటి ప్రయత్నము జరుగుట లేదు. న్యాయముగా ఈ సంపదను పెంచుకొను ఆశ ఉండవలసినది. అటువంటిది ప్రస్తుతము ఇది మరుగు పడుచున్నది. ఇటువంటి పరిస్థితులలో మన సంస్కృతి సంప్రదాయాలు, నైతిక విలువలు అధ్యాత్మిక విలువలను పసికూనల మనసులలో నాటుటకు మీరు చేస్తున్న ప్రయత్నము విజయవంతము కావలయనని ఆ ఈశ్వరుని ప్రార్థించుచున్నాను. దీని వలన సామాజిక అధ్యాత్మిక సంపద కొంతవరకైనా మెరుగుపడుటకు ఉపయోగ పడుతుందనుటలో ఎటువంటి సందేహము లేదు. ఇక ఆర్థిక సంపదకు ప్రస్తుతము సమాజానికి ఎవరు పాఠాలను చెప్పనవసరము లేదు. ఎవరికి వారు వారి శక్తి కొలది చేసుకొంటారు.

మీ శ్రేయోభిలాషి

ఇట్లు

**చన్నంరాజు కృష్ణంరాజు**

Sachivalaya Nagar,
Vanasthalipuram, Hyderabad.

# స్పందన

గౌరవనీయులు శ్రీ రామారావుగారు

మీరు పంపిన "సాయి దేశం - గాంధీ మార్గం" చదివాను. ఎటో పరిపరి విధాల పయనిస్తున్న మా మనస్సును ఏదో సాధించాలని తపన పడే మా జీవితాన్ని, ఒక్కసారి వెనుదిరిగి చుచుకోమని వార్నింగ్ ఇచ్చింది.

మీ సాయిసందేశంలో "స్వార్ధచింతన" "నైతిక విలువలు" "డబ్బు కోసం అకృత్యాలు" "విలువలు కోల్పోవడం" 'వాస్తవాలతో రాజీ' 'బాధ్యతలు విస్మరించటం' 'మన ఒక్కరి వల్ల ఏమవుతుంది' ఈ పదజాలం నూటికి నూరు పాళ్ళు నేటి మానవునిలో జీర్ణించుకపోయాయి. నేను కూడా అందులో ఒకణ్ణి అని చెప్పుకోవటానికి సిగ్గు పడటం లేదు. **73** ఏళ్ళ నేను ఏమి చేయగలను అనే నిస్పృహ, అయ్యో! ఎంతటి విలువైన కాలాన్ని వృధా చేసాననీ ఆలోచనను రేకెత్తించింది మీ 'గాంధీ మార్గం'.

తల్లిదండ్రులు తమ బిడ్డ డాక్టరు లేక ఇంజనీరు కావాలని కోరుకుంటారే తప్ప, గాంధీ, అంబేద్కర్, వివేకానంద, మదర్ థెరిస్సా కావాలని ఎవరు అనుకోవడం లేదు. ముమ్మాటికి నిజం. నాకు కూడా ఆ ఆలోచన రాలేదు. వారిని ఆదర్శ పురుషులు అంటామే తప్ప, వారి ఆదర్శాలను గురించి సభలలో చెప్పుకుంటాం కాని ఆ ఆదర్శాలను తమ బిడ్డలు జీవితంలో ఉన్నత శిఖరాలు ఎక్కటానికి మెట్లుగా ఉపయోగించాలని అనుకోరు. ఎందుకు? బహుశా వారు అందరికి అందని అంత ఎత్తుకు ఎదిగారు కాబట్టి. ఎలా? నమ్మిన ఆశయాల కొరకు కఠోరమైన శ్రమపడ్డారు కాబట్టి. మనం కూడా ప్రయత్నిస్తే మన బిడ్డలు అంత ఎత్తుకు కాకపోయినా కొంత దూరం ఎదగ గలరు.

చిత్రం ఏమిటే మీరు బిజినెస్ మెన్, రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ మీ వ్యాపారాలు. రియల్ ఎస్టేట్ చేసేవారు సంపాదన పెంచుకుంటూ, పెరిగిన కొద్ది ఇంకా, ఇంకా పెంచి, తృప్తికి దూరమై, దురాశలకు లోనై చివరకు గమ్యాన్ని తెలుసుకోలేరు. కాని అదే మీ చిత్రమో, మీరు సంపాదనకు, ఆశలకు హద్దులు ఏర్పరిచారు. జీవితం అంటే ఏమిటో ఆలోచించారు. సమాజానికి శక్తి కొద్ది సేవ చేయాలని, మర్చాలనే ఆలోచనే ఈ గాంధీ మార్గం. ఆశ్చర్యం! గాంధీ గారు

ఎవరో తెలియని ఈ తరానికి గాంధీ మార్గం గురించి ఏం తెలుస్తుంది. అందుకే కాబోలు పది సంవత్సరాల విద్యార్థులను ఎన్నుకున్నారు. వారే భావితరానికి వారసులు కనుక.

రామారావు గారూ! మీరు ఎదిగారు. మీ ఆలోచనా విధానం మమ్మల్ని ఆలోచించేటట్లు చేస్తుంది. మీరు పిల్లలకు నేర్పటానికి అంటారేమిటి? మాకు, అంటే మా వయస్సు వారు నేర్చుకోటానికి, నడుస్తున్న ఈ స్వార్థ మార్గాన్ని వీడి మరొక మంచి మార్గాన్ని ఎంచుకోవటానికి మీ యీ ఆలోచన ఉపయోగపడుతోంది.

మిమ్మల్ని పైనుదహరించన గొప్ప వ్యక్తులతో పోల్చను కాని, త్వరలో, అతి త్వరలో, మీలో నుండి, ఒక మహోన్నత వ్యక్తి, ఆదర్శ వ్యక్తి, ఈ స్వార్థ సమాజం తల ఎత్తి చూచే వ్యక్తి అవతరించ బోతున్నాడు. ఆ వ్యక్తికి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాను.

కృతజ్ఞతలతో

సాయిబాబాకు అర్పించే పూలమాలలో

ఒక చిన్న పువ్వు ఈ

**జడ్డి కృష్ణమూర్తి**

NGO's Colony,
Vanasthalipuram, Hyderabad.

******

# స్పందన

శ్రీ చెరుకూరి రామారావు గారికి
నమస్కారములతో

"సాయి దేశం - గాంధీ మార్గం". "ఆధ్యాత్మిక పునాదులపై బాలబాలికలతో నైతిక విలువల నిర్మాణ వేదిక" కావాలన్న మీ ఆశయం ఎంతో స్ఫూర్తి దాయకం. బాల బాలికల భవిష్యత్తుకు మంచి ఫలితాలు ఇవ్వాలని ఆశిస్తున్నాను. "సాయి దేశం - గాంధీ మార్గం" అనే ఒక సందేశాత్మకమైన పుస్తకంగా రూపుదిద్దుకొని, మానవ విలువలను పెంపొందించే విధంగా ఉండాలని అది యువత భవితకు నిర్మాణాత్మకమైన పునాదులుగా ఏర్పడాలని, వారు చేపట్టే ప్రతి పనిలో నైతిక విలువలను పాటిస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, ఆధ్యాత్మిక విలువలను పెంపొందిచాలని కోరుతున్నాను. అప్పుడు మాత్రమే ఈ సమాజం ప్రగతి పథంలో ముందుకు నడుస్తుంది.

"సాయి దేశం - గాంధీ మార్గం" పుస్తకం ద్వారా పిల్లలకు వారి నడవడికలో ఎంతో మార్పు రావాలని, మన మహానుభావుల జీవిత చరిత్రలను చదివి, అవగాహన చేసుకొని, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడి భారతదేశమును ప్రగతి పథంలో ముందుకు నడిపించాలని కోరుకుంటున్నాను.

సమాజం మనకేమీ చేసిందనే భావనను ప్రక్కకు పెట్టి మీరు సమాజం కోసం పాటుపడుతున్న తీరు ఎంతో అభినందనీయం మరియు గర్వ కారణం.

చివరిగా, మీరు చేసే ఈ విధమైన సమాజ సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు చేయూత ఇవ్వాలని, "సాయి దేశం - గాంధీ మార్గం" అనే పుస్తకంలో నా యొక్క స్పందన కూడా ఉండటం ఎంతో సంతోషం.

కృతజ్ఞుడను
ఇట్లు
సదా మీ సేవలో
**కె. సంజయ్ కుమార్**

# స్పందన

శ్రీ సాయి పరిపూర్ణ కటాక్ష సంపన్నులు,
శ్రీ చెరుకూరి రామారావు గారికి నమస్కరించి వ్రాయునది,

శ్రీలవిలసిల్లి, సకల కళా శోభితమై, జాతీయభావపరిపుష్టి గల్గి నైతిక విలువల సమన్వితమైన ఒకనాటి భారతజాతి గత నాలుగు దశాబ్దముల నుండి "స్వార్థపిశాచి" బారినపడి నీచ దశకు చేరుకున్నది.

నేటి ఈ కలుషిత సమాజంలో ధనదాహంతో హత్యలు, పదవీ వ్యామోహంతో కొట్లాటలు, కామవాంఛ కోసం మాన భంగములు నిత్య జీవన విధానమైనది.

భారతీయ సంప్రదాయములో తరతరాలుగా విద్య అభ్యసించడంలో ఉన్నత ప్రమాణములు కలిగిన దేశమిది. అట్టి సుసంపన్నమైన విద్యా రంగము నేడు కాముక వ్యాపారస్థితికి చేరినది. ముఖ్యముగా తల్లిదండ్రుల నిరాదరణకు గురియై, సామాన్య మానవునికి కరువైనది. అంతేకాక పాలకుల నిర్లక్ష్యానికి బలైనది. బోధించేవారిలో వ్యాపార దృష్టి స్వలాభం, ధనార్జన, పరాకాష్టకు చేరింది. విద్యార్థులలో క్రమశిక్షణా రాహిత్యము పెచ్చుపెరిగింది. వారిలో నైతిక విలువలు పతనమైపోయినాయి.

మరి ఇంత జటిలమైన సమస్యకు పరిష్కారము "సాగరమథనం" అవుతుంది. అలనాటి స్వాతంత్ర్య సమరస్ఫూర్తి ప్రతి యింట మరల వెల్లివిరిస్తేనే ఈ "హిమాలయ" శిఖర అధిరోహణ సాధ్యమవుతుంది.

ప్రతి ఉద్యమానికి అకుంఠిత దీక్షగల నాయకుడు కావాలి. ముందు వానిని ఎంచుకొని ఆచరణ పూరితమైన ప్రణాళిక రూపొందించాలి.

గత **35** సంవత్సరములు విద్యాశాఖతో అనుబంధాన్ని కలవాడిని కాబట్టి నా అనుభవము మేరకు ఆలోచించాను. విద్యాధికుడని కాకపోయినా! ఉన్నత స్థాయి ఆచార్యులతో గత రెండు దశాబ్దాలుగా కలసి పనిచేసే అవకాశము లభించింది. ఆ స్ఫూర్తితో ఈ క్రింది "పంచసూత్ర విధానము" మీ ముందు ఉంచుతున్నాను.

దీని పేరు "సువిద్య".

1. ఒకటవ విధానము - నివాసిత విధానము, ఇది శతాధికదేశములలో అనేకానేక లక్షల భక్తులకు ఆరాధ్యదైవమైన శ్రీ సత్యసాయి విధానమే. ఈ విధానమునకు నేటి వ్యాపార పూరితమైన "రెసిడెన్షియల్" విధానమునకు భేదమున్నది. అంతేకాక మన దేశములో అత్యున్నతమైన విశ్వవిద్యాలయాల గ్రాంట్ల కమీషన్ 15 సం॥ల క్రితమే ఆమోదించి ఆచరణకు అన్ని విశ్వవిద్యాలయాలను కోరిన విధానము. దీనికి పూర్తి స్థాయిలో "సత్యము" "ధర్మము" "శాంతి" "ప్రేమ" "అహింస" ఐదు కోర్సులకు సిలబస్ రూపొందించి విద్యార్థుల పాఠ్యాంశములతో పాటు ఒక సబ్జెక్టుగా పరీక్షాంశముగా నిర్ణయించాలి.

2. దూర విద్యా విధానము

సామాన్యులకు అందుబాటులో వుండేటట్లుగా ప్రతి గ్రామములో ప్రతి నగరములో ప్రతి వార్డులో స్థాపించి సమాజముతో సంబంధము లేకుండా 7వ తరగతి నుండి డిగ్రీ వరకు విద్యార్థిని క్రమశిక్షణతో పూర్తి కాలము నివసింపచేసి ఉన్నతునిగా తీర్చి దిద్దిన తరువాత సమాజములోకి పంపాలి. వీరందరికి ప్రభుత్వము మన దేశములో ముఖ్యముగా ప్రప్రథమముగా మన రాష్ట్రములో స్థాపించిన "దూరవిద్య" విధానములో విద్యాభ్యాసము ఏర్పాటు చేయాలి.

దూరవిద్యకుటీరములు

ఉపాధ్యాయులు మరియు పదవీ విరమణ చేసిన వారి సహాయంతో సెలవు దినములలో నడుపవచ్చును.

3. సుపోషణ విధానము

విద్యాలయాలను గాలికి వదిలి చెట్ల క్రింద నడుపుట మంచిది కాదు. మంచి కుటీరమైన చాలు. గాలి, నీరు, ఆహారము, కనీస నిర్వాహణ ఏర్పాటు నిరంతరము అందేలా చూచుటకు ప్రత్యేక బృందము వుండాలి.

4. సుపరీక్షా విధానము

ఏ రంగములోనైనా ఆచరణలో సంపూర్ణ విజయము విధాయకము మొత్తము

"సువిద్య" పంచ సూత్రముల ఆచరణలో నిరంతరము పరిశీలక బృందాలచే పరీక్ష (తనిఖీ) చేయించి లోపాలను ఎప్పటికప్పుడు సరిచేయుటకై పరిశీలక బృందాలను ఏర్పాటు చేయాలి. ప్రతి విద్యాలయమునకు తనిఖీ రిపోర్టు ప్రత్యేకమైన రికార్డును ఉంచాలి.

**5.** స్వయంపోషక విధానము

చాలా విదేశములలో అమలు చేసినట్లు విద్యపూర్తి అయిన విద్యార్థులకు స్వయం శక్తితో బ్రతికే కుటీర పరిశ్రమల తరహా ఉద్యోగ అవకాశములకై నిరంతరము సహాయము కొరకు సరియైన పథకాలను సూచించేటందుకు ప్రత్యేక బృందములను ఏర్పాటు చేస్తే సువిద్య నేర్చుకొన్న విద్యార్థి ఆదర్శ పౌరుడిగా మనుగడ సాగించగలడు.

చివరగా

మరి జీవన విధానానికి సర్వ యత్నముల పథకాల విజయమునకు మూలం ధనం. మరి ధనసమీకరణ ఎలా చేస్తే బాగుంటుంది? ప్రతి గృహస్తు రోజుకు ఒక్క రూపాయి చొప్పున సంవత్సరమునకు **365** రూపాయలు ఏ పాలకులకు సంబంధము లేని సమాజ సేవా సంస్థలైన (రెడ్ క్రాస్ లేక విశ్వవిద్యాలయములకు) "సువిద్య" అను ఖాతాలో చెక్/డి.డి./యం.ఓ. చేయించాలి. ఈ విద్యానిధి సద్వినియోగం కొరకై ఒక ట్రస్తును ఏర్పాటు చేసి స్వచ్ఛమైన సభ్యులను నియమించాలి.

మీ ఆలోచన భగవత్ ప్రేరితమైనది కావున విజయవంతం కావాలని ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

**మేమూరి శ్యాంసుందర్**

మాజీ రిజిస్ట్రార్,
Vanasthalipuram, Hyderabad.

# స్పందన

గౌరవనీయులు రామారావు గార్కి

మీరు ప్రారంభించిన ''సాయి దేశం - గాంధీ మార్గం'', యిప్పుడున్నటువంటి దేశ, సామాజిక పరిస్థితులలో ఎంతో అవసరము. చాలా ఉదాత్తమైన ప్రణాళిక, అవినీతి తాండవిస్తున్న యీ రోజుల్లో మీ కార్యక్రమము వెలుగుబాట. ఒక పటిష్టమైన ఆలోచనతో, ముందుకు సాగుతున్నందుకు మీరు సర్వదా అభినందనీయులు.

స్వామి వివేకానంద చాటి చెప్పిన Arise, Awake, stop not till the goal is reached సందేశాన్ని అనుసరించేందుకు సర్వతో ముఖంగా కృషి సలుపుతున్నందుకు మాకు ప్రేరణ యిచ్చినందుకు ఇందులో భాగస్వాములను చేస్తూన్నందుకు మీకు కృతజ్ఞతలు

ఇట్లు

**జి. ఆంజనేయులు**

Advocate,
Vanasthalipuram, Hyderabad.

******

# స్పందన

## గాంధీమార్గం అధ్యాత్మిక విలువల పై
## ప్రశాంతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ చంద్రారెడ్డి గారి స్పందన

ధర్మం అంటే ఆత్మబోధ లేక ఆత్మ జ్ఞానమను విశాల అర్థాన్ని గాంధీగారు గ్రహించారు.

పినతండ్రి కుమారుని యెడల గల ఆదరణభావం వల్ల గాంధీగారికి దైవచింతన ఏర్పడి రామరక్షస్తోత్రంపై శుద్ధమైన ఆధ్యాత్మికత ఏర్పడింది.

లాఘూమహరాజ్ రామభద్రునికి పరమబక్తుడు. ఇతడి ద్వారా "రామాయణ పారాయణం యొక్క ప్రభావము గాంధీగారి పై పడింది. దానికి కారణం తన కుటుంబమందలి దాసియైన రంభ అనుపేరుగల ఒక నర్సు నాటిన విత్తనమే, అని చెప్పవచ్చు.

తులసిదాసు రచించిన రామాయణం సర్వోత్తమమైన గ్రంథంగా గాంధీగారు భావించడానికి గల కారణం లాఘూమహరాజు గారేనని చెప్పవచ్చు. రామాయణం స్ఫూర్తితో మనుస్మతిని అభ్యసించారు.

భూత ప్రేతాదులంటే గాంధీగారికి చిన్న తనం నుండే భయం. కుటుంబదాసి (నర్సు). అట్టి భయానికి రామనామ స్మరణం మంచి మందు అని చెప్పటంవల్ల, ఆమే చెప్పిన మందు మీదకంటే ఆమె మీద గాంధీగారికి అమితమైన నమ్మకం కలిగి, అప్పటినుండి రామనామ జపం ప్రారంభించారు.

భాగవతం భక్తి ప్రధానమైన గ్రంథంగా గాంధీగారు పేర్కొనిరి. మదన్ మొహన్ మాలవ్య, వంటి మహభక్తుని నోట భాగవతం విని, దాన్ని గుజరాతి భాషలో చదివి తన్మయుడై ఆధ్యాత్మికతను పెంచుకున్నారు. అందులో గల సారమును గాంధీగారు గ్రహించారు.

మహాత్మాగాంధీగారు తమ కుటుంబం రాజకోటలో ఉన్నప్పుడు వారి తల్లి దండ్రులనుండి సర్వమత సంప్రదాయాల యొక్క సమ్మేళనం గాంధీగారికి సునాయసంగా యేర్పడినది. దానికి కారణం వీరి తల్లిదండ్రులు అక్కడ ఉన్న

రామాలయానికి, శివాలయానికి తీసుకు వెళ్ళుతూ ఉండటం చేత శైవమతం పై గాంధీగారికి అభిమానం ఏర్పడింది.

"దివ్యజ్ఞాన సమాజం" ప్రకటించిన " ఉపనిషత్తుల " అనువాదాన్ని, మిగత మతముల సారాంశాన్ని శ్రద్ధగా చదివారు. వీటన్నింటి వల్ల గాంధీగారికి " హిందూమతం " పై ఆదరణపెరిగి, నానాటికి దాని గొప్పతనం అమితంగా కనిపించి, దాని వల్ల ఇతర మతాల యెడల వైముఖ్య కలుగలేదు. "హిందూమతము" నే కొనియాడారు.

"కోట్సుగారి" వాదన ప్రకారం "యేసు ఒక్కడే రక్షకుడు" అనీ, అతనిని నమ్మినవారికి "పరిపూర్ణశాంతి" లభిస్తుందనీ, కానీ ఈ వాదన గాంధీగారికి నచ్చలేదు. గాంధీగారు "యేసు" మతమును అంగీకరించక పాపాలు చేసి, "తత్ఫలం నాకు అంటరాదనీ నేనెన్నడు ప్రార్ధించను" "పాపకర్మ నుండి, పాప ప్రవృత్తి నుండి, విముక్తుడనగుటకు ప్రయత్నిస్తాను" అట్టి స్థితి చేకూరేదాకా నాకు అశాంతియే ప్రీతికరం అని ఉద్ఘాటించారు.

ఒక పర్యాయం బుద్ధునికి, యేసుకు గల తారతమ్యం గూర్చి చర్చకు వచ్చింది. అప్పుడు "అమ్మా చూడూ బుద్ధుని దయ అది మనుషులతో ఆగక, సకల భూతముల దాకా వ్యాపించింది. కాని యేసులో ఈ విధమైన "సర్వభూత వ్యాప్తమైన " దయ కనిపించదు. అని గాంధీగారు వక్కానించారు.

క్రైస్తవ మతం పై గాంధీగారికి, అభిరుచి కలుగలేదు. క్రైస్తవ మత భోధకులు హిందువులను, వారి దేవుళ్ళను, నిందిస్తూ చేసే ఉపాన్యాసాలు వీరికి నచ్చలేదు. అట్టి నిందను గాంధీగారు సహించలేక పోయారు.

క్రైస్తవ ప్రబోధకుడు బేకరు గారికి ప్రార్ధనా బలమే మహాబలం. ప్రార్ధన పై ఆయనకు అమిత విశ్వాసం. ప్రార్ధనా మహిమను గురించి ఆయన చెబుతూ వుంటే గాంధీగారు "తటస్థభావం" తో వినేవారు. "అంతరాత్మ గనుక ప్రబోధిస్తే నేను తప్పక "ఏసు" మతంలో చేరతాననీ, అట్టి స్థితిలో ప్రపంచమందలి ఏ శక్తి నన్ను ఆపలేదు" అని బేకరు గారికి గాంధీగారు చెప్పితీరారు.

మనిషికి అహింసతో కూడిన "శాంతీతత్వం" కావాలి, దానికితోడు "క్షమాగుణం" కావాలి. భూత దయకూడా ఉండాలని, "గాంధీ" పేర్కొన్నారు.

తండ్రిగారి దగ్గరగల గ్రంథాలలో "మనుస్కతి" అను గ్రంథం కనపడింది. అందలి విషయాలు గాంధీగారికి నాస్తికత్వం కలిగించాయి. "మనుస్మృతి" యందలి "ఖ్యాద్యాభాద్యా" ప్రకరణం, తదితర ప్రకరణాలలో ప్రచురిత మైన విధానాలు, విరుద్ధమైన విషయాలు గాంధీగారికి నచ్చలేదు. అందలి

విషయాలు "అహింసా బోధ" ను కలిగించలేదు. "మనుస్మృతి" లో మాంసాహారానికి, సమర్ధన ఉంది. పాములు, నల్లులు, మొదలగు వాటిని చంపడం నీతిబాహ్యం కాదని గాంధీగారు అభిప్రాయపడిరి.

ఆధునిక యుగం ఆయనను "యుగపురుషుడు" గా, "జాతిపిత" గా గుర్తించి ఆరాధిస్తున్నారు. అందుకు గల కారణం అతడి "సత్యం", "అహింస", "ధర్మము" లు అని భావించడమైనది.

******

# స్పందన

శ్రీ చెరుకూరి రామారావు గారికి

"సాయి దేశం - గాంధీ మార్గం" అను మీ కరపత్రము చూచినాను. ఒక చక్కటి ఆలోచన - మన వంతు ప్రయత్నము చేయడము ప్రతి మానవ ధర్మము - అందులో ఎంత వరకు సఫలీకృతులము అవుతామనునది దైవకృప.

ఈ నవ నాగరిక సమాజములో ఆధ్యాత్మికమంటే గిట్టని వారు చాలా మంది ఉంటారు. కొద్ది మంది చూద్దాము ఏమి చేస్తారు అని వస్తారు. కొద్ది మంది చెప్పినది విని వదిలి వేస్తారు. కొద్ది మంది మాత్రము ఆచరిస్తారు. వారిని చూచి సమాజము నవ్వుతుంది.

శ్రీ భగవాన్ సత్యసాయి బాబా దగ్గరికి ఎందరో ఎన్నియో కోరికలతో వస్తారు. కాని స్వామి చెప్పేది శ్రద్ధగా ఆచరించినట్లే నటిస్తారు. బయటకు వచ్చిన తదుపరి వారి వారి ఆకృత్యములు ప్రారంభిస్తారు. ఇది స్వామి గారి ఉపన్యాసములో ఎన్నియో మార్లు చెప్పారు. కాని మార్పు లేదు క్షమించాలి. విమర్శించడము కాదు. ఇది వాస్తవము. ఏదియైన మన ప్రయత్నము మనము చేయాలి. ఒక తేనె బొట్టు అయిన మనము చిలకరించ గలిగితే మన జన్మ ధన్యమైనట్లే.

ముందు పిల్లల తల్లి తండ్రులు మారాలి. వారు క్రమశిక్షణఅలవరుచుకొని భావి తరాలకు మంచి మనుష్యులను - అందించాలి. వారు ఆచరించి పిల్లలకు చూపితే అది ఫలిస్తుంది.

**ఎస్. నర్సింగ్ రావు**

******

# స్పందన

## అభినందన చందనం

శ్రీ చెరుకూరి రామారావుగారు వ్యాపార రంగంలో ప్రముఖస్థానం అలంకరించిన వారిలో ధర్మ జిజ్ఞాస, నైతిక నిష్ఠ, త్యాగనిరతి నిండుగా మెండుగా ఉన్న వనే విషయం వారు చేపట్టే ఆధ్యాతిక కార్యక్రమాలు సుస్పష్టం చేస్తున్నాయి. వారు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి భక్తులే గాక శ్రీ వారి ఉపదేశాలను నిజ జీవితంలో త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ వాటిని సమాజపరంగా కూడా అవలంభింప జేయాలనే సత్సంకల్పం తో వివిధ ధార్మిక కార్య క్రమాలు స్వయంగా నిర్వహిస్తున్నారు. సర్వ సాధారణంగా వ్యాపార సంస్థలలో లాభదృష్టియే ఎక్కువగా కనపడుతుంటుంది. ధార్మిక దృష్టి అరుదుగా ఉంటుంది. మానవుడు కీర్తిప్రతిష్టలు పొందాలన్నా, ధనార్జన చేయాలన్నా తన మనుగడకు అవసరమైన సమస్త భౌతిక సౌకర్యాలు అందుకోవలన్నా , ఆఖరికి శారీరక భద్రత కోసం అయినా సమాజమే సర్వ రక్షగా ఆశ్రయమిస్తున్నది. అందు వలన వ్యక్తి పరంగాను, సామూహికంగాను సమాజ బహు ముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలి. " సంఘం శరణంగచ్ఛామి " అనే బుద్ధ భగవానుని ఉపదేశం యీ దిశగా నిరంతర నిర్విరామ కృషి చేయుచున్నదనుటలో ఏ మాత్రం సందేహం లేదు.

ఈ మధ్య శ్రీ రామారావుగారు " సాయి దేశం - గాంధీ మార్గం" అనే భావ యుక్తమైన శీర్షికతో ఒక ధర్మ ప్రతిష్టాపన వేదిక ఏర్పాటు చేసి భావసామ్యం గల కొందరు పెద్దలను చర్చా వేదికకు ఆహ్వానించారు. బహుముఖ విజ్ఞాన సంపన్ను లైన వీరు పలు ధార్మిక, నైతికాంశములను వివరిస్తూ కొన్ని కార్యాచరణప్రణాళికలను తెలియ జేసారు. ఇట్టి పవిత్ర గోష్టిలో పాల్గొనే అదృష్టం నాకు కూడ ప్రాప్తించింది.

"జాతి గౌరవంబు నీతి పై నిలుచును. నీతి లేక యున్న జాతి చెడును నీతి గలుగు జాతి నిజమైన జాతిరా" అన్నారు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు. ఒక జాతి యొక్క విలువ ఆ జాతి భౌతిక సంపద మరి ఇతర లౌకిక ప్రతిభల మీదనే ఆధారపడి ఉండదు. ప్రధానంగా ఆ జాతి ప్రజల జీవన సరళి మీద, పరిపాలకుల నీతి నిజాయితీల మీద జాతి గౌరవం ఆధారపడి ఉంటుంది. నీతి నియమాలు లేని రాజకీయాలు దేశానికి అనర్థ దాయకం అని గాంధీజీ అన్నారు. అయితే నీతి నియమాలు పాటించే జాతిని ప్రస్తుత విషమ పరిస్థితులలో ఎలా

నిర్మాణం చేయాలి? ఎక్కడ ప్రారంభించాలి ? ఈ ప్రశ్నలు ఒకనాడు అనుభవజ్ఞులైన మేధావులను కూడా కలవర పరచిన మాట వాస్తవం. కాని యీ ప్రశ్నలకు సమాధానాలు పలు విద్యా విషయిక ప్రణాళికలలో నివేదికలలో మనం గమనించగలం. తరగతి లోనే జాతి రూపు రేఖలు దిద్దుకుంటుదని విద్యా వేత్తలు స్పష్టం చేస్తున్నారు.

అసలు విద్య అనేది ఎప్పుడు నేర్చుకోవాలి అందులోను నైతిక విద్య ఎప్పుడు వంటపడుతుంది? " శైశవే అభ్యస్త విద్యానాం" అని ధర్మ శాస్త్రం ఉద్ఘాటించింది. విద్య గాని, నైతిక ఆధ్మాత్మిక విలువలు గాని బాల్యమునందే అభ్యసించాలి అప్పుడే అవి మనస్సులో దృఢంగా నాటుకొని జీవితాంతం ఆచరణరూపంగా వికసించి వ్యక్తి జీవితానికి, సమాజ కార్యకలాపాలకు శుభదాయకమైన ఫలితాన్ని ప్రస్తాదిస్తవి. ఈ విధంగా బాల బాలికలు సచ్ఛీల సంపన్నులుగా తయారవుతారు. వీరి తో నవభారత నిర్మాణం ఆధ్యాత్మిక విలువల ఆధారంగా ఫలిస్తుంది, పరమ శాంతిని ప్రసాదిస్తుంది.

విద్య కేవలం జీవితం కోసం, కూటి కోసం కారాదు. అది ఉత్తమ . జీవితం కోసం, జీవిత పరమావధియైన మోక్షం కోసం కావాలి. ఈ నాటి విద్యలు తెలివి తేటలను పెంచుతున్నవే గాని కొంచెమైనా గుణాన్ని పెంచటం లేదు. గుడ్డలు మారుస్తున్నారు దుర్గుణాలు మార్చుకోవటం లేదు. సద్గుణాలు, సద్బుద్ధి, సత్య నిరతి, భక్తి, క్రమ శిక్షణకర్తవ్య పాలనమును నేర్పునదే విద్య. విద్యార్థి అట్టి విద్యనేర్వ వలయునని భగవాన్ బాబా వారు ప్రబోధించారు. శ్రీవారు స్థాపించిన విశ్వ విద్యాలయంలో గాని, కళాశాలలు, పాఠశాలలో గాని విద్యార్థులకు లౌకిక విద్యతో పాటు ఆధ్యాత్మిక, ధార్మిక, నైతిక విలువలలో కూడా అచరణాత్మకంగా శిక్షణఇస్తున్నారు. స్వామి వారి విద్యాలయాలు డిగ్రీలు, సర్టిఫికెట్లు పంచిపట్టే సామాన్య విద్యా కేంద్రాలు కాదు. అవి భవ్యమైన, దివ్యమైన జాతిని నిర్మాణం చేస్తున్న విద్యాలయాలు.

విద్యార్థులు మార్కులు, ర్యాంకులు తెచ్చుకోవటంతో సరిపోదు వాటితో పాటు రిమార్కులు (దోషాలు, దుర్గుణాలు) లేకుండా చూచుకోవాలి. విద్యతో వినయం, చదువుతో సంస్కారం పెరగాలి. గుణం లేని జీవితం దీపం పెట్టని గృహంలాంటిది. గుణసహితమైనప్పుడే విద్యార్థి నేర్చినది సద్విద్య అవుతుంది. కావున గుణప్రధానమైన నవ సమాజం నిర్మించు కోవాలి. అప్పుడే శాంతి సౌఖ్యాలు

వర్ధిల్లుతాయి. కాని దురదృష్టవశాత్తు నేడు ధన ప్రధాన మైన సమాజమే గోచరిస్తున్నది. భూమి సూర్యుని చుట్టు తిరిగినట్లు మానవుడు ధనం చుట్టు పరిభ్రమిస్తున్నాడు. అందువల్ల మనిషి అత్యాశలతో, దురాశలతో నిరాశలతో ఉడికి పోతున్నాడు. అశాంతితో అలమటిస్తున్నాడు. ధనం పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోవచ్చు. కాని నైతిక విలువలు పోగొట్టు కుంటే శాంతి సౌఖ్యాలతో పాటు అన్నీ పోగొట్టుకున్న వారమవుతాము. ధనం వస్తుంది పోతుంది. కాని శీల సంపద వస్తుంది, పెరుగుతుంది. అది తరగని ధనం. దానితో అన్ని సమకూరుతాయి. ఇది పరమార్ధ సత్యం.

శ్రీ రామారావుగారు వ్యాపార రంగంలో గణనీయమైన ఉన్నత స్థాయికి ఎదిగినప్పటికిని భారతీయ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని ఏనాడు విస్మరించలేదు. నేటి సమాజ దుస్థితిని గమనించి బాధాతప్త హృదయంతో భగవాన్ బాబావారి మార్గంలో విద్యార్ధులలో నైతిక విలువలు పెంపొందించాలని, వారిని ఉత్తమ భావి పౌరులుగా తీర్చి దిద్దాలని సంకల్పించారు. ఈ సత్సంకల్పం తోనే "సాయి దేశం - గాంధీ మార్గం" అను ప్రబోధాత్మకమైన మార్గ దర్శక గ్రంధాన్ని ప్రచురించారు. ఇది విద్యార్ధుల మనో భావాలను సంస్కరించి వారిలో విద్యాభ్యాసంతో పాటు దేశభక్తిని దైవ ప్రీతిని, ధర్మ నిరతిని పెంపొందింపజేయ గలదు. శ్రీ రామారావు గారి యీ శుభ సంకల్పం అత్యంత ప్రశంశనీయం. వారికి భగవాన్ బాబావారి కృపాశీస్సులు విరివిగా లభించ గలవని నా ప్రగాఢ విశ్వాసము, అయితే నీతి నియమాలు గ్రంధాన నిలిచి పోరాదు. అవి ఆచరణలోనికి రావాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం సిద్ధిస్తుంది.

" నైతిక ఆధ్యాత్మిక శీలసంపత్తులను ఇనుమడింప జేసేదే సరియైన విద్య. నీతి మానవుని ఉన్న స్థితి నుండి అత్యున్నత స్థితికి కొనిపోయే రాజమార్గము".

- మహాత్మ గాంధి

**డి.వి. కృష్ణా రావు**

******

# స్పందన

To,
Sri Cherukuri Rama Rao,
Founder / Chairman
Cherukuri Group,
Vanasthalipuram,
Hyderabad - 500070.

Dear Sir,

I am very happy to have received your "Sai Desham - Gandhi Margam" letter. I had gone through the contents of your letter and would like to Congratulate you on this happy & rejoicing occasion. You are indeed contributing a lot for the well-being of not only the present Generation but also the "Pensioners". We are very much pleased with your ambitious & endeavour. I hope & trust that you will continue to contribute more & more for the years ahead. I sincerely express my support to the extent possible in this regard.

With warm regards & best wishes

Sincerely yours

**P. SRIHARI RAO**
NGO's Colony,
Vanasthalipuram, Hyderabad.

******

# స్పందన

To,
Sri Cherukuri Rama Rao,

I am happy to the proposal to print a book about value of foundation to the growing children educating by the old National Leaders who are made valuable things to the nation in the past.

However, now a days after increasing technology and propaganda on video and TVs in other things leaving the important and valuable things are going down even after repeated propaganda in newspapers and books.

Anyhow, it is a very good idea and proposal to print a book by the Cherukuri Society at this stage.

**B.S.N. PRASAD**
NGO's Colony,
Vanasthalipuram, Hyderabad.

******

# స్పందన

మనం మన దేశం సాంకేతికంగా ముందుకు వెళ్తున్నది కాదనే వారు లేరు కాని. నైతిక విద్యను అందించడంలో ఏ విద్యాలయమూ ముందుకు రావడం లేదు. మహాత్మా గాంధీ, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, నేతాజీ వంటి మహనీయుల ఆదర్శజీవిత చరిత్రలు ఎవరూ చదవడం లేదు. విద్యాలయాలలో బోధించడం లేదు - మనిషి సాంఘికంగా ఎంత ఎదిగినా ఆధ్యాత్మిక భావనా గతి శీలత పెరగాలి.

ఈ దశలో ఈ లోపాన్ని గుర్తించి సమాజంలో నైతిక విద్యను, మానవ విలువలను సులభ శైలిలో అందరికి అందించాలనే సత్సంకల్పముతో సాహసించి ముందుకు వచ్చిన సామాజిక స్పృహ, సచ్ఛీలవంతుడు శ్రీ చెరుకూరి రామారావు గారిని శతధా, సహస్రధా అభినందించక తప్పదు. గతంలో గాంధీ మహాత్ముని జీవితంలోని అపురూప ఘట్టాలను పుస్తక రూపంలో ఆవిష్కరించి, విద్యార్థులకు అందించి, ఒక ప్రశ్నావళి రూపొందించి, అందులో విజేతలైన వారికి బహుమాన పురస్కారాలతో ప్రోత్సాహించారు. ఒకేఒక్కడు ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తున్న శ్రీ రామారావు గారి కృషి విజయంవంతం కావాలని కోరుతూ, అందుకు మా సహాయం కూడా ఉంటుందని వాగ్దానం చేస్తున్నాను.

**శేషం రామానుజా చార్యులు**
కవి, రచయిత

******

# స్పందన

## "ఆధ్యాత్మిక స్ఫూర్తి"

ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు. భావి భారత ఆధ్యాత్మిక పరిపుష్టి గురించి పరితపించే వారే లేని యీనాడు "ప్రేమ, సత్యం, అహింస, ఆధ్యాత్మికత, నైతికత" అను సూక్తులను ఆధారంగా చేసుకొని భావి తరాలను ఆధ్యాత్మిక చింతనకు పూనుకొనునట్లు చేయు మీ కృషికి ధన్యవాదములు.

ఈనాటి విద్యావిధానము విద్యార్థులను ధన సంపాదన యంత్రములుగా తయారు చేయుచున్నవి. "ప్రేమ మూలం, ఇదం జగత్" అను దానికి బదులుగా "ధనమూలం, ఇదంజగత్" అను నానుడిని విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తిగా నమ్ముచున్నారు. కాని వారు ధన సంపాదనా పరులై కనిపెంచిన తల్లిదండ్రులను వదలి" రెక్కలు వచ్చిన పక్షిపిల్లల వలె ఎగిరి పోతూవుంటే, ఆయెడ బాటును మనసులోనే దిగమింగుకొని తమను తావే నిందించుకొనుచు కాలము వెళ్ళబుచ్చుచున్న వారెందరినో మనము చూచుచున్నాము.

అలాగని తమ సంతానమును చదివించ వద్దని కాదు. వారికి చిరు వయసులోనే, రామాయణ, భారత, భాగవతాది గ్రంథముల యందలి సన్నివేశములను విపులముగా కథా రూపమున వారికి అర్థమగు నటుల చెప్పగలిగిన, వారు తప్పక ఆధ్యాత్మిక, నైతిక ధర్మముల నలవరచుకొని ఆచరణలో పెట్టగలరు.

ఈనాడు పాశ్చాత్య నాగరికతా ప్రభావం చేత కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు విద్యార్థులకు పాఠశాలలో "లైంగిక విద్యను" ప్రవేశ పెట్టాలనడం హాస్యాస్పదం. వీరి ఆలోచనా ధోరణి ప్రమాదకరం. లైంగిక విద్యకు బదులుగా "నైతిక విద్యను" పాఠ్యాంశముగా ప్రవేశ పెట్టిన వారు బాల్యము నుండియే నైతిక విలువల పట్ల ఆకర్షితులౌదు రనుటలో సందేహం లేదు.

"సాయి దేశం – గాంధీ మార్గం" ఈ నాటికీ, ఏనాటికి గూడ, విద్యార్థులకు సంజీవని లాంటిది. విద్యార్థులలో తోటివారిని గౌరవించు స్వభావమును, ప్రేమించు స్వభావమును పెంపొందింప చేయాలి, అది సమాజ ధర్మము.

విద్యార్థికి తొలి గురువు "అమ్మ" ఈ అమ్మే తమ సంతానము సత్సంప్రదాయ పరిరక్షకులు కావలెనని "దీక్ష" పూనినచో మన దేశం ధర్మ భూమి కాగలదు. "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ" అను వేద సూక్తుల

పరమార్ధమును, ఇంటిలోను, పాఠశాలలోను వినిపించాలి, కనిపించాలి. ప్రేమతో ప్రపంచాన్ని జయించవచ్చు" అను "సాయి సూక్తిని" బాల్యము నందే విద్యార్థులకు అవగాహన కల్గించాలి.

తను నమ్మిన సత్యమును ఆచరణలో పెట్టిన మహానుభావుడు గాంధీ. "అహింసా పరమో ధర్మ" అను సూత్రమునకు ప్రాణము పోసిన మహానుభావుడితడు. ఇతరుల మనస్సులను నొప్పించ కుండుటే "అహింస" అని బాల్యము నందే వీరికి తెలపాలి. "ప్రేమ, అహింస, సత్యం, ధర్మం, ఆధ్యాత్మికత, నైతికత" అను సూత్రములచే జరుపబడు యీ మహా యజ్ఞము నందు ప్రతి పౌరుడు పాల్గొని తమ వంతుగా భావి భారత నిర్మాతలైన విద్యార్థులకు యీ యజ్ఞ ఫలమును అందించాలి. ప్రతి భారతీయుడు ధార్మిక, ఆధ్యాత్మిక, నైతిక సంపదను పెంపొందించుటకు ప్రతిన బూను సమయమిది.

ఇది సాధ్యమా! అని సందేహ మక్కరలేదు. మన పురాణాలలో "ప్రహ్లాదుడు. ధృవుడు, మార్కండేయుడు" మొదలగు వారి చరిత్రములు వీరికి ఆదర్శములు కావాలి. ప్రస్తుతము "బాబా" గారి సందర్శనము చేత గూడా బాలబాలికలలో ఒక విధమైన ప్రేమ భావం యేర్పడగలదు. "బాబా" గారి ఆశీస్సులే ఆధ్యాత్మిక భారతమునకు "దీక్ష".

గాంధీ గారి జీవిత చరిత్ర నుండి కొన్ని ఘట్టములను తీసుకొని బొమ్మల రూపమున, కథారూపమున వారి కందించిన వారిలో చైతన్యం తప్పక రాగలదు. ఆనాడు గాంధీగారు, ఒక్కరే దేశమును దాస్యము నుండి విముక్తి కలిగించారు. వివేకానందుడు "భారతీయ" సంస్కృతిని, విదేశాలలో చాటి చెప్పి మనదేశ ఔన్నత్యమును మహోన్నతముగా నిలిపిరి గదా.

అదే విధముగా "చెరుకూరి సంస్థల" అధిపతి "సాయి దేశం - గాంధీ మార్గం" ప్రయోగ కర్తలు. వీరి ఆరాటం వర్ణనాతీతం, వీరి ప్రయోగం ఫలవంతం కావాలని నా ఆకాంక్ష, ప్రతి పౌరుడు "సొంత స్వార్థం - కొంత మానుకొని" భావి భారతమును "స్వర్ణ భారతిగా" మలచు బాధ్యతను స్వీకరించాలని శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. వీరి ఆశయమును బాబా ఆశీస్సులే పూర్తి గావిస్తాయి.

ఇట్లు

**పి. రంగాచార్యులు**

# స్పందన

"జన కవి"
ఉమ్మా నారాయణ రెడ్డి,
గౌరవాధ్యక్షుడు ఆం. ప్ర రాష్ట్ర పెన్షనర్ల సంఘం,
హైదరాబాద్.

శ్రీ చెరుకూరి రామారావు గారు

మీరు కోరిన విధముగా జాతిపిత మహాత్ముని గురించి వ్రాసి పంపుతున్నాను.

1. మహాత్ముని సిద్ధాంంతములు అమూల్యమైనవి. ఉన్నతమైనవి. నేటి పతనావస్థలోనున్న సమాజానికి నైతిక పరిపుష్టి కలిగించునవి.
2. వారి బోధనలు అతి ముఖ్యమైనవి. యువత జీవన విధానానికి కాంతి కిరణాల వంటివి. అంధకారమును తొలగించి సత్‌శీలతను కలిగించి ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించునవి.
3. నిరంతరము కృషి సల్పి వారి సిద్ధాంతములతో గట్టి పునాది వేసి ఆదర్శ సమాజ సౌధమును నిర్మించాలి.
4. మీరు తలపెట్టిన పునాది రాబోవు చెక్కు చెదరని ఆశ సౌధమునకు ఆధారము. కావున తక్షణ చర్యగా మన రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో "మోరల్ విద్య" తిరిగి ప్రారంభించవలెను.

మీ ప్రయత్నము విజయవంతం కావాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

**ఉమ్మా నారాయణ రెడ్డి**

# స్పందన

గౌరవనీయులైన శ్రీ చెరుకూరి రామారావు గారికి

అమూల్యమైన భారతీయ సంస్కృతిని కాపాడుకొనుటకు "సాయిదేశం – గాంధీ మార్గం" ఆధ్యాత్మిక పునాదులపై బాలబాలికలతో నైతిక విలువల నిర్మాణ వేదిక ద్వార బావి భారత పౌరులలో మన సంస్కృతిని, సంస్కారాన్ని ఇనుమడింప చేయాలని మీ యొక్క సత్ సంకల్పము, ఆవేదన, తపన హర్షనీయము.

సంపాదనే ప్రధానంగా ఉన్న ఈ కలియుగంలో తల్లి తండ్రులు కూడ అనాలోచితంగ తమ పిల్లలను పై చదువుల కోసమో, సంపాదన కోసమో కాని విదేశాలకు పంపించి మన సంస్కృతిని, విలువలను మేధాశక్తిని తాకట్టు పెట్టి అక్కడే స్థిరపడిపోయి విదేశీయుల యువతులకు ఆకర్షింపబడి వివాహము చేసుకొంటున్న తరుణంలో మీరు చేపట్టిన ఈ అద్భుతమైన కార్యక్రమమునకు శ్రీ భగవాన్ సత్యసాయి బాబా గారి ఆశీర్వచనముతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను.

ఇట్లు

**పి. నాగేశ్వర శర్మ**

# PART - B

# 1. బావురు మంటున్న బాల్యం

పిల్లల సమగ్ర సంక్షేమ లక్ష్యం సాకారం కావాలంటే అత్యున్నత స్థాయిలో రాజకీయ సంకల్పం, పటిష్ఠమైన కార్యాచరణ అవసరముంటుంది. ఇవి కొరవడితే మన సంకల్పాలన్నీ నీటి మీద రాతలై పోతాయి. భారతావనిలోని 40 కోట్ల మంది పిల్లల అభివృద్ధి కోసం లెక్కలేనన్ని పథకాలు రూపుదాలుస్తున్నా అవి వసివాడిపోతున్న పసి బ్రతుకులకు ఆసరాగా నిలబడలేక పోతున్నాయి.

పిల్లల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టాలు చట్టుబండ లవుతున్నాయి. ఒక వైపున అవినీతి మడుగులో కూరుకుపోయిన శిశుసంక్షేమం గుడ్లు తేలేస్తోంది.

ఈ సమస్యకు పరిష్కార మార్గమేది? ఎక్కడి కక్కడ వ్యవస్థాగతమై వర్ధిల్లుతున్న మౌలిక సమస్యల్ని పరిష్కరించనిదే, అంతా చిత్త శుద్ధితో నిస్వార్ధంగా పని చేయనిదే ముందడుగు పడదు. ఉన్నత లక్ష్యాలు, ఉదాత్త ఆశయ ప్రకటనలను వల్లెవేయడంతోనే భావిపౌరుల బతుకులు అమాంతం బాగుపడిపోవు.

కొన్ని నిష్ఠుసత్యాలను తెలుసుకుంటే మన మనస్సులు చలించిపోతాయి. మన దేశంలో పుట్టే ప్రతి వంద మందిలోనూ సంపూర్ణ ఆరోగ్యానికి నోచుకుంటున్న అదృష్టవంతుల సంఖ్య ఇరవైలోపేనట!

కాగా అత్యధికుల జీవితాల్ని పౌష్ఠికాహారలోపమే కర్కషంగా కాటేస్తోంది. వ్యాధి నిరోధక శక్తి లోపించడంతో రకరకాల రుగ్మతలు సులభంగా కమ్ముకుంటున్నాయి.

సరైన పౌష్ఠిక విలువల్లేని ఆహారం మూలకంగా ఇరవై శాతం మహిళలు రక్త హీనతతో బాధ పడుతున్నారు. పుట్టే పిల్లల్లో ముప్పై శాతం తక్కువ బరువుతో అర్భకులుగా తయారవుతున్నారు. అయితే ఈ ప్రభావం పనిదినాలు పైనా, ఉత్పాదక మీదా పడి దేశం ఏటా 1000 కోట్ల మేరకు నష్ట పోతోందని లెక్కలు కట్టారు.

1998-99 లో 22 రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, నీరు, ఆరోగ్యాల ఖాతాల నుండి మొత్తం 1,02,800 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సొమ్మంతా సద్వినియోగమైందంటారా? సద్వినియోగమైతే పరిస్థితి "ఎక్కడి గొంగడి అక్కడే!" ఎందుకుంటుంది? ఏ సమస్య పరిష్కారానికైనా శోధన అవసరం. చిత్తశుద్ధి

అవసరం. సమాజం పట్ల బాధ్యత అవసరం. శోధించి సాధించాలనే ఆరాటం అన్ని సమస్యలకూ పరిష్కారాన్ని చూపుతుంది.

దేశంలో సగం మంది దాకా చిన్నారులు బాల్యంలోనే ఇలా వడలిపోతుంటే భవిష్యత్తును ఊహించుకోడానికే భయం వేస్తుంది.

మరి దీనికి విరుగుడే లేదా? అంటే లేకేం? ఉంది. తల్లిదండ్రుల్లో వివేచన పెరగాలి. తమ పిల్లలకు పౌష్ఠికాహార విలువలతో కూడిన తిండిని సమకూర్చేలా పౌరుల జీవన స్థాయి పెరగాలి.

అంతే కాదు బాల్య వివాహాల్ని పూర్తిగా అరికట్టేందుకు, చిన్న వయసులోనే బిడ్డల్ని కనకుండా నివారించేందుకు సామాజిక చైతన్యం వెల్లివిరియాలి.

అంతకన్నా ముందుగా గ్రామీణాభి వృద్ధి పథకాలు అర్ధవంతంగా, నిస్వార్ధంగా అమలు జరగాలి. సమాజంలోని ప్రతి నిరుపేద గ్రామీణ వ్యక్తికి అవి చేరేలా చూడాలి.

అయితే భావి భారత భాగ్య విధాతలైన బాలల సంక్షేమం, వికాసాల పట్ల సమగ్ర ధృక్పధం కొరవడుతున్నందు వల్ల సమస్యలు మరీ విజృంభించి పెను సంక్షోభానికి దారి తీస్తున్నాయి. పేదరికాన్ని దాని కవలలైన ఆకలి, అనారోగ్యాన్ని నిర్మూలిస్తామని మన నాయకులు స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లోనే ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు.

స్వాతంత్ర్య రజతోత్సవాలను జరుపుకొన్నాం. ఇపుడు వజ్రోత్సవాలకు సన్నద్ధమౌతున్నాం. కాని పేదరికంలో మగ్గుతున్న బాలల సమస్యలను మాత్రం కొంచెమైనా తీర్చలేక పోతున్నాం. బాలల సంక్షేమాన్ని గూర్చి మనం చేస్తున్న ప్రకటనలు ఒక విధంగా మన ప్రగతిని ఎగతాళి చేస్తున్నాయనే చెప్పవలసి ఉంటుంది.

దేశంలోని కోట్లాది మంది బాలబాలికలు పలక, బలపం చేత బట్టవలసిన వారు పలుగు రాళ్లను కొట్టవలసివస్తోంది. పని మనుషులుగా ఇళ్లల్లో అంట్లు తోమ వలసి వస్తోంది. పాచి పనులను చేయవలసి వస్తోంది. ప్రమాదకర పరిశ్రమల్లో పని చేయవలసి వస్తోంది. రాళ్లెత్త వలసి వస్తోంది. రిక్షాలను తోలవలసి వస్తోంది. అలా పసి తనంలోనే వారు తలకు మించిన భారాన్ని మోయవలసి వస్తోంది.

## బుగ్గి పాలవుతోన్న బాల్యం

మన దేశంలో బాల కార్మికుల పట్ల ఉదాసీన ధోరణులు ఇంత ప్రబలంగా ఉండడం వల్లనే – పిల్లలను పనుల్లో పెట్టుకునే యాజమాన్యాలు వారి శ్రమ శక్తిని జంకూ గొంకూ లేకుండా దోచుకుంటున్నాయి. పిల్లల చేత ఇంటి చాకిరీ చేయించుకునే వారిదీ అదే బాట.

బాల కార్మిక వ్యవస్థను నిషేధిస్తున్న చట్టం ఉన్నా ఇప్పటికీ మనవారు మేధావులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు మొదలైన వారి ఇళ్లలో చాలా వరకు పిల్లలే పని మనుషులుగా కొనసాగుతున్నారు.

ఇక ధనవంతులు సుఖప్రదమైన జీవనం గడపడంలో బాల కార్మికులు పరోక్షంగా పోషిస్తున్న పాత్ర ఎంతో ఉంది. కాని దీనిని ఎవరూ గుర్తించడం లేదు. పిల్లలు చేమటోడ్చి పని చేస్తే పెద్దలు సుఖవంతంగా జీవిస్తున్నారు. చిన్నారులు మాత్రం చేమటోడుస్తూనే ఎన్నో అవమానాలకు గురిఅవుతున్నారు. మండుటెండలో పొలాల్లో పని చేసే బాలికలెందరో ఉన్నారు. విత్తులు నాటడం, కలుపు తీయడం, కూరగాయలు పండించడం – ఇలా మనకు అవసరమయ్యే ఆహార పంటల ఉత్పత్తిలో వారు పాలు పంచుకుంటున్నారు. ఇళ్లల్లో కూడా పసివారికి పని తప్పడం లేదు. మరమగ్గాలు, మగ్గాలు వినియోగించే పరిశ్రమల్లోనూ, పట్టు పరిశ్రమల్లోనూ బాణసంచా తయారీలోనూ బాల కార్మికులు ఉంటున్నారు.

ముఖ్యంగా ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భారత్‌లోనే బాల కార్మికుల సంఖ్య అధికంగా ఉందంటున్నారు. ఏ రూపంలో అయినా పిల్లల చేత పనులు చేయించడం నేరం. అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి.

మూడేళ్ల క్రితం అంతర్జాతీయ బాలల సదస్సు బాలల సంక్షేమానికి, బాలల ప్రశాంత జీవితానికి దోహద పడే ఇరవయ్యొక్క సూత్రాలను వరుసగా పేర్కొంది. 2018 లోగా దుర్భర పేదరికాన్ని, ఆకలిని జయించాలనీ, సార్వత్రిక ప్రాథమిక విద్యా లక్ష్యాల్ని సాధించాలనీ, బాల కార్మిక వ్యవస్థను బొత్తిగా తుడిచి వెయ్యాలనీ, శిశు మరణాల్ని తగ్గించాలనీ, వ్యాధుల్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలనీ అందులోని ముఖ్యాంశాలు.

అంతే కాదు మూడేళ్లలో బడి ఈడు పిల్లలెవరూ పాఠశాల వెలుపల కనిపించకూడదనేది మన ఆశయమన్నారు. 1986 నాటి బాల కార్మికుల

నియంత్రణ, నిషేధ చట్టం ప్రమాదకర పరిశ్రమలు, పనుల్లో పద్నాలుగేళ్ల లోపు పిల్లల్ని తీసుకోరాదని ఆంక్షలు విధించింది. కాగా కేంద్ర ప్రభుత్వం తాజాగా రెస్టారెంట్లు, కాకా హోటళ్లు, టీ కొట్లు, వినోద కేంద్రాల వంటి వాటితో పాటు ఇంటి పనుల్నీ ఆ చట్ట పరిధిలో చేర్చింది. దీనికి అదనంగా ఈ మధ్యనే ఇటీవలే అమల్లో వచ్చిన చట్టం పద్నాలుగేళ్ల లోపు పిల్లలు ఏ పనీ చేయరాదంటూ సంపూర్ణ నిషేధం విధించింది.

ఇపుడు మన దేశంలో ఆరు నుంచి పద్నాలుగేళ్ల లోపు పిల్లల సంఖ్య సుమారు ఇరవై కోట్లు. వారిలో రమారమి పదమూడు కోట్ల మంది రకరకాల పనుల్లో తలమునకలై బతుకు పోరాటం చేస్తున్నారని అంచనా. ఇది ప్రపంచ దేశాలన్నింటా తిరుగులేని రికార్డు. సామాజిక, ఆర్థిక సమస్యగా వేళ్లు తన్నుకుంటూ బాల కార్మిక వ్యవస్థ విస్తరిస్తోంది. అయినా మన పాలకుల్లో ఉలుకూ, పలుకూ లేదు. ఈ సమస్య పరిష్కారానికి ఇపుడు జరుగుతున్న కృషి నామ మాత్రమే!

పేదరికం రూపుమాసి పోనంత కాలం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలను సాధ్యం కాదని కమిటీలు వివరణాత్మక నివేదికలిచ్చాయి. అసలు బాల కార్మిక వ్యవస్థకు పేదరికమే తల్లివేరు.

పెద్దలతో పాటు పిల్లలూ శరీర శ్రమ చేస్తే గాని రోజు గడవనందువల్లనే, పలకా బలపం చేత పట్టాల్సిన వయసులో పలుగూ పారా చేపడుతున్నారు. పనిలో గనిలో కార్ఖానాలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. వారి ఆకలిమంటలు చల్లారనన్నాళ్లు. బాల కార్మిక వ్యవస్థకు చావు లేదు. ఒక వేళ బాల కార్మికులను బలవంతంగా వారి వృత్తుల్లోంచి తొలగిస్తే చివరికి వాళ్లు బిచ్చగాళ్లుగానో, వ్యభిచారులు గానో మారుతారని, తినడానికి తిండి కూడా వారికి దొరకదని వారంటున్నారు.

అయితే చుట్టూ ఉన్న సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను మెరుగు పరచి ప్రత్యామ్నాయ మార్గాల్లో కృషి చెయ్యడం ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చెయ్యవచ్చు. వయోజనులకు విద్యా సౌకర్యం కల్పించడం ద్వారా, మహిళలకు చదువు నేర్పడంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం ద్వారా, వయోజనులకు అంటే పిల్లల తండ్రులకు పనికి తగిన వేతనం లభించేలా చూడటం, విద్యా సౌకర్యాలను వృద్ధి చేయడం, పాఠశాల విద్యను మరింత నాణ్యంగా తీర్చి దిద్దడం

లాంటి చర్యలు తీసుకోవడం ద్వారా కూడా బాల కార్మిక సమస్య తీవ్రతను తగ్గించవచ్చును.

అసలు పేదరికాన్ని తగ్గించడంపై దృష్టి పెడుతూనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముమ్మరం చేసినప్పుడే బాలకార్మిక వ్యవస్థకు చరమ గీతం పాడటం సాధ్యమని ప్రఖ్యాత ఆర్థిక వేత్త అమర్త్యసేన్ అభిప్రాయ పడ్డారు.

ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ వ్యవసాయ రంగంలో బాలకార్మికులు ఎక్కువగానే ఉన్నారు. అందువల్ల బాల కార్మిక వ్యవస్థపై నిషేధం విధించినంత మాత్రాన ఆ సమస్య పరిష్కారం కాదు. దాని వెనుకనున్న సామాజిక, ఆర్థిక కారణాలను అధ్యయనం చేసి వాటిని సరియైన రీతిలో పరిష్కరించకపోతే ఈ సమస్య ఎప్పటికీ ఎక్కడి దక్కడే ఉంటుంది.

కాగా దారిద్ర్యాన్ని తొలగించడం కోసం ఇంకా పటిష్టమైన చర్యలు తీసుకోబడాలి. ఆర్థికాభివృద్ధి వేగాన్ని పెంచి, పేదరికాన్ని తగ్గించే విధానాలను అనుసరించడం ద్వారా బాలకార్మిక సమస్య తీవ్రతను తగ్గించవచ్చును. ఉద్యోగాలు కల్పించడం ద్వారా, వయోజనులు చేసే పనికి మెరుగైన వేతనాలు చెల్లించడం ద్వారా ఈ వ్యవస్థను కొంత మేరకు తగ్గించ వచ్చును.

నిర్బంధ విద్య అమలుతో పాటు సరిపడన్ని పాఠశాలలు నెల కొల్పి వాటిలో వసతులు కల్పించాలి. అసలు పేదల నివాస ప్రాంతాల్లోనే పాఠశాలలను ఏర్పాటు చేసి వారికి చదువును అందుబాటులోకి తీసుకురావాలి.

మరోవైపు వయోజనులకు చేతినిండా పని కల్పిస్తూ వారికి మెరుగైన వేతనాలను చెల్లించే ఏర్పాటు చేస్తే ఈ వ్యవస్థను కొంతమేరకు నిర్మూలించవచ్చును.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపి నిర్బంధ విద్యను అమలు పరచాలనేదే మన ముఖ్యోద్దేశం. ఇందుకు శ్రీలంకను ఆదర్శంగా తీసుకోవచ్చును. అక్కడ **1946**లో పాఠశాలకు వెళ్లే పిల్లల సంఖ్య **58** శాతం ఉండేది. ఇప్పుడది **90** శాతానికి పెరిగింది. దీనికి అనుగుణంగా **10-14** ఏళ్ల వయసులో ఒకప్పుడు **13** శాతం ఉన్న బాల కార్మికుల సంఖ్య ప్రస్తుతం మూడో వంతుకు పడిపోయిందంటున్నారు.

నిబద్ధత అంటే అది. చట్టాలెన్ని వచ్చినా సక్రమంగా, చిత్తశుద్ధితో అమలు చేస్తేనే ఫలితాలు కనిపిస్తాయి.

# 2. శాపగ్రస్తులు నేటి బాలలు

తల్లిదండ్రులు తమ పిల్లల బాగోగులను గూర్చి, వారి మంచి భవిష్యత్‌ను గూర్చి ఎంత మేరకు పాటు పడుతున్నారు? అసలు తమ పిల్లలకు మంచి ఆహారాన్నీ, మంచి భవిష్యత్‌నూ యిచ్చే స్థితిలో ఎంత మంది తల్లిదండ్రులున్నారు? ఇపుడు దేశమంతటా అవిద్య, పౌష్ఠికాహారం, అనారోగ్యం వంటి మౌలిక సమస్యలు పసివాళ్లను కసిగా కాటేస్తున్నాయి. తమ పిల్లల బాల్యాన్ని బంగరు బాటలో నడిపించాలని కలలు గంటున్న ఎందరో తల్లిదండ్రుల ఆశలు అడియాసలే అవుతున్నాయి. ఇప్పటికీ రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో సుమారు తొమ్మిది కోట్లమంది పసి బ్రతుకులు వివిధ పరిశ్రమా గారాల్లో బాల కార్మికులుగా మగ్గి పోతున్నారు.

అసలు బతుకు గానుగలో నలిగిపోతున్న నునులేత మొగ్గ, ఈ దేశంలో బాల్యం.

ఇక్కడ శైశవం అక్షరాలా శాపగ్రస్తం.

మనం స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న ఇన్ని సంవత్సరాల తరువాత కూడా బాల్యం ఇలా చితికిపోవలసిందేనా?

సభ్య సమాజానికి మచ్చగా బాలకార్మిక వ్యవస్థ ఇలా కొనసాగవలసిందేనా? ఇందుకు ఎవరు బాధ్యులు? ఈ సమాజం అంటే మనమందరం కాదా?

సభ్య సమాజానికి మచ్చగా బాలకార్మిక వ్యవస్థ ఇంకా కొనసాగడమేంటి?

ఈ విషయంలో సుప్రీం కోర్టు కూడా తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ప్రమాదకర పనుల్లో ఉన్న పసివాళ్లందరినీ తప్పని సరిగా స్కూళ్లలో చేర్పించి విద్యా బుద్ధులు నేర్పించాలని ఆదేశించింది.

భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు బాలల హక్కుల్ని ఏనాడో నిర్దేశించాయి. పిల్లల కోసం 1974లో రూపొందించిన జాతీయ విధాన పత్రం - శిశు జననం మొదలుకొని సంపూర్ణ మానవుడిగా ఎదుగుదల వరకు భరోసా

యిచ్చేలా సమస్త సేవలూ అందజేయాలని పిలుపు నిచ్చింది.

ఆరోగ్యవంతమైన, సంతోషకర బాల్యాన్ని పిల్లలంతా అనుభవించాలంటూ జాతీయ నియమావళిని ఆవిష్కరించుకొన్నాం.

పిల్లల హక్కుల పరిరక్షణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టుకొన్నాం. బాలల అభ్యున్నతికి జాతీయ కార్యాచరణ ప్రణాళికను తాజాగా వెలువరించుకున్నాం. పిల్లల్ని జాతి సంపదగా పరిగణిస్తూ లింగ, వర్గ, కుల, మత, జాతి విచక్షణకు తావు లేకుండా సమానత్వ సాధన పథకాలను అమలు చేస్తామంటున్నాయి ప్రభుత్వాలు ఎప్పటి నుండో.

దీపం పేరు చెబితే చీకటి మలిగి పోతుందా? మాటలు, వాగ్దానాలు ముఖ్యం కాదు. పకడ్బందీ కార్యాచరణ ముఖ్యం.

అంతే కాదు మన దేశంలో **40** కోట్ల మంది పిల్లల అభివృద్ధి కోసమంటూ ఎన్నెన్ని పథకాలో పుట్టుకొస్తున్నాయి. అయినా వాటిని పట్టించుకునే నాథులేరి? ఎవరికి వారు తప్పించుకునే మార్గాలనే వెతుక్కుంటారు తప్ప బాధ్యతల్ని తమ నెత్తిన పెట్టుకొని వాటిని మోస్తూ భారాన్ని భరిస్తూ, వాటి పరిష్కారాల మార్గంలో పయనిస్తున్న వారెంతమంది?

ఎన్నెన్ని కార్యక్రమాలు అమలు పరుస్తున్నా, పిల్లల, శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ఎన్ని పథకాలు రూపొందుతున్నా పసివాళ్ల మరణాల రేటు **1993** స్థాయి నుంచి దిగిరావడం లేదంటున్నారు. అందుకు కారణం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం మందగించిందనే ఒక వాదన. పౌష్ఠికాహార లోపం సమస్య ప్రబలంగా ఉందని ప్రభుత్వలెక్కలే ఒక వంక చెబుతున్నాయి. ఇలాంటి దుర్భర స్థితి గతుల వల్లే నివారించగల రోగాలకూ కోరలు మొలుస్తున్నాయి. పసి కందుల్ని బలిగొంటున్నాయి.

ఒక నివేదిక ప్రకారంగా మన పొరుగున ఉన్న మహారాష్ట్రలో ఏటా సగటున లక్షా అరవై వేల మంది పసివారు పౌష్ఠికాహార లోపం వల్ల చనిపోతూన్నట్లు తెలుస్తోంది. అలాగే ఒరిస్సా, గుజరాత్, రాజస్థాన్, ఆంధ్ర ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా వికసించక ముందే ఎన్నో పసి మొగ్గలు రాలి పోతున్నాయి. దేశ వ్యాప్తంగా మూడేళ్ల లోపు పిల్లల్లో **47** శాతం పౌష్ఠికాహారానికి నోచుకోక అలమటిస్తున్నారు. రక్తహీనతతో **51** శాతం చిన్నారులు కృషించి పోతున్నారు.

ఇలా పసిపిల్లల సంరక్షణ, సంక్షేమం విషయంలో ఎటుచూసినా నిరాశే ఎదురౌతోంది. మరి బాలల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదా? అనే ప్రశ్న వచ్చినప్పుడు ఆయా రంగాల్లో ప్రభత్వాలు తగిన చర్యలకు రూపకల్పన చేస్తూనే ఉన్నాయి. ఎటొచ్చీ వాటి అమలుపైనే నిరాశ ఎదురవుతోంది.

శిశు మరణాల తగ్గింపు, పోషకాహార లోపాల అదుపు, బాల కార్మిక వ్యవస్థ తొలగింపు, తదితర వాటిపై దృష్టి పెడుతున్న మాట వాస్తవమే. కాని వాటిని సూటిగా ఛేదించడానికి ముఖ్యంగా కావాల్సింది ప్రభుత్వంలో చిత్తశుద్ధి.

ఇక్కడొక ఉదంతాన్ని చెప్పుకోవాలి. సమగ్ర శిశు అభివృద్ధి పథకం కింద పిల్లలకు పౌష్ఠికాహారం అందించడంలో ఇప్పటి ప్రభుత్వ వైఖరికి ఆ మధ్య సుప్రీం కోర్టు మండిపడింది. ఈ పథకం కింద ఏర్పరచిన పద్నాలుగు లక్షల అంగన్ వాడీ కేంద్రాల్లో సగానికిపైగా మూత పడ్డాయి. తక్కినవీ సవ్యంగా పని చెయ్యడం లేదని తీవ్రంగా ఆక్షేపించింది కోర్టు. కేంద్రాలకు సరఫరా కావాల్సిన పౌష్ఠికాహారం పెద్ద ఎత్తున నల్ల బజారుకు తరలిపోవడం పట్ల ఎన్నో ఆరోపణలు వచ్చాయి.

శిశు సంక్షేమ శాఖ, అవినీతి మడుగులో కూరుకుపోయింది  అని మరీ మందలించింది. ఇలా పిల్లల సంక్షేమానికి సంబంధించిన పథకాలు నీరుగారి పోతున్నాయి.

మరో వంక పేరుకే సమగ్ర శిశు అభివృద్ధి సేవా కార్యక్రమాలు. గౌరవ వేతనాలు చాలడం లేదని కార్యకర్తల్లో నిత్యం అసంతృప్తి చోటుచేసుకుంటోంది. విస్తరిస్తున్న పేదరికం, నిర్భాగ్య బాలలు కోట్ల సంఖ్యలో ఉండటం తదితర కారణాల వల్ల సంపూర్ణ సాధన అసాధ్యమంటున్నారు. తిండి కలిగితె కండ కలుగుతుంది – "తిండి కలిగితె కండ కలదోయ్ – కండ కలవాడేను మనిషోయ్" అని ఏనాడో అన్నారు గురజాడ వారు.

మన పవిత్ర భారత దేశంలో చాలా మంది అసలు మనుషులే కారు. చాలీ చాలని ఆదాయంతో ఒక పూట తింటే మరో పూట పస్తుండే అర్ధాకలి బతుకులు – తమ బతుకును ఇలా వెలారుస్తున్నారు. ఆ లెక్కన ఈ గడ్డ మీద కండ కలవారెందరు? దిన దినమూ ఇక్కట్ల పాలవుతూ సంసార సాగరాన్ని ఈదలేక తనతో పాటు తక్కిన కుటుంబ సభ్యులకూ ఏ విషమో తినిపించి అర్థాంతరంగా తనువు చాలించుకుంటున్న అభాగ్యుల దీన గాథలు ఈ పుణ్యభూమిలో తరచూ పునరావృతమౌతూనే ఉన్నాయి.

ఆత్మహత్య నేరమని, అందుకు ఒడిగట్టిన వాళ్లకు ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష విధించవచ్చని భారతీయ శిక్షా స్మృతి నిర్దేశిస్తోంది. మరి వాళ్లను ఆ దురవస్థకు దిగజార్చిన సామాజిక స్థితిగతులకు, అందుకు (దిగజార్చిన) కారకులైన ఏలిన వారికి ఎటువంటి శిక్ష ఉందని? ఈ విషయంలో ఆత్మ విమర్శ అంతకన్నా లేదు.

ఇలాంటి వాతావరణంలో ఎందరికో సరైన తిండికే దిక్కులేనప్పుడు, ఇక పౌష్ఠికాహార మెక్కడి నుండి వస్తుంది? అందుకే నూరు కోట్లకు పై బడిన మన దేశ జనాభాలో అనేకుల్ని బ్రతుకు భయంతో పాటు పౌష్ఠికాహారలోపాలూ పట్టి పీడిస్తున్నాయి. జీవచ్ఛవాల్లా మార్చేస్తున్నాయి. ఆ మధ్య మహారాష్ట్రలోని అహ్మద్ నగర్, ధూలే, జల్‌గావ్, నన్‌దర్బార్, నాసిక్ జిల్లాల్లో ఆరేళ్లలోపు పిల్లలు ఎనిమిది వేలమంది దాకా కృషించి పోతున్నారన్న వార్త రావడంతో ఊరూ, వాడా గగ్గోలెత్తిపోయింది.

అయితే అది పౌష్ఠికాహార లోపం వల్ల కాదనీ మీజిల్స్, డీ హైడ్రేషన్, డయేరియా, కలరా వల్ల కన్ను మూశారనీ అక్కడి అధికార గణం చెప్పుకుంది. ఆ తరువాత కొన్ని సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో కొన్ని పరమ సత్యాలు బయటికొచ్చాయి.

మహారాష్ట్రలో ప్రతి రోజూ **525** మంది చిన్న పిల్లలు మరణిస్తున్నారని ఉమ్మడి అధ్యయన ఫలితాలు చాటి చెప్పాయి. అంటే ఏడాదికి రెండు లక్షల మంది దాకా పసి మొగ్గలు విరిసీ విరియకుండానే మాడిపోతున్నాయన్నమాట.

మహారాష్ట్రలోనే పరిస్థితి ఇంత ఘోరంగా ఉంటే ఒరిస్సా లాంటి వెనుక బడిన ప్రాంతాల్లో సంగతెలా ఉంటుంది?

తినేందుకేమీ దొరక్క ఆకలి మంటలు చల్లార్చుకునేందుకు టెంకల పిండి అంబలిని సేవించి, అది విషాహారంగా మారడంతో అన్యాయంగా నేల రాలిపోయిన కాశీపూర్ బ్లాక్ గిరిజనుల విషాదాంతానికి మనమంతా సిగ్గుపడాలి.

నిరుపేదలకు ఆహార ధాన్యాల్ని ఉచితంగా ఇవ్వాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాల పై ఉంది. అంతే కాని డబ్బు లేని కారణంగా ఏ వ్యక్తి ఆకలి చావుకు గురికాకూడదని సుప్రీం కోర్టు అప్పట్లో రూలింగ్ యిచ్చింది.

ఈ రూలింగ్‌ను అక్షరాలా పాటిస్తున్నామనీ, అది దేశమంతటా అమలుకు నోచుకుంటున్నదనీ ధీమాగా చెప్పే ప్రభుత్వాలున్నాయా?

తమ తమ రాష్ట్రాల్లో ఆకలి చావులకు ఆస్కారమే లేదని ఆయా ప్రభుత్వాలు ఎంత సమర్థించుకుంటున్నా అనేక రాష్ట్రాల్లో, అనేక ప్రాంతాల్లో దారిద్ర్యం తాండవిస్తూనే ఉందనడం సత్యదూరం కాదు. పోషకాలు కొరవడిన అరకొర తిండి ఎందరినో క్రమేణా మృత్యుకోరల్లోకి నెడుతూనే ఉంది.

ప్రపంచ ఆహార కార్యక్రమానికి సంబంధించిన ఉన్నతాధికారులు కొన్ని నిష్ఠుర సత్యాలను వెల్లడించారు. భారత దేశంలో రమారమి యాభై శాతం మంది పిల్లలు పౌష్టికాహార లోపాలతో కునారిల్లుతున్నారు. ఈ దేశంలో ఇరవై ఆరు కోట్ల ప్రజానీకానికి తగినన్ని కేలరీలతో కూడిన ఆహారం అందుబాటులో లేదనీ పేర్కొన్నారు వారు. ఆకలి బాధతో రగిలిపోతూ ఏం చేసేందుకైనా సిద్ధపడుతున్నారు పసివారు.

ఇలాంటి నగ్న సత్యాలను తెలుసుకుని మనమంతా తట్టు కోగలమా?

ఇదీ పసివాళ్ల దీన స్థితి.

# 3. ఆకలితో అల్లాడుతున్న బాలలు

పేదరికాన్ని, దాని కవలలైన ఆకలి అనారోగ్యాల్నీ అంత మొందిస్తామంటూ స్వాతంత్ర్యం వచ్చిన నాడే సదాశయ ప్రకటనలు చేశారు పెద్దలు. **1950** లోనే ప్లానింగ్ కమిషన్ ఏర్పాటైంది. ప్రణాళికా బద్ధ ప్రగతికి బాటలు పడ్డాయి.

ఇక వజ్రోత్సవ సంవత్సరంలో పది పంచవర్ష ప్రణాళికలు పూర్తయ్యాయి. ఫలితాన్ని కనుకమదింపు చేసుకుంటే కలిగేది మాత్రం నిరాశే.

"దేశంలో నిరుపేదల సంఖ్య నేడు పాతిక కోట్లకు పైగా ఉందంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆకలితో ఆలమటిస్తున్న దేశాల జాబితాలో మన దేశం ఎంతో దయనీయంగా **117** వ స్థానంలో ఉందిప్పుడు. యిక బాల భారతంలో **47.5** శాతం పిల్లలు పౌష్ఠికాహారానికి నోచుకోక ఉసూరుమంటున్నారని ఎన్నో అధ్యయనాలు తెలుపుతున్నాయి.

"గరీబీ హటావో" అంటూ ప్రధాని ఇందిరా గాంధీ నినదించి మూడు దశాబ్దాలు దాటాయి. అయినా పరిస్థితి ఇలా ఉంది. పేదరికంపై మనం తలపెట్టిన పోరుకు అడుగడుగా వైఫల్యాలే. ఆ సజీవ చిత్రం ఇలా ఉంది. **1973-74** లో భారత దేశంలో **55** శాతంగా ఉన్న పేదల సంఖ్య ఇపుడు **26.1** శాతానికి దిగివచ్చినా, నిర్భాగ్య జీవుల జీవన ప్రమాణాలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు సూక్ష్మ రుణాలను అందజేస్తే, రెక్కల కష్టంతో వారే ప్రగతికి బాటలు వేసుకుంటారు. పేదరిక నిర్మూలనకు సూక్ష్మ రుణాలు బాగా తోడ్పడతాయని హేమాహేమీలే అంటున్నారు. కానీ ఆ చొరవ వల్ల పేదరికం ఏ మూలన నిర్మూలించ బడిందనేదే ప్రశ్న?

"ఆకలి మంటల్లో పిల్లలు సమిధలవుతున్న, దుర్భర దారిద్ర్యం తాండవిస్తున్న దేశాల జాబితాలో భారత్, నేపాల్‌లతో పాటు బంగ్లాదేశ్ కూడా ఉందంటున్నారు".

అయితే "కార్యక్రమాల రూపకల్పన - అమలు తీరు అస్తిమ శకాంతరం" - కార్యక్రమాల అమలులో అన్నీ లొసుగులే - అసలే కొరగాని కెటాయింపులు అందులో తాండవించే అవినీతి - దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

అన్న చందంగా ఉంటోంది.

ప్రజా ఉద్యమంగా సాగాల్సిన పేదరికంపై పోరు ప్రభుత్వ పరంగా పథకంగా ఉన్నంత కాలం వైఫల్యాలు వెన్నంటుతూనే ఉంటాయని చరిత్ర చెబుతోంది.

"పేదరికాన్ని రూపుమాపడమన్నది మానవాళి సామాజికార్థిక, రాజకీయ నైతిక కర్తవ్యం" అని తీర్మానించారు. అయినా ఈ పదేళ్ల కాలంలో అమలు ఏ మాత్రం కనిపించలేదు.

ఆదాయం లేకపోవడం ఒక్కటే పేదరికం కాదు. విద్యా వైద్య సౌకర్యాలలేమి, సరైన ఉపాధి, భద్రత, రాజకీయ భాగస్వామ్య అవకాశాలు వంటివి కొరవడటం కూడా పేదరికమే అని సూత్రీకరించారు.

ప్రతి వారికీ ఇంత తిండి దొరకాలనీ, చేతికి కాస్తంత పని దొరకాలనీ, దారిద్ర్య నిర్మూలనే ధ్యేయం కావాలనీ ఇరవై సూత్రాల కార్యక్రమాన్ని 1975లో ప్రారంభించారు. దానికి మెరుగులు దిద్దుతూనే ఉన్నారు. అయినా పేదరిక నిర్మూలన ఒక కొలిక్కి రావడం లేదు. పేదల్లో చాలా మందికి తిండి దొరకడం లేదు.

"కడు పేదరికంలో ప్రజలు కొట్టుమిట్టాడే పరిస్థితులు ఎక్కడున్నా, ఎక్కడ ఆకలి కేకలు వేసినా అక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్టే".

మరి ఈ హక్కును సంఘటితంగా సాధించుకోవాలి. ఇందుకు అందరి బాధ్యతా ఉంది. తమ పిల్లలకు తిండి పెట్టలేని తల్లిదండ్రులు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు ఎలా వేయగలుగుతారు?

# 4. కర్మాగారాల్లో నలిగిపోతోన్న బాల్యం

మూడేళ్ల క్రితం అంతర్జాతీయ బాలల సదస్సు బాలల సంక్షేమానికి, బాలల ప్రశాంత జీవితానికి దోహదపడే ఇరవయ్యొక్క సూత్రాలను వరుసగా పేర్కొంది. 2018 లోగా దుర్భర పేదరికాన్నీ, ఆకలిని జయించాలనీ, సార్వత్రిక ప్రాథమిక విద్యా లక్ష్యాన్ని సాధించాలనీ, బాల కార్మిక వ్యవస్థను బొత్తిగా తుడిచి వెయ్యాలనీ, బాలల చేత వెట్టి చాకిరీ చేయించుకునే తీరుకు స్వస్తి చెప్పాలనీ - ఇలాంటి అంశాలను పేర్కొంది.

అంతే కాదు "మూడేళ్లలో బడి ఈడు పిల్లలెవరూ పాఠశాల వెలుపల కనిపించగూడదనీ" - ఇదే మన ఆశయం కావాలనీ అన్నారు.

ఇలాగా మనం చేసిన వాగ్దానాలన్నీ ఏ మేరకు అమలులోకి వస్తున్నాయని ఒకసారి తరచి చూస్తే మనకు అన్నింటా నిరాశే మిగులుతుంది. పిల్లల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టాలు కుదేలవుతున్నాయి. ఆర్థిక దుస్థితిని ఆసరాగా తీసుకొని పనివాళ్ల చేత పనులు చేయించడాన్ని అనుమతించబోమన్న ప్రకటనలతో నిమిత్తం లేకుండా అసంఖ్యాక అభాగ్యుల బంగారు బాల్యం కష్టాల కొలిమిలోకి నెట్టివేస్తున్నారు. పద్నాలుగు సంవత్సరాల లోపు పిల్లల చేత పని చేయించగూడదని రాజ్యాంగ అధికరణే చాటుతోంది.

బాల కార్మికుల నిషేధ చట్టం రెండు దశాబ్దాల నాడే రూపుదాల్చుకుంది. ప్రమాదకర పరిశ్రమలు, పనుల్లో పిల్లల్ని తీసుకోవడంపై ఆంక్షలు విధిస్తోంది. టీ కొట్లు, హోటళ్లలో, ధాబాలలో, ఇళ్లల్లో పనులు చేయించుకోరాదని ఖచ్చితంగా పేర్కొంది. పిల్లల్ని పనిలో పెట్టుకున్న ఎవరికైనా ఏడాది పాటు జైలు శిక్షతో పాటు, జరిమానా తప్పదని కార్మిక శాఖ హెచ్చరిస్తోంది.

కానీ జరుగుతన్నదేమిటి? ఈ దేశంలో తమ కుటుంబాలని పోషించుకోటానికి ముక్కు పచ్చలారని పిల్లల్ని కూడా బాణాసంచా తయారీల్లాంటి ప్రమాదకరమైన పనుల్లో పెట్టి, గంటకో పదిరూపాయలు సంపాదించుకునేలా చేసి, ఆ పూట కాపూట కలో గంజో తాగి కడుపు నింపుకోడానికి పడరాని పాట్లు పడే నిరుపేదల జీవన గతి ఇది? దుర్గతి ఇది!

అంతే కాదు పాపం ఈ దేశంలో రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలో, బాల కార్మికుల చేత ఊడిగాలు చేయించడాన్ని నివారించడానికి నిర్దిష్టమైన చట్టాలున్నాయి. అయినా దేశంలోని అనేక ప్రాంతాల్లో వేళ్లూనుకు పోయిన వెట్టి సంస్కృతిని తలుచుకుంటే భయం వేస్తుంది. వెట్టి చాకిరీ వ్యవస్థలో అయితే మన ప్రభుత్వాలన్నీ నీరుగారి పోతున్నాయి.

అక్రమంగా బాణా సంచా తయారీ లాంటి ప్రమాదకరమైన పనులను చేయించడాన్ని ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది. బాల బాలికలను బాణా సంచా, పత్తి పంట, వజ్రాల నగల తయారీలలో వినియోగించటం నేరమని తెలిపింది. కాని ధన బలం, అధికార బలం అండదండలతో సమాజంలో బ్యూరోక్రాట్లు వీటిని ఉల్లంఘిస్తూనే ఉన్నారు. తరచూ జరుగుతున్న బాణాసంచా ఫ్యాక్టరీలలో చిన్నారులే ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఈనాడు బాణా సంచా తయారు చేసే కుటీర పరిశ్రమలు ఎన్నో వెలుస్తున్నాయి. వీటిల్లో బాల కార్మికులు **8-14** ఏళ్ల మధ్య వయస్సున్న వారే బలైపోతున్నారు.

ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ఈ విషయంలో ఎన్నో చర్యలు తీసుకోవలసిన ఇన్స్‌పెక్టర్లు, లేబర్ కమిషనర్లు, ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్లు, ఫ్యాక్టరీ సేఫ్టీ ఆఫీసర్లు, ఫ్యాక్టరీ లైసెన్స్ అథారిటీ వాళ్లు శ్రద్ధ వహించడం లేదు. ఏసీ రూముల్లో కూర్చొని కాగితాలు మాత్రం వారు తిరగేస్తుంటారు. స్వర్గతుల్యమైన బంగళాల్లో సుఖ సౌఖ్యాలతో తులతూగే వారికి ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయి? పాలనా యంత్రాంగం వ్యవస్థ నిర్లక్ష్యం, అవినీతి, లంచగొండితనం దేశమంతటా కటిక చీకటిలా ముసురుకు పోయింది.

ఇక వెట్టి చాకిరీ వ్యవస్థలో అయితే మన ప్రయత్నాలన్నీ నీరుగారి పోతున్నాయి. గ్రామ సీమల్లో వెట్టి చాకిరీ వ్యవస్థ ఇంకా వేల్లూనుకునే ఉంది. గ్రామాల్లోని ఆసామీలు కూలీ జనాన్ని తమ చెప్పు చేతుల్లో పెట్టుకొని వారిపై పెత్తనం చెలాయిస్తున్నారు. దేశంలో వెట్టి చాకిరీపై మూడు దశాబ్దాలుగా చట్ట బద్ధమైన పోరాటం జరుగుతున్నా ప్రభుత్వం తనవంతుగా చేపట్టిన చర్యలు అంతంత మాత్రమే. సభ్య సమాజానికి సిగ్గుచేటు అయిన ఈ వెట్టి చాకిరీ వ్యవస్థను నిర్మూలించే బాధ్యత ప్రభుత్వానిదే.

పోతే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పట్ల ఏ మాత్రం కృషి జరుగడం లేదని కాదు. బాల కార్మికుల చేత పని మాన్పించి బళ్లలో చేర్పించాలంటే వారి

కుటుంబ పరిస్థితులను ఆదుకో వలసి ఉంటుంది. ఇది జరుగనంత కాలం బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించలేం. ఈ రంగంలో వాస్తవిక కార్యాచరణకు సంబంధించన పనులు జరగాలి. ఇలాంటి పిల్లల తల్లిదండ్రులకు తగిన ఉపాధి కల్పించాలి. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి నిర్బంధ విద్యను అమలు పరచాలి. నిబద్ధత ఉంటే మనం ఏ పనినైనా సాధించ వచ్చును. చిత్తశుద్ధి లేనంత కాలం చట్టాలెన్ని వచ్చినా అవి కొరగానివిగానే ఉంటాయి.

## బాలల హక్కులు

ఐక్య రాజ్య సమితి బాలల హక్కుల ఒప్పందం, 1989 - సంతకం చేసిన తొలి దేశాల జాబితాలో భారతదేశం ఒకటి.

బాలల హక్కులు

- జీవించే హక్కు
- రక్షణ పొందే హక్కు
- అభివృద్ధి చెందే హక్కు
- భాగస్వామ్యం వహించే హక్కు
- గౌరవం పొందే హక్కు

(18 సంవత్సరాల లోపు వారందరూ బాలలే)

బాలల హక్కులు - పరిరక్షణకై నిర్దేశింపబడిన చట్టాలు

- బాల్య వివాహాల నిరోధక చట్టం 2006. బాల్య వివాహాలకు సహకరించిన వారికి 2 సం॥లు జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా లేదా రెండూ విధించ వచ్చును.
- వివాహాల నమోదు చట్టం 2005. అన్ని వివాహాలు తప్పక నమోదు చేయవలసిన అవసరం.
- జనన మరణాలు రిజిస్ట్రేషన్ చట్టం 1969. పుట్టిన ప్రతి శిశువు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలి.
- అక్రమ రవాణా నిరోధక చట్టం 1956. బాలల అక్రమ రవాణా, నిర్బంధ వ్యభిచారం నేరం. నేరస్థులకు 7-14 సం॥లు వరకు కఠిన కారాగార శిక్ష విధించ బడుతుంది.

# 5. ఎయిడ్స్ కోరల్లో చిన్నారులు

ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా ప్రతినిమిషం ఆరుగురు చొప్పున యువతీ యువకులు ప్రాణాంతకమైన ఎయిడ్స్ బారిన పడుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ఇక 25 సంవత్సరాల లోపు యువకుల్లో ఈ వ్యాధి అధికంగా ప్రబలుతూన్నట్లు చెబుతున్నారు. కాగా ఎక్కువ ప్రాంతాల్లో ఈ వ్యాధి అమ్మాయిలకే ఎక్కువగా ప్రబలుతూన్నట్లు ఈ మధ్యే యునిసెఫ్ తమ నివేదికల్లో వెల్లడించింది. 2000 సంవత్సరం నాటికే ప్రపంచ వ్యాప్తంగా 34.3 మిలియన్ల మంది హెచ్.ఐ.వి. బారిన పడ్డట్లూ, అందులో సౌత్ సర్‌హాన్‌లోనే 24.5 మిలియన్ల మంది ఉన్నారనీ యునిసెఫ్ వెల్లడించింది.

ప్రళయాంతకంగా వ్యాపిస్తున్న ఈ వ్యాధి నివారణకు ఇపుడు ఎన్నో చర్యలు తీసుకోబడుతున్నాయి. ఈ వ్యాధి నిరోధకానికి ఎన్నో పరిశోధనలూ జరుగుతున్నాయి. ముఖ్యంగా పిల్లల్లో ఆరోగ్య సంరక్షణ – వైద్యం, విద్యపట్ల అత్యంత శ్రద్ధ వహించాలి. కొన్ని దేశాల్లో వీటి పట్ల ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నందువల్ల ఫలితాలు కనిపిస్తున్నాయి.

పోతే ఎయిడ్స్ బారిన పడుతున్న చిన్న పిల్లల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతున్నది. 1999లో ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది పిల్లల్ని అడిగే దిక్కులేకుండా పోయారు. వారి తల్లి దండ్రులు, సమీప బంధువులు ఎయిడ్స్ – హెచ్.ఐ.వి. సోకి చనిపోవడమో లేదా చావుకు దగ్గర పడడమో జరిగింది. అందువల్ల అలాంటి పిల్లలకు దుర్భర పరిస్థితి ఏర్పడింది. మరో వైపు ఎయిడ్స్‌కు చేరువుగా ఉన్నవారు ఎందరో మృత్యువాత పడ్డారు. అలా పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది.

పెద్దల్లో అవగాహన లేకపోవడం, పెద్దల్లో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు కావడం దీనికి ముఖ్యకారణాలని చెప్పవచ్చును. అంతే కాకుండా తల్లుల నుండి ఈ వ్యాధి పిల్లలకు సోకిన తీరు మరీ ఘోరమైంది. అలా ఈ వ్యాధిన పడ్డ ఎందరో పసివాళ్లు మృతి చెందారు.

అనాధలౌతున్న చిన్నారులు నేటి వరకు 15 సంవత్సరాల లోపున్న దాదాపు 4 మిలియన్ల అంటే 40 లక్షల మంది చిన్న పిల్లలు ఎయిడ్స్ వ్యాధి సోకి

చనిపోయారు. అదే విధంగా **1999** చివరి కల్లా **15** సంవత్సరాలలోపు పిల్లలకు చెందిన **13.2** మిలయన్ల మంది తల్లులు లేదా తండ్రులిద్దరూ ఎయిడ్స్ వ్యాధికి గురై మరణించినట్లు చెబుతున్నారు. పోతే బాగా ఇష్టపడే కుటుంబ సభ్యులున్న చాలా మంది పిల్లలకు ఎయిడ్స్ వ్యాధి సోకడం వల్లా అనాధలుగా మారిపోతున్నారు. ఇలా వ్యాధి గ్రస్థులైన పిల్లల్ని నిర్దాక్షిణ్యంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. పిల్లల సంరక్షణ కేంద్రాలలోనో లేదా రోడ్లపైనో వదిలి పెట్టడం జరుగుతోంది.

ఇలాంటి తల్లిదండ్రులకు ఎయిడ్స్ పట్ల అవగాహన లేకపోవడం ఎంతో నష్టదాయకం. కాగా ఎయిడ్స్ సంక్రమించే, ప్రబలే విషయంలో కనుక తల్లిదండ్రులు ముఖ్యంగా తల్లులు మంచి అవగాహనను కలిగి ఉంటే పరిస్థితి ఇంత వరకు రాదు.

## సామాన్యులకూ అవగాహన

ఈ వ్యాధి సోకిన విషయాన్ని బాహాటంగా తెలియజెయ్యాలి. ఈ వ్యాధి అక్రమ సెక్స్ సంభంధం మూలంగా, విశృంఖల లైంగిక సంపర్కం మూలంగా వ్యాపిస్తూన్న విషయాన్ని అతి సామాన్యులకు, నిరక్షరాస్యులకు, ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఉండే వారికి తెలియజెయ్యవలసి ఉంది. ఇలాంటి కార్యక్రమాల్ని నిరంతరంగా కొనసాగించాలి.

అసలు చాలా మందికి ఎయిడ్స్‌ను అదుపులో పెట్టడానికి, మామూలుగా తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి, తీసుకోవలసిన మందులను గూర్చి తెలియదు. ఎయిడ్స్ వ్యాక్సిన్లలో అతి ముఖ్యమైన మందును వారికి తెలియజెయ్యాలి.

## పిల్లలకు పాఠశాలలోనే అవగాహన

**25** ఏళ్లలోపు యువతలో హెచ్.ఐ.వి. సోకే ప్రమాదమున్న విషయాన్ని పాఠశాల స్థాయిలోనే "ఎయిడ్స్ విద్య"గా పిల్లలకు ప్రవేశ పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో తర్జన భర్జనలు జరుగుతున్నాయి.

జీవితంలో మనిషి ఎప్పటికీ ఆరోగ్యంగా ఉండడానికి వీలుగా కొన్ని ముఖ్య విషయాలలో ప్రావీణ్యం సంపాదించే విషయంలో పిల్లలకు బోధన జరగాలి. అందుకు క్రమశిక్షణ, ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ, అవగాహన, ఇతర అంశాల పైనా తగిన శిక్షణ ఎంతేనీ అవసరం. పెద్దలు, ఉపాధ్యాయులు ఈ విషయంలో స్వచ్ఛందంగా కృషి చేయవలసి ఉంది.

ఏమైనా యువతను, పసివారిని ఎయిడ్స్ బారిన పడకుండా చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

దేశ సర్వతో ముఖాభివృద్ధిని దెబ్బతీస్తున్న ఎయిడ్స్ వ్యాధికి సమాజంలోని అనైతికతే ప్రబల కారణం అవుతోన్నది. గ్లోబలైజేషన్, వెస్టర్నైజేషన్ మూలంగా భారతీయ సంస్కృతిలో గణనీయంగా మార్పు వచ్చేస్తోంది. అలా పాశ్చాత్య ధోరణి రోజు రోజుకూ పెరిగి పోతోంది. దీని వల్ల తల్లిదండ్రులకు పిల్లల మీద పర్యవేక్షణ తగ్గిపోతోంది. భార్యాభర్తలు ఉద్యోగులైతే తమ పిల్లల మీద శ్రద్ధను కనబరచలేక పోతున్నారు. ఇలాంటి కుటుంబాలలో పెరిగే పిల్లల్లో (లోన్లీనెస్) ఒంటరితనం పెరిగిపోతోంది. దాంతో ఆపోజిట్ సెక్స్ పట్ల ఎక్కువగా ఆకర్షితులౌతున్నట్లు వైద్య శాస్త్ర నిపుణులు పేర్కొంటున్నారు. ఎవరైనా పలుకరిస్తే అదే ప్రేమ అనుకుంటున్నారు. ఈ క్రమంలో పెరిగే స్నేహం శారీరక సంబంధాల వరకు దారితీస్తోంది. యువత ఇలా ఎయిడ్స్ బారిన పడటానికి ఇదో దారి అవుతోంది.

కొన్ని మధ్యతరగతి, పేద కుటుంబాల్లో ఇరుకు ఇల్లైతేనేమి, మరే కారణమైతే నేమి లైంగిక విజ్ఞానం పట్ల అవగాహన లేని తల్లిదండ్రులు పిల్లల విషయాన్ని దృష్టిలో పెట్టకుండా, వారు పడుకుందీ, లేనిదీ చూడకుండా సెక్స్‌లో పాల్గొనడం మూలాన అది పిల్లల మనస్సుల మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఎదిగిన వయస్సులో వారిని, మిడిమిడి జ్ఞానంతో ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

భార్యా భర్తలు ఉద్యోగరీత్యా వేరువేరు ప్రాంతాల్లో ఉంటూండడం వల్ల, వారి మధ్య సెక్స్ విషయంలో గ్యాప్ పెరగడం వల్ల మనస్సు గతి తప్పి వివాహేతర సంబంధాలకు లోనవడం వల్ల ఎయిడ్స్ వ్యాధి విస్తరిస్తోంది. మన రాష్ట్రం (ఆంధ్ర ప్రదేశ్)లో 15 శాతం మంది యువకులు, ఇంకా ఎదగని వారు వివాహేతర లైంగిక సంబంధాలను కలిగి ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

ఇక పిల్లల విషయానికి వస్తే (అమ్మాయిలు), 12, 13 సంవత్సరాల వయస్సులోనే యుక్త వయస్సులోకి వస్తున్నారు. అప్పటి నుండే వారిలో అలజడి మొదలవుతుంది. నేటి సినిమాలు, టి.వీ.ల ప్రబావం వారిని మరి గందరగోళపరుస్తున్నాయి. అలా వారు అక్రమ సెక్స్ సంబంధాలకు లోనై ఎయిడ్స్‌ను కొని తెచ్చుకుంటున్నారు. ఇపుడు ఈ వ్యాధికి గురవుతున్న వారిలో 15 సంవత్సరాల నుండి 24 సంవత్సరాల వయస్సుకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారు.

పోతే ఎయిడ్స్ బాధితుల్లో ఇపుడు 50 శాతం 15 నుండి 25 సంవత్సరాలలోపు వారే ఉంటున్నారు. మన దేశంలో ఎయిడ్స్ వ్యాధికి గురైన 90 మంది 28 సంవత్సరాల లోపు యువతీ యువకులు కావడం అత్యంత బాధాకరం.

## భావితరాల రక్షణ ధ్యేయంగా

మశూచి, మహమ్మారిని మట్టి గరిపించిందీ, మలేరియా, టి.బి. (క్షయ) వంటి అంటు వ్యాధుల అనుపానులు గుర్తించి సమర్థవంతమైన మందులు కనిపెట్టిందీ ఈ శతాబ్దంలోనే.

అయితే ఎన్నో విజయాలు సాధించిన మానవాళి నూతన శతాబ్దంలోనూ కొత్త వ్యాధి "ఎయిడ్స్" మృత్యు ఘంటికలు మోగిస్తున్నది. ప్రపంచ ప్రజానీకాన్ని భయకంపితులను చేస్తున్న ఎయిడ్స్ వ్యాధి మానవ మేధకు, వైద్య రంగానికి సవాలుగా పరిణమించింది.

ఇంతటి భయంకరమైన వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి జాగృతం చెయ్యవలసి ఉంది. ఈ మేలు కొలుపు ఉద్యమం అంతర్జాతీయ స్థాయి నుండి జాతీయ, రాష్ట్ర స్థాయి నుండి, పట్టణ, గ్రామీణ స్థాయి వరకు కొనసాదుతోన్నది.

విశృంఖల వ్యభిచారులకో, రక్తదానం వృత్తిగా కలిగిన వారిలో, మాదక ద్రవ్యాల బానిసలకో పరిమితమనే భావన, ధీమా ఉన్న ఈ దేశంలో ఎయిడ్స్ వ్యాధి చాప కింద నీరులా ప్రవహిస్తోంది. అన్నెం పున్నెం ఎరుగని పసికందులను కూడా ఇలా ఈ వ్యాధి అన్ని వర్గాల వారినీ వేధిస్తోంది. ఇప్పటికీ భారత దేశంలో 0.5-0.8 శాతం యువకుల్లో హెచ్.ఐ.వి. వ్యాపించినట్లు చెబుతున్నారు. మరో వైపు ఎయిడ్స్ వ్యాధి నిశ్శబ్దంగా పట్టణాల నుంటి పల్లెల్లోకి చొచ్చుకు పోతోంది. సుమారు 85 లక్షల మంది ఎయిడ్స్ పీడితులతో భారతదేశం ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉంది. కాగా దేశంలో ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి తీవ్రతను బట్టి విభజించిన జోన్‌లలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని అత్యంత ప్రమాదకర జోన్‌గా గర్తించారు. రాష్ట్రంలోని గర్భిణీ స్త్రీలలో 2 శాతంలో హెచ్.ఐ.వి. ఉనికిని గుర్తించారు. ఇది అత్యంత ప్రమాదకర విచారకర ప్రమాదం.

పోతే ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఇపుడు ఎందరెందరో పిల్లలు ఎయిడ్స్ కోరల్లో గిలగిల లాడుతున్నారు. వీరిలో హెచ్.ఐ.వి. వ్యాప్తి తగ్గే సూచనలు కను చూపు మేరలో కనిపించడం లేదంటున్నారు.

## బుగ్గిపాలవుతున్న బాలల బంగారు భవితవ్యం

ప్రపంచమంతటా ఒక వైపు బాలల హక్కులు కాలరాచి వేయ బడుతున్నాయి. ఇక బాలల హక్కులను సమగ్రంగా రక్షించలేని చట్టాలు, వారు ఆరోగ్యంగా జీవించే హక్కును కాలరాచి వేస్తున్న మనకు స్పష్టంగా కనిపిస్తోంది. ఈనాటి సమాజం అలసత్వం వల్ల లేతప్రాయంలోనే ఎయిడ్స్ వాతపడి నిరాదరణకు గురై కృంగిపోతున్న వారెందరినో చూస్తున్నాం.

పరిస్థితి ఎంత దారణ స్థితికి చేరుకున్నదంటే ప్రపంచ వ్యాప్తంగా ఒక్క **1998** లోనే ప్రతిరోజూ **14** వందల మంది పిల్లలు ఎయిడ్స్ వ్యాధికి బలైపోయారు. **2001** మొదట్లోనే **15** ఏళ్లలోపు పిల్లల్లో **12** లక్షల **20** వేల మంది హెచ్.ఐ.వి.తో జీవిస్తున్నారు. పోతే వీరిలో **90** శాతం అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన వారు కావడం విశేషం.

**2010** నాటికి హెచ్.ఐ.వి. వ్యాప్తిని సమర్ధవంతంగా అరికట్ట లేకపోతే ఎయిడ్స్‌కు గురై అయిదేళ్ల వయస్సు వచ్చే వరకు బతికిబట్ట కట్ట గలిగే పిల్లలు ఉండనే ఉండరంటున్నారు అంటే నూటికి నూరు శాతం అయిదేండ్ల లోపు మరణాలే సంభవిస్తాయని చెప్పక తప్పదు.

హెచ్.ఐ.వి. పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతియ్యడమే కాకుండా వారి జీవితాన్ని, జీవన గమనాన్ని ఘోరాతి ఘోరంగా మార్చేసే ప్రమాదం ఉంది.

## బాల సెక్స్ వర్కర్లు

ప్రపంచంలో ఎంత మంది బాల సెక్స్ వర్కర్లు ఉన్నారో ఖచ్చితమైన గణాంకాల వివరాలేమీ లేవు. **1996** ఆగస్టులో స్టాక్ హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సు వివరాల ప్రకారం ప్రతీ సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా **10** లక్షల మందికి పైగా పిల్లలు బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి అదుగిదు తున్నారు. మరోలా చెప్పాలంటే నెట్టి వేయబడుతున్నారు.

పోతే భారత దేశంలో **5** లక్షల మందికి పైగా ముక్కు పచ్చలారని బాలికలు వ్యభిచారులుగా జీవిస్తున్నారు.

మరో ఘోరమైన వార్త ఏమిటంటే డొమినిక్ రిపబ్లిక్‌లో రజస్వల కాని **26,400** మంది వ్యభిచార వృత్తిలో మ్రగ్గిపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యభిచార

వృత్తిలో 13 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు పిల్లలే అత్యధికంగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

కెన్యాలో ఇటీవల నిర్వహించిన సర్వేలో 30 శాతం బాల వ్యభిచారుల్లో హెచ్.ఐ.వి. ఉన్నట్లు నిర్ధారణ అయింది. భవిష్యత్తులో పిల్లల్లో హెచ్.ఐ.వి. ఇన్‌ఫెక్షన్ రానురాను పెరుగుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మొత్తం ఎయిడ్స్ కేసుల్లో 15 నుంచి 20 శాతం పిల్లలే ఉంటారు.

ఎయిడ్స్ ముఖ్యంగా బాల్యాన్ని బలిపీఠ మెక్కిస్తోంది. తల్లిదండ్రులు ఎయిడ్స్‌తో మృతి చెందడంతో ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా కోటిన్నర మంది బాలలు అనాథలయ్యారు. 2010 నాటికి అనాథ బాలల సంఖ్య దాదాపు రెండున్నర కోట్లకు చేరవచ్చునన్న అంచనా ఆందోళన కలిగిస్తోంది.

ఈ నేపథ్యంలో భవిష్యత్ తరాన్ని బతికించు కోవడం కోసమైనా - ఎయిడ్స్‌పై యుద్ధానికి అంతా సన్నద్ధం కావాల్సి ఉంది. పోరాటం ఏ రీతిన సాగాలన్నది ప్రధానమైన ప్రశ్న - ప్రతి నిమిషానికి పది మందిని కబళిస్తున్న ఈ వ్యాధిని ఎదుర్కొని, అదుపు చేయడం సునాయాసం కాదని ఇప్పటికే స్పష్టమైంది.

హెచ్.ఐ.వి. పీడితుల పాలిట మరణ శాసనంగా పరిణమించిన క్షయ (టి.బి.) వ్యాధిని అదుపు చేయందే ఎయిడ్స్‌పై ప్రపంచ పోరాటంలో విజయం అసాధ్యమంటూ మండేలా చేసిన హెచ్చరిక మన మనో నేత్రాలను తెరిపించేదే.

# 6. ఆప్యాయతలకు దూరమవుతున్న చిన్నతనం

బాల్యం ఓ మధురతరం. ఓ మధుర సంతకం. ప్రతి వ్యక్తి జీవితం పై చెరగని ముద్ర వేసేది అతడి బాల్యమే. చిన్నతనం నుంచి పిల్లల మనసులో రూపు దిద్దే భావాలే పెద్దైన తర్వాత మార్గ నిర్దేశం చేస్తుంటాయి.

అందుకే తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ "భారత దేశ భవితవ్యం తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని" అన్నారు చిన్నారులకు ఉత్తమ విద్య అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

ఈ సందర్భంలోనే ఓ కవి అన్న మాటలు గుర్తుకు వస్తాయి. "దేవుడా! నా సర్వ సంపదలను ఇచ్చేస్తాను – నా బాల్యాన్ని నాకు తిరిగివ్వు".

ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం ఎంతటి గొప్ప స్థానాన్ని ఆక్రమిస్తుందో వేరుగా చెప్పనక్కరలేదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి గోరు ముద్దలు తినిపించాలి. ఆత్మీయతను పంచాలి. దాంతో పాటు వారికి క్రమ శిక్షణను కూడా నేర్పించాలి. పిల్లలు తమకు తాము వికసించడంతో పాటు సమాజానికి, దేశానికి పనికి వచ్చే పౌరులనుగా తయారు చెయ్యాలి.

అయితే చిన్నారులు పాఠశాలల్లో జరిగిన విషయాలను ముందుగా అమ్మానాన్నలకే చెప్పుకోవాలని ఆశపడుతుంటారు. వీరి ఆశలకు నేటి తల్లిదండ్రులు దూరంగా ఉంటున్నారనే చెప్పవలసి ఉంటుంది. ముఖ్యంగా పట్టణాలు, నగర ప్రాంతాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లల ప్రేమను పంచుకోడానికి మరీ దూరమౌతున్నారు. తమ పిల్లల అనుబంధాలను, ఆప్యాయతలను డబ్బుతో ముడిపెడుతున్నారు. చిన్నారుల మనసులను గాయ పరుస్తున్నారు. ఆ ప్రభావం రేపు వృద్ధాశ్రమాలకు చేరితే గానీ అర్థం కాదేమో!

డబ్బు సంపాదనే ధ్యేయంగా భావిస్తూ పిల్లల చిన్ని చిన్ని ఆశలు తీర్చలేకపోతున్నారు. వాళ్లతో సెలవు రోజున గడిపితే సరిపోదు. స్కూలు నుంచి రాగానే అమ్మ కనిపించాలి. నాన్న నా కోసం ఏదైనా చేస్తాడనే నమ్మకాన్ని కలిగించాలి. మహా నగరాలలో పిల్లలు అమ్మ గోటి ముద్దలకు, నాన్న ఆత్మీయతలకు దూరమవుతున్నారు. మార్కెట్లలో అప్పటికప్పుడు తయారుగా దొరికే ఫాస్ట్‌ఫుడ్

సంస్కృతికి అలవాటు పడుతున్నారు. ఊబకాయులుగా మారుతున్నారు రేపటి తరంవారసులు.

మహా నగరాలలో చిన్నారుల బ్రతుకులు అగమ్యగోచరంగా తయారవుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపై ట్రాఫిక్ గోల ఎక్కువవుతోంది. ఎందరో కిడ్నాపర్ల వలలో చిక్కుకుని నానా హింసలకు గురి అవుతున్నారు. ప్రాణాలను కూడా నిష్కారణంగా పోగొట్టుకుంటున్నారు. నగర బాలురను బాల్య రుచులు చూడకుండా ఆందోళనకు గురి చేస్తున్నాయి. అమ్మ ఒడిలో, నాన్న చేతుల్లో గడపాల్సిన బాల్యం బేబీ కేర్ సెంటర్లలో గడచిపోతోంది. ఇలా బాల్యాన్ని గందరగోళ పరుస్తున్నాయి మహానగర జీవిత విధానాలు. అంతే కాదు అందివచ్చిన ఆధునిక సదుపాయాలు వయసు మించిన పరిణితిని పెంచుతున్నాయి. పదేళ్లు నిండని వయసులోనే అన్నీ నేర్పుతున్నాయి. ప్రపంచాన్ని చదివిస్తున్నాయి. ఆనాటి పిల్లల బాల్యానికీ, ఈ నాటి పిల్లల బాల్యానికి ఎంతో తేడా కనిపిస్తోంది. నిజంగా తల్లిదండ్రులకు దూరమవుతోన్న బాల్యం భవిష్యత్తులో ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది.

ఇలాంటి వాతావరణంలో పెరుగుతున్న వారి బాల్యం పసి మనసులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. వాళ్లను ఒంటరి వాళ్లను చేస్తుందని చిన్న పిల్లల మనస్తత్వ నిపుణులు అంటున్నారు.

పెరిగిన జీవన ప్రమాణాలు, అక్షరాస్యత ప్రభావం నేటి యువ జంటలు ఒక్క బిడ్డతోనే సరిపుచ్చుకుంటున్నాయి. ఉమ్మడి కుటుంబాలకు దూరమైన బాల్యం తోబుట్టువుల ఆత్మీయతనూ కోల్పోతోంది. అమ్మానాన్నలు ఉద్యోగస్తులైతే స్కూలు నుండి ఇంటి కొచ్చిన పిల్లలు ఒంటరి తనానికి గురవక తప్పదు. అప్పుడు వారికి టి.వీ.లు దిక్కవుతున్నాయి. ఇవి పెడదారి పట్టేందుకు దోహద పడుతున్నాయి. తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన చిన్నారులు తమను ఆప్యాయంగా పిలిచిన వారికి చేరువై వారి వికృత చేష్టలకు పావులుగా మారుతున్నారు. సెలవుల్లో ఏదో ఒక రోజు పిల్లలకు వినోదాన్ని పంచిన తల్లిదండ్రులు తమ బాధ్యత అంతవరకేనని చేతులు దులుపుకుంటున్నారు. వారికి అన్నీ సమకూర్చడమే గొప్పతనంగా భావిస్తున్నారు. కాని వారికి అసలైన మమతల రుచిని చూపలేకపోతున్నారు.

# 7. బాలలే మూలధనం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే అత్యధిక శాతం యువత ఉండటం ఇప్పటి పరిస్థితి అంటున్నారు విశ్లేషకులు. చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ కనిపించలేదని వారంటున్నారు. ప్రపంచంలో ముఖ్యంగా భారత్ లాంటి దేశాల్లో జనాభా పెరిగిపోతోండడం ఆందోళన కలిగించే విషయం. ప్రపంచ జనాభాలో **50** కోట్ల మంది **12** నుంచి **24** సంవత్సరాల వయసు వారు ఉన్నారు. ఇక మన దేశ జనాభాలో చూస్తే మూడో వంతు **15** సంవత్సరాల లోపు వారే. అందువలన జనాభాలో ఎక్కువ శాతం మంది పని చేసే వారున్నారని మనం గమనించాలి. వారిని సంపద సృష్టించగల మానవ వనరులుగా తీర్చి దిద్దుకోవాలి. బాలలు, యువతకోసం పెట్టే పెట్టుబడులను పెంచాలి.

జనాభా ధోరణులు కల్పిస్తున్న ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించుకోవాలంటే దేశాభివృద్ధికి బాలలను, యువతనే పెట్టుబడిగా భావించాలి. వారిని అన్ని విధాలా తీర్చిదిద్దుకోడానికి అవకాశాలు కల్పించాలి. అలా మలచుకోనప్పుడు ఆ దేశ భవిష్యత్ సంపదను నిర్వీర్యం చేస్తున్నట్లుగా భావించాలి. ఉదాహరణకి మన దేశంలో **12** ఏళ్ల లోపు పిల్లల్లో **65** శాతం మేరకు పాఠశాలల్లో చదువుకుంటున్నారు. అయితే ఆపై స్థాయికి చేరేసరికి ఈ సంఖ్య పడిపోతోంది. ఇలా మధ్యలో బడిమానేసిన వారు **24** ఏళ్ల వయసు వచ్చే సరికి ఆ నేర్చుకుంది కాస్తా మరచి పోతున్నారు. వయోజన దశలో కొత్తగా నేర్చుకునేది ఉండటం లేదు.

అందువల్లనే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏ నైపుణ్యం లేని శ్రామికుల సంఖ్య గణనీయంగా ఉంటోంది. ఆర్థిక వ్యవస్థలో మానవ మేధస్సు పాత్ర పెరుగుతున్న కొద్దీ నైపుణ్యంలేని శ్రమ శక్తి వల్ల అభివృద్ధి కుంటుపడుతోంది. అలా నేటి బాలలు, యువత క్రమంగా నైపుణ్యం లేని వారుగా తయారవుతున్నారు.

అందుకు ఇపుడు బాల కార్మిక వ్యవస్థ పెరగకుండా చూసుకోవాలి. సార్వత్రిక ప్రాథమిక విద్యను, వివిధ రకాల నైపుణ్యాలను కల్పించాలి. భిన్న రకాల ఉపాధికి ఉపయోగపడే రీతిలో యువతీ యువకులను సుశిక్షితులను చెయ్యాలి.

సంపదను సృష్టించే సామర్థ్యాలను వారిలో పెంచాలి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొనే ఆనాడు గాంధీజీ "నయీ తాలీం" బేసిక్ విద్యను ప్రోత్సహించారు. విద్యతో పాటు పనులను నేర్చుకోవాలన్నారు. అవి జీవికకు ఉపయోగ పడతాయన్నారు. కేవలం విద్యావ్యాప్తికి కృషి చేస్తేనే విద్యావ్యాప్తి జరిగేతేనే సరిపోదు. ప్రమాణాలున్న విద్యను అందించగలగాలి. విద్యా వ్యవస్థను విస్తరింప చెయ్యడంతో పాటు ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం ఎంతైనా అవసరం.

**18 సంవత్సరాల లోపు వారందరూ బాలలే**

# 8. విద్యకు పునాది ప్రాథమిక విద్య

"మొక్కై వంగనిదే మ్రానై వంగదంటారు". అందువల్ల పిల్లల్లో చిన్నతనంలోనే, ప్రాథమిక విద్యా స్థాయిలోనే వారి జీవితానికి పునాదులు వేయవలసి ఉంటుంది. ప్రాథమిక స్థాయిలోనే విద్యతో పాటు మన సంస్కృతీ సాంప్రదాయాల పట్ల, క్రమ శిక్షణ పట్ల అవగాహనను కలిగించడానికి ప్రయత్నం చెయ్యాలి. మన ఇరుగుపొరుగు వారు, సమాజం పట్ల, సమాజం తీరు పట్ల, ఎదటి వారి పట్ల వారు వ్యవహరించే తీరు పట్ల అవగాహనను కలిగించాలి. తల్లిదండ్రులు, సమాజంలోని ఇతర పెద్దల యెడల ప్రవర్తించే తీరును వారికి ఈ దశలోనే నేర్పించ వలసి ఉంటుంది. తోటివారికి సహాయ పడటం, బలహీనులకు, జబ్బు చేసిన వారికి సహాయం అందించే విషయంలో, ఎదటి వారిని నొప్పించ కుండా మాట్లాడే తీరును వారికి ఈ ప్రాథమిక స్థాయిలోనే నేర్పవలసి ఉంటుంది.

ఇంట్లో తల్లిదండ్రులతో మొదలైన నీతి పాఠాలు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో గట్టి పడిపోతుంటాయి. అలాగే మంచి, చెడుల విచక్షణా జ్ఞానం ప్రాథమిక విద్య స్థాయిలోనే పాదుకొల్పబడాలి. అలా ప్రాథమిక విద్య స్వచ్ఛమైన, ప్రశాంతమైన వాతావరణంలో జరగాలి. కాగా ప్రాథమిక స్థాయిలో కావించే విద్యా బోధన బాలబాలికల హృదయాలలో బీజాలుగా నాటుకొంటాయి. అందువల్ల వారికి నీతి, నియమాల పాఠాలతో పాటు మహనీయుల, మార్గదర్శకుల జీవితాల్లోని ఆదర్శ ఇతి వృత్తాలనూ వినిపించి వారిలో నైతిక విలువలు నాటుకొనేలా చేయాలి.

సత్యాన్ని పాటిస్తూ, పెద్దలను గౌరవిస్తూ, మంచి పౌరులుగా, సచ్ఛీలురుగా వారు తయారు కావడానికి రామాయణ, మహాభారత, భగవద్గీత, బైబిల్, ఖురాన్‌ల నుంచి కొన్ని ఘట్టాలను వినిపించి వారికి అన్ని మతాల, ధర్మాల పట్ల అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగాలి. తరగతి పుస్తకాలతో పాటు, పాఠ్యాంశాలతో పాటు పాఠ్యాంశాల్లో లేని కొన్ని నీతి, నియమాలనూ, సదాచారాలనూ, సత్ సాంప్రదాయాలనూ వారిలో పాదుకొల్ప వలసి ఉంది. ఎన్నో ధర్మ సూత్రాలను వారికి అర్థమయ్యే రీతిలో బోధించి వారి మనస్సులలో స్థిరంగా కూర్చుండే చెయ్యాలి.

ఏమైనా లేత మనసులపై ప్రభావాన్ని చూపే విషయాలు వారి భవిష్యత్ జీవితాలపై మంచి ప్రభావాన్ని చూపుతాయి. వారు పెరిగి పెద్ద వారైన తరువాత కూడా వారిలో ముద్రపడి తద్వారా గట్టి పడ్డ విధానాలే వారి జీవిత ఆశయాలౌతాయి. అవి సమాజానికి ఎంతగానో తోడ్పడతాయి. చిన్ననాడే వారిలో గట్టిపడిన విధానాలే అటు ఆత్మ (స్వంత) శాంతికీ, విశ్వశాంతికీ దోహదపడతాయి. అలా చిన్న పిల్లల్లో అతి సామాన్యమైన విషయాల నుండీ మహదాశయాల వరకూ బీజారోపణ జరగాలి. సత్పౌరులుగా, ఆదర్శ పురుషులుగా ఎదగడానికీ ప్రాథమిక విద్యా స్థాయిలోనే బీజారోపణ జరగాలి.

అందుకు ఈ ప్రాథమిక స్థాయిలోనే ఇంట్లోనూ, పాఠశాలలోనూ ప్రశాంతమైన, స్వచ్ఛమైన, సుమధురమైన వాతావరణం ఉండాలి. ఆదర్శవంతమైన విద్యాలయాలు, ఆదర్శ ఉపాధ్యాయులు ఉండాలి.

అప్పుడే మనం ఆశిస్తున్న ఈ ప్రాథమిక స్థాయి విద్య సుసంపన్నమై విలసిల్లుతుంది.

మరిప్పుడు మనం ఈ ప్రాథమిక స్థాయిలో ఆదర్శవంతమైన విద్యను, ప్రశాంత వాతావరణానికి నిలయమైన పాఠశాలలను సమకూర్చ గలుగుతున్నామా? అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులను అందించగలుగుతున్నామా?

## 9. ఇపుడు "ప్రాథమిక విద్య స్థాయి" ఎలా ఉంటోంది?

"ప్రతి తల్లీ, తండ్రీ సమీపంలోని పాఠశాలలకు వెళ్లి తమ పిల్లల్ని అందులో చేర్చాలి. తమ సంతానానికి విలువలతో కూడిన అర్థవంతమైన విద్య లభిస్తుందన్న నమ్మకంతో ఆనందంగా తిరిగి రావాలి. అటువంటి పరిస్థితుల్ని కల్పించాలి".

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారన్న మాటలివి – ఈ స్వప్న సాఫల్యం ఎప్పుడు నెరవేరుతుంది. ఇది కనుచూపు మేరలో నెరవేరుతుందా?

మరిప్పుడు పునాది స్థాయి అయిన ప్రాథమిక విద్య స్థాయి ఎలా ఉంది? ఇపుడు బ్రహ్మాండం బద్దలు కొడుతున్నామా! అన్నంత జోరుగా విద్యా విధానం కొనసాగుతోంది. కంప్యూటర్ విద్యా బోధన, హైటెక్ హంగుల పేరిట సందడి. తీరా చూస్తే మన ప్రాథమిక విద్యా స్థాయి ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంది. దేశీయంగా ప్రాథమిక విద్యారంగం దుస్థితి – ఈ మధ్యే వార్షిక విద్యా సర్వేలో తాజాగా వెల్లడైంది.

అయిదో తరగతి చదివే పిల్లల్లో **55** శాతం మూడంకెల సంఖ్యను ఒక అంకెతో భాగించలేని వారి సంఖ్య ఎక్కువే అని తేలింది. తమ తరగతి పాఠ్య పుస్తకాల్ని **47** శాతం విద్యార్థులు చకచకా చదవలేరని వెల్లడైంది. మొక్కుబడి చదువులకు ఇంతకన్నా దృష్టాంతరాలు అనవసరమేమో!

ఇక అధికారిక గణాంకాలే తెలుపుతున్నాయి దేశంలో రమారమి ముప్పై కోట్ల మంది పౌరులకు చదవడం, రాయడం రాదని – అంతే కాదు విశ్వవ్యాప్తంగా అత్యధిక నిరక్షర కుక్షులున్నది మన దేశంలోనే అని. ఇక అక్ష రాస్యుల్లోనూ **41** శాతం అయిదో తరగతి, ఆలోపు చదివిన వారేనని.

ఇటువంటి ప్రత్యేకతలున్నాయి కాబట్టే యునెస్కో విద్యాభివృద్ధి నివేదిక **94** దేశాల్లో భారత్‌కు దెబ్బై ఆరో స్థానం కట్టబెట్టింది. ఇక అక్షరాస్యత ప్రాతిపదికన జాతీయ స్థాయిలో ఇరవై ఎనిమిదో స్థానాన నిలిచిపోయింది మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం. ఇది మరీ ఘోరం.

ఇక్కడి ప్రాథమిక పాఠశాలల స్థితికి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు తొంబై వేల ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక పాఠశాలలు ఎన్నో సమస్యలతో

సతమతమౌతున్నాయి. తాగునీటికి, మరుగు దొడ్లకు, విద్యుత్ సౌకర్యానికి సహితం నోచుకోని పాఠశాలలు వేలల్లో ఉన్నాయి.

అసలు ఇక్కడి విద్యాలయాలకు స్వంత భవనాలున్నాయా? కిరాయి భవనాల్లో ఇరుకు గదుల్లో విద్యార్థులు ఎలా మసలు కొంటున్నారో తెలియంది కాదు.

వసతుల సమస్యలే కాదు తగినంత బోధన సిబ్బందికి నోచుకోని పాఠశాలలు వేల సంఖ్యలోనే ఉంటున్నాయి. ఒకే ఒక్క ఉపాధ్యాయుడు అయిదు తరగతులకు బోధించాలి. అయిదు తరగతులకు అన్ని విషయాలనూ ఆయనే, బోధించాలి. వేరు వేరు తరగతి గదులకు అవకాశం కూడా లేని పరిస్థితి నెలకొంది ఈ నాటికీ – అన్ని తరగతుల విద్యార్థులను ఒకే దగ్గర, తరగతి గదిలోనో, చెట్ల కిందనో కూర్చోబెట్టి చదువు చెప్పాల్సిన పరిస్థితి ఇంకా నెలకొంది.

విద్యా వ్యాప్తిపై మన వారి ప్రగల్భాలే తప్ప కార్యాచరణ చర్యలు ఈ నాటికీ కరువవుతున్నాయి. విద్యా వ్యాప్తిపై నాయకుల ప్రగల్భాలే తప్ప చేతల పసలేనే లేదని ఈ మధ్యే పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చీవాట్లు పెట్టింది.

ప్రభుత్వ పాఠశాలల్లో కనీసావసరాలకూ దరిద్రమేమిటని కోర్టులు చీవాట్లు పెట్టినా స్పందించడం లేదు మన నాయకులూ, ప్రభుత్వాలూ.

సర్కారీ బడుల దురవస్థ, పనికి మాలిన బోధన వాసి – నిజంగా చదువుల తల్లి పట్ల ప్రజా ప్రభుత్వాల ఘోర వైఫల్యమే అనక తప్పదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగం అభివృద్ధి కోసం ఏటా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. వాస్తవంలో విద్యా ప్రమాణాలు పాఠశాలల్లోని స్థితి గతులు, నానాటికీ తీసు కట్టుగా దిద్దేందుకు గురువుల బోధన రీతుల్ని, శిష్యుల అభ్యాస నైపుణ్యాన్ని తీర్చి దిద్దేందుకు సర్వ శిక్ష అభియాన్ కింద అనేక చర్యలు తీసుకో బోతున్నట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి చెబుతున్నారు.

మరోవైపు చేరువలో ప్రభుత్వ పాఠశాలలున్నా రోజు కూలీతో, పొట్ట పోసుకునే బడుగు జీవులు సైతం ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్న తీరు కనిపిస్తోంది. ఇంగ్లీషు మీడియం లేదనీ, కనీస సదుపాయాలకూ కొరతేననీ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేత గదులు ఊడిపిస్తున్నారనీ, పనులు

చేయిస్తున్నారనీ నిరుపేదల పిల్లలూ ప్రభుత్వ బడులకు దూరమవుతున్న ఉదంతాలు చూస్తున్నాం.

అయితే ప్రభుత్వ పాఠశాలలు పేదలకూ, మధ్య తరగతి వారికీ నిర్దేశింప పడుతున్నాయి కాబట్టి అటు నగర ప్రాంతాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటి స్థితిగతులను మెరుగు పరచడానికి ఆయా సంస్థలూ, ఆయా వ్యక్తులూ పూనుకో వలసి ఉంటుంది.

భవనాల కొరత, గదుల కొరత విషయంలో అక్కడక్కడా కొన్ని చర్యలు తీసుకో బడుతున్నాయి.

ఉపాధ్యాయుల కొరత విషయంలోనూ ఆయా పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు దగ్గర్లో ఉన్న రిటైరైన ఉపాధ్యాయుల సర్వీసును తీసుకోవచ్చును. ఇలాంటి చర్యలు కొన్ని సమస్యలకు పరిష్కారాలను చూపిస్తాయి. అయితే అందుకు చొరవ కావాలి. నిబద్ధత కావాలి. అంకిత భావం కావాలి. సేవాదృక్పథం కావాలి.

# 10. బాలలు బడి బాట పట్టే కార్యక్రమాలు - ఫలించని తీరు

బాల భారతానికి ప్రాథమిక విద్యను అందించడంలో వరుసగా ప్రభుత్వాల వైఫల్యం దేశ ప్రగతి ప్రస్థానాన్ని కుంగదీస్తోంది. అసలు రక్షణ, జాతీయ భద్రతలకు ఇచ్చినంత ప్రాధాన్యత ప్రాథమిక విద్యకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎప్పుడో తెలిపింది తన సిఫార్సుల్లో.

అయితే సార్వత్రిక విద్యావ్యాప్తి లక్ష్యాలు మాత్రం నెరవేరడం లేదు. దేశంలోని పిల్లల్లో సగం మంది, పట్టుమని అయిదేళ్లయినా చదవకుండానే పాఠశాలలకు ఎగనాగం పెడుతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో అయితే స్కూళ్లలో చేర్చిన తరువాత మూడు లేదా నాలుగు సంవత్సరాలైనా చదవకుండా బడి మానేస్తున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి.

జరుగుతున్న దేమిటంటే ఆ తరువాత పదేళ్లకు నేర్చుకున్న అక్షరం ముక్కలను కాస్తా మరచిపోతున్నారు. నిరక్షరాస్యులుగానే మిగిలిపోతున్నారు. ఒకడుగు ముందుకు వేస్తున్నామని అనుకుంటున్నారు. కాని రెండడుగులు వెనక్కి వెళ్తున్న పరిస్థితి - ఇదీ మనం సాధిస్తున్న అభివృద్ధి పథం. ఒక విధంగా చూస్తే ఇదంతా భారీ ఎత్తున సాగుతున్న మానవ వనరుల వృధా ప్రయాస అని చెప్ప వలసి ఉంటుంది.

ఏమైనా అయిదున్నర దశాబ్దాలుగా ప్రాథమిక విద్యను సార్వత్రికం చేసి నిర్బంధంగా అమలు చేయలేక పోవడం దేశానికే అవమానకరం. భారీ ఎత్తున ఎన్నో సదస్సులు జరుగుతున్నాయి. ఎన్నో తీర్మానాలు వెలువడుతున్నాయి. **2005** నాటికల్లా పాఠశాలల్లో చేరే బాలబాలికల మధ్య సమానత్వం సాధించాలని సదస్సు సూచించింది.

మరో నివేదిక ప్రకారం ఇపుడు మన దేశంలో **16** కోట్ల మంది పిల్లలు చదువుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇది సంతోషించదగిందే. మరి ఇంకా ఆరున్నర కోట్ల మంది బాలబాలికలు పాఠశాల ముఖం చూడడం లేదన్నదని తెలిస్తే బాధపడిపోతాం. ఇప్పటికే మన దేశంలో **40** కోట్ల మంది నిరక్షరాస్యులు పోగుపడి ఉన్నారు. వారంతా నిరాశా నిస్పృహల్లో ఉన్నారు. **1991-92** లగాయతు

**2001-2002** మధ్య పదేళ్ల కాలంలో అక్షరాలా రూ॥**22,000** కోట్లు ఖర్చు చేసినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. అయినా మనం లక్షించిన పథకాలు నెరవేరడం లేదు. మరో వంక నిధుల వినియోగం సక్రమంగా సాగడం లేదు.

నిరక్షరాస్యత నిర్మూలన సామాజికోద్యమంగా ఎదగ వలసి ఉంది. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు చేపట్టవలసి ఉంది. అక్షరాస్యతలో లక్ష్యాలను సాధించడానికి సామాజిక అభ్యసన కేంద్రాలను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలో అక్షరాస్యత సాధన కోసం వయోజన విద్య ఓపెన్ స్కూళ్లను ప్రారంభించింది. మరో వైపు బడిబాట పేరుతో మరో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించే వరకు ఈ కార్యక్రమాలు తోడ్పడతాయి. కానీ వారిని క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చేయడంలో ఎదురవుతున్న వైఫల్యాలను నియంత్రించడంలో జరుగుతున్నదేమిటి?

కోట్లాది రూపాయలను ఖర్చుపెడుతున్నా అక్షరాస్యత సాధనలో ఆశించిన ఫలితాలు రావడంలేదు. దీనికి మూలమేమిటో అన్వేషించాలి. పాఠశాలల్లో డ్రాపవుట్లను నిరోధించకుండా వయోజన విద్యపై ఖర్చు చేయడం వృథా ప్రయాసే.

ప్రజలను కేవలం అక్షరాస్యులనుగా మార్చడమే కాదు విద్యావంతులనుగా, విజ్ఞానవంతులనుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమం ఉంది. అది నెరవేరేదెప్పుడు?

ఏమైనా పథకాలను చిత్తశుద్ధితో అమలు చెయ్యడం అందరి ధర్మం కావాలి. అప్పుడే ఫలితాలు కనిపిస్తాయి.

## 11. ప్రాథమిక విద్యారంగలో వైఫల్యాలెన్నో!

బాలలందరికీ ఉచిత ప్రాథమిక విద్యనందించాలని రాజ్యాంగం విస్పష్టంగా పేర్కొంటోంది. అందుకు పదేళ్ల గడువును విధిస్తున్నట్లు అప్పుడు ఆదేశ సూత్రాల్లో పేర్కోవడం జరిగింది. యాభై సంవత్సరాల తరువాత దాన్ని ప్రాథమిక హక్కుగా మార్చి మరో పదేళ్లలో లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పడం ఒక విధంగా వైఫల్యాన్నే చాటినట్లవుతుంది.

అయితే మన రాజ్యాంగంలోని 45వ అధికరణం రాష్ట్రాలకు దాదాపు ఒక ఆదేశం లాందిదే. ఆ ఆర్టికల్ ప్రకారం ఆరు నుంచి పద్నాలుగేళ్ల మధ్య వయస్సుగల పిల్లలందరికీ తప్పనిసరిగా పాఠశాల విద్య గరపవలసిందే. మన రాజ్యాంగాన్ని 1949లో ఆమోదించారు. 45వ ఆర్టికల్ ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా చర్యలు తీసుకొని ఉంటే, విద్యా, విద్యారంగంలో సోవియట్ యూనియన్ తరహాలోనే మన దేశం కూడా ప్రగతిని సాధించి ఉండేది.

1917 తరువాత సోవియట్‌లు చక్కని దృక్పథంతో రూపొందించిన విధానాన్ని అనుసరించినందువల్లనే 1928 నాటికి – అంటే విప్లవానంతరం ఒక దశాబ్దానికల్లా దాదాపు తమ దేశ జనాభా మొత్తాన్ని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాయి. అంతర్యుద్ధం, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు, మరెన్నో అవరోధాలు ఎదురైనప్పటికీ వారు ప్రగతిని సాధించగలిగారు.

పిల్లలకు పకడ్బందీగా, సమగ్రంగా పాఠశాల విద్యా సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, చదువుకోవాలనే ఆసక్తిని కనబరచి పెద్దలకూ విస్తృతంగా వయోజన విద్యను సోవియట్ అందుబాటులోకి తెచ్చింది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా విద్యకు మాత్రం వారు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. విద్యాపరంగా ఆదేశం పటిష్టమైన చర్యలు తీసుకుంది.

ఇక మన దేశానికి వస్తే విద్యా రంగంలో జరిగిన కృషి అత్యల్పం. తీర్చి దిద్దవలసిన తీరులో, స్థాయిలో మన విద్యా విధానాన్ని మనం పునర్ వ్యవస్థీకరించలేక పోతున్నాం. జనాభా లెక్కల సేకరణ జరిగిన ప్రతిసారీ వెల్లడవుతున్న నిష్ఠుర సత్యమిది.

మన నాయకులు సోవియట్ యూనియన్‌నైతే దర్శించారు, స్ఫూర్తి పొందారు కాని మన దేశంలో ఇలాంటి అభివృద్ధిని సాధించడంలో విజయం పొందలేక పోయారు. ముఖ్యంగా విద్యారంగంలో.

విద్యారంగం పట్ల మన నాయకులెవరి లోనూ స్పష్టమైన దృక్పథం చోటు చేసుకోకపోవడం కడువిచారకరం.

అసలు **1960** లోనే కేంద్రం తీసుకున్న పథకానికి రెండు అంశాల ప్రాధాన్యత ఉంది. వీటిలో మొదటిది పేదరికం. ప్రజల బీదరికమే అక్షరాస్య వ్యాప్తికి ప్రధాన అడ్డంగా తయారైందని **1960**ల ప్రారంభంలోనే తేట తెల్లమైంది. స్కూలు కెళ్లే వయసులోని పిల్లల తల్లిదండ్రుల్లో పేదరికంలో మ్రగుతున్న వారే అత్యధికులు. ఏడెనిమిదేళ్లకు మించిన వయసులేని తమ పిల్లలు సైతం కుటుంబ పోషణకు పాటు పడాలని తల్లిదండ్రులు ఆదేశించేవారు.

చెల్లెళ్ల ఆలనా పాలనా చూసుకోడానికి ఆడపిల్లలను స్కూళ్లకు పంపించేవారు కాదు. పశువులను మేపుకోవడం, తదితర పనులను మగపిల్లలకు అప్పగించేవారు. పిల్లలను పాఠశాలలకు పంపేలా కొంతమంది తల్లిదండ్రులను ఒప్పించగలిగినా, ఆ పిల్లలు పాఠశాలల్లో కొనసాగేలా చెయ్యడం కష్టమయ్యేది. ఆ పిల్లల్లో అత్యధికులు (దాదాపు **60** శాతం మంది) మధ్యలోనే స్కూలు మానేసే వారు.

మన దేశంలో ప్రాథమిక విద్య విషయంలో ఎన్నో చర్యల్ని నిర్దేశించారు. వాటి అమలు తీరులో మాత్రం వైఫల్యాలే ఎదురవుతున్నాయి.

ఈ విషయంలో **1990**లోనే ప్రభుత్వం కొన్ని ప్రోత్సాహక చర్యల్ని నిర్దేశించింది. పాఠశాలలకు హాజరయ్యే బాల బాలికలకు “మధ్యాహ్న భోజన” సౌకర్యం కల్పించేందుకు సంవత్సరానికి **1500** కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చింది. దీంతో కొన్ని రాష్ట్రాలు పాఠశాలలకు హాజరయ్యే పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టాయి.

అయితే ఈ పథకం కొన్ని రాష్ట్రాల్లో సత్ఫలితాల నిచ్చింది. కొన్ని రాష్ట్రాల్లో మధ్యలోనే స్కూలు మానే “డ్రాపవుట్స్” పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.

విచారకరమైన విషయమేమిటంటే ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం సమకూర్చిన నిధులను వినియోగించుకోవడంలో ఆయా రాష్ట్రాలు విఫలమయ్యాయి.

పర్యవసానంగా ఆ గ్రాంట్లు మురిగిపోయాయి. ఇలా కేంద్ర నిధులను ఆయా రాష్ట్రాలు వినియోగించుకోలేక పోవడాన్ని ముమ్మాటికీ విద్యా రంగం నిర్వాహకుల అసమర్థతే అనక తప్పదు.

నిధులు అందుబాటులో ఉన్నా చాలా రాష్ట్రాలు, చాలా సందర్భాలలో వాటిని ఉపయోగించుకోలేక పోయాయి. ఏమైనా ప్రాథమిక విద్యారంగానికి మౌలిక సదుపాయాలు కల్పించి పరిపుష్ఠి చేయనంత కాలం అక్షరాస్యత ఎండమావే అనక తప్పదు.

## ప్రభుత్వ పాఠశాలల పనితీరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఎంత అధ్వాన్నంగా ఉందో అందరికీ తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులూ, బోధన సక్రమంగా లేకపోయినందువల్లనే తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్చడానికి ఇష్టపడతున్నారు. డబ్బును గూర్చి ఎవరూ ఆలోచించడం లేదు. ఎంత ఖర్చయినా, అప్పు చేసి అయినా తల్లిదండ్రులు అందుకు సిద్ధమవుతున్నారు.

ఇపుడు ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం, ఉత్తీర్ణతా శాతం పెంచడానికి ఎన్ని రకాలుగా శ్రద్ధ తీసుకుంటున్నా ఫలితం లేకుండా పోతున్నది. ఇందు కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అవి బూడిదలో పోసిన పన్నీరులాగా తయారవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల కోసం ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా అధికారుల, ఉపాధ్యాయుల సహకారం కొరవడటంతో ఆ పాఠశాలలు అధ్వాన్నంగా తయారవుతున్నాయి. అక్కడి ఉపాధ్యాయులు సరైన సమయానికి రాకపోవడం, ట్యూషన్లు, ఇతర సొంత వ్యాపకాల ములంగా ప్రభుత్వ పాఠశాలల్లో సరైన విద్యను అందించలేక పోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరలేక పోతున్నారు. డ్రాపవుడ్స్ బాగా ఉంటున్నాయి. మధ్యాహ్న భోజన పథకం లాంటి పథకాలకు కూడా ఆకర్షితులు కాలేక పోతున్నారు.

ఎల్.కె.జి. స్థాయి నుంచే వేలాది రూపాయలు ఖర్చుపెట్టి, తమ శక్తికి మించిన పని అయినా అంతా ప్రైవేట్ స్కూళ్ల వైపే మొగ్గు చూపుతున్నారు. ఇక ఇపుడు గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు మెరుగైన విద్యను అందిచడానికి గ్రామీణ ఆశ్రమ పాఠశాలలను నెలకొల్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందుకోసం కోట్లాది రూపాయలను ఖర్చు చెయ్యడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

ఇపుడు ప్రభుత్వం నేరుగా సెకండరీ పాఠశాలలను ప్రైవేట్ భాగస్వామ్యంతోనే నడిపిస్తామని పేర్కొంటోంది. అలా మున్ముందు విద్య ఇంక అందని ద్రాక్షగా అవతోందన్న భయం నెలకొంటోంది అందరిలో.

ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల పని తీరును మెరుగు పర్చేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నెలకొల్పే ఏ రకమైన పాఠశాలల్లోనైనా పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు తక్కువ ఫీజులతో వారికి విద్యను అందించాలి.

## ప్రాథమిక విద్యే ప్రియం

ఒకప్పుడు పదో తరగతి దాకా చదువంటే ఇంట్లో వాళ్లకి ఖర్చే తెలియదు. కాలేజీలకు వచ్చిన తరువాతే ఫీజులు వగైరాలు ఉండేవి. వీటిని కట్టలేక అప్పట్లో చాలా మంది కాలేజీ చదువులు మానేసే వారు. ఇదంతా గతం.

కాని నేడు మన దేశంలో యూనివర్సిటీ విద్యే చాలా చౌకగా ఉందనీ, ప్రాథమిక విద్య కోసం ప్రజలు భారీ స్థాయిలో ఖర్చు పెట్టాల్సి వస్తోందనీ ఈ మధ్యే యునెస్కో నిర్వహించిన సర్వేలో తేలింది. స్కూలు విద్యకు ఖర్చు పెడుతున్న దానిలో సగం కంటే తక్కువే యునివర్సిటీ విద్యకు అవుతోందనీ, అంతేకాక ఎంతో నాణ్యమైన విద్య కూడా ఇక్కడ లభిస్తోందని పేర్కొంది.

భారత్‌లో చాలా కుటుంబాలు వారి సంపాదనలో సరాసరి 28 శాతం తమ పిల్లల పాఠశాల విద్య కోసం ఖర్చు పెడుతున్నట్లు అంచనా. ఇంత పెద్ద మొత్తంలో ఫీజులు ఉండటం వల్లే, పేద కుటుంబాల్లోని పిల్లలు చదువును కొనసాగించ లేకపోతున్నారు. కానీ యునివర్సిటీ చదువుకి అవుతున్న ఖర్చు మాత్రం కేవలం 14 శాతమే అని సర్వేలో తేలింది.

"ప్రపంచ విద్య ప్రమాణాలు" పేరుతో మొత్తం 200 దేశాల్లో యునెస్కో సర్వే జరిపిన తరువాత ఒక నివేదికను విడుదల చేసింది. విద్యలో ప్రభుత్వం కంటే ప్రైవేటు భాగస్వామ్యం అధికమవుతుండడం వల్లే ఖర్చు కూడా అధికంగా పెరిగిపోయిందని నివేదిక పేర్కొంది. దీని ఫలితంగా పేద కుటుంబాలకు విద్య అందడం లేదని పేర్కొంది. వాస్తవానికి ప్రాథమిక విద్యను అందించడం ఆయా దేశాల బాధ్యతనీ, కాని భారత్‌లో మాత్రం డిమాండ్‌ను తట్టుకునేలా ప్రభుత్వ పాఠశాలలు నెలకొల్పడంలేదని నివేదిక తప్పు బట్టింది.

# 12. ప్రాథమిక విద్యలో వేరుపురుగులు

ఏ విద్యార్థి జీవితంలోనైనా ప్రాథమిక విద్య మైలు రాయి లాంటిది. ఈ కీలక ఘట్టాన్ని చాకచక్యంగా, సమర్ధవంతంగా నిర్వహించవలసి ఉంటుంది.

ఈ విషయంలో ఎంతో బాధ్యత వహించాల్సిన అధికార యంత్రాంగం తమ బాధ్యతల పట్ల ప్రశ్నలు వేసుకొని ఎన్నేళ్లయిందో బాధిత తల్లిదండ్రులకు విద్యార్థులకు కళ్లకు కడుతూనే ఉంది. పైవాళ్ల చేతకాని తనం మూలంగా విద్యా బోధనకు నిబద్ధమైన కొన్ని సంస్థల్ని మినహాయిస్తే తక్కిన చోట్ల సిలబస్ పూర్తి కాలేదని, వసతుల సరిగాలేవని! ఫిర్యాదులు వినిపిస్తుంటాయి.

ఇలా విద్యా రంగం ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటోంది. పాఠశాల విద్యారంగంలో నెలకొన్న అవ్యవస్థను చక్కదిద్దడంపై తక్షణం దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్, ముంబాయి, కేరళ, ఢిల్లీ హై కోర్టులు ప్రభుత్వాలకు సూచించాయి.

ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను తమ స్కూళ్లలో చేర్చుకోవడానికి అనుసరిస్తున్న విధానాలపై కోర్టులు అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. ప్రైవేట్ రంగంలో పాఠశాలలు పెద్ద ఎత్తున విస్తరించడంతో పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందకుండా పోతోంది.

ఈ నేపథ్యంలో పాఠశాల విద్యారంగంలోని అవ్యవస్థను చక్కదిద్దడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్, ముంబై, ఢిల్లీ, కేరళ హై కోర్టులు ప్రభుత్వాలను ఆదేశించాయి. ధనిక పేద వర్గాల పిల్లలకు వేర్వేరు పాఠశాలలు ఉండటం వంటి అనారోగ్య కరమైన సామాజిక విభజనను కొనసాగించ కూడదని పార్లమెంటు సభ్యులతో ఏర్పాటైన సంఘం కూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది.

విద్యార్థులకు కులం, మతం, ఆర్థిక వనరులు (పరిస్థితులు) తదితర అంశాలతో నిమిత్తం లేకుండా ఉమ్మడి పాఠశాల పద్ధతి (కామన్ స్కూల్ సిస్టమ్)ని అనుసరించాలని సూచించింది. ఈ సూచనల ఆధారంగానే **1968** నాటి విద్యా విధానాన్ని రూపొందించారు.

ప్రభుత్వ సహాయం పొందే ప్రైవేట్ స్కూళ్లలో ప్రతిభకు ప్రాధాన్యం యిస్తూనే నిర్దేశిత శాతంలో విద్యార్థులకు ఉచితంగా విద్యనందించాలని ఈ విధానంలో

నిర్దేశించారు.

పోతే **1986**లో రూపొందిన జాతీయ విద్యా విధానం విలువలతో కూడిన విద్య ఆవస్యకతను నొక్కి చెప్పింది.

సాంస్కృతిక భిన్నత్వం గల మన దేశంలో ప్రాథమిక స్థాయి నుంచే చిన్నారులలో సామాజిక విలువలను పెంపొందించే విద్య నందించాలని ఉద్ఘాటించింది.

నగరాల్లోని ప్రైవేట్ పాఠశాలలు ఈ మార్గదర్శకాలను పాటిస్తున్నదీ లేనిదీ పరిశీలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ నాడూ చర్యలు తీసుకోలేదు.

ఫీజులు, సౌకర్యాలు తదితర విషయాల్లో ప్రేవేట్ పాఠశాలలు బాధ్యతా రహితంగా వ్యవహరించడం తరచూ కోర్టుల దృష్టికి వస్తూనే ఉంది. పేద పిల్లలకు కొన్ని సీట్లు కెటాయించాలనీ, ఫీజుల్లేకుండా వారికి విద్యనందించడం ద్వారా ప్రైవేట్ పాఠశాలలు సమాజం పట్ల తమ బాధ్యతను నెరవేర్చాలని ఢిల్లీ హై కోర్టు తీర్పునిచ్చింది.

ప్రాథమిక విద్యకు సంబంధించి ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేస్తూ ఆంధ్ర ప్రదేశ్ హై కోర్టు ఆ మధ్య ఘాటైన వ్యాఖ్యాలూ చేసింది. “ఆరోగ్యం, విద్య – రాజ్యాంగంలోని మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రతి వ్యక్తికీ ప్రాథమిక విద్యను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే – ఈ పని చేయలేకపోతే వైదొలగండంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించింది.

ఢిల్లీ, ముంబాయి, హైదరాబాద్ లాంటి నగరాలలో గడచిన కొద్ది సంవత్సరాలుగా ప్రైవేట్ పాఠశాలలు బాగా విస్తరించాయి. పర్యవసానంగా పేద కటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య దూరమవుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రైవేట్ పాఠశాలలు అనుసరిస్తున్న పద్ధతులు వివాదాస్పద మవుతున్నాయి. విద్యార్థులను చేర్చుకునేటప్పుడు పాటించవలసిన మార్గదర్శకాలు ఆ పాఠశాలల యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరు ఎంతో బాధాకరంగా ఉంటున్నాయి.

మార్కుల ఆధారంగా విద్యార్థులను విభాగాల వారీగా విభజించడం, కొన్ని పాఠశాలల్లో ధనిక కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉదయం, పేద కుటుంబాల నునిచి వచ్చే విద్యార్థులకు సాయంత్రం తరగతులు నిర్వహినిచడం వంటి అంశాలు భారత రాజ్యాంగానికే అవమానకరం.

ముఖ్యంగా ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలపై ప్రభుత్వానికి నియంత్రణ లేకుండా పోతున్నది. ఢిల్లీ, ముంబాయి, హైదరాబాద్ నగరాల్లో ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు చేసే వారికి భూమి కేటాయింపు, నీటి సరఫరా, ఆస్తి పన్ను వంటి విషయాల్లో ప్రభుత్వ రాయితీలను కల్పిస్తున్నాయి.

మరి ఈనాడు ప్రభుత్వ పాఠశాలలు తీరు ఎలా ఉంటోంది? ఎన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్వంత భవనాలున్నాయి? వసతులేమైనా ఉంటున్నాయా? త్రాగు నీటి వసతి, మరుగుదొడ్ల వసతి ఉంటున్నాయా? పేద పిల్లల చదువులన్నీ శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. చెట్ల కింద కొనసాగుతున్నాయి.

ప్రభుత్వాల సవతి ప్రేమే ఇందుకు కారణం. విద్యారంగంపై నియమించిన కమిటీల్లో విధాన పరమైన చర్చల్లో ఈ అంశాలు ఎప్పుడూ ప్రస్తావనకు వస్తూనే ఉంటాయి. కాని అవి అమలులోకి రావు. నిరుపేద పిల్లలకు ఆసరా మధ్యాహ్న భోజన పథకం. మరి ఆ మధ్యాహ్న భోజన పథకం నడుస్తున్న తీరు అయోమయం, అగాధం!

## అర్ధాకలితో బాలబాలికలు

పేద పిల్లల్లో చదువు పట్ల ఆసక్తి కలిగించి వారిని చదువుకునేలా చేయడానికి, వారికి కొంత మేరకు పౌష్ఠిక ఆహారాన్ని అందించ గలిగే సదుద్దేశంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టారు. మధ్యాహ్న భోజన పథకం పేద పిల్లలకు ఒక పూట తిండి పెట్టే పథకం. ఇపుడు ఈ పథకం అమలులో జరుగుతన్న వింత పోకడలను కూడా చూస్తున్నాం.

రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం **2003** జనవరి **2**వ తేది నుండి అమలు జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా **72,829** పాఠశాలల్లో **73** లక్షల మంది విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారు. ఈ పథకం సజావుగా సాగడానికి అనువైన పరిస్థితులు చాలా పాఠశాలల్లో లేవు. సమయానికి సరుకులందవు. దీని కోసం ప్రత్యేకంగా వంట గదులు, చాలి నంత సిబ్బంది ఉండదు. వంట ఒక చోట – సరఫరా మరొక చోట.

వేలాది పాఠశాలలకు త్రాగు నీటి వసతి లేదు. గ్యాస్ కనెక్షన్లు మంజూరు కాలేదు. ఇపుడు మధ్యాహ్న భోజన పథకం అధ్వాన్న భోజన పథకంగా మారిపోయింది. ఈ పథకం ఎక్కువగా దుర్వినియోగమవుతోంది. పసివాళ్లకంద

వలసిన పదార్థాలు పరుల చేతుల్లో పోతున్నాయి. ఇది ఎంతేనీ సిగ్గుచేటు.

ఏమైనా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువు నాసిరకంగా ఉంటోంది. ప్రభుత్వ పథకాలు కొన్ని సరిగ్గానే ఉన్నా వాటి అమలులో అన్నీ లొసుగులే. పోతే 1986 నుంచి ఈ పథకం కొంత మార్పుకు గురైంది. ఆ మార్పు ఏమిటంటే ఆహారాన్ని వండి వడ్డించడానికి బదులు ఒక్కొక్క విద్యార్థికి 3 కి॥ బియ్యం నెలనెలా ఇవ్వడం. ఇందులో విద్యార్థి పాఠశాలకు హాజరు శాతం 80కి తగ్గకుండా ఉండడం తప్పనిసరి చేసింది ప్రభుత్వం.

ఈ పద్ధతి వల్ల కొన్ని ప్రయోజనాలతో పాటు కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. బడిలో చేరే బాలల సంఖ్య పెరిగింది. విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. కాని పోషకాహార లక్ష్యం దెబ్బతింది.

3 కి॥ల బియ్యం విద్యార్థి కుటుంబానికి మొత్తంగా వినియోగించ బడటం వలన ఆశించిన ఫలితం బాలలకు అందలేదు. సరఫరా చేసే బియ్యం కొత్తవి, ముతకవి కావడంతో విద్యార్థులలో 20 శాతం మంది ఈ భోజనం తినడానికి ఇష్టపడలేదు. కొందరు పిల్లలు ఆహారం వద్దని పరిగెత్తారు కూడా. అలాంటి వారిలెక్కను తప్పుగా చూపి ఆ సొమ్ముతో విద్యార్థులకు పోషకాహారం అందించిన ఉపాధ్యాయులున్నారు. ఇది కొంత మేరకు హర్షించదగిందే.

ఇక ఈ మధ్యాహ్న భోజన పథకం పౌష్ఠికాహారాన్ని అందించే పథకం విజయవంతం కావడానికి కొన్ని చర్యలు చేపట్టారు. మధ్యాహ్న భోజన పథకంలో వారానికి రెండు సార్లు విధిగా గుడ్డు ఇవ్వాలనీ, తక్కిన దినాలలో కాయ గూరలు, ఆకు కూరలు మొదలైన వాటితో మెనూ నిర్ణయించుకొని అమలు చేయాలని ఆదేశం జరిగింది.

## పౌష్ఠి కాహారమేదీ?

బాలబాలికలకు మధ్యాహ్న భోజన పథకంలో పౌష్ఠికాహారం అందించాలని ప్రభుత్వ ధ్యేయం. ప్రభుత్వం వీటి అదనంగా చెల్లిస్తోంది. మొత్తంలో వారానికి రెండు కోడి గుడ్లు పెట్టడం తప్పనిసరి. కొన్ని చోట్ల ఒకటే ఇస్తున్నారు. కొన్ని చోట్ల అసలే లేదు. ఇచ్చిన పట్టిక ప్రకారం వంటలు వండడం లేదు. ఉడికీ ఉడకని అన్నం. చాలీ చాలని అన్నం. నీళ్ల సాంబారు - అందులో కూరగాయల ముక్కలుండవు.

ఎక్కడో వండి పాఠశాలలకు సప్లై చేస్తున్నారు. అలా సమయానికి పిల్లలకు వంటకాలు అందడం లేదు. వండే చోట పరిసరాలు శుభ్రంగా ఉండవు. కాగా ఉపయోగించే నీరు చాలా చోట్ల అపరి శుభ్రంగా ఉంటోంది.

కొన్ని చోట్ల హాజరు శాతం తక్కువగా ఉన్నా ఎక్కువ చూపి కాజేస్తున్నారు. ఇలా పసి పిల్లలకు చెందాల్సినవి కూడా సరిగా చెందడం లేదు. ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. సరియైన పర్యవేక్షణ లేకపోవడం ఇందుకు మూల కారణం.

ఏమైనా ఈ పథకం ఈనాటికీ సజావుగా సాగడం లేదన్నది నిష్ఠుర సత్యం. పౌష్ఠికాహారలేమితో బాలలు సరిగా విద్యను అభ్యసించక పోవడం, రక్త హీనతతో అనేక విధాల అనారోగ్యాల బారిన పడటం – నిరాశ నిస్పృహలతో విద్యార్థులు నీరస పడిన విద్యార్థులు బడికి వచ్చినా సరిగా చదవలేక పోతున్నారనడం ఎంతేనీ నిజం.

చివరికి ఇప్పుడు సాంబారుతోనే సరిపుచ్చుకో వలసి వస్తోంది. ఇలా సాంబారుతో తినే పిల్లలు బలిష్ఠంగా ఎలా ఉంటారు? వారి చదువులు సజావుగా ఎలా సాగుతాయి?

విద్యకు పునాది అయిన ప్రాథమిక విద్యా రంగం బాగు పడితేనే మనం ముందుకు వెళ్ల గలుగుతాం. కాగా అన్ని రంగాల్లో విస్తరిస్తున్న అవినీతి పాతిపెట్ట బడనంత వరకు మన ప్రగతికి అన్నీ ఆటంకాలే!

# 13. అక్షరాస్యత సాధనలో పెరుగుతున్న వెనకబాటుతనం

కేంద్రం సంపూర్ణ అక్షరాస్యతను సాధించడానికి అనేక పథకాలను చేపట్టి కోట్లాది రూపాయల నిధులను ఖర్చుపెడుతోంది. అయితే ఈ పథకాల అమలు పట్ల ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తున్నా అక్షర జ్ఞానం అంటే కేవలం సంతకం పెట్టే స్థాయికి వ్యక్తిని తీసుకురావడమన్న ప్రమాణానికి అనుగుణంగా సాగుతున్న అక్షరాస్యతా కార్యక్రమం వల్ల ప్రజలకు ఒరిగేదేమైనా ఉందా?

ప్రపంచ స్థాయిలో మన అక్షరాస్యతా కార్యక్రమాలు గుర్తింపు పొందుతున్నాయా? అన్ని రంగాలతో పాటు విద్యా రంగంలో కూడా భారత్ ముందుకు దూసుకుపోతోందని పాలకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్షరాస్యత సాధనలో మరే ఇతర దేశాలకు మనం తీసిపోమని గొప్పలు చెబుతున్నారు.

అసలు అక్షర జ్ఞానం అంటే సంతకాలు చేయడమా? లేక పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని సముపార్జించడమా? అక్షరాస్యత గుర్తింపుకు అయిదు దశాబ్దాల క్రితం నెలకొల్పిన ప్రామాణికాలు ప్రస్తుత పరిస్థితులకు సరిపోతాయా? ఈ ప్రామాణికాలను పున సమీక్షించాల్సిన ఆవశ్యకత ఉందా? అన్న అంశాలపై జాతీయ స్థాయిలో విస్తృత ప్రాతిపదికన చర్చలు జరుగుతున్నాయి.

అయితే అన్ని రంగాల్లో ప్రపంచం ఎంతో ముందుకు సాగిన ప్రస్తుత తరుణంలో అక్షరాస్యత శాతాన్ని గుణించేందుకు మన రాష్ట్రంలో పాటిస్తున్న ప్రామాణికాలను పరిగణనలోకి తీసుకుంటే విద్యాధికులు సైతం ముక్కు వేలు వేసుకోవలసిన పరిస్థితి నెలకొంది.

దేశానికి కొత్తగా స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో భూస్వాములు, కామందులు సైతం వేలిముద్రలకే పరిమిత మయ్యారు. రిజిస్ట్రేషన్లు, బదలాయింపులు, కొనుగోళ్లు, విక్రయాలలో వేలిముద్రలు వాడడాన్ని ఆత్మ న్యూనతగా భావించారు. కనీసం తెలుగులోనైనా వారి పేర్లు వారు రాసుకుంటూ సంతకాలు నేర్చుకుంటే చాలని, వారితో పాటు ప్రభుత్వం కూడా భావించింది. తెలుగు అక్షర మాలలోని అక్షరాలను నేర్పితే ప్రతి ఒక్కరూ చదువరులవుతారని అక్షరాస్యత సాధించినట్లేనని నిర్ణయించింది. తమ సంతకం తాము చేయగలిగిన ప్రతి వారిని అక్షరాస్తులుగా

గుర్తించాలని, అది కూడా చేతకాని వారిని నిరక్షరాస్యులుగా పరిగణించాలని భావించింది.

ఆనాడు అక్షరజ్ఞానం ఉంటే చాలు అక్షరాస్యుడేనని చేసిన నిర్ణయం ప్రస్తుత సమాజ వాతావరణంలో సరిపోతుందా? ప్రపంచ వ్యాప్తంగా విజ్ఞానంతో పాటు విజ్ఞాన పిపాస, విద్య అవసరం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో దీన్నే ప్రామాణికంగా పరిగణించి అక్షరాస్యత శాతాన్ని నిర్ణయించడం సమంజసమేనా అన్న ప్రశ్నలు కొత్తగా తలెత్తుతున్నాయి. సంతకం నేర్పి, తమ సంఖ్యలో కలుపుకుని అంతటితో సరిపెట్టే అక్షరాస్యతా ఉద్యమాలు సత్ఫలితాలనివ్వలేవు. వేగంగా పరిగెడుతున్న ఇతర సమాజాలతో సమానంగా మన సమాజం పరిగెట్టేందుకు అవకాశం కల్పించలేవు.

ప్రభుత్వం ఇప్పటికైనా అక్షరాస్యుల గుణింపుకు ప్రామాణికాలను పునర్ సమీక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కనీసం ఇంటర్ వరకైనా చదివిన వారిని మాత్రమే అక్షరాస్యులుగా గుర్తించాల్సిన అవసరం ఉంది.

అందువల్ల ప్రతి ఒక్కరిని ఇంటర్ వరకైనా చదివించడం, లేదా చదివే విధంగా ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వం చేపట్టాలి.

ఈ మధ్య యునెస్కో నివేదిక చెప్పిందిలా

- ప్రపంచంలో **7.3** కోట్ల మంది చిన్నారులు అసలు పాఠశాల ముఖమే చూడలేదు. పాఠశాలలో చేరే వయస్సున్న ప్రపంచంలోని మొత్తం చిన్నారుల్లో వీరు **10** శాతానికి సమానం.అయితే వీరి సంఖ్య గత దశాబ్ద కాలంలో **9.6** కోట్ల నుంచి **7.2** కోట్లకు తగ్గింది.

- బడికి వెళ్లే బాలికల సంఖ్య గతంలో పోలిస్తే గూనీయంగా పెరుగుతోంది. ప్రపంచంలో ప్రస్తుతం ప్రతి **100** మంది అక్షరాస్యులైన పురుషులకు **89** మంది అక్షరాస్య మహిళలున్నారు. అదే ఆసియా దేశాల్లో ప్రతి **100** మంది అక్షరాస్య పురుషులకూ **67** మందే అక్షరాస్య మహిళలున్నారు.

- ప్రపంచంలోని అక్షరాస్యుల్లో మూడొంతుల మంది కేవలం **15** దేశాల్లోనే ఉన్నారు. అది అధిక జనాభా కలిగిన భారత్, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్,

ఇండొనేషియాలాంటి దేశాల్లో.

- ఆశియా దేశాల్లో ప్రాథమిక పాఠశాలల్లో చేరే విద్యార్థులు **22** శాతం పెరిగారు.

- అసియా దేశాల్లో ప్రాథమిక పాఠశాలల్లో చేరిన వారిలో **78** శాతం మంది ఉన్నత విద్య వరకూ చదువుతున్నారు.

- **2015** కల్లా సంపూర్ణ అక్షరాస్యత సాధించాలంటే **1.8** కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరమవుతారు.

## “అందరికీ విద్య” లక్ష్య సాధనకై

ఈ మధ్య “అందరికీ విద్య” కార్యక్రమంపై జరిగిన అన్ని చర్చల్లో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ కూడా పాల్గొన్నారు. **2015** వరకు సాగనీయకుండా **2010** సంవత్సరానికే “అందరికీ విద్య” లక్ష్యాన్ని సాధించగలమని ఆమె ఉద్ఘాటించారు.

కాగా ఇటువంటి ఉదాత్త కార్యక్రమాల అమలులో రాజకీయాలకు అతీతంగా అన్ని రాష్ట్రాలు స్వచ్ఛందంగా స్పందించవలసి ఉంటుంది. పథకం అమలులో కేంద్రం తన వంతు పాత్ర పోషించవలసి ఉన్నా ప్రధాన బాధ్యతలన్నీ రాష్ట్ర ప్రభుత్వాల భుజస్కంధాలపైనే ఉంటాయి. రాష్ట్రాలు అవలంభిస్తున్న ఉదాసీన వైఖరి కారణంగా సంపూర్ణ అక్షరాస్యత సాధనలో ఆరుదశాబ్దాలుగా విఫలమవుతున్నాం. ప్రణాళికల వ్యూహరచనలో రాష్ట్ర ప్రభుత్వాలకు భాగస్వామ్యం లేక పోవడం సమస్యకు ఒక పార్శ్వమైతే, ప్రారంభించిన పథకాలను సక్రమంగా ముందుకు తీసుకు వెళ్లడంలో అవి విఫలమవడంలో పార్శ్వం.

కొన్నేళ్లుగా రాష్ట్రాలు అమలు చేయాల్సిన పథకాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇలా పెరిగిపోతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి తగిన పనితీరును అధికార యంత్రాంగాలు అలవర్చుకోలేదు. అవసరమైన మార్పులు చోటు చేసుకోవడం లేదు. కార్యక్రమాల విస్తరణ పైనే దృష్టి కేంద్రీకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు - వాటిని సమర్ధవంతంగా అమలు చెయ్యడానికి కావలసిన అధికారాలను పంచాయతీలకు, ఇతర మున్సిపల్ సంస్థలకు బదలాయించడం లేదు. అందుకే పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి.

అక్షరాస్యత వంటి పథకాల అమలులో రాష్ట్రాలు విజయవంతంగా ముందడుగు వేయాలంటే, పంచాయతీలకు స్థానిక సంస్థలకు ముందుగా అధికారాలను బదలాయించవలసి ఉంటుంది. గ్రామ పంచాయతీలకు, పట్టణ, నగరాలలోని స్థానిక సంస్థలకు అధికారాల బదలాయించకపోతే ప్రస్తుత పరిస్థితులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటాయి.

## 14. ప్రభుత్వ పాఠశాలలను గూర్చి ప్రజలేమనుకుంటున్నారు?

ఈనాటి పాఠశాలల - ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల తీరు పట్ల, ప్రజల అభిప్రాయం ఎలా ఉంటోంది? ఈ నాటి ప్రాథమిక పాఠశాలలు పని చేస్తున్న తీరు పట్ల, ప్రభుత్వం వాటికి కల్పిస్తున్న వసతి సౌకర్యాల తీరు పట్ల ప్రజలు ఎలా స్పందిస్తున్నారు? అనే విషయానికి వస్తే మనకు ఒక విధంగా భయం వేస్తుంది. ఆందోళనను రేకెత్తిస్తుంది.

అందుకు ఆంధ్ర ప్రభ, తేదీ 24.10.2007 సంచికలో ప్రజాగళమ్ శీర్షికన, ఇవి పాఠశాలలేనా? పేరిట ప్రచురితమైన ఈ ఉత్తరమే సాక్ష్యం.

### ఇవి పాఠశాలలేనా?

ప్రభుత్వ పాఠశాలలు మౌళిక వసతులు లేక హీన స్థితిలో కొట్టు మిట్టాడుతున్నాయి. జగద్గిరిగుట్టలోని రిక్షాపుల్లర్స్ కాలనిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 1 నుండి 10వ తరగతి వరకు నిర్వహించబడుతున్నాయి. మొత్తం విద్యార్థులు 930 మంది వరకు ఉన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం ఇద్దరే. నిజానికి ప్రాథమికస్థాయిలో తరగతికి ఒకరిచొప్పునైనా కనీసం ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలి. అలాగే ఉన్నత పాఠశాలలో కనీసం ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఒక తెలుగు పండిత్, ఒక హిందీ పండిత్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్, ఒక పిటిఎఫ్ ఉండాలి. కానీ అక్కడ మాత్రం ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు, సుమారు పదిమంది విద్యా వాలంటీర్లతో ఆ పాఠసాల కొనసాగుతోంది. ఎలాంటి ఆటస్థలం లేదు. బాలికలకు మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక్కడ కేవలం ఇద్దరు మాత్రమే ట్రైన్డ్ ఉపాధ్యాయులు ఉన్నారంటే విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించవచ్చు.

అలాగే వెంకటేశ్వరనగర్ కాలనీలో మరో ప్రభుత్వ పాఠశాల. ఇది ప్రాథమిక పాఠశాల. 1 నుండి 5 తరగతులు కొనసాగుతున్నాయి. అయితే నిజానికి ఒక్క ప్రభుత్వ ఉపాధ్యాయుడూ లేడు. గత్యంతరం లేని పరిస్థితులలో ఆల్విన్ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఒక ఉపాధ్యాయురాలు డిప్యూటేషన్‌పై ఇక్కడ విధులను నిర్వర్తిస్తున్నారు. మొత్తం విద్యార్థులు 148 మంది. అయితే ప్రభుత్వం

ఇద్దరు విద్యావాలంటీర్లను కేటాయించింది. తరగతికి ఒక్కరు ఉపాధ్యాయులైనా కనీసం ఇద్దరి కొరత ఉంది. ఎలాంటి మూత్రశాలలు లేక పిల్లలకు, ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయి. పాఠశాలలలోనికి వచ్చే గేటు ముందే చెత్తా, చెదారం పేరుకుపోయి తీవ్ర దుర్గందాన్ని వెదజల్లుతుంది. దీంతో పలువురు విద్యార్థులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అయినా సంబందిత అధికారులు ఇటువైపు కన్నెత్తైనా చూడకపోవడం విశేషం.

ఇవీ మన ప్రభుత్వ పాఠశాలల దుస్థితి

# 15. మానవీయ విలువలు

ఏ రంగాన్ని తీసుకున్నా ఇపుడు నానాటికీ మానవ విలువలు దిగజారిపోతున్నాయి. అడుగడుగునా మానవ విలువలకు పాతర వేయబడుతూన్నది. ఆయా రంగాలలో పని చేసే వారందరిలోనూ ఇలా మానవ విలువలు లుప్తమైపోతున్నాయి. మనిషి ఈనాడు మంచి, చెడు – నీతి, నిజాయితీ, పాపభీతి అనే మాటల్ని మరచిపోతున్నాడు. ఇంగిత జ్ఞానాన్ని కోల్పోతున్నాడు. ఇతరులను ఎదటివారిని గూర్చి ఆలోచించే తీరును, అందరి క్షేమాన్ని గూర్చి ఆలోచించే తీరును, ధర్మాన్ని మరచిపోతున్నాడు.

కేవలం డబ్బును గూర్చే ఆలోచిస్తున్నాడు తప్ప ధర్మాన్ని గూర్చి ఆలోచించడం లేదు. స్వార్థంలో మునిగిపోయి ధర్మాన్ని మరచిపోతున్నాడు. ఇక అవినీతి అంతటా రాజ్యమేలుతోంది. స్వార్థం విలయ తాండవం చేస్తోంది. ఈ శక్తులు బలీయంగా పని చేస్తూండడంతో మనిషి విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతున్నాడు. మనిషిలో ఆలోచనా తీరు కుంటుపడుతోంది.

ప్రభుత్వోగులు ఉద్యోగాల్లో చేరే ముందు అంతా నీతిమంతులే – ఉద్యోగాల్లో చేరిన తరువాత అన్నీ మరచి పోతున్నారు. ప్రక్క వాడిని చూసి చెడును నేర్చు కుంటున్నాడే కాని వారు నడిచేది చెడ్డ దారి అనీ, దానిని త్యజించాలనీ మంచి దారిని ఎంచుకోలేక పోతున్నాడు. నలుగురితో పాటు నారాయణ అనే నిర్ణయానికి వస్తున్నాడు. తానూ మంచి దారిలో నడుస్తూ నలుగురిని మంచి దారిలోకి మళ్లించలేక పోతున్నాడు.

తన ఆలోచనలకు పదును పెట్టి అన్యాయంపై, అవినీతిపై పోరాటానికి పూనుకోలేకపోతున్నాడు.

ఈ సమాజం ఇలా కుళ్లిపో వలసిందేనా? ఈ అవినీతికి అంతం అనేది లేదా? అవినీతి నిర్మూలనలో మనం కొంచెమైనా పాలుపంచుకోలేమా?

మరి తీక్షణంగా పెరిగిపోతోన్న అవినీతికి అడ్డుకట్ట వేయాలంటే, అన్యాయాన్ని అరికట్టాలంటే మనం ఏం చెయ్యాలి? తరిగి పోతోన్న మానవీయ విలువలు పునరుద్ధరింపబడాలంటే ఇపుడేం జరగాలి?

లంచాల జాడ్యం పెరిగిపోతోన్న ఈ తరుణంలో లంచాలు తీసుకున్న వారిని పట్టుకొని శిక్షిస్తే లంచాల జాడ్యం సమసిపోతుందా?

వారిలో నీతి, నిజాయితీ, సత్ప్రవర్తనకు సంబంధించన జ్ఞానోదయం కలగాలి. ధర్మం, న్యాయం, ప్రేమ, నీతి, నిజాయితీల పట్ల అవగాహన కలిగించాలి. ఇలాంటి గుణాలు గొప్ప సంపదలనీ, ఈ సంపదలను కైవసం చేసుకోడానికి అంతా ప్రయత్నం చెయ్యాలనీ తెలుసుకో గలుగాలి.

ఇలాంటి సుగుణాలు మనష్యుల్లో నెలకొనాలంటే వీటికి సంబంధించిన బీజారోపణ చిన్ననాడే జరగాలి. ఏ విషయమైనా పిల్లల లేత మనస్సుల్లోనే బాగా నాటుకుపోతుంది. చిన్నప్పుడే పిల్లల్లో సత్ప్రవర్తనకు సంబంధించి, నీతి, నిజాయితీ, పాపభీతికి సంబంధించన విషయాలు నాటుకునేలా చెయ్యాలి. ఇలా చిన్నప్పుడే పిల్లల్లో నాటుకుపోయిన సుగుణాలు క్రమంగా వారిలో వెల్లి విరుస్తుంటాయి. జీవితంలో వారిని మార్గదర్శకులనుగా తయారు చేస్తాయి. అలా ఎదిగిన వారు లోక కళ్యాణం కావించడానికి ఎప్పుడూ సిద్ధపడతారు.

చిన్నప్పుడే పిల్లల చేత గొప్పవారి, మహానుభావుల, ఆదర్శ పురుషుల జీవిత చరిత్రలను చదివించాలి. నీతి, నిజాయితీకి సంబంధించిన కథలను వినిపించాలి. అందులో నీతి సారాన్ని వారికి ఒంట బట్టించాలి. ఇపుడు అంతా అనుభవిస్తున్నది నిజమైన జీవితం కాదనీ, నీతి, నిజాయితీలతో కూడుకున్న జీవితం ఇలా ఉంటుందనీ తెలియజెయ్యాలి. నైతిక విద్యను పాఠ్యాంశంగా చేర్చాలి.

సమాజంలో నీతి, నిజాయితీలు నెలకొన్నప్పుడే సమాజంలో ప్రశాంతత నెలకొంటుందనీ, ప్రశాంతమైన సమాజంలో అంతా ప్రశాంతంగా జీవించగలుగుతారనీ తెలియజెయ్యాలి.

నైతిక విద్య, అంటే నీతికి సంబంధించి అంశాలను ప్రాథమిక స్థాయిలోనే సిలబస్‌లో చేర్చాలి.

## 16. పిల్లలను సత్ప్రవర్తనగా తయారు చెయ్యడంలో తల్లిదండ్రుల పాత్ర

ప్రజల సంక్షేమం కోసం పాటు పడతామనీ, ప్రజలకు న్యాయాన్ని చేకూరుస్తామనీ రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవీ బాధ్యతలను చేపట్టిన నాయకమణులే అక్రమాలకు, అక్రమ ఆర్జనకు, దౌర్జన్యాలకు పూనుకుంటూ ఉంటే ఎలా ఉంటుందీ సమాజం?

ఎలా ఉంటుంది? కంచెయే చేను మేసి నట్లుంటింది. అరవై సంవత్సరాల స్వతంత్ర భారతంలో సామాన్యులు, పేదలు తమకు అందవలసిన సంక్షేమం అందకపోవడంతో నిరాశ, నిస్పృహలకు గురి అవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఫలితాలు మాత్రం అలాగే ఉంటున్నాయి. ఇక నైనా మా బ్రతుకులు బాగుపడతాయేమో!నని గంపెడాశతో ఎదురుచూస్తున్న పేదలకు, సామాన్యులకు మాత్రం నిరాశే ఎదురవుతోంది.

ప్రజల సంక్షేమం కోసం కేటాయించబడుతూన్న నిధులు ప్రజల కోసం ఖర్చు పెట్ట బడడం లేదు. అవి మధ్యలోనే నాయకుల చేతుల్లోకి దళారుల చేతుల్లోకి, ప్రభుత్వాధికారుల చేతుల్లోకి పోయి చివరికి ప్రజలకు అందకుండాపోతున్నాయి. అలా ప్రజల కోసం కేటాయించిన నిధులు ప్రజల కోసం ఖర్చు పెట్టబడడం లేదు. ప్రజల కోసం కేటాయించబడ్డ నిధుల్లో కేవలం 15 శాతం వరకైనా ప్రజల కోసం ఖర్చు పెట్టబడడం లేదంటే ఇంతకు మించిన అన్యాయం మరెక్కడైనా ఉంటుందా?

రాజకీయ రంగంలో అవినీతి, అధికార్లలో, ఉద్యోగుల్లో అవినీతి, చివరికి కార్యాలయాల్లో పనిచేసే కర్మచారుల్లో కూడా అంతులేని అవినీతి చోటు చేసుకుంటోంది. అంతు లేకుండా పోతోన్న ఈ దోపిడీకి కింది నుండి పై స్థాయి వరకు అంతా బాధ్యులే - అంతా దేశ సంపదను దోచేస్తున్నారు. మూకుమ్మడిగా ఈ దేశ సంపదను కొల్లగొడుతున్నారు. చివరికి సామాన్యులకు చెందకుండా చేస్తున్నారు.

అలా ఈనాడు సమాజంలో అసమానతలూ పెరిగిపోతున్నాయి. ఉన్నవారు మరీ ఎదిగి పోతుంటే లేని వాడు మరీ ఏమీ లేనివాడుగా మారిపోయి పట్టెడన్నం కోసం పరుగులు తీస్తున్నాడు. ప్రభుత్వాల అభివృద్ధి లెక్కలు మాత్రం కాగితాలకే

పరిమితం అవుతున్నాయి.

డబ్బు, పలుకుబడి, బలం ఉన్నవాడికే సమాజంలో జీవించే హక్కు ఉందా? అనేంతటి స్థితికి ఈనాడు చేరుకున్నాం. ఈనాడు రౌడీలదే రాజ్యమా? అనేంతటి స్థితికి చేరుకున్నాం. నీతి, నియమాలను ప్రజలు ఎప్పుడో మరచిపోయారు. న్యాయానికి, ధర్మానికి, నీతికి ఎప్పుడో పాతర వేశారు. క్రమ శిక్షణ అంటే ఏమిటో ఎవరికీ తెలియకుండా పోతోంది.

ఇలా రోజు రోజుకూ కుళ్లిపోతోన్న సమాజానికి బాగుపడే లక్షణాలులేవా? ఈ సమాజాన్ని బాగుచేసే మందే లేదా? ఈ సమాజం ఇలా ఎందుకవుతోంది?

వీటన్నింటికీ నాకు ఒకే కారణం స్ఫురిస్తోంది. ఈనాటి తల్లిదండ్రులు తమ పిల్లలను సక్రమ మార్గంలో, నీతి నియమాలతో పెంచక పోవడమే అని అనక తప్పదు. తల్లిదండ్రులు తమ పిల్లలను సంపద మంతులనుగా తయారుచెయ్యాలను కుంటున్నారే గాని సంస్కారవంతలను చేద్దామనే సదాలోచనకు రావడం లేదు. ఈ ప్రపంచంలో జీవించాలంటే డబ్బే ప్రధానం - డబ్బు లేనిదే మనం దేనినీ సాధించలేం అనే నిర్ణయాలకు వస్తున్నారు. డబ్బు సంపాదనలో నీతి, నియమాలకూ, న్యాయాన్యాయాలకూ తావివ్వడం లేదు. మనం చేసే ప్రతి పనినీ మన పిల్లలు అనుకరిస్తారనీ, మన మూలంగా వారూ చెడు దారి పడతారనే దూరదృష్టి ఈ నాటి తల్లిదండ్రుల్లో కొరవడుతోంది. అక్రమార్జనతో తమ పిల్లల్ని బాగా చదివిస్తున్నారు. వారూ పెట్టుబడికి తగ్గట్లుగా సంపాదించాలనే నిర్ణయాలకు వచ్చేస్తున్నారు. అలా తల్లిదండ్రులతో పాటు పిల్లలు కూడా ధనమే మూలం అనే నిర్ణయాలకు వచ్చి వారూ అలాగే మెదులుతున్నారు.

ఒక గాంధీ, ఒక నెహ్రూ, ఒక లాల్ బహదూర్, ఒక గుల్జారీలాల్ నందా, ఒక వివేకానందుడు, ఒక వినోబా భావే, ఒక మదర్ థెరిస్సా వీరంతా కేవలం డబ్బే ప్రధానమని అనుకుంటే ఇంతటి గొప్పవారు అయ్యేవారేనా?

సమాజమే మనం - మనమే సమాజం అనుకొని నీతి, నియమాలకూ, ధర్మానికీ, కట్టుబాట్లకూ కట్టుబడి ఉన్నారుకాబట్టే వారు ఇంతటి గొప్పవారయ్యారు. వారంతా సమాజం శ్రేయస్సు, మానవ శ్రేయస్సునే కోరుకున్నారు కాబట్టే ఇంతటి మహనీయులుగా పేర్కొనబడుతున్నారు.

వీరంతా ఒక ధర్మ బద్ధమైన, నిజాయితీతో కూడుకున్న,

అహింసాయుతమైన, ప్రేమ పూరితమైన, న్యాయబద్ధమైన సమాజాన్ని నిర్మించడానికి పాటు పడ్డారు. వారు జీవితాంతం నిష్కల్మషంగా మెదిలారు.

ఏమైనా ఈనాటి తరాన్ని మాత్రం చెడుమార్గం గుండా పయనించకుండా అరికట్టవలసి ఉంది. వారిని కేవలం చదువుకున్న వారిని మాత్రమే కాకుండా సంస్కార వంతులనుగా తయారు చెయ్యవలసి ఉంది.

# తల్లిదండ్రులూ! పిల్లలకోసం కొంత సమయాన్ని వెచ్చించండి

అమ్మ ఒడి నుండి మొదలైన బాల్యం పాఠశాల ప్రాంగణంలో మొగ్గ తొడుగుతుంది. కీలకమైన ఈ రెండింటి మధ్య ఇపుడు ఎంతో అంతరం పెరుగుతోంది. ఇలా పెరుగుతున్న అంతరం పిల్లలు చెడు మార్గం పట్టేందుకు అవకాశా లుంటున్నాయి.

ఇటీవల కాలంలో పిల్లల్లో పెరిగిన ఒత్తిడి దీనికంతటికీ ప్రధాన కారణం. అయితే ఈ ఒత్తిడిని ఎలా తట్టుకోవాలనేది వారికి అర్థమయ్యేలా తల్లిదండ్రులు చెప్పవలసి ఉంటుంది. అలా చెప్పక పోవడం వల్లనే పిల్లలు అగాధంలోకి నెట్టివేయబడుతున్నారు. వారిని ఒంటరిగా వదిలి వేయడం మరింత దారుణం.

పిల్లల మనో బీజంలో పడిన స్పర్థలు వికృతంగా మారి పగ, ప్రతీకారం వింత పోకడలకు ప్రేరేపిస్తున్నాయి. మార్కుల మోజులో ఇవన్నీ గుర్తించని తల్లిదండ్రులు, విషయం తెలుసుకునే లోపు పరిస్థితి చేజారిపోతుంది. తల్లిదండ్రులు పూనుకోవలసిన కర్తవ్యాలు.

- పిల్లల కోసం కొద్ది సమయాన్ని వెచ్చించాలి. స్కూల్లో వారి ప్రవర్తన, స్నేహితులు తదితర అంశాలను తెలుసుకోవాలి.

- వారి వ్యక్తిత్వానికి విలువివ్వాలి. మీకు మేమున్నామనే ధైర్యాన్ని భరోసాను కల్పించాలి.

- కోపాన్ని ఎలా అదుపు చేసుకోవాలనే విషయాన్ని వారికి తెలియజెయ్యాలి.

- మంచి–చెడుల విచక్షణను అవగాహన కావించాలి.

- పిల్లలు అధిక సమయాన్ని వెచ్చించేది పాఠసాలల్లోనే. అందువలన పాఠశాల ప్రభావం వారిపై ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఉపాధ్యాయులు పాఠ్యాంశాలతో పాటు, అవసర సమయాల్లో కౌన్సెలింగ్ నిర్వహించాలి.

ఇలా కొద్ది జాగ్రత్తలు తీసుకుంటే పక్క దారి పట్టే పిల్లల్ని జాతిమెచ్చే యువతగా తీర్చి దిద్దవచ్చును.

# 17. శాంతి భద్రతలు - పోలీసు వ్యవస్థ

సంఘంలో పెరుగుతూన్న అరాచకాల పట్ల, అశాంతి పట్ల పిల్లలకు చిన్నతనంలోనే ఒక అవగాహనను కల్పించాలి. నేరాలను అదుపు చెయ్యడం, ధర్మాన్ని రక్షించి శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసు వ్యవస్థ, రక్షక భట వ్యవస్థ ఎలాంటి పాత్రను నిర్వహిస్తిన్నదీ పిల్లలకు చిన్నతనంలోనే అవగాహనను కల్పించాలి.

దేశంలోని ప్రజల హక్కులను పరిరక్షించి, నేరాలను అదుపుచేస్తూ, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలను కాపాడే పోలీసు వ్యవస్థ అత్యంత కీలకమైనది. నేరాలు చేసే వారిని శిక్షించి, ప్రజలలో నెలకొనే భయాందోళనలను పారద్రోలి ప్రజల పక్షంగా నిలిచేదే రక్షక భట (పోలీసు) వ్యవస్థ. ఏ సమాజమైనా అభివృద్ధి చెందాలంటే, శాంతియుతంగా ముందుకు వెళ్లాలంటే అందుకు ప్రధాన పాత్ర వహించేది ఈ వ్యవస్థే.

పోలీసు వ్యవస్థ - ప్రజలలో శాంతియుత సహజీవనానికి దోహదం చేస్తుంది. సంఘ విద్రోహ శక్తుల నుండి సమాజాన్ని కాపాడుతుంది. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడుతుంది. ప్రజల హక్కులకు భంగం కలిగే పరిస్థితి వచ్చినప్పుడు ఈ వ్యవస్థ ప్రజల పక్షం వహిస్తుంది. అండగా నిలుస్తుంది.

దేశంలోని ఏ ప్రాంతంలోనైనా రాజకీయ, మతపరమైన అల్లర్లు చెలరేగినా, దొంగలు అన్యాయాలకు పూనుకొని దోపిడీలు జరిపినా, దొంగతనాలు జరిపినా వారిని వెంటాడి శిక్షిస్తుంది. ప్రజల ఆస్తి, మాన, ప్రాణాలను కాపాడుతుంది. పోలీసు వ్యవస్థ న్యాయం వైపు నిలుస్తుంది. అన్యాయాన్ని అంతం చేస్తుంది. పేదల పక్షం, బలహీనుల పక్షం నిలుస్తుంది. నిస్వార్థంగా, ధర్మ బద్ధంగా పని చేస్తుంది. న్యాయం కోసం ప్రజలకు ఎల్లవేలలా పోలీసు స్టేషన్ల తలుపులు తెరిచి ఉంటాయి. అభాగ్యులను, అబలలను ఆదుకోడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి.

ఒక విధంగా పోలీసు వ్యవస్థలో పని చేసే వారంతా ఎంతో ఆదర్శంగా ఉండాలి. సమాజ శ్రేయస్సే తమ శ్రేయస్సని భావిస్తూ ఉండాలి. పోలీసులు చేసే సేవను అతి ధైర్య సాహసంతో కూడుకున్నదిగా అతి పవిత్రమైనదిగా భావించవలసి ఉంటుంది. న్యాయానికీ, నీతి నిజాయితీకి మారు పేరు పోలీసు వ్యవస్థ.

ప్రభుత్వానికీ, ప్రజలకూ మధ్య వారధిగా ఉంటూ ఎప్పుడూ ప్రజల మేలు కోసమే అహర్నిశలు శ్రమించే వ్యవస్థ పోలీసు వ్యవస్థ. ప్రజలకు ఎప్పుడు ఆపద కలిగినా వెంటనే ఫిర్యాదులను స్వీకరించి రంగంలోకి దిగుతుంది. నేరాలను అరికట్టడంలో, దొంగలను పట్టుకోవడంలో అత్యంత సాహసాలనూ, నైపుణ్యాన్నీ ప్రదర్శిస్తుంది ఈ వ్యవస్థ.

ఈ వ్యవస్థలో పనిచేసే వారు ఎంతో ఆదర్శంగా ఉండాలి. ఎంతో పవిత్రంగా మెదలాలి. న్యాయానికీ, నీతికీ కట్టుబడి ఉండాలి.

అలాంటి పవిత్రమైన వ్యవస్థ ఇపుడు రోజురోజుకూ గాడితప్పుతోంది. శాంతి భద్రతలను కాపాడి, అన్యాయాలను బట్టబయలు చేసి ధర్మం, నీతి, నిజాయితీల వైపు నిలబడవలసిన వ్యవస్థలో అంతా కుళ్లు చోటుచేసుకుంటోంది. ధర్మం, న్యాయం కోసం పోలీస్ స్టేషన్లకు వెళ్లిన ప్రజలకు న్యాయం కలుగడం లేదు. ఈ వ్యవస్థ ఇపుడు డబ్బు ఇస్తేనే కాని పనులు జరుగని స్థితికి చేరుకుంది. బలవంతుల అన్యాయాల నుండి పేదలను కాపాడి పేదలకు న్యాయం చేకూర్చవలసిన ఈ వ్యవస్థ పూర్తిగా డబ్బుకు అమ్ముడుపోతోంది. న్యాయం కోసం పోలీసు స్టేషన్లకు పరుగెత్తే వారికి నిరాశే మిగులుతోంది.

పోలీసు వ్యవస్థపై రాజకీయ నాయకుల స్వారీ మొదలు కావడంతో ఈ వ్యవస్థ మరీ దిగజారిపోయే స్థాయికి చేరుకుంటోంది.

ఈ వ్యవస్థను బాగు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజా స్వామ్యంలో పౌరహక్కులకు రక్షణ లేకపోతే ఇక అర్థమే లేదు. పోలీసులకు ఉద్యోగాల్లో చేరే ముందే వారికి శరీర దార్ఢ్యతతో పాటు నైతిక శిక్షణ నివ్వాలి. బాధ్యత పట్ల మక్కువను కలిగించాలి. వారికి మంచి వసతులనూ, సౌకర్యాలనూ కల్పించి వారికి చేతినిండా పని కల్పించాలి. సోమరితనానికి తావివ్వకుండా చెయ్యాలి.

ఈ వ్యవస్థపై ఈనాటి బాలురకు కూడా కొంత అవగాహనను కల్పించాలి. వారి విధులు, బాధ్యతలను, శాంతి భద్రతకు సంబంధించిన పాఠాలను వారికీ నేర్పించాలి. ముఖ్యంగా నీతి, నిజాయితీల పట్ల పిల్లలు స్పందించేలా చెయ్యాలి.

# 18. త్యాగమే అన్నింటికీ మూలం కావాలి

ప్రతి ఒక్కరూ అంతా తమకు కావాలనీ, అన్నీ తమకు చెందాలనీ ఆశ పడేవారే కానీ మనలా ఇతరులు కూడా ఆలోచించరా? అనే విషయాన్ని గుర్తెరిగిన వారు బహుతక్కువ. ఇతరులు కూడా ఇలాగే ఆలోచిస్తారని అనుకున్నప్పుడు మనం అంతా మనకే కావాలి అనే ఆశను వదులు కోగలుగుతాం. ఎదటి వారికి కూడా కొంత దక్కాలి అనే ఆలోచన అప్పుడే కలుగుతుంది. ఎదటి వారికి కూడా చెందాలి అని అనుకున్నప్పుడు మనం కొంత వదులుకోవాలి. అంటే కొంత త్యాగం చెయ్యాలి.

ఇలాంటి ఆలోచన చిన్నప్పుడే పిల్లల్లో కలిగేలా చెయ్యాలి. “ఎదటి వారు బాధపడుతుంటే వారిని చూసి నవ్వకూడదు. వారి బాధను అర్థం చేసుకోవాలి. వారి బాధపట్ల మనం స్పందించ గలుగాలి”. అనే ఇలాంటి గుణాలను పిల్లల్లో చిన్నప్పుడే పాదుకొల్పాలి.

తోటి పిల్లలు ఏ విషయంలోనైనా బాధపడుతుంటే వారు అలా ఎందుకు బాధ పడుతున్నారు? అని తెలుసుకో గలిగే మనస్తత్వాన్ని పిల్లల్లో కలిగించాలి. ఎదటి వారి బాధను చూసి స్పందించే పిల్లలు “తమకున్న దానిలో కొంత వారికి అందజేస్తే వారి బాధ తొలగిపోతుంది”. అనే విషయాన్ని గూర్చి ఆలోచించాలి. పిల్లల్లో నెలకొన వలసిన మొట్టమొదటి అంశం ఇది. ఆ తరువాత తమకు ఉన్న దాంట్లో కొంత పంచి ఇవ్వాలనే భావన నెలకొనాలి. ఆలోచన మాత్రమే కాదు తమకున్న దాంట్లో కొంత పంచివ్వాలి. అలా పిల్లల్లో ఇతరులకు కొంత త్యాగం చేసే అలవాటును కలుగ చెయ్యాలి.

ఇలా చెయ్యగలిగితే పిల్లలు భవిష్యత్తులో త్యాగధనులుగా తయారవుతారు. ఈనాడు తల్లిదండ్రులు కేవలం డబ్బు సంపాదనపైననే దృష్టి పెడుతున్నారు. ఏదో విధంగా డబ్బును సంపాదించి కూడబెట్టాలి అనే స్థితికి వస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం తాపత్రయ పడుతూ భవిష్యత్‌లో పిల్లలు బాధపడకుండా, ఎలాంటి కష్టానికి గురి కాకుండా ఉండేలా చూస్తున్నారు. తమ పిల్లలు బాధపడితే తమ శరీరమే కందిపోతుందని భావిస్తూ ఉంటారు.

కాని తమ పిల్లలు కూడా కష్టపడాలి. కష్టాలకు అలవాటు పడాలి. తమ

కాళ్ల మీద తాము నిలబడ గలిగేలా చేయడానికి ముందుకు రావడం లేదు. మరో విధంగా వారు తమ పిల్లల్ని సోమరిపోతులనుగా మారుస్తున్నామనే ఆలోచనకు రావడం లేదు.

పుట్టుకతో సంపన్నులు ఎవరూ కారు. జీవితంలో కష్టపడి, నిజాయితీగా సంపదను పెంచుకోవాలని వారికి తెలియజెయ్యాలి. తల్లిదండ్రులు తప్పుడు మార్గాలలో సంపాదించి పిల్లలకు పెడితే పిల్లలు ఎప్పటికైనా ఈ విషయాన్ని తెలుసుకొని తల్లిదండ్రులను ద్వేషిస్తారు. మనం నడుస్తున్న మార్గాన్ని పిల్లలు పసికడుతూ ఉంటారు.

పిల్లలకు ప్రతి అవసరాన్ని గూర్చి తెలియజెయ్యాలి. అది నెరవేరే విధానాన్ని గూర్చి తెలియజెయ్యాలి. అవసరం మేరకే డబ్బును కలిగి ఉండాలని తెలియజెయ్యాలి. అంతా తనకు కావాలనే అత్యాశను కలుగకుండా చెయ్యాలి.

ప్రతిదీ తెలుసుకోవాలి. ప్రతిదీ నేర్చుకోవాలి. కష్టపడి సంపాదించుకోవాలి అనే దృక్పధాన్ని పిల్లల్లో కల్పించాలి.  కష్టపడే తత్వంలోనే త్యాగ బుద్ధి అలవడుతుంది. త్యాగ బుద్ధితోనే ఇలాంటివి అలవడతాయి. అప్పుడే వారు సక్రమంగా ఎదుగుతారు.

దురదృష్టవశాత్తు ఇపుడు స్వార్థం బాగా పెరిగిపోయి అంతా లేనిదాని కోసం, దాన్ని పొందడానికి ప్రాకులాడుతున్నారు. త్యాగానికి వ్యతిరేకమైన స్వార్థం ఇపుడు బాగా ప్రబలిపోతోంది.

త్యాగం అనేది భారతీయులకు వెన్నతో పెట్టిన విద్య అనీ ఇది భారతీయతలోనే ఇమిడి ఉన్న గొప్ప ఉన్నత గుణమనీ తెలియజెయ్యాలి. ఎన్నో త్యాగాలు చేస్తేనే మనకు స్వాతంత్ర్యం వచ్చిందనే విషయాన్ని పిల్లలకు తెలియజెయ్యాలి.

అసలు త్యాగ గుణం వల్లనే శాంతి వర్ధిల్లుతుందనే విషయాన్ని పిల్లలకు తెలియజెయ్యాలి.

# 19. మద్యం మహమ్మారికి దూరంగా బాలలు

మన రాష్ట్రంలో మంచి నీటికి కొరత ఉందేమో కాని మద్యానికి మాత్రం కొరత ఉండటం లేదు. రాష్ట్రమంతటా మద్యం ఏరులై పారుతోంది. నీటి సరఫరాకు సమయముంటోంది కాని మద్యం సరఫరాకు మాత్రం నిర్ణీత సమయం ఉండటం లేదు. ధనవంతులతో పాటు పూరి గుడిసెల్లో ఉండే వారు కూడా మద్యం మత్తులో ఎలా మునిగి పోతున్నదీ. ఇపుడు మనం చూస్తూనే ఉన్నాం.

మద్యం మహమ్మారి మానవాళిని పీల్చి పిప్పిచేస్తుంటే మన నాయకులేమో ప్రభుత్వం ఎలా నడుస్తుందా? ఏయే రంగాలనుండి సొమ్మును ఎలా రాబట్టుకుందామా! అని ఆలోచిస్తోంది. మద్యం కొనుగోళ్లపై ప్రజలు వెచ్చించే మొత్తం ఏటా 11 వేల కోట్ల వరకుంటుంది. మద్యం వల్ల రాబడి ఇలా పెరుగుతూన్నదంటే మద్యానికి ఎంత మంది బానిసలౌతున్నారో వేరుగా చెప్పనక్కరలేదు.

పేదల అనారోగ్యానికి, వారి సంసారాల్లో చిచ్చులేపి కుటుంబాలను అల్లకల్లోలం చేస్తున్న మద్యపానంను నిషేధించడానికి తగిన చర్యలేవీ తీసుకోబడడం లేదా? మానవాళిని పట్టి పీడిస్తున్న ఈ భయంకర మహమ్మారికి ఎంతో చరిత్ర ఉంది. ఈ మహమ్మారిని తరమి కొట్టడానికి అప్పుడప్పుడూ ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ తన నిర్మాణ కార్యక్రమాల్లో మద్యపాన నిషేధాన్ని చేర్చారు. ఈ ఉద్యమాన్ని అన్ని ఊర్లకూ వ్యాపింపజేశారు. మద్యపానం వల్ల జరిగే అనర్థాలను అడుగడుగునా గ్రామీణ ప్రజలకు తెలియజేసే ప్రయత్నాలు జరిగాయి.

ప్రభుత్వాలు మాత్రం దీనిపై దృష్టి పెట్టకుండా కేవలం ఆదాయాన్ని గూర్చి మాత్రమే ఆలోచిస్తున్నాయి. మరొక విధంగా ప్రభుత్వాలే ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి.

మద్యం విషయంలో రోజురోజుకూ ప్రభుత్వం ఆచరిస్తున్న విధానాలు మరీ భయంకరంగానూ ఉంటున్నాయి. ప్రజలను మరింత తాగుబోతులుగా మార్చేలా మద్యాన్ని విస్తృతంగా అందుబాటులోకి తెచ్చే విధంగా ఉంటున్నాయి.

ప్రభుత్వం ఒక వైపున పేదలందరినీ తాగుబోతులనుగా మార్చివేస్తూ తిరిగి వారి ఆరోగ్యం కోసం బీమా పథకాన్ని అమలు చేస్తోంది. గాంధీజీ కన్నకలలు నిజం కావాలంటే బడుగు, పేద వర్గాలు బాగు పడాలంటే మద్యపానం పై జరుగుతున్న వ్యతిరేక ఉద్యమం తీవ్ర రూపం దాల్చాలి. పేదల కుటుంబాలను గుల్ల చేసి వారిని అల్లకల్లోలం పాలు చేస్తున్న మద్య పానంపై అందరూ ధ్వజమెత్తాలి.

ఇటీవలి కాలంలో మహిళాలోకం మద్యపానంపై దృష్టిని సారించింది. మద్యం షాపులను తొలగించాలని డిమాండు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. కొన్ని చోట్ల విపక్షాల నేతృత్వంలో ఈ ఉద్యమాలు సాగుతున్నాయి. బెల్టు షాపుల్లోని సీసాల్ని ధ్వంసం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో అక్రమంగా తయారు చేస్తున్న మద్యం పైన కూడా మహిళలు దాడి చేసి వాటిని ధ్వంసం చేస్తున్నారు. చాలా చోట్ల వీటికి నేతృత్వం వహిస్తోంది మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు కావటం విశేషం.

ఆయా కుటుంబాలకు చెందిన మహిళలు కొందరు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలను పొంది బ్రతుకు తెరువును ఏర్పాట్లు చేసుకుంటూ ఉంటే అలాంటి కుటుంబాల్లోని వ్యక్తులే తాగుడుకు పూనుకొని అప్పు తీసుకున్న డబ్బును గుళ్ల చేస్తున్నారు. దీంతో కుటుంబాల్లో చిచ్చురేగుతోంది. అలజడి సృష్టించబడుతోంది. అందువల్ల ఇపుడు మహిళలు బాగా ఉద్యమిస్తున్నారు.

ఇక మద్యపాన సేవనం వల్ల గలుగుతున్న నష్టాలు ఇంతా, అంతా అని కాదు. రోగనిరోధక శక్తి తగ్గడం, చూపు మందగించడం, ఏ పనీ చెయ్యలేక పోవడం, మద్యం కోసం నానాయాతనలు పడుతూ చివరికి దొంగతనాలు, దోపిడీ, హత్యలకు కూడా పూనుకోవడం జరుగుతూన్నది, నిరక్షరాస్యులైన పేద ప్రజానీకంలో ఇవి మరీ ఎక్కువగా జరుగుతున్నాయి.

మద్యాన్ని సేవించే వారు తాము చెడిపోతూ విచక్షణా జ్ఞానాన్ని కోల్పోవడమే కాక తమ సంతానాన్ని కూడా తమ చేతులారా చెడగొట్టు కుంటున్నారు. తాగుబోతుల కుటుంబాల్లోని పిల్లలపై ఈ మత్తు ఎన్నో అనర్థాలను సృష్టిస్తోంది. వారి లేతమనసులపై చెడు ప్రభావాన్ని కలుగజేస్తోంది. ఇలాంటి కుటుంబాల నుంచి వచ్చే పిల్లలు మతి భ్రమించే తీరులో ఉంటున్నారు. వారు సరిగా చదవలేక పోతున్నారు. తమ అభివృద్ధి, గమ్యంపై సరిగా స్పందించలేక పోతున్నారు.

తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని, మద్యానికి అలవాటు పడినవారు, మద్యపానం త్యజించాలి. ఇలా, ఇంటి నుండి, కుటుంబం నుండి, మద్య పాన నిషేద స్వచ్ఛంద ఉద్యమం ప్రారంభమైతే, బాల-బాలికలు సంస్కారవంతులు అవుతారు. పిల్లల కోసం తల్లిదండ్రులు దుర అలవాట్లను మానుకోవాలి. వారి దృష్టిలో వారు ఎంతో నీతి మంతులుగా ప్రవర్తించాలి. అలా జరిగినపుడే ఈ సమాజం మెరుగుపడుతుంది. అపుడే ఈ దేశము సౌభాగ్యవంత మవుతుంది. చిన్న వయసులో పిల్లల మనసు గాయపడకుండా చూడ గలిగితే తప్పకుండా ప్రతి పౌరుడు ఒక గాంధీనో, ఒక వివేకానందుడో కాగలుగుతాడు.

ఏమైనా లేత మనసులపై పడే ఇలాంటి గట్టిముద్రలను తొలగించడానికి ప్రయత్నాలు జరుగాలి. ఇలాంటి చర్యలు మొదట ఇంట్లో తల్లిదండ్రుల ద్వారా జరగాలి. ఆ తరువాత విద్యాలయాల్లో ఉపాధ్యాయుల ద్వారా జరగాలి.

ప్రభుత్వం కూడా ప్రజల దురలవాట్లను, బలహీనతలను ఆధారం చేసుకొని సులువుగా ఆదాయం సమకూర్చుకుంటున్న విధానాలకు పాల్పడకుండా ఉండాలి. ప్రభుత్వాలు తమ దృష్టిని కేవలం ప్రజల సంక్షేమంపైననే సారించాలి.

# ౨౦. బాలల సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా

ఈనాటి బాలురే రేపటి పౌరులంటారు. అలా పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దడానికి తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ కృషి చెయ్యాలి. పిల్లలకు చదువుతో పాటు చక్కని గుణాలను నేర్పించి మంచి పౌరులనుగా తీర్చి దిద్ది ఈ సమాజానికి అందించవలసిన బాధ్యత ఇంట్లో తల్లిదండ్రులపైనా, పాఠశాలల్లో ఉపాధ్యాయులపైనా ఉంటుంది. అలా పిల్లలను తీర్చి దిద్దడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల గురుతర బాధ్యత ఎంతగానో ఉంటుంది.

పిల్లలకు మంచి అలవాట్లను నూరిపోయడంలో, సత్ప్రవర్తనను గురించి తల్లిదండ్రులే ముఖ్య బాధ్యత వహించాలి. పిల్లల్లో పెద్దలను అనుకరించే తీరు ఎంతో చురుకుగా ఉంటుంది. కాబట్టి తల్లిదండ్రులు తాము చేసే ప్రతి పని విషయంలో ఎంతో జాగ్రత్తగా మెదలాలి.

ఈనాడు సమాజంలో అంతులేకుండా పేరుకుపోతున్న అవినీతిని అంతం చెయ్యడానికి మార్గమేదైనా లేదా అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంజీని అడిగినప్పుడు "ఈ ప్రయత్నం ఇంటి నుండే ప్రారంభం కావాలి. తల్లిదండ్రులతోనే ప్రారంభం కావాలి" అని అన్నారు. ఇళ్లల్లో అవినీతికి, పక్షపాతానికి, అక్రమ దారులకు సంబంధించిన వాతావరణం ఏ మాత్రం కనిపించకుండా ఉండాలి".

ఈ విషయంలో తల్లిదండ్రులు ఎంతో జాగ్రత్త వహించాలి. తమ సంతానాన్ని ఎంతో జాగ్రత్తగా పెంచుకోవాలి. వారి జీవితంలో చీకటి కోణాలు లేకుండా చూసుకోవాలి. పిల్లలు తప్పులు చేయకుండా, చెడు అలవాట్లకు లోను కాకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు కనిపెడుతూ ఉండాలి. వారికి అడుగడుగా నీతి వంతమైన మాటల్ని చెబుతూ ఉండాలి. సందర్భాను సారంగా నీతి కథలను చెబుతూ ఉండాలి.

భవిష్యత్‌లో జాతికి వారే గొప్ప సంపద, మార్గదర్శకులు కాబట్టి వారి మీద ఏ విధమైన దుష్ప్రభావం లేకుండా కాపాడుకోవాలి. నీతివంతమైన, శీలవంతమైన వారుగా పిల్లలు ఎదిగితే, ఇలాంటి వారిని మనం తరతరాలకూ అందించ గలిగినట్లైతే అది విశేషమైన, గొప్ప సంపదగా మనం భావించాలి, గర్వ పడాలి.

తల్లిదండ్రులు పిల్లల్లోని చురుకుదనాన్నీ, పిల్లల్లోని లక్షణాలనూ పరికించి వాటిని తీర్చి దిద్దేందుకు కృషి సలుపాలి. తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ పిల్లలకు మహా పురుషుల జీవిత చరిత్రలను వినిపించాలి. వారి జీవితాలతో ఘట్టాలను విడమర్చి చెబుతుండాలి.

సదాచారాలను జీవితంలో అవలంభించేలా చెయ్యాలి. అలా తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ పిల్లల్ని మంచి దారిలో నడిపించే సారథులు కావాలి. తల్లిదండ్రులు పిల్లలకు మంచి మాటలను చెబుతూ ఇంటి వద్ద వారి చేత కొన్ని పనులను చేయించాలి. అలా శ్రమించే తత్వాన్ని పిల్లల్లో కలుగజెయ్యాలి.

తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాడే కష్టపడే తత్వాన్ని కలుగజెయ్యాలి. ధైర్య సాహసాలను నూరిపోయాలి. భవిష్యత్‌లో వారికి సమస్యలెదురై కష్టాలు వచ్చినప్పుడు కృంగి పోకుండా సమస్యలను ఎదుర్కొనేంతటి శక్తి సామర్థ్యాలను పెంపొందించాలి. జీవితం సుఖ, దుఖాల సమ్మేళనం అని వారికి తెలియజెయ్యాలి. సుఖంగా ఉన్నప్పుడు బాగా పొంగిపోకుండా, కష్టాలు వచ్చినప్పుడు బాగా కృంగిపోకుండా ఉండేందుకు మనో నిబ్బరాన్ని నూరిపోయాలి.

జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఆత్మ నిగ్రహంతో అధిగమించేలా వారిని తయారు చెయ్యాలి. సమస్యలు వచ్చినప్పుడు వారు కృంగిపోతూ తమ పిల్లల్ని కృంగిపోకుండా చెయ్యాలి. మనో నిబ్బరాన్ని కలిగించే ప్రయత్నం చెయ్యాలి. ఒకటి తరువాత మరొకటిగా కష్టాలు ఎదురైనా మనం విచలితులం కాగూడదనీ, కష్టాలను భరిస్తూ వాటికి పరిష్కారాలను కనుగొనాలనే ధైర్యాన్నీ, సహనాన్నీ తెలియజెయ్యాలి.

బాహ్య ఆడంబరాలు, గొప్పల కంటే అంతః సౌందర్యం చాలా గొప్పదనీ అదే ఆదర్శవంతమైనదనీ తెలియజెయ్యాలి. పిల్లలకు పని చెబితే, వారిచేత బరువులు మోయిస్తే వారు కందిపోతారనుకోగూడదు. చిన్నప్పుడే వారికి శ్రమ శక్తినీ, శ్రమించే తత్వాన్నీ అలవాటు చెయ్యాలి. పనులను నెరవేర్చే తీరు పట్ల వారిలో ఉత్సాహాన్ని పెంచాలి. పిల్లలపై అధిక ప్రేమను కనబురుస్తూ పిల్లల్లోని ఉత్సాహంపై నీరు చల్లడానికి ప్రయత్నం చెయ్యగూడదు. అడుగడుగునా వారిని కర్తవ్యోన్ముఖులను చెయ్యడానికి ప్రయత్నించాలి. ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ పిల్లల పట్ల ఇలా శ్రద్ధ వహిస్తే వారిని బాగా తీర్చిదిద్దిన వారవుతారు.

## పెద్దలకు తీసిపోని చిన్నారులు

పిల్లల్లోనే పిడుగులుంటారు. చూడడానికి చిన్న పిల్లల్లానే కనిపిస్తారు. కాని కొన్ని అసాధ్యాలైన పనులను చేసి చూపిన వారు కూడా ఉన్నారు. కొందరు పిల్లలు అద్భుత మేధా సంపత్తికి ప్రతిరూపాలు. క్రీడలు, శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లోనూ అద్భుతాలు సాధించిన వారు పిల్లల్లోనూ ఉన్నారు. వారు సాధించిన పనులకు పెద్దలే అబ్బుర పడుతుంటారు. నిజంగా అలాంటి వారు "వరప్రసాదులని" చెప్పుకోవాలి. జన్మతః వచ్చిన వారిలోని ప్రతిభలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి వారి ప్రతిభ విస్తరించేలా, వెలుగొందేలా చేస్తున్నారు. అలాంటి వారు ఎన్నో అద్భుతాలను సృష్టించి రికార్డుల్లోకి (గిన్నిస్ బుక్‌లోకి) ఎక్కుతున్నారు. పెద్దల చేత సత్కరించ బడుతున్నారు.

అందువల్ల పిల్లలే కదా అని నిర్లక్ష్యధోరణిని ప్రదర్శించరాదు. వారిలోని ప్రతిభకు, నారు, నీరు పోసి అది బయట పడి వ్యాప్తి చెందడానికి ప్రయత్నం చెయ్యాలి. అలాంటి వారిలోని ప్రతిభ దేశానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని భావించాలి.

చదువులోనే కాక ఇతర రంగాలు – క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోనూ బాగా రాణించిన వారెందరో ఉన్నారు, ఉంటున్నారు. అంతే కాక చదువులో రాణించకుండా ఇతర రంగాల్లో బాగా రాణించే పిల్లలుంటూరు కాబట్టి చదువులో బాగా లేరని బాధపడక పిల్లల ప్రతిభ, వ్యుత్పత్తులు ఏ రంగంలో కనిపించినా వాటిని గుర్తించి వాటికి పదునుపెట్ట వలసింది తల్లిదండ్రులు ఉపాధ్యాయులే. అందువల్ల వారు పిల్లల్లోని ఇలాంటి శక్తి సామర్థ్యాలు వృధాగా సమసిపోకుండా చూడాలి. వాటిని కాపాడుతూ పెంపొందించాలి. అవి దేశానికీ, ప్రపంచానికీ ఉపయోగ పడేలా చెయ్యాలి.

# 21. చదువులో ధనిక, పేదవర్గ భేదాలు దేశ ప్రగతికే గొడ్డలిపెట్టు విధానాలు

ప్రభుత్వ విద్య ఇపుడు అన్ని స్థాయిలలోనూ గాడి తప్పుతోంది. ప్రభుత్వ పాఠశాలలో ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయని అంతా వేలెత్తి చూపుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వమే అంగీకరిస్తోంది. మంచి ప్రమాణాల విద్యను ప్రభుత్వ పాఠశాలలు అందరికీ అందిస్తాయన్న నమ్మకం నానాటికీ వమ్మైపోతోంది. ప్రభుత్వ పాఠశాలలో మంచి ప్రమాణాలున్న విద్యను అందిస్తామనీ, దీనిని ఒక రాజకీయ సవాలుగా ప్రభుత్వాలు భావించడం లేదు.

ముఖ్యంగా రాష్ట్రంలో ప్రాథమిక విద్య పునాదులు అధ్వాన్నంగా ఉన్నాయి. **3,4,5** తరగతులు చదివే పిల్లల్లో చాలా మంది తమ పేర్లను, తల్లిదండ్రుల పేర్లను, ఊర్ల పేర్లను, ఉపాధ్యాయుల పేర్లను, పాఠశాలల పేర్లను రాయలేకపోతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. **60** యేళ్ల స్వతంత్ర భారతంలో కనీసం రెండు తరాల పిల్లలందరికీ మంచి ప్రమాణాలతో కూడుకున్న విద్యను అందించలేకపోయాం. వేరే దేశాలు మాత్రం పిల్లలకు ప్రమాణాలతో కుడుకున్న విద్యను అందించడానికి తగిన చర్యలు తీసుకున్నాయి. పుట్టిన ప్రతి బిడ్డకీ కులంతో, డబ్బుతో నిమిత్తం లేకుండా ఎదిగే అవకాశాన్ని కల్పించాలనే రాజకీయ సంకల్పంతో ముందుకు సాగలేకపోయాం.

పర్యవసానంగా సమాజంలో ఉన్నవాళ్లకొక విద్య, లేని వాళ్లకొక విద్య అనే రీతిలో కొనసాగుతున్నాం. అలా ఈ అంతరం ఇంకా పెరిగిపోతోంది. పేదలకందే విద్యలో నాణ్యత లేకుండా పోతోంది.

మన రాష్ట్రంలో **66,353** ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. వీటిలో **54,31,797** మంది పిల్లలు చదువుతున్నారు. ఇంతమంది పిల్లల భవిష్యత్తు అగాధంలోకే నెట్టివేయ బడుతోందన్న మాట. ప్రభుత్వం ఎన్ని కొత్త పథకాలు ప్రారంభించినా ఇంత మంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే గమ్యాన్ని చాటలేకపోతున్నాం. అలాంటి సదుద్దేశమే కనిపించడం లేదు. ఇపుడు ప్రభుత్వం ప్రారంభించనున్న రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూళ్లు కూడా ఉన్నవారికే వర్తిస్తాయి. ఉన్నవారికే మంచి నాణ్యమైన విద్యను అందించే రీతిలో కొనసాగుతాయి. ప్రభుత్వ

పాఠశాలలో చదువుతున్న వారిలో అత్యధిక సంఖ్యాకులు యస్.సి., యస్.టి., బి.సి. కులాలు ఇతర కులాలలో పేదలకు సంబంధించిన వారే ఉన్నారు.

అలా ఇపుడు అంతటా పేదల చదువు, సంపన్నుల చదువు అనే రీతిలో కొనసాగుతున్నది విద్యా విధానం. కార్పొరేట్ స్కూళ్లు విద్యను వ్యాపారంగా చేసుకొని కోట్లు ఆర్జిస్తున్నాయి. ప్రభుత్వం ఈ విషయాన్ని గుడ్లప్పగించి చూస్తోంది తప్ప ఏమీ చేయలేక పోతోంది. ప్రైవేట్ స్కూళ్లలో కూడా పేద పిల్లలకు అవకాశం కల్పించే విషయంలో ఆలోచించాలి. ప్రైవేట్ భాగస్వామ్యంలో పేద పిల్లలకు మంచి ప్రమాణాలున్న విద్యను అందించాలంటే ఈ ప్రైవేట్ స్కూళ్లలో కనీసం 15,20 శాతం మంది పిల్లలకు ఉచిత విద్యలో భాగస్వామ్యం కల్పించే చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఒకే తరహా సిలబస్, ఒకే తరహా మీడియం, ఒకే తరహాలో ఆంగ్ల భాష నేర్పడానికి చర్యలు తీసుకోబడాలి. కాని ప్రభుత్వం ఎంత సేపూ ప్రైవేట్ భాగస్వామ్యం వైపుకే దృష్టి సారిస్తూ ఉంటుంది. అన్ని వసతులనూ వారికే కల్పించడానికి ముందుకు వస్తుంది. అంతే తప్ప పాఠశాల విద్యను సంస్కరించే చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పం కనిపించదు.

ఈ పరిస్థితులలో ప్రైవేట్ భాగస్వామ్యంలో అంటే వారి లాభాలలో కొంత భాగం పేద పిల్లల చదువు మీద ఖర్చు చేసేది కావాలి. ప్రభుత్వం అలాంటి విధానాన్ని చూపించాలి.

# 22. పిల్లల్లో మతప్రసక్తి లేని సమైక్యతా బీజాలు

కుల, మత, వర్గ, వర్ణ విచక్షణ లేని లౌకిక సిద్ధాంతానికి కట్టుబడిన దేశం మనది. దేశంలో అలముకొన్న అసమానతలను రూపి మాపి అందరి సంక్షేమానికి పాటు పడాలన్నదే మన ఆశయం. గొప్ప ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచంలోనే పేరుపొందిన దేశం మనది. అలాంటి దేశంలో ఇంకా కులాలు, మతాల కుమ్ములాటలు జరుగుతున్నాయి. వర్గపోరాటాలు జరుగుతున్నాయి. చివరికి పాఠశాలల్లోనూ పిల్లలను చేర్చేటప్పుడు ఇస్తున్న అడ్మిషన్ ఫారాల్లోనూ కుల, మత ప్రసక్తి ఉంటోంది. అంటే ప్రాథమిక విద్యా స్థాయిలోనే కులాల, మతాల ప్రసక్తి పిల్లల మనసుల్లోకి దూరుతోందన్నమాట.

పాఠశాలల్లో పిల్లల్లో హెచ్చు, తగ్గులను భేదాభిప్రాయాలు రాకుండా "మనందరం సమానలం" అనే భావన రావడానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. పిల్లల్లో కామన్ డ్రెస్సును (యూనిఫారాలను) ప్రవేశపెట్టింది కూడా అందుకే. అందువల్ల పిల్లల్లో కుల, మతాల, హెచ్చు తగ్గుల బీజాలు పడకుండా జాగ్రత్తపడాలి.

పాఠశాలల్లో పిల్లలను చేర్చే సమయంలో కులాన్ని వెల్లడించాలని చెప్పే "కులం కాలమ్"ను దరఖాస్తు పత్రాల నుంచి తొలగించాలని కూడా చాలా మంది అభిప్రాయం. ఈ కాలాన్ని తొలగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

కొందరైతే హిందూ సమాజాన్ని దెబ్బ తీస్తున్న కుల వ్యవస్థ పోవాలని చాలా మంది కోరుతున్నారు. అలాగే స్కూళ్లలో విద్యార్థుల కులం నమోదును నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేయాలని కొందరి వాదన. అయితే కులం తెలిపే కాలమ్‌ను రద్దు చేస్తే కులం ద్వారా ఉపకార వేతనాలు, ఫీజులు, రాయితీలు, ఇతర ప్రయోజనాలు పొందే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని ధర్మాసనం కూడా స్పష్టం చేసింది. పిల్లలకు పై చదువుల విషయంలో సీట్ల రిజర్వేషన్లు మొదలైన వాటి విషయంలో కులం ప్రస్తావన ఉపకరిస్తుందని ధర్మాసనమే పేర్కొంది.

మరో విధంగా చెప్పాలంటే భారత ఉపఖండంలో దాదాపు అన్ని దేశాల్లో ఏదో ఒక రూపంలో కుల వ్యవస్థకు బలం చేకూరుతున్నదని చెప్పక తప్పదు.

పోతే బలహీన వర్గాల పురోగతికి ప్రభుత్వ పరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా సామాజిక అసమానతలను తగ్గించడానికి అవి స్వల్పంగా ఉపయోగపడుతున్నాయే కాని కులం లేని సమాజం నిర్మించాలన్న ఆశయానికి దోహదం చేయలేకపోతున్నాయి.

దేశంలో కులాన్ని నిషేధిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని హేమాహేమీలు ప్రయత్నం చేశారంతే కాని కులం అనేది చట్టంతో పోయేది కాదు అని చాలా మంది విశదీకరించారు. కుల నిర్మూలన కోసం చాలా ఉద్యమాలు నడిచాయి. కాని దేశ ఆర్థికాభివృద్ధి, జన సంక్షేమం పైనే ప్రభుత్వాలు దృష్టి సారించడం వల్ల కుల నిర్మూలన ప్రసక్తి అంతగా బలహీన పడడం లేదు.

ఏమైనా పాఠశాలల్లో మాత్రం కులం స్పృహ పిల్లల్లో పడకుండా చూడవలసిన బాధ్యత మనందరి పైనా ఉంది. పాఠశాలల్లో కులం ఉనికి పడకుండా చెయ్యడానికి కొత్త ప్రత్యామ్నాయాలను అన్వేషించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# 23. ప్రకృతిని ప్రేమించు - కాలుష్యాన్ని తరమికొట్టు

అడవులు మనకేమిస్తాయి? స్వచ్ఛమైన గాలినిస్తాయి. బతకడానికి ఆధారాన్ని చూపిస్తాయి - ఆహ్లాదకరమైన ప్రకృతికి అడవులే మూలం. అలాంటి అడవులు ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా నరికివేతకు గురి అవుతున్నాయి. అడవులను నరకడమంటే మన అభివృద్ధిని, మన సంపదను మనమే పాడుచేసుకోవడ మన్నమాటు.

అడవులు మానవ జీవితానికి అత్యంత ప్రాధాన్యమైనవి. మనిషి జీవించడానికి కావలసిన ప్రాణ వాయువును అందించే అతి ముఖ్యసాధనాలు, వాతావరణంలోని బొగ్గు పులుసు వాయువును అవి స్వీకరించి ప్రాణవాయువును అందిస్తాయి. ముఖ్యంగా అడవులు గిరిజనులకు ప్రధాన ఆర్థిక వనరులు. వారికి నేరుగా ఆహారాన్ని, ఇంధనాన్ని, పశువుల మేతను అందజేస్తున్న అడవులే.

భూమి కోషీకరణను నిరోధించి, జలవనరులను ప్రసాదిస్తాయి. వాణిజ్య, పారిశ్రామిక అవసరాల కోసం అడవుల నరికివేత ముమ్మరం కావడంతో అడవులను కాపాడుకోవలసిన అవసరం ఏర్పడుతూన్నది.

ముఖ్యంగా పట్టణాలు విస్తరిస్తుండడంతో అడవులు అంతరించిపోతున్నాయి. దాంతో భూములు నిస్సారమై, పర్యావరణం కలుషితమైపోతోంది. ముందు తరాల మానవ జీవితం ప్రశ్నార్థకంగా మారిపోతోంది. ఇక రానున్న మూడు దశాబ్దాల్లో పలుదేశాలు కాలుష్యానికి నిలయాలుగా మారనున్నాయంటున్నారు. అప్పుడు ఎన్నో దుర్భర పరిస్థితులను ఎదుర్కోవలసి ఉంటుంది.

మన దేశంలో యథేచ్ఛగా కొనసాదుతున్న అడవుల విధ్వంసం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. వ్యవసాయ యోగ్య భూములు నిస్సారమైపోతున్నాయి. తద్వారా వ్యవసాయోత్పత్తులు తగ్గిపోతున్నాయి. మరో వైపు మన మృగ సంపద, పక్షుల సంపద తరిగిపోతున్నది. ఇలా వన సంహారం మూలంగా అరుదైన జంతు, పక్షి జాతులు సైతం అంతరించిపోతున్నాయి. ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వణ్య ప్రాణుల సంపదను కాపాడుకోవాలన్న ఆలోచన

మనందరిలో కలుగాలి. అడవుల్లో ఉండే జంతువులు, అరుదైన పక్షి జాతులను, వన్య మృగాలను రేపటి తరాల వారికి అందించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. అంతే కాక మన సంస్కృతి, మన నాగరికత అడవుల, వన్య ప్రాణుల సంరక్షణపైననే ఆధారపడి ఉంది.

ప్రకృతి వనరులు లేకుండా అసలు మానవుని జీవితమే లేదు. ఉదా- కప్పలను నిర్మూలించడం వల్ల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయి.

ప్రకృతి వనరులన్నీ సవ్యంగా ఉంటే మానవుల ఆరోగ్యాలు, జలాశయాలు, వ్యవసాయ దిగుబడులన్నీ అనుకూలంగా ఉంటాయి. అభయారణ్యాలు, జాతీయ పార్కులను నిర్మించుకోవడం వల్ల, రక్షించుకోవడం వల్ల, వన్య ప్రాణులను, వృక్ష సంపదను, వాటిని సహజ సిద్ధమైన రీతిలో చూసి ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ పొందుతాం. పిల్లలకూ విద్యార్థులకూ, పెద్దలకూ ఇవి చూడడానికి ఎంతో ఇంపుగా ఉంటాయి. విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శాస్త్రీయ సంబంధమైన విషయాలెన్నో బోధ పడతాయి.

ఈ అంశాలన్నీ విద్యార్థులకు దైనందిన జీవితంలో ఎన్నో అవరోధాలను అధిగమించడానికి, జీవితంలో స్థిర పడేందుకు తోడ్పడుతాయి. ఇపుడు అడవులు నరికివేయ బడుతన్నందువల్ల, చెట్లు హరించుకు పోతున్నందువల్ల ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటే కార్యక్రమానికి అంకితం కావాలి. ముఖ్యంగా విద్యార్థుల్ని ఇందులో భాగస్వాముల్ని చేయాలి. చిన్నతనంలోనే మొక్కలు నాటడంపట్ల ఆసక్తిని పెంచాలి.

అయితే ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కుదరక, సంబంధిత అధికారుల అలసత్యం వల్ల, అవినీతి, అక్రమాల వల్ల మనం అడవులను సంరక్షించుకునే కార్యక్రమం, మొక్కలను నాటే కార్యక్రమం ఆశించిన ఫలితాలను ఇవ్వలేక పోతున్నది. వీటికి కెటాయించిన డబ్బంతా అధికారుల చేతుల్లోకి పోయి వృధా అయి పోతోంది. మన రాష్ట్రంలో రాష్ట్ర వ్యాప్తంగా 8,500 స్కూళ్లలో విద్యార్థులతో "గ్రీన్ ఆర్మీ"ని ఏర్పాటు చేసి, మొక్కల సంరక్షణ చేపడతామని మన నాయకులంతా చెబుతున్నారు. కానీ అలాంటి చర్యలేవీ చేపట్ట బడడం లేదు. కనీసం ఈ చర్య తీసుకున్నా రాష్ట్రంలో పర్యావరణ పరిస్థితి బాగుపడేది.

ఇప్పటికైనా సమయం మించి పోలేదు. ఆయా ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. భవిష్యత్తు మనది కాబట్టి, భవిష్యత్తులో మంచి పర్యావరణం అవసరముంది కాబట్టి ఈ రంగంలో కృషి చేస్తున్న వారిని గురించి తెలుసుకొని వారి అడుగు జాడలలో నడవాలి. ప్రాథమిక దశనుండే ఈ కృషి జరుగాలి.

మన భవిష్యత్తు పర్యావరణం కోసం పాటుపడిన మహానుభావుడు సుందర్‌లాల్ బహుగుణను గురించి తెలుసుకుందాం. ఈయన గొప్ప గాంధేయవాది. పర్యావరణ కార్యకర్త. గాంధీజీ ఆశయాలతో ప్రభావితుడైన సుందర్ లాల్ బహుగుణ బాల్యం నుంచే తన సొంత ప్రాంతమైన హిమాలయాల్లో గాంధీజీ ఆశయానికి అనుగుణంగా పని చేయడం మొదలుపెట్టారు. రానురాను హిమాలయాల్లోని అడవుల్లో తీవ్ర మార్పులు వస్తున్న సంగతిని అక్కడి గిరిజనులతో పాటు గుర్తించారు. మొత్తం దేశానికే విలువైన హిమాలయాల సౌందర్య సంపద దెబ్బ తింటుందని నిరసన తెలిపారు.

**1970**లో ఈయన “చిప్కో” ఉద్యమాన్ని చేపట్టారు. చిప్కో అంటే కౌగిలించుకో, దరిజేర్చుకో అని అర్థం. అడవులను నరికివేయకు వాటిని దరి జేర్చుకో అని అందరి చేతా చెప్పించారు. హిమాలయాల్లో **4,870** కి.మీ. పాద యాత్ర చేశారు. దారి పొడవునా పాటలు, నినాదాలతో అడవిని కాపాడుకొమ్మని చైతన్యం తీసుకువచ్చారు.

వీరి అడుగుజాడలలో నడిస్తే మనమూ అడవులనూ, ప్రకృతినీ కాపాడుకున్న వారమౌతాం.

ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి సిలబస్‌లో కొంత సమయాన్ని కేటాయించాలి. పిల్లల చేత మొదట పాఠశాల పరిసరాల్లోనూ, ఆ తరువాత ఊర్లు, పట్టణాలు, నగరాలలోని కొన్ని ప్రాంతాలను ఎంచుకొని పిల్లల్ని అక్కడికి తీసుకు వెళ్లి వారి చేత మొక్కలు నాటించాలి. నాటిన మొక్కలను కాపాడుకునే విషయంలో పాటించే జాగ్రత్తలను వారికి తెలియజెయ్యాలి.

# 24. దేశభక్తిని పెంపొందించుకో

## స్వాతంత్ర్యోద్యమంలో చిన్నారులు నిర్వహించిన పాత్ర

భారత స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ, పండిత జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, నేతాజీ లాంటి ఎందరో మహనీయులు పాల్గొని వారు తమ తమ పాత్రను నిర్వహించారు. గాంధీజీ అహింసాయుత, శాంతియుత మార్గంలో ఉద్యమాన్ని నడిపిస్తే నేతాజీ బ్రిటిష్ వారిని ఎదిరించడానికి సైన్యాన్నే తయారు చేశారు. ఆ సైన్యమే ఆజాద్ హింద్ ఫౌజ్.

మరో వంక బ్రిటిష్ పాలనను తట్టుకోలేక విప్లవకారులు భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి విప్లవ వీరులు విప్లవ మార్గంలో నడిచారు. ఎవరు ఏ దారిలో నడిచినా ధ్యేయం మాత్రం ఒకటే “స్వాతంత్ర్య సాధన”. స్వాతంత్ర్య సాధన కోసం ఎందరో తమ సర్వస్వాన్ని త్యాగం చేశారు. ఎందరో తమ తమ చదువులకు స్వస్తి చెప్పి, ఉద్యమంలో పాల్గొన్నారు. జైలుకెళ్లారు. కొందరైతే బ్రిటిష్ వారిని ఎదిరిస్తూ ఉరికంబాలపై వ్రేలాడారు. బ్రిటిష్ వారి తుపాకీ గుండ్లకు బలైపోయారు.

అయితే ఆనాడు స్వాతంత్ర్యోద్యమంలో పెద్దలతో పాటు చిన్నారులు కూడా పాల్గొన్నారు. వారూ పెద్దలకు తీసిపోనంతగా సాహసాలకు పూనుకున్నారు. బ్రిటిష్ వారిని ఎదిరించారు. జండాలను పట్టుకొని ఊరేగింపుగా వెళ్తూ బ్రిటిష్ వారు జరిపిన కాల్పులకు బలయ్యారు. అలాంటి చిన్నారుల జీవితాలు ఎంతో ధన్యమైనవి. ఈనాటి బాల బాలికలకు స్ఫూర్తిదాయకమైనవి.

ఇలా దేశం కోసం బలైన చిన్నారి త్యాగధనుల జీవిత విశేషాలను, ముఖ్యంగా వారి స్ఫూర్తిదాయకమైన ఘట్టాలను ఈనాటి బాలబాలికలకు తెలియజెయ్యాలి. వారిలో దేశభక్తినీ, త్యాగ నిరతినీ, పట్టుదలనూ కలుగజెయ్యాలి. అందుకు ఈ చిన్నారుల బలిదానాలే ఆదర్శం - స్ఫూర్తి దాయకం.

స్వాతంత్ర్యోద్యమంలో **1942** నాటి క్విట్ ఇండియా ఉద్యమం ఎంతో మహోజ్వలమైనది. ఈ ఉద్యమంలో పాల్గొనడానికి దేశమంతా కదలివచ్చింది. క్విట్ ఇండియా అంటే “ఇండియాను వదలి వెళ్లిపొండి” అనేనినాద మారు మ్రోగింది. జనమంతా కదలి వచ్చింది. అందులో బాలబాలికలు కూడా ఎంతో ఉత్సాహంతో

ముందుకు సాగారు. "స్వాతంత్ర్యం వర్ధిల్లాలి" – "వందే మాతరం" అంటూ వీధుల్లోకి ఊరేగింపుగా ముందుకు నడిచారు. బ్రిటిష్ వారి ఆజ్ఞలను లెక్కచేయక పెద్దలతో పాటు ముందుకు నడుస్తూ, బ్రిటిష్ కార్యాలయాలపై మన జెండాలను ఎగురవేసే కార్యక్రమాల్లో పాల్గొంటూ, బ్రిటిష్ వారిని ధైర్యంగా ఎదిరిస్తూ, బ్రిటిష్ వారు జరిపిన అమానుష కాల్పులకు బలైపోయారు.

ఆనాడు చిన్నారుల్లో ఇంతటి దేశభక్తి ఎలా నెలకొంది? పెద్దలనే అబ్బుర పరచేలా పిన్నలు కూడా ఎన్నో త్యాగాలకు, బలిదానాలకు పూనుకున్నారు. అందుకు ఆనాడు చిన్నారులు కావించిన కొన్ని బలిదానాలను, ఆనాటి కొన్ని సంఘటనలు తెలియజెయ్యాలి.

జండాను ఎగురవేస్తూ నేల కొరిగిన వీరులు

అది బీహార్‌లోని సచివాలయ ప్రాంతం. వేలాది మందితో కూడిన ఊరేగింపు ఒకటి అటు వైపుగా వస్తోంది. ఆ ఊరేగింపులో ఎంతోమంది బాల, బాలిక, విద్యార్థులూ ఉన్నారు. ఆ ఊరేగింపును చూసి బ్రిటిష్ ప్రభుత్వమే హడలిపోయింది. వెంటనే బ్రిటిష్ అధికారులు "ఎవరూ ముందుకు సాగడానికి వీలు లేదన్నారు". విద్యార్థులంతా ముందుకు వచ్చి ఈ ఊరేగింపు ఇలాగే ముందుకు సాగి తీరుతుందని అన్నారు ఆక్రోశం ప్రతిధ్వనించేలా.

అప్పుడా ఊరేగింపును సెమినరీ స్కూలులో చదువుతన్న చిన్నారి రామానంద్ నడుపుతున్నాడు. బ్రిటిష్ వారి అరుపులను లెక్కచెయ్యకుండా ఆ ఊరేగింపు అలాగే ముందుకు సాగింది.

"ఊ.... కానివ్వండి" అని ఆజ్ఞాపించాడు బ్రిటిష్ అధికారి. పోలీసులు కాల్పులు ప్రారంభించారు. ఒక గోలీ రామానంద్ ఛాతీ గుండా దూసుకు పోయింది. అయినా అతను చలించలేదు. "స్వాతంత్ర్యం వర్ధిల్లాలి" అంటూ గొంతెత్తి అరిచాడు.

మరొక గోలీ పొట్ట గుండా దూసుకు పోయింది. ఇక అతను నిలువ లేక పోయాడు. "భారత్ మాతాకీ జై!" అంటూ అలాగే నేలకొరిగాడు. అతని చేతిలో జెండా మాత్రం అలాగే నిలిచి ఉండింది.

తుపాకీ కాల్పులకు గురై నేల కొరిగిన రామానంద్‌ను, ఆ భయంకర దృశ్యాన్ని చూసి విద్యార్థులంతా పారి పోతారనుకున్నారు బ్రిటిష్ వారు. కాని అప్పుడలా జరుగ లేదు. ఆ దృశ్యాన్ని చూసిన విద్యార్థులు, బాల బాలికలు ఎంతో

పొంగి పోయారు. రామానంద్ చేతిలోని జాతీయ జెండా కింత పడక ముందే మరో విద్యార్థి జగపతి రామానంద్ చేతిలోని జండాను అలాగే తీసుకున్నాడు.

ప్రాణాలు పోయినా ఫరవాలేదు, కాని జాతీయ జండాను మాత్రం కింద పడనీయమనే విద్యార్థుల్లోని జాతీయాభిమానం, కార్య దీక్ష ఎంతేనీ కొనియాడ దగినవి. వెంటనే పోలీసులు జగపతిపై కూడా కాల్పులు జరిపారు. జగపతి కూడా అలాగే నేలకొరిగాడు.

జగపతి నుండి ప్రసాద్ ఝూ అనే మరో విద్యార్థి జండాను తీసుకున్నాడు కింద పడనీయకుండా. ఇలాగే ఎందరో బాల బాలికలు, ముక్కు పచ్చలారని చిన్నారులు ఒక్కరొక్కరుగా నేల కొరిగారు. కాని జండాను కింద పడనీయలేదు. చివరికి సచివాలయం మీద జండాను ఎగురవేసే తీరారు. అప్పుడు వారి ఆనందానికి అవధులే లేవు. ఆ చిన్నారుల్లో ఇంతటి దేశ భక్తి, దీక్ష, పట్టుదల ఎలా ఎచ్చాయో?

మరో సంఘటన

పాట్నాలోని అసెంబ్లీ భవనాన్ని వేల మంది యువకులు, బాల బాలికలు ఆక్రమించుకుని జండాను ఎగుర వేశారు. ఇది సహించలేని ఆంగ్లేయులు నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఎంతో మంది చిన్నారులు నేల కొరిగారు. వారిలో ఒక బాలుడు తుపాకీ గోలీలు చిక్కుకుని ఇంకా చావు బ్రతుకుల్లో ఉన్నాడు. బాలున్ని ఆస్పత్రిలో చేర్చారు.

ఆ బాలుడు "గోలీ ఎక్కడ చిక్కుకుందండీ? వీపులోనా? ఛాతీలోనా? అని డాక్టర్ని అడిగాడు". "ఛాతీలోనే" అని డాక్టర్ చెప్పగానే ఆ బాలుడి ఆనందానికి అవధులు లేకపోయాయి. అతను అమితానందంతో కళ్లుమూశాడు.

స్వాతంత్ర్యోమ కాలంనాటి ఇలాంటివే ఎన్నో అద్భుత సంఘటనలున్నాయి. చిన్నారుల్లో కూడా ఇంతటి దేశ భక్తి ఉందని తెలిస్తే మనం ఎంతో పొంగిపోతాం. ముఖ్యంగా చిన్నారులు ఇలాంటి సంఘటనలు తెలుసుకొని ఎంతగానో పొంగిపోతారు. ఇలాంటి అవకాశాలను మనం కల్పించాలి. వారిలో దేశభక్తిని రగిలించాలి. అది వారికి భవిష్యత్తులో తోడ్పడుతుంది.

# 25. జాతీయ గీతాల పట్ల ప్రదర్శించాల్సిన గౌరవభావం

"వందే మాతరం", "జనగణమన" గీతాలు మన జాతికే ఉత్తేజకర గీతాలు. ఈ గీతాలు మన జాతి వైభవాన్ని, జాతి సంపదను, సంస్కృతిని మనకు గుర్తు చేసి మనస్సును పులకింపజేస్తాయి.

ఈ గీతాలను విన్నప్పుడు మన హృదయాలు గర్వంతో పొంగిపోతాయి. మన దేశం పట్ల, మనకో అపూర్వ గౌరవ భావం ఏర్పడుతుంది. దేశభక్తి మనలో నిండిపోతుంది. ఈ రెండు గీతాలూ మనను ముగ్ధులను చేసేవే.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రతి సమావేశంలో ఆరంభంలో వందే మాతరం గీతం, సభానంతరం జనగణమన గీతాన్ని ఆలపించే సంప్రదాయం, ఆనవాయితీ అమలులోకి వచ్చాయి. ఈ గీతాలను ఆలపిస్తే మనలో దేశభక్తి భావన పెంపొందాలనీ, దేశం యెడల ప్రేమ, గౌరవభావం అంతరించి పోకుండా ఉండాలనీ అసలు ఉద్దేశ్యం.

ప్రభుత్వ, ప్రభుత్వేతర సమావేశాల్లో, జాతీయ పర్వదినాల్లో, విద్యాలయాల్లో అయితే ప్రతి రోజూ ఆరంభంలో వందేమాతరం, చివర్లో జనగణమన గీతాలు ఆలపించబడాలనే నిబంధనలు కూడా ఉన్నాయి. చివరికి సినిమా హాళ్లలో కూడా సినిమా అయిపోగానే జనగణమన గీతం ఆలపించాలనీ, గీతం ఆలపించబడేటప్పుడు అంతా కదలకుండా నిలబడాలనీ నిబంధనలున్నాయి.

జాతీయ పర్వదినాల్లో ఆగస్టు 15 (స్వాతంత్ర్య దినోత్సవం), జనవరి 26 (గణతంత్ర దినోత్సవం), పర్వదినాల్లో జాతీయ జండా ఎగురవేసేటప్పుడు జండా పైకి ఎగురగానే జనగణమన జాతీయ గీతం సామూహికంగా ఆలపించాలనే నిబంధనను పాటిస్తున్నాం.

అయితే ఇపుడు జాతీయ పర్వదినాల్లో జండా ఎగిరేటప్పుడు మాత్రం జనగణమన జాతీయ గీతం ఆలపించబడుతున్నది. మిగిలిన సమావేశాల సందర్భాలలో వందేమాతరం, జనగణమన గీతాలాపన సంప్రదాయానికి ఇంచుమించు స్వస్తి చెప్పబడినట్లే.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ గీతాలు వినిపించినప్పుడు ఎంతో చైతన్యాన్ని కలిగించేవి. స్వాతంత్ర్యం రావడానికి ఈ గీతాలు ఎంతో ప్రేరణనిచ్చాయి. ఎందరినో దేశభక్తులనుగా, సమర యోధులనుగా తీర్చిదిద్దాయి. ఈ రెండు గీతాలకూ ఎంతో చరిత్ర ఉంది.

వందే మాతరం

వందే మాతరం గీతాన్ని బంకిం చంద్ర చటోపాధ్యాయ రచించారు. **1904**లో బంకించంద్ర చటోపాధ్యాయ వందేమాతరం గీతాన్ని సంస్కృతంలో రాశారు. కొద్ది రోజుల్లోనే ఈ గీతం ప్రజల్లో ఎంతో ప్రేరణను కలిగించింది. దేశం పట్ల గౌరవాన్నీ, అభిమానాన్నీ కలుగజేసింది. ఈ గీతం వచ్చిన సమయం ఎలాంటిదంటే దేశంలో అప్పుడప్పుడే స్వాతంత్ర్యోద్యమ బీజాలు అంకురిస్తున్నాయి.

మొట్టమొదటి సారిగా **1905** ఆగస్టు **7**న "వందేమాతరం" పేరున ఒక జండాను ఎగురవేసి ఈ గీతాన్ని పాడారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ గీతం ఇలా ప్రాణం పోసుకుంది. అప్పటినుండే ఈ గీతానికి ఆదరణ పెరగసాగింది.

ఈ గీతానికి కొత్తదనాన్ని కలిగించారు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్. ఆయన ఈ గీతానికి రాగం, సంగీతం సమకూర్చారు. అప్పటి కాంగ్రెస్ సభల్లో ఈ గీతాన్ని పాడే వారు. అలా ఈ గీతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. అందరి నోటా జపమంత్రమైంది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో బ్రిటిష్ వారిని ఈ దేశం నుండి తరిమివేయడానికి అంతా త్రివర్ణ పతాకాలను చేతబట్టి "వందేమాతరం" అంటూ ముందుకు సాగారు. అలా ఈ గీతం భారతీయులను చైతన్యులను చేసింది. జైళ్లలో దేశభక్తులు ఈ గీతాన్ని ఆలపిస్తూ లాఠీ దెబ్బలు తిన్నారు. శిక్షలను అనుభవించారు.

"వందేమాతరం" సారాంశం

భారత దేశంలోని నదులనూ, ప్రకృతి శోభనూ మన సంపదగా చిత్రీకరించిన గీతం ఇది. భాతరమాతను చిరునవ్వుతో, తీయని మాటలతో, ఆనందంతోనూ, కోర్కెలను తీర్చే దేవతగా, ఈ మాతృమూర్తిగా వర్ణిస్తూ ఆ తల్లి ధ్యానంలో మనమంతా మునిగి పోవాలని కోరాడు బంకించంద్ర. కోట్లాదిమంది భారతీయుల హృదయ మందిరాల్లో నివాసముండే తల్లి – ప్రతి ఇంట్లోనూ తల్లి భారతిని ప్రతిష్టించి పూజించాలి. అలా భారతీయుల జీవన మంత్రం "వందే

మాతరం" గీతం.

వందే మాతరం, వందేమాతరం

సుజలాం, సుఫలాం మలయజ శీతలాం

సస్యశ్యామలాం మాతరం వందేమాతరం

శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం

పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం

సుహాసినీం సుమధుర భాషిణీం

సుఖదాం వరదాం మాతరం వందే మాతరం

ఇప్పుడూ, ఎప్పుడూ ఈ గీతం జాతీయతకు ఆత్మ. భారతదేశంలోని కోట్లాది ప్రజల నాల్కలపై జాతీయ గీతంగా నిలబడింది. ఆనాడు గాంధీజీ తాను రాసే ప్రతి ఉత్తరంలోనూ "వందేమాతరం" అని సంభోదిస్తూ రాయడం ప్రారంభించారు. సభల్లో "వందే మాతరం" అంటూ తప్పకుండా చెప్పేవారు.

జనగణమన

మరో మహత్తరమైన జాతీయ గీతం "జనగణమన". ఈ గీతం బెంగాలీ బాషలో **31** చరణాల్లో తొలుత విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించారు. ఇప్పుడు **7** చరణాలను మాత్రం మన జాతీయ గీతంగా ఆలపిస్తున్నాం. దీని భావం ఇలా ఉంది.

జన సమూహానికి అధినాయకుడైన ఓ భారతదేశ సౌభాగ్య విధాతా! నీకు జయము కలుగుగాక - పంజాబ్, సింధ్, గుజరాత్, మరాఠ, ద్రావిడ, ఉత్కళ, వంగ ప్రాంతాలు, వింధ్య, హిమాచల పర్వతాలు, గంగాయమునా నదులు, ఉప్పొంగుతున్న సముద్ర తీరాలు నీ మంగళ ప్రదమైన నామాన్ని స్మరించుకుని మేల్కొంటున్నాయి. నీ శుభాశీస్సులను కోరుతున్నాయి. నీ జయగాథలను గానం చేస్తున్నాయి. జనులకు మంగళ దాయక భాగ్యవిధాతా! నీకు జయము కలుగుగాక.

ఎన్నో రకాల బాణీలతో పాడిన ఈ గీతానికి నేడు మనం పాడుకునే బాణీని కూర్చినది **1919**లో. ఈ సంవత్సరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లిలోని థియోసాఫికల్ కాలేజీ హాస్టల్‌లో విశ్రాంతి పొందారు. ఈ

సమయంలో శ్రీమతి మార్గరెట్ కజిన్స్ ఈ గీతానికి చక్కని వరుస కూర్చి పాడారు. ఠాగోర్ అప్పుడు ఎంతో పరవశించి పోయారు. ఆమె కూర్చిన బాణీలోనే ఈ గీతం ఆలపిస్తున్నాం. ఇలా మన దేశ జాతీయ గీతానికి మన ఆంధ్ర రాష్ట్రంతో స్వర కల్పిన కావించబడడం మనకెంతో గర్వ కారణం.

**1911** డిసెంబర్ **27**న మొదటిసారిగా బహిరంగంగా వేదిక మీద "జనగణమన" గీతాలాపన జరిగింది. ఈ గీతంలో జాతికి విధేయతను ప్రకటించడం ఉందని భావించారు.

**1911**లో కాంగ్రెస్ సమావేశంలో ఆలపించిన ఈ గీతం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. **1950** జనవరి **24**న జరిగిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో అప్పటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ దీనిని జాతీయ గీతంగా అధికారికంగా ప్రకటించారు. అలాగే "వందేమాతరం" గీతానికి సమానప్రతిపత్తి ఇచ్చారు.

ఈ రెండు జాతీయ గీతాలనూ చిన్నారులకు కంఠత్వం చేయించాలి. వారి చేత ప్రతి రోజూ పాడించాలి. అలా బాలబాలికల్లో దేశం పట్ల ప్రేమనూ, అభిమానాన్నీ, భక్తినీ గౌరవాన్నీ పెంపొందించాలి. మన దేశమంటే గర్వపడేలా చెయ్యాలి.

# 26. మన మువ్వన్నెల జెండా (త్రివర్ణ పతాకం)తో స్ఫూర్తి

మన జాతీయ త్రివర్ణ పతాకం వినువీధిలో రెపరెపటాడుతుంటే చూసి, సగర్వంగా, సహర్షంగా వందనం చేయని భారతీయుడుంటాడా! అసలు మన త్రివర్ణ పతాకం, మువ్వన్నెల జండాను చూడగానే ప్రతి భారతీయునిలో చెయ్యెత్తి కొలిచేటంతటి భక్తి, శ్రద్ధలు కలుగుతాయి.

జాతిజనులను ఒక్కతాటిపై నడిపించి, బ్రిటిష్ పాలకుల గుండెల్లో గుబులు పుట్టించిన మన జెండాకు వందేళ్ళ చరిత్ర ఉంది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతి, మత, కుల విభేదాల కతీతంగా అంతా దృఢ నిశ్చయంతో ముందుకెళ్లారు. ఇది మన జాతి, ఇది మన సంస్కృతి అని తెలుసుకో గలిగేంతటి ఆలోచన అందరిలో రాసాగింది. ప్రతి ఒక్కరికీ మన జాతిని, మన సంస్కృతికి గూర్చి తెలియజెప్పటం అంత సులువైన పని కాదు. ఏదైనా ఒక నిర్దిష్టమైన చిహ్నాన్ని చూడటంతోనే దేశాభిమానం, జాతీయభిమానం కలగాలి. దీని వల్ల జాతి అంతా ఏకం కావడానికి అవకాశం ఏర్పడుతుంది.

బ్రిటిష్ పాలన నుండి మన జాతి విముక్తి పొందాలంటే జాతి అంతా ఏకం కావాలంటే అందరిలో జాతీయ భావం ఏర్పడాలి. అది ఎలా ఏర్పడుతుంది? ఓ ప్రత్యేక చిహ్నం ద్వారానే ఏర్పడుతుంది.

ఆ ప్రత్యేక చిహ్నమే మన జాతీయ జెండా. ఆ జెండా భారతీయ సంస్కృతినంతా ప్రతిబింబింప చేస్తూ ప్రతి భారతీయుని హృదయంలో స్వాతంత్ర్య పిపాసనూ, జాతీయ అభిమానాన్నీ కలిగించాలి. విభిన్న భాషలు, విభిన్న మతాలు కోకొల్లలుగా ఉన్న ఈ విశాల భారతదేశానికి భారతీయులందరినీ సమైక్య పరచ గల జెండా కావాలి.

ఖండాంతరాలలో కూడా భారత జాతి ఖ్యాతిని వేనోళ్లా చాటి విజయాన్ని చేకూర్చ గలదిగా ఉండాలి. భారత స్వాతంత్ర్య పోరాటం తొలి దశలో ఉన్నప్పుడు మన కొక ప్రత్యేక జాతీయ పతాకం లేదు. జాతీయ సమావేశాలలో కూడా పరాయి దేశపు పతాకాలను ఉపయోగించే వాళ్లం.

ఈనాటి జాతీయ పతాకం నమూనా త్రివర్ణ పతాకాన్ని 1931లో కాంగ్రెస్ అధికార పూర్వకంగా ఆమోదించింది. దీనిలో మూడు సమానమైన అడ్డభాగాలున్నాయి. పై భాగం ఎరుపు కేసరి వర్ణం – మధ్య భాగం పసుపుపచ్చ, కింది భాగం ఆకు పచ్చ, ఎరుపు భాగంలో ఎనిమిది తెల్ల పద్మాలు ఒక వరుసలో ఉండేవి.

పసుపు పచ్చ భాగంలో "వందేమాతరం" అనే అక్షరాలు దేవనాగరి లిపిలో ముదురు నీలం రంగులో ఉండేవి. అడుగు నుండే ఎరుపు రంగులో ఎడమ వైపు సూర్యుడు, కుడి వైపు నెలవంక, నక్షత్రం ఉండేవి. ఆ రోజుల్లో దీనిని వందేమాతరం జండా అని పిలిచారు.

రెండవ జాతీయ పతాకం 1907లో ప్యారిస్ నగరంలో ఎగురవేయబడింది. ఇందులో కొంత మార్పు జరిగింది.

మూడవ జాతీయ పతాకం 1917లో ఎగురవేయబడింది. అయితే 1905లోనే మేడం కామా కొన్ని మార్పులతో తయారు చేసి ప్యారిస్ నగరంలో ఎగుర వేశారు.

పింగళి వెంకయ్య కూర్చిన మూడురంగుల జెండా

ఆంధ్ర దేశంలోని మచిలీపట్నంకు చెందిన పింగళి వెంకయ్య 1907లోనే మాతృదేశానికి ఒక జెండాను తయారు చేయడానికి పూనుకున్నారు. ఆయన దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగే ప్రతి జాతీయ మహాసభకూ హాజరై నాయకులందరితోనూ జాతీయ పతాకం గూర్చి చర్చలు జరిపారు. చివరికి ఆయన ఎరుపు, ఆకుపచ్చ రంగులు కలిగిన, మధ్యరాట్నం చిహ్నం కలిగిన జాతీయ జండాను కూర్చారు.

1921లో విజయవాడలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగినప్పుడు గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిచారు. కొన్ని సూచనలిచ్చారు. వెంకయ్యగారు ఆ సూచనల మేరకు పతాకాన్ని కూర్చారు.

1916లో లక్నోలో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహా సభ సమావేశంలో ప్రప్రథమంగా వెంకయ్య తయారు చేసిన జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు.

మన జాతీయ జెండా భారత జాతి కంతటికీ ఏకైక దైవంగానూ,

లక్ష్యంగానూ, ఉపయోగిస్తుంది. జాతీయ ఐక్యతను ఎంతగానో తోడ్పడుతుంది. భారతీయుల్లో రెట్టింపు శక్తినీ, ధైర్యాన్ని రేకెత్తిస్తుంది. జాతినంతటినీ త్యాగమూర్తులను తయారు చెయ్యగలిగిన మహత్తర శక్తి మన జాతీయ పతాకంలో ఉంది.

మన పతాకంలోని కేసవ వర్ణం ధైర్యానికీ త్యాగానికీ చిహ్నం. తెలుపు అహింసకూ సత్యానికీ శాంతికీ చిహ్నం. ఆకుపచ్చ సస్యశ్యామలానికీ, విశ్వాసానికీ, ఔదార్యానికీ చిహ్నం. మొదట్లో చేర్చిన చరఖా చిహ్నం స్వాతంత్ర్య సమరానికి స్ఫూర్తి నిచ్చింది.

ఆ తరువాత చరఖా బదులు చక్రంతో తయారైంది. ఇది ధర్మ చక్రం. క్రీ.పూ. మూడవ శతాబ్దంలో అశోక చక్రవర్తి సారనాథ్ వద్ద ఒక స్థంభాన్ని నిలిపాడు. ఆ స్థంభం చివర ఉన్న సింహ ఆమలకు ఫలకం మీది ధర్మ చక్రానికి ప్రతిరూపమే మన జాతీయ పతాకంలోని చక్రం. ఈ చక్రంలో **24** ఆకులుంటాయి. పన్నెండు శుక్ల పక్షాలూ, పన్నెండు కృష్ణ పక్షాలూ. ఇవి వెన్నెలకూ, చీకటికీ, కష్టాలకూ, సుఖాలకూ గుర్తులు.

అంతే కాదు హిందువుల యెడ ఎరుపులో, ముస్లింల యెడ పచ్చరంగులో, ఇతర మతాల వారి యెడ తెలుపుతో వెలుగొందుతుంది మన జెండా. ఇలా మన జాతీయ జెండా ప్రతి మతం వారికీ జాతీయ జెండా పట్ల గౌరవ భావం ఏర్పడుతుంది.

మన జాతీయ పతాకం మన జాతికి ఉత్తేజాన్ని కలుగజేస్తుంది. జాతీయాభిమానాన్నీ, దేశభక్తినీ ప్రేరేపింపజేస్తుంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో మన దేశంలోని ఎందరినో ఈ పతాకం స్ఫూర్తిని కలుగ జేసింది. దేశ భక్తిని పెంపొందించింది.

# 27. బాల్య వివాహాలు భవిష్యత్ జీవితానికి శాపాలు

ఈ మధ్య గుంటూరు జిల్లాలోని ఒక పాఠశాలలో పన్నెండేళ్ల చిన్నారులు తాళికట్టుకొని పాఠశాలకు వచ్చిన ఉదంతం ఒకటి బయటికి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తరువాత కూడా మనం ఇంకా పాత కాలంలోనే ఉన్నామా? అని అనిపిస్తోంది.

ఈ వార్త విన్న వారంతా బాల్య వివాహాలా అని విస్తుపోతున్నారు. అవి ఇంకా జరుగుతున్నాయా? ఎక్కడ మన రాష్ట్రంలోనేనా? అని సభ్య సమాజం బింకంగా పలికే మాటలివి. కానీ ఒకసారి సర్వేలలో తేలిన గణాంకాలకు వెళ్తే కేవలం మన రాష్ట్రంలోనే **54.7** శాతం వివాహాలు ఆడ పిల్లలకు **18** ఏళ్లు నిండక ముందే జరుగుతున్నాయని **2005-06** నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే నిజాన్ని తెలియజేస్తోంది.

దేశంలో బాల్య వివాహాలు సగటు **44.5** శాతాన్ని మించిపోవడాన్ని బట్టి మనం బాల్య వివాహాల విషయంలో ఎంత వేగంగా ముందుకెళ్తున్నామో ఇట్టే తెలిసిపోతుంది. బాల్య వివాహాల నేపథ్యంలో పెళ్లి, వైధవ్యం వంటి భారమైన జీవితంలో ఎన్నో కఠోరమైన అనుభవాలు, దుఖాలు, బాధలు పిడుగుల్లా దొర్లుతున్నాయి.

పేదరికంలో మ్రగ్గుతున్న ఎందరో తల్లిదండ్రులకు భారమౌతోన్నందున అమ్మాయిల బాల్య వివాహాలు కొన్ని తప్పనిసరి అవుతున్నాయి. కొందరైతే ఛాందస భావాలతో అమ్మాయిలకూ, అబ్బాయిలకూ చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసేస్తున్నారు. పేదరికం మూలాన తల్లిదండ్రులు పసివాళ్లను, తెలిసీ తెలియని వయస్సులో ఉన్న బాలికలను వయసు మీరిన వారికి కట్టబెట్టి తమ బాధ్యతలను తీర్చుకుంటున్నారు. ఆటలు, పాటలు చదువు సంధ్యలతో కేరింతలు కొట్టాల్సిన బాల్యంలోనే పెళ్లిళ్లు చేసి తమ బాధ్యతలను ముగించుకుంటున్నారు. కాని వారి భవిష్యత్ జీవితాలను గూర్చి ఇసుమంతైనా ఆలోచించడం లేదు.

పసితనంలోనే పెళ్లి జరిగి విధవరాళ్లైన వారికి ఈ మధ్య ప్రభుత్వం కల్పిస్తున్న కొన్ని పథకాలు ఆసరా కల్పిస్తున్నాయి. కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థల

నుండి కొద్ది మందికి మాత్రమే సహాయం అందుతోంది. ఇలాంటి సహాయం కూడా దొరక్క ఎందరో అభాగినులు బతుకు భారంగా వెళ్లదీస్తున్నారు.

కొన్ని సంఘటనలు మరీ ఘోరంగా ఉంటున్నాయి. చిన్న తనంలోనే పెళ్లిళ్లు – అంతలోనే విడాకులు, మెట్టినింట వేధింపులు, విడాకులు అన్నీ తనకు తెలియకుండానే పరిణతి లేక ముందే జరిగి పోతుంటాయి. ఇలాంటి సంఘటనలు జరిగిన తరువాత కళ్లు తెరుస్తున్న వారుంటున్నారు. చిన్నతనంలోనే పెళ్లి చేయకుండా కొంత వరకు చదివిస్తే ఇలాంటి పరిస్థితుల్లో తమ కాళ్ల మీద వారు నిలబడేవారు కదా అని రోదిస్తున్న తల్లిదండ్రులెందరో.

ఎంతో మంది అభాగినులు తమ బతుకు ఇలా గంగలో కలిసి పోయింది కాని తన పిల్లల బతుకులు అలా కావడానికి వీలులేదని పట్టుదలతో చదివించే వారూ ఉంటున్నారిప్పుడు.

చిన్నతనంలోనే పెళ్లిళ్లు జరుపుకుంటున్న అమ్మాయిలు మరి కొన్ని కఠోర సమస్యలకు గురి అవుతున్నారు. చదువుకోవలసిన వయస్సులో పెళ్లిళ్లు, సంసార బాధ్యతలు నెత్తిన పడుతున్నాయి. అత్త వారింటిలో ఇంటి పనులు చెయ్యాలి. బయటికి వెళ్లి కూలీ పనులు చెయ్యాలి. ఈ లోపల గర్భం ధరిస్తే ఆరోగ్య సమస్యలు – ఇలా ఇంకా ఆడ పిల్లలను కూలీ డబ్బులు సంపాదించే యంత్రాల్లానే చూస్తున్నారు కొందరు. ఇలాంటి పరిస్థితుల్లో అత్తింట్లో ఏ చిన్న పొరపాట్లు జరిగినా వేధింపులు తప్పవు.

ఇలాంటి వాటిని తట్టుకోలేక కొందరు విడాకులు తీసుకుంటున్నారు. మళ్లీ చదువుపై దృష్టి పెడుతున్నారు.

సాఫీగా సాగాల్సిన జీవితాల్లో బాల్య వివాహాలు ఎన్నో సుడిగుండాలను సృష్టించి పసి హృదయాలను ఎన్నో అష్ట కష్టాలకు బలిచేసి కృంగదీస్తున్నాయి.

సమాజం ఛాందస భావాల నుండి బయట పడి బాల్య వివాహాలకు స్వస్తి చెప్పనంత వరకు లేత బతుకులు యిలా మాడి మసై పోతూనే ఉంటాయి.

## 28. విలువలను తెలుసుకో జాగ్రత్తగా మసలుకో

**జీవితంలో ప్రతీ క్షణం విలువైనదే**

జీవితంలో ప్రతి క్షణాన్నీ విలువైనదిగా భావించాలి. కాలం, ప్రవాహం ఎవ్వరికోసమో ఆగవు. ఇపుడు జరుగుతున్నదీ, నిన్న జరిగిందీ పరిగణనలోకి తీసుకోబడుతుంది. రేపటి దానిని గూర్చి నిర్దిష్టంగా చెప్పలేం. అసలు "రేపు"నకు రూపే లేదంటారు.

అందుకే కబీర్ ఏమన్నాడంటే రేపు చేసేది ఈ రోజే చెయి. ఈ రోజు చేసేది ఇప్పుడే చెయ్యి. కాలం మనకోసం నిలువదు. అందుకని ప్రతి ఒక్కరూ వివేకంతో ప్రతీ క్షణాన్నీ సద్వినియోగం చేసుకోవాలి. మనం ఆగినా, ఆలస్యం చేసినా కాలం మాత్రం ఆగకుండా తన పనిని చేసుకుంటూ పోతుంది. కాలం ఓ ప్రవాహంలా ఆగకుండా ముందుకు సాగుతుంది.

రేపటికీ, నేటికీ మధ్య ఎంతో అంతరం ఉంటుంది. చేయాల్సిన పనికి ఏదైనా అంతరాయం ఏర్పడవచ్చును. అందువల్ల రేపు చేయాల్సిన పనిని సహితం ఈరోజే చేసుకో. అదెంత పని ఎప్పుడైనా చేసుకోవచ్చులే అంటూ వాయిదా వేస్తే అది ఏనాటికీ పూర్తి కాదు. అంతే కాదు క్షణకాలంలోనే అదృష్టం, అవకాశం చేజారిపోయే ప్రమాదం ఉంది.

ఏమైనా విద్యార్థులెప్పుడూ ఈ జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామా? లేదా? కనీస జాగ్రత్తలు తీసుకుంటున్నామా? అని ఆలోచించుకోవాలి. మదింపు చేసుకోవాలి. అన్ని పనులనూ నిర్ణీత సమయానికే చేసుకుంటూ పోవాలి.

# సన్మార్గం దిశగా పయనించు

గౌతమ బుద్ధుడు తన శిష్యులకు సందేశమిస్తూ ఇలా అన్నాడు. "సన్మార్గం మానవ జీవితానికి వెలుగు రేఖ వంటిది". మంచి మార్గంలో నడిచిన వాడే మహా పురుషుడవుతాడు.

ప్రతి ఒక్కరూ పైపై మెరుగుల ప్రాధాన్యత నివ్వక అంతః సౌందర్యానికి అంటే మంచి గుణ గణాలను కలిగి ఉండే తీరుకే ప్రాధాన్యత నివ్వాలి. అలా పెద్దలు చెప్పిన విధానాలను అలవర్చుకొని నిన్ను నీవు తీర్చిదిద్దుకో. అదే శాశ్వతమైంది. ఇలా పై పై ఆడంబరాలకు పోకుండా అంతః సౌందర్యాన్ని పెంపొందికుకున్న వారే గొప్ప వారయ్యారు. ఆదర్శ పురుషులయ్యారు.

పాలకులు కూడా సన్మార్గంలో నడుస్తూ ధర్మపాలను కొనసాగించాలి. వారిని అనుకరించే ప్రజలు మెదులుతారు. అలాగే తల్లిదండ్రులు కూడా సన్మార్గంలో నడవాలి. పిల్లలు తల్లిదండ్రులను ఎప్పుడూ అనుకరిస్తుంటారు కాబట్టి తల్లిదండ్రులు ఎప్పుడూ మంచి మార్గంలోనే నడవాలి.

# సజ్జన సాంగత్యాన్ని కోరుకో

పిల్లలెప్పుడూ సజ్జనులతోనే అంటే మంచి వారితోనే స్నేహం చెయ్యడానికి ఇష్టపడాలి. మంచివారిని ఎన్నుకోవడంలో అటు తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులు తోడ్పడాలి.

ఆరు నెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారు, వీరు వారవుతారు అని అంటారు. అందువలన సజ్జనులను ఎంపిక చేసుకొని వారితో స్నేహం చేస్తే స్నేహం చేసిన వారు మంచి వారవుతారు. అలా వారు మంచివారు గానే చెలామనీ అవుతారు. ఇలా సజ్జనులతో స్నేహం చెయ్యడం వల్ల వారికి సద్గుణాలు అలవడుతాయి. సద్గుణాలు కలిగిన వారు నిర్మలమైన మనస్సుతో మెదులుతారు. దీంతో మనస్సులో ప్రశాంతత ఏర్పడుతుంది. అదే మనశ్శాంతిని కలుగుజేస్తుంది.

మనం మంచి స్నేహితునితో కలిసిమెలిసి తిరుగుతుంటే అతడు మన చేత మంచి పనినే చేయిస్తాడు. అలా కాక చెడ్డవానితో స్నేహం చేసే అతడు మనకు దురవాట్లనే నేర్పుతాడు. తాగుడు, బీడీలు (పొగ పీల్చడం)లాంటి అలవాట్లు సామాన్యంగా చెడు స్నేహం వల్లనే అలవడుతాయి. చెడు వాళ్లు ఎప్పుడూ చెడు పనులను, తప్పుడు పనులనే ప్రోత్సహిస్తారు. తాను చెడిపోవడమే కాక ఎదటి వారినీ చెడగొడతారు.

అందు వలన చెడ్డవారితో స్నేహం చెయ్యక మంచి వారినే ఎంచుకోవాలి. ఇందుకు తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ పిల్లలను అడుగడుగునా గమనిస్తూ ఉండాలి. పర్యవేక్షిస్తూ ఉండాలి.

గాంధీజీ కూడా చిన్న తనంలో చెడ్డ అలవాట్లకు పాల్పడి తొందరలోనే తన తప్పును తెలుసుకున్నాడు. అందుకే ఆయన తన జీవితాన్ని మంచి మార్గంలో నడిపించుకుంటూ ఇంత గొప్పవాడయ్యాడు.

# శాంత చిత్తం

"తన కోపమే తన శత్రువు, తన శాంతమే తనకు రక్ష" అని వింటూ ఉంటాం. మనిషి ఎప్పుడూ కోపానికి లోనుకాకుండా ప్రశాంతంగా శాంత చిత్తంతో ఉండడానికి ప్రయత్నం చెయ్యాలి. కోపం ఎప్పుడూ మనిషిని పతనానికే చేరుస్తుంది. కోపం వచ్చే పరిస్థితి ఎప్పుడైనా కలిగితే కాసేపు ఆలోచించాలి. దీంతో కొంత మేరకు కోపం తగ్గిపోతుంది. ఇంకా కొంచెం ఆలోచిస్తే పూర్తిగా తగ్గిపోతుంది.

అసలు కోపడానికి కారణం అహంకారం. నేను అని గర్వ పడితే, నన్ను మించిన వారెవరూ లేరని గర్వపడితే కోపం దానంతటి కదే వస్తుంది.

కోపంతో కాలిపోయేవారు ఎప్పుడూ మనశ్శాంతిని కోల్పోయి నరకాన్ని అనుభవిస్తారు. మనశ్శాంతిని కోల్పోయిన వారి బ్రతుకు నరకమౌతుంది. ఎంత సంపద, డబ్బు ఉన్నా మనశ్శాంతి లేకపోతే జీవితం వృథానే అవుతుంది. అదే డబ్బులేకున్నా మనశ్శాంతి ఉంటే చాలు గుక్కెడు మంచి నీళ్లు త్రాగి అయినా ప్రశాంతంగా ఉండవచ్చును.

ఎప్పుడూ అత్యాశను పెంచుకొని దానిని సాధించలేక నిరాశ పడుతూ జీవితాన్ని గందరగోళం చేసుకోగూడదు. అలాగే అధిక సంపాదనను కోరి, సంపాదనను పెంచుకొని మనశ్శాంతిని కరువు చేసుకోగూడదు.

ఇలాంటి తీరుతెన్నులను చిన్నప్పుడే తెలియజేస్తూ పిల్లల్ని మంచి దారిలో నడిపించాలి.

# కలిమి వేములు, కష్ట సుఖాలు

మానవ జీవితంలో కష్టాలూ, సుఖాలూ ఎదురవుతుంటాయి. వ్యక్తి కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోయి నిరాశ పడకూడదు.

అలాగే సుఖశాంతులు ఎప్పటికీ ఇలాగే ఉంటాయని నిబ్బరంగా ఉండకూడదు. సామాన్యంగా మానవుడు ఉన్న దాంతో తృప్తి పడక గొప్ప గొప్ప పోకడలకు పోయి దుఖాన్ని, కష్టాలను కొని తెచ్చుకుంటాడు. అందుకే ప్రతి ఒక్కరూ ఉన్నదాంతోనే సంతృప్తి చెందుతూ మనస్సును అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నం చెయ్యాలి. మనిషి తన స్థాయికి మించిన కోరికలను కోరుకున్నప్పుడు కలిగేది దుఖమే – కష్టాలు ఎవరో తెచ్చిపెట్టినట్టు ఉండదు. మన దుఖానికి మనమే కారణం.

మనకు కష్టాలు వస్తే కష్టాలను ఎదుర్కొనే ధైర్యం ఉండాలి, కష్టాల నుండి బయట పడే తీరును గూర్చి ఆలోచించాలి. అప్పుడే మనస్సును అదుపులో పెట్టుకోవాలి.

జీవితంలో వచ్చే ఇలాంటి సంఘటనలను గూర్చి ఇంట్లో తల్లిదండ్రులూ, పాఠశాలలో ఉపాధ్యాయులూ చెబుతూ పిల్లలను తయారు చెయ్యాలి. కష్టం వెనకనే సుఖం ఉంటుందని వారికి నమ్మకాన్ని కలిగించాలి.

# మంచి వ్యక్తిత్వమే సౌభాగ్యం

మంచి శీలం అంటే మంచి వ్యక్తిత్వమే మానవున్ని ఉన్నత మార్గాల వైపు నడిపిస్తుంది. వ్యక్తిత్వమే మానవుణ్ణి అన్ని విధాలుగా తీర్చి దిద్దుతుంది. ఏ దేశ చరిత్రలో అయినా గొప్పవారు తమ వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకోవడం ద్వారానే మహా పురుషులైనట్లు కనిపిస్తుంది.

మంచి వ్యక్తిత్వముంటే అందరూ హర్షిస్తారు. మంచి వ్యక్తిత్వమున్న వారినే ఆదరిస్తారు. ప్రతి వ్యక్తీ తన వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకోడానికి ప్రయత్నం చెయ్యాలి. అలా మంచి వ్యక్తిత్వమున్న వ్యక్తికి అన్ని సంపదలున్నట్లే భావించాలి. ఎన్ని సంపదలున్నా మనిషిలో వ్యక్తిత్వం కనుక లేకపోతే సమాజంలో ఎలాంటి గౌరవం ఉండదు. మంచి వ్యక్తిత్వం కనుక లేకపోతే అలాంటి జీవితం ఎదటి వారికేమో గాని తన జీవితం తనకే ఉపయోగపడదు.

మన దేహానికి ఎముక ఎంత ముఖ్యమో ఉత్తమ జీవితానికి మంచి వ్యక్తిత్వం కూడా అంతే ముఖ్యం. ప్రతి ఒక్కరూ తమ మిత్రులే కాదు శత్రువులు కూడా మెచ్చుకోదగిన విధంగా వ్యక్తిత్వాన్ని పెంపు చేసుకోవాలి.

మొదట ఇళ్లల్లో తల్లిదండ్రులు, మిగిలిన సభ్యులు వ్యక్తిత్వాన్ని పెంపు చేసుకొని ఆదర్శ పురుషులుగా మెదలాలి. పిల్లలు వారిని అనుసరిస్తారు, అనుకరిస్తారు కాబట్టి అలా ఏ మంచి విషయాల విషయంలోనైనా తల్లిదండ్రులే ఆదర్శనీయులు కావాలి.

# విశాల దృక్పథాన్ని అలవర్చుకో

ఇపుడు మానవుడు అన్ని పరిధులనూ దాటుకొని "విశ్వ మానవుడు"గా ఎదుగుతున్నాడు. "నేను", "నా" అనే బావన పోయి "మన" అనే భావన ఇపుడు మనషుల్లో కలుగుతోంది. ఇలాంటి భావనను పిల్లలకు చిన్నతనంలోనే కల్పించాలి.

ఇపుడు మనం దూరాన్ని జయించాం. ఇపుడు ప్రపంచమంతా ఒక పల్లెలా మారింది. ప్రపంచంతో మన సంబంధాలు పెరుగుతున్నాయి. ఇలా "నా" అనే భావన నుండి "మా" అనే భావనకు విస్తరించిపోతోంది ఇపుడు ప్రపంచం. అలా మన ఆలోచనలు కూడా విస్తృతం కావాలి. మన భావాలతో పాటు మన చర్యలు కూడా విస్తృతం కావాలి.

తన కుటుంబాన్నీ, తన సంస్కృతినీ కాపాడుకుంటూనే ఇతర ప్రాంతాల, దేశాల సంస్కృతులను అవగాహన చేసుకోవాలి. "విశ్వమానవుడు"గా ఎదగడానికి ప్రయత్నం చెయ్యాలి. ఇలాంటి భావనను పిల్లలకు ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ కలుగుజెయ్యాలి.

అలాగే ప్రేమను, కష్ట సుఖాలను పంచుకునే విషయంలో మన దేశ పరిధులను దాటి అంతర్జాతీయ పరిధులకు అంటే అన్ని దేశాలకూ చేరుకోవాలి. దానినే విశ్వజనీనత అంటారు.

తనను గూర్చే కాక ప్రపంచాన్ని గూర్చి ఆలోచించే భావన చిన్న తనంలోనే పిల్లల్లో కలుగజెయ్యాలి.

# మాటలే బంగారు మూటలు

"మన మాటలలోని తియ్యదనంలో ప్రపంచాన్ని జయించగల శక్తి ఉందని" మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారన్నారు. అంతే కాదు "వాగ్భూషణం సుభూషణం" అని అంటారు. మనిషికి మంచి ఆభరణం వాగ్భూషణమే అని అంటారు. మాటలకు ఎందరినో కదిలించి వేసే శక్తి ఉంటుంది. ఎందరినో సన్మార్గంలో పెట్టే శక్తి మాటల్లో ఉంటుంది.

మనం మాట్లాడే తీరులోనే మన వ్యక్తిత్వం, మన నడత తీరూ ఉంటుందని చెబుతారు. ఒక మనిషి మాటల తీరులోనే ఆ మనిషిని విలువ కట్టవచ్చునంటారు.

మనం మాట్లాడేటప్పుడు ఎవరి మనస్సూ నొవ్వకుండా ఉండాలి. పరుష వాక్యాలతో ఎదటి వారి మనస్సు గాయపడుతుంది. అలా కాకుండా మనం మాట్లాడే మాటలు మనస్సుకు హత్తుకొని పోయేలా ఉండాలి. ఎదటి వారితో స్నేహాన్ని పెంచేలా ఉండాలి. మన మాటలు ఎదటి వారితో శతృత్వానికి దారి తీసేలా ఉండకూడదు. అలా 'మనమాటలే బంగారు మూటలని" మనం భావించాలి.

మన సమాజంలో సత్యానికే ఎక్కువ విలువ ఉంది. అందువల్ల ఎప్పుడూ సత్యాన్నే పలుకు.

చాడీలు చెప్పడానికి ప్రయత్నించకు. చాడీలు ఇంట్లోనూ, కుటుంబాల్లోనూ, సమాజంలోనూ కలహాలు రేపుతాయి. ద్వేషాలకు దారి తీస్తాయి. సన్నిహితులను విరోధులను చేస్తాయి. అందువల్ల చాడీల జోలికి పోకు.

## పరిశుభ్రంగా ఉండు - ఆరోగ్య నియమాలను పాటించు

ప్రతి రోజూ ఉదయం లేవగానే ఓ గంట పాటు వ్యాయామం చెయ్యడం చాలా అవసరం. శరీరానికీ, మానసిక శక్తికీ అది ఎంతగానో తోడ్పడుతుంది. ప్రతిరోజూ స్నానం చెయ్యడం మరవకు - శుభ్రమైన ఉతికిన బట్టలనే వేసుకో - చెమటనూ, వాసనలనూ ఎప్పటికప్పుడు వదిలించుకో.

రాత్రిళ్లు ఎక్కువగా మేల్కొనకుండా తొందరగా పడుకొని తొందరగా లేవడానికి ప్రయత్నం చెయ్యాలి. నిత్యం ఆచరించే పనులకు ఒక కార్యక్రమ, కాల నిర్ణయ పట్టికను, టైం టేబుల్‌ను తయారు చేసుకొని దాని ప్రకారంగా మెదలాలి. అలా అయితేనే మనం అనుకున్న పనులను సక్రమంగా చెయ్యగలుగుతాం. అన్నింటినీ నెరవేర్చ గలుగుతాం..

మనమే కాదు మన పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి పరిసరాల్లోని గడ్డిని, పనికి రాని మొక్కలు తీసేస్తూ శుభ్రంగా ఉంచుకోవాలి. మనమూ, మన ఇల్లూ, మన పరిసరాలూ శుభ్రంగా ఉండేలా శ్రద్ధ తీసుకోవాలి.

మన శరీరం శుభ్రంగా ఉండాలి - మంచి ఆలోచనలతో మన మనస్సునూ ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలి.

# సంఘ శ్రేయస్సే ప్రధానంగా నడుచుకో

మనిషి సంఘజీవి. సంఘం వ్యక్తి మీద, వ్యక్తి సంఘం మీద ఆధార పడడం సహజం. అందువలన ప్రతి వ్యక్తీ సమాజ నియమాలను, సంఘ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవాలి. నిత్య జీవితంలో వీటిని అనుసరించాలి. ముఖ్యంగా సత్యం, అహింసలకు కట్టుబడి ఉండాలి.

మనుష్యుల పట్లనే కాదు అన్ని జీవ జంతవుల పట్ల కూడా ప్రతి ఒక్కరూ దయ, ప్రేమ, కరుణలను కలిగి ఉండాలి. విద్యార్థుల్లో కూడా చిన్న తనంలోనే ఇలాంటి సుగుణాలు అలవడేలా చెయ్యాలి. ఇందుకు తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ కృషి చెయ్యాలి.

బుద్ధుడు మొదలు గాంధీజీ వరకూ అహింసనే పరమావధిగా భావించి ఆచరించి చూపించారు. హింసతో పాటు ఎలాంటి పాప కార్యాలూ చేయకూడదని విద్యార్థులకు చిన్నతనంలోనే రంగరించి పోయాలి.

అబద్ధం చెప్పడం కూడా హింస కిందకు వస్తుందని విద్యార్థులు అవగాహన చేసుకోవాలి. ఈ బాధ్యత ఉపాధ్యాయుల పైనా తల్లిదండ్రుల పైనా ఉంది. విద్యార్థులు నేర్చుకునే మంచి గుణాల్లో మరొకటుంది. అదేమిటంటే వ్యక్తి తనకు కావలసినంత మేరకే సంపాదించుకోవాలి. సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని ధనాన్ని తమ వద్దే దాచుకునే ప్రయత్నం చెయ్యగూడదు. "ధనం అందరి చేతుల్లోనూ మెదులుతూ ఉండాలి", అని గాంధీజీ ప్రవచించారు.

తమకు కలిగిన దాంట్లో కొంత మేరకు సమాజంలోని బలహీన వర్గాలకు విధిగా అందజెయ్యాలి.

## మంచి మిత్రుణ్ణి ఎంచుకో

మంచి వ్యక్తుల మధ్య ఏర్పడ్డ మైత్రి ఎన్ని అవాంతరాలు వచ్చినా, ఎన్ని కష్టాలు ఎదురైనా చెడిపోగూడదంటారు. కష్టాల్లోనూ, సుఖాల్లోనూ ఆదుకునే వాడే మంచి స్నేహితుడు.

మంచి పరిస్థితుల్లో స్నేహం చేసి కష్ట సమయంలో దూరంగా ఉండే వాడు నిజమైన స్నేహితుడు కాడు. అలాంటి వారిని స్వార్ధపరులంటాం. ఇలాంటి హీనమనస్తత్వం కలవారి మధ్య స్నేహం కలవారి మధ్య స్నేహం కలకాలం నిలువదు.

మంచి వ్యక్తులెవరో తెలుసుకున్న మీదటే అతనితో స్నేహం చెయ్యాలి. కష్టకాలంలో తన వెంట ఉండి, అండగా నిలబడి ఆదుకున్న వాడే నిజమైన స్నేహితుడు. అలా కాక మనతో లాభం పొందడానికే స్నేహం చేస్తే అతడు స్నేహితుడు కాడు, స్వార్ధపరుడు, కపటి అని తెలుసుకోవాలి.

మన కష్టాల్లో పాలు పంచుకొని, మన వెంట ఉండే వారే నిజమైన మిత్రులు - అలాంటి వారితోనే స్నేహం చెయ్యాలి.

# ఈనాటి తరానికి ఎలాంటి విద్య కావాలి?

కేవలం పుస్తకాల ద్వారా కలిగే జ్ఞానాన్ని సంపూర్ణ జ్ఞానం అని అనలేం – పెద్దలు అలాంటి విద్యను రసం లేని ఫలమన్నారు.

విద్య మంచి గుణాలను పెంచి విచక్షణా జ్ఞానాన్ని పెంచేదిగా ఉండాలంటారు. ఒక విధంగా చెప్పాలంటే ఇపుడు విద్యాలయాల్లో గరుపుతున్న విద్య కేవలం ఉద్యోగాల కోసమే అని అనవచ్చును. కాగా ఈనాటి ఉద్యోగాలు కేవలం ధనార్జనకు మాత్రమే పరిమిత మౌతున్నాయి.

విద్య ప్రపంచ జ్ఞానాన్నీ, సమాజ శ్రేయస్సుకు ఉపయోగ పడే విధంగా, వ్యక్తి వ్యక్తిత్వాన్ని, మూర్తిమత్వాన్ని తీర్చి దిద్దేదై ఉండాలి. మంచి శీలాన్నీ, వినయాన్నీ పెంపొందించాలి. విద్య ప్రతి ఒక్కరికి దిశామార్గాన్ని చూపించేదిగా ఉండాలి. విద్య సత్యమార్గంలో నడిపించేదిగా ఉండాలి. ధర్మాన్ని అనసరించే రీతిలో నడిపించాలి. విద్య సంస్కారవంతులనుగా చేయగలుగాలి. ఆదర్శ ప్రాయులనుగా తీర్చిదిద్దాలి.

విద్య చాలా పవిత్రమైనది. మనిషిలో ధృడత్వాన్ని కలుగజేసి విచక్షణా జ్ఞానాన్ని పెంపొందిస్తుంది.

అలాంటి విద్యను ఈనాటి తరానికి అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# 29. అన్నింటికీ మూలం ఇల్లే

ఉదయం నుండి సాయంత్రం వరకుండే దిన చర్యలో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇళ్లల్లోనే మంచి వాతావరణాన్నీ, ప్రశాంతతనూ కలుగజెయ్యాలి. పిల్లలకు చికాకు కలిగించే చర్యలకు పూనుకోకూడదు. ప్రశాంతమైన జీవితమే ప్రశాంతతకు దోహదం చేస్తుంది. అప్పుడే బాగా ఎదగ గలుగుతారు. పిల్లలు తమ వ్యక్తిత్వాన్ని, మూర్తి మత్మాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచుకోడానికి ఇంట్లోని ప్రశాంత వాతావరణమే ప్రధానం కావాలి.

- ఇల్లు, ఇంటి పరిసరాలు ఆకర్షణీయంగా ఉండేలా చూడాలి.
- ఇల్లు, ఆవరణ, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి.
- ఇంటిలో పరిశుభ్రమైన త్రాగు నీరుండేలా నీటి వ్యవస్థను గూర్చి పిల్లలకు నేర్పాలి. మురుగు నీరు నిలువ కాకుండా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఇలాంటి పనులను పిల్లల చేత చేయించాలి.
- ఇంటి పెరట్లలో కూరగాయలను, ఆకు కూరలను పెంచేలా వారికి శిక్షణనివ్వాలి. ఇంటి ఆవరణలో నీడనిచ్చే చెట్లు, వేప లాంటి చెట్లను నాటించి వాటి ప్రాధాన్యతను తల్లిదండ్రులు తెలుపాలి.
- పిల్లలు ప్రాతచే కాలంలోనే లేచి పనులకు పక్రమించేటట్లు చెయ్యాలి తల్లిదండ్రులు.
- ఉదయమే దైవ ప్రార్ధన చేసుకోవడం పిల్లలకు నేర్పాలి.
- దైవ దర్శనానికి వెళ్లేటప్పుడు పిల్లల్ని తమ వెంటబెట్టుకొని వెళ్లాలి. ప్రార్ధన, దైవ దర్శనం లాంటి మంచి అలవాట్లను నేర్పించాలి.
- పెద్ద వారి యెడల మెదిలే తీరునూ, తల్లిదండ్రులకూ, పెద్దలకూ పాదాభివందనం చేసే అలవాటునూ కలుగచెయ్యాలి. నీతి సూత్రాలనూ బోధించాలి.
- భోజనం ముందు భగవంతుని స్మరించడం నేర్పాలి.

- ఇంటి వారంతా కలిసి భోజనం చెయ్యాలి. ఇంటి వారంతా కలిసి మెలిసి ఆత్మీయంగా ఉండేలా చూడాలి.
- అతిథి మర్యాదలను గూర్చి వారికి తెలియజెయ్యాలి - నేర్పాలి.
- ఇరుగు పొరుగు వారితో మంచి సంబంధం (సత్సంబంధం) గూర్చి నేర్పాలి.
- ఇంటి వారంతా సమరసతను పాటించాలి.
- మాతృభాష పట్ల గౌరవభావం కలిగించాలి. అమ్మ, నాన్న ("మమ్మీ", "డాడీ" బదులు) అని పిలిచేలా చూడాలి.
- నీతి శాస్త్రాన్నీ, నీతి పద్యాలనూ పిల్లలకు చిన్నతనంలోనే నేర్పించాలి.
- నీతి కథలనూ, రామాయణం, భారతం, భగవద్గీతలను గూర్చి పిల్లలకు వివరించాలి. వాటికి సంబంధించిన కథలను చెప్పాలి.
- అన్ని మతాల సారం ఒకటేననీ, అన్ని మతాలూ మంచినే బోధిస్తాయనే భావన పిల్లల్లో ఇళ్లలోనే నెలకొనాలి. అందుకు తల్లిదండ్రులు అలాంటి బీజారోపణ కావించాలి. అందుకు వారికి బైబిల్, ఖురాన్, భగవద్గీతలోని ముఖ్యాంశాలు తెలియజెయ్యాలి.

## 30. మాతృభాష పట్ల మమకారం

"దేశ భాషల్లో తెలుగులెస్స" అని శ్రీ కృష్ణ దేవరాయలన్నారు. తెలుగులో మంచి మాధుర్యం ఉంది అని ఒక విదేశీ పండితుడు హెన్రీ మోరిస్ అన్నారు.

అంతెందుకు "తెలుగు భాష సరళమైన, అందమైన, మధురమైన భాష" అని డా॥ హోమీ ఫీల్డ్ లియోడ్ అన్నారు. ఇంతటి మాధుర్యమైన తెలుగు భాష రోజురోజుకూ ఏవగింపుకు గురి అవుతోంది. మన మాతృభాష అయిన తెలుగు రోజురోజుకూ నిర్లక్ష్యం చేయబడుతూంది. దీనికి మరెవరో కాదు తెలుగు వారే కారణం. తల్లిదండ్రులే కారణం. మన పాలకులే కారణం. ఒక విధంగా ఈనాటి ఉపాధ్యాయులూను – ఇళ్లల్లో ఇపుడు లేచిన దగ్గర్నుండీ పరభాష అయిన ఆంగ్ల పదాలే వినిపిస్తుంటాయి. మనకు స్వాతంత్ర్యం వచ్చి బ్రిటిష్ వాళ్లు ఈ దేశం నుండి వెళ్లిపోయినా వారి సంస్కృతి, భాష మాత్రం మనను వీడడం లేదు.

ఇంగ్లీషులో మాట్లాడితే అదో గొప్ప అని అనుకుంటున్నామే కాని మన మాతృ భాషను తృణీకరిస్తున్నామని అనుకోవడం లేదు. ఎంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు మాతృభాషలో పద్యాలను వల్లె వేయిస్తున్నారు. మాతృ భాష పట్ల మమకారాన్ని కలిగిస్తున్నారు. మాతృభాష పట్ల మమకారాన్ని పెంచుతున్నారు.

తమ పిల్లలు పెద్ద చదువులు (ఇంగ్లీషు చదువులు) చదివి ఇతర దేశాల్లో ఉద్యోగాలు చెయ్యాలనే ఆలోచనలతోనే మెదులుతున్నారు. అంతే కాని ఇంగ్లీషుతో పాటు మాతృ భాషను కూడా రంగరించి పోయాలనుకోవడం లేదు. చివరికి పిల్లల చేత మమ్మీ, డాడీ, ఆంటీ, అంకుల్ అనిపించుకోవడాన్ని ఒక గొప్ప సంస్కృతిగా భావిస్తున్నారు.

మాతృభాషలో బోధన మహత్తర శక్తివంతమైనది. విషయాన్ని మాతృభాషలో బోధిస్తే పిల్లలు సులువుగా, సమూలంగా, సమగ్రంగా అర్థం చేసుకుంటారు. మాతృభాషలో బోధన వల్ల అవగాహన పెరుగుతుంది. ఆలోచన పెరుగుతుంది. పరిశీలనా జ్ఞానం పెరుగుతుంది. అందువల్ల పిల్లలకు ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో మాతృభాష మాధ్యంగానే విద్యాబోధన జరగాలి.

"తెలుగులో ఊహించు. తెలుగులో భావించు. తెలుగు చదివి, తెలుగు

రాసి తెలుగులో జీవించు” అని తెలుగు వారిని శాసించారు మహాకవి దాశరథి.

పిల్లలకు మనం ఇవ్వ - మన ఆస్తిపాస్తులే కాదు!! మన భాషా సంస్కారాలు కూడా.

ఆంగ్ల భాష అంతర్జాతీయ భాష - పై చదువులు ఆంగ్ల భాష మాధ్యమంగా జరగవచ్చును. కాని మాతృభాషను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ తృణీకరించకూడదు. ఇపుడు ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ అన్ని కోర్సులు తెలుగు మాధ్యమంలో బోధించబడుతున్నాయి. ప్రపంచ పరిజ్ఞానానికి ఆంగ్ల భాష అవసరమే కాని మాతృభాషను కాదని ఆంగ్లంలోనే చదువు కొనసాగిస్తామనడం వెర్రి ఆలోచనే అవుతుంది.

ఆధునిక కాలానికి, అవసరాలకు అనుగుణంగా తెలుగు భాషను పరిపుష్ఠం చేసుకోవడం తెలుగు జాతి ప్రథమ కర్తవ్యం.

ఇప్పుడు మన మాతృభాష చిన్న బోతోంది. ఇప్పుడు మనం మనం కాము. మన నేల, నీరు, గాలి మనవి కావు. తెలుగు వాడు తనకు తాను పరాయి వాడుగా కనిపిస్తున్నాడు. ఆధునిక విజ్ఞాన పురోగతి, నూతన అంతర్జాతీయ, వాణిజ్య వికాసం, ప్రపంచీకరణ వంటి బలమైన కారణాలు మన ప్రభుత్వాల అసమర్ధ విధానాలకు తోడై తెలుగు తనాన్ని దిగజారుస్తున్నాయి.

ఆలస్యంగానైనా మన మాతృ భాషను ఆధునిక విజ్ఞానం అందించే సమర్ధమైన భాషగా నిరూపించడానికి మేధావులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏమైనా మాతృభాష పట్ల గౌరవాన్ని పెంచడం అందరి దృక్పథం కావాలి. గతంలో కంటే తెలుగు భాషకు ఎంతో మన్నన పెరిగింది. ఇంకా పెరగాలి. మన మాతృభాష మీద మనకు మక్కువా పెరగాలి. ముఖ్యంగా మన మాతృభాషలోని కమ్మదనాన్ని పిల్లలకు నేర్పించాలి. తెలుగు మాటలు, సామెతలు, పలుకు బడులు ఎన్నింటినో పిల్లలకు ప్రాథమిక దశలోనే వంట బట్టించాలి. ఇది మనందరి ధర్మం, కర్తవ్యం కావాలి.

# 31. ప్రశాంత ప్రపంచానికి గాంధీజీ సిద్ధాంతాలే శరణ్యం

ఒక వ్యక్తి చివరిదాకా మంచి వ్యక్తిగా ఉంటూ సత్కార్యాలే చేయాలనుకుంటే – ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార పీఠాన్ని ఆశించకూడదని గాంధీజీ నిర్దేశించారు.

గాంధీజీ ప్రభోదించిన ఈ పరమ సత్యహక్కు ఏ మేరకు అమలులో ఉంది? మహాత్ముడి సంస్కృతీ సాంప్రదాయాలకు మేము సిసలైన వారసులమంటూ ఢంకా బజాయించే వారిలో ఇపుడు ఎంత మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా అధికారం చెలాయించకుండా ఉంటున్నారు?

ఇపుడు ప్రజాధనాన్ని సొంత ప్రయోజనాలకు వాడుకోవడమే కాదు దాన్ని దుబారా చేస్తున్నారు. ఇవి నేరాల కిందకే వస్తాయన్నది గాంధీజీ ప్రబోధం. దీనిని మన నాయక గణం వీసమెత్తైనా పట్టించుకుంటున్నారా?

జనం తలలో నాలుకలా మసలుతూ నిరాడంబర జీవితం గడపమంటే, పట్టించుకుంటున్నది ఎంత మంది? ప్రజా సేవను గూర్చి గాంధీజీ ఎంతో విడమర్చి చెప్పారు. ప్రజాసేవను కైవసం చేసుకోవడం సులువైన మార్గం కాదు. ఇపుడు ప్రజా సేవను సులభ ఆర్జన మార్గంగా ఎంచి ఎలాగైనా సరే అధికార పదవులకు ఎగబాకడం, అందుకు ఎదురు వచ్చిన వాళ్లను అడ్డు తొలగించుకోడానికి ఎంతటి దుష్కృత్యానికైనా పూనుకోవడం ఇపుడు జరుగుతున్నదే.

ఇపుడు పదవులనూ, నిధులనూ పంచుకోవడం రాజకీయ మార్గంగా మారిపోయింది. "నీతి, నిజాయితీ, నిబద్ధత" ప్రజా జీవితంలో విలసిల్లాలని మహాత్ముడు అభిలషించిన గొప్ప మార్గాలు. కాని ఈ కలికాలంలో ఇవి మచ్చుకైనా కనిపిస్తున్నాయా? ఇపుడు ఆశ్రిత పక్షపాతాలు, అవినీతి కుంభకోణాలు రాజకీయాల్లో మామూలైపోయాయి. నాయకుల అధికార లాలస, పదవీ వ్యామోహాల ధాటికి ప్రజాశ్రేయస్సు నిత్యం బలిపశువై పోతోంది.

అసలు గాంధీయిజంలో సత్తా లేకపోతే ఈ భూగోళం మీది నుంచి అది ఏనాడో కనిపించకుండా పోయేది. ఆయన సిద్ధాంతాలు విదేశాల్లో ఎందరో మహానుభావులను ఆకర్షిస్తున్నాయి. అదేం దురదృష్టమో కాని, దౌర్భాగ్యమో కాని మన దేశంలోనే గాంధీజీ సిద్ధాంతాలకు తూట్లు పొడుస్తున్నారు.

"మద్యపానం, ధూమపానం, జూదం" ఇవి మానవున్ని నిలువుగా ముంచేస్తాయి. గాంధీజీ వీటిని పూర్తిగా అసహ్యించుకునే వారు. కాని ఇప్పటి ప్రభుత్వం వీటినే విశేష ఆదాయ వనరులుగా మలచుకుంటోంది. ప్రజా ప్రభుత్వ అధినేతలు వీటిని బాహాటంగా ప్రోత్సహిస్తున్నారు.

పల్లె సీమలు స్వయం సమృద్ధమైన పచ్చగా కలకల లాడాలన్నది మహాత్ముడి బంగారు కల. ఇది నిజం కావడానికి ఎన్నో పథకాలు రూపొందుతున్నాయి. కాని సక్రమంగా అమలు కావడం లేదు. కొన్ని పూర్తి కాకుండానే నిలిచిపోతున్నాయి. అసహాయ రైతన్నల, పేదల ఆత్మహత్యలు ఈ నాటికీ కొనసాగుతున్నాయి.

ఆకలి, అవిద్య, అనారోగ్యం, అంటరానితనం - ఇవి ఎప్పుడో నిర్మూలించబడాలి. కాని ఇవి ఎక్కడికక్కడ తిష్ఠ వేసుకొని రాజ్యమేలుతున్నాయి. ఉగ్రవాదం, హింస, ద్వేషాలకు తావులేని శాంతియుత ప్రపంచానికి మానవాళిని చేర్చగలిగేది గాంధీ మార్గమే.

సమకాలీన సమస్యల్ని ఎదుర్కోడానికి గాంధీమార్గం నుంచే మనం స్ఫూర్తినొందాలి. ఇది యదార్థం. ఇకనైనా మానవాళి గాంధీ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకొని ముందుకు పయనిస్తే శాంతియుత, ప్రశాంత ప్రపంచాన్ని చూడగలుగుతుంది.

# 32. నేటి తరానికి గాంధీజీ బోధనలు

తాను నమ్మిన సిద్ధాంతాన్ని తన జీవితంలో ఆచరించి, ప్రపంచానికి ప్రబోధించారు బాపూజీ. అందులోనే గాంధీజీ గొప్పతనం దాగుంది. ఆయన ఆవిష్కరించిన సూత్రాలు, ఆచరించిన మార్గాలు అన్నీ భారతీయ జీవన విలువల నుండే వచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

పాశ్చాత్య నాగరికతను నరనరాన జీర్ణించుకున్న ఎందరో విదేశీయులు కూడా గాంధీజీ సిద్ధాంతాలపై అపనమ్మకాన్ని ప్రకటించారు. కొందరైతే గాంధీజీ పంథాను తీవ్రంగా విమర్శించారు. అయినా గాంధీజీ ప్రభావం ఏ మాత్రం తగ్గలేదు. గాంధీజీ ప్రభావం ఆ రోజుల్లో ఎంతో బలంగా ఉండేది. జాతీయోద్యమ స్ఫూర్తిని కేవలం విద్యార్థికులకు మాత్రమే పరిమితం చెయ్యలేదు. ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తిని మానవాళి కంతటికీ పరిచయం చేశారు బాపూజీ. అలాంటి సత్యాశ్రమ సాధకులు గాంధీజీ. పోతే గాంధీజీ ప్రవచించిన సిద్ధాంతాలు నేటి తరానికి ఎంత వరకు తోడ్పడతాయనేది ప్రశ్న?

నిజానికి ఈ ప్రశ్న ఈనాటిది కాదు. బాపూజీ జీవించిన రోజుల్లో కూడా ఈ ప్రశ్న ఉత్పన్నమైంది. గాంధీజీ వ్యక్తిత్వాన్ని ఎంతగానో ఆరాధిస్తూనే, ఆయన సిద్ధాంతాన్ని అదే స్థాయిలో వ్యతిరేకించిన వారు ఆనాడూ ఉన్నారు. మహాత్ముడు బోధించిన విద్యావిధానాన్ని (నయీ తాలీం – పని ద్వారా విద్య) ఎంతో మంది ప్రశ్నించారు. కాని ఆ తరువాత కానీ ఆ విద్యా విధానం విలువలు తెలిసి రాలేదు. చదువుతో పాటు పని అనే సూత్రం ఎంతో విలువైనది – అది పిల్లల భావి జీవితానికి తోడ్పడుతుంది. బాపూజీ బోధించిన చరఖా సంస్కృతి కూడా మొదట్లో ఎవరికీ అర్థం కాలేదు. చరఖా సంస్కృతి జీవనోపాధికి మార్గమని అంతా తెలుసుకోసాగాడు. గాంధీజీ కుటీర పరిశ్రమల్ని ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవి జీవనోపాధికి మార్గాన్ని చూపించాయి. బ్రతుకు దెరువును చూపిస్తున్నాయి ఈనాటికీ.

బేసిక్ విద్యావిధానం – అప్పట్లో జూనియర్ బేసిక్ స్కూళ్లు (ప్రైమరీ స్కూళ్లు), సీనియర్ బేసిక్ స్కూళ్ల (మిడిల్ స్కూళ్లు)ను ప్రవేశ పెట్టి చదువుతో పాటు కొన్ని పనులను నేర్పించారు. ఈ విధానం ఎంతో కాలం నిలువలేదు.

ఆనాడు గాంధీజీ చెప్పిన విద్యా విధానం ప్రాథమిక స్థాయిలోనూ అమలు కాలేదు. భవిష్యత్తులో అది విద్యార్థులకు జీవనోపాధిని కల్పిస్తుందని కొందరు మాత్రమే అర్థం చేసుకున్నారు.

గాంధీజీ చెప్పిన విలువలతో కూడిన జీవన మార్గం ఈనాడు అనివార్యమైన అవసరం. భారత యువతరం, ముఖ్యంగా నగర జీవనతరం ప్రపంచీకరణ ప్రభావంలో పడిపోతోంది. డబ్బుతో సాధించలేనిది లేదనే అభిప్రాయం బలపడుతోంది. వస్తు వ్యామోహం అంతకంతకూ వెర్రితలలు వేస్తోంది. ఆనందమే జీవితమనే ఆలోచన అందరిలోనూ పెరుగుతోంది. చివరికి అంతులేని అసంతృప్తి బాగా అధికమౌతోంది. చివరికి మానవుల మధ్య ఉండవలసిన మానవీయ సంబంధాలు మటుమాయమౌతున్నాయి. అసమానతలు బాగా పెరిగిపోతున్నాయి. ఈ ఆర్థిక అసమానతలు ముందు ముందు మరిన్ని ఉద్రిక్తతల్ని సృష్టించే ప్రమాదం ఉంది.

ఈ పరిస్థితుల్లో గాంధీ బోధనలు వాటి ఆచరణ, అపూర్వ ఉపశమనాలవుతాయి. "సంతృప్తిని మించిన సంపదలేదనే గాంధీ తత్వం - నిజంగానే ఈ కాలానికి ఒక అమృత సరోవరం. దీనిని అందరూ జీర్ణించుకుంటే కల్లోలాలు ఉండవు. హింస ఉండదు - ప్రశాంతతకు దారి ఏర్పడుతుంది. ముఖ్యంగా సత్యం, అహింసా విధానాలను పిల్లలకు బోధించి వాటిని అనుసరించేలా చేయాలి.

# బోసిపోతున్న బాలుర భవితవ్యం

"కష్ట పడుతూ నీతి, నిజాయితీలతో ముందుకు సాగితే ఎప్పుడూ నీకు విజయమే కలుగుతుంది" అని చిన్ననాడే చెరుకూరి రామారావు గారి తల్లిదండ్రులు అందించిన జీవన గమ్యం ఆయనను గొప్ప మలుపు దారిలోకి మళ్లించింది. ఆ దారిలోనే ఈ నాటికీ ఆయన ముందుకు సాగుతూనే ఉన్నారు. అలుపెరుగని జీవితం ఆయనది.

ప్రజల పెట్టుబడితో ప్రజలకు లాభాన్ని చేకూర్చి వారితో పాటు తానూ అనుభవిస్తూ సమాజ శ్రేయస్సే తన శ్రేయస్సని భావించే ఆదర్శవాది వీరు.

నిత్య జీవితంలో తన వ్యాపార వ్యాసంగంలో మునిగి తేలుతూ ఎదటి వారిని గూర్చి, సమాజాన్ని గూర్చి ఆలోచించడానికి కొంత సమయాన్ని కేటాయిస్తారు.

సమాజంలో నానాటికీ చోటు చేసుకుంటోన్న దుష్పరిణామాల, దుష్కృత్యాల, హింసాత్మక విధానాల పట్ల తీవ్రంగా చలించే మనస్తత్వం వీరిది. సమాజం తీరు పట్ల వీరిలో ఆవేదన ఉంది. తపన ఉంది. ఈ సమాజానికి ఏదో కొంత చేయాలనే ఆరాటం ఉంది. అందుకు తగిన కార్యసాధన ఉంది.

ఏనాటికైనా ఈ సమాజానికి గాంధీజీ చూపించిన అహింస, సత్యం, శాంతియుత విధానాలే, సత్యసాయి గారి ప్రబోధాలే శరణ్యం అని అంటారు వీరు.

# విద్యకు పునాది ప్రాథమిక విద్య

"మొక్కై వంగనిదే మ్రానై వంగదంటారు". అందువల్ల పిల్లల్లో చిన్నతనంలోనే, ప్రాథమిక విద్యా స్థాయిలోనే వారి జీవితానికి పునాదులు వేయవలసి ఉంటుంది. ప్రాథమిక స్థాయిలోనే విద్యతో పాటు మన సంస్కృతీ సాంప్రదాయాల పట్ల, క్రమ శిక్షణ పట్ల అవగాహనను కలిగించడానికి ప్రయత్నం చెయ్యాలి. మన ఇరుగుపొరుగు వారు, సమాజం పట్ల, సమాజం తీరు పట్ల, ఎదటి వారి పట్ల వారు వ్యవహరించే తీరు పట్ల అవగాహనను కలిగించాలి. తల్లిదండ్రులు, సమాజంలోని ఇతర పెద్దల యెడల ప్రవర్తించే తీరును వారికి ఈ దశలోనే నేర్పించ వలసి ఉంటుంది. తోటివారికి సహాయ పడటం, బలహీనులకు, జబ్బు చేసిన వారికి సహాయం అందించే విషయంలో, ఎదటి వారిని నొప్పించ కుండా మాట్లాడే తీరును వారికి ఈ ప్రాథమిక స్థాయిలోనే నేర్పవలసి ఉంటుంది.

ఇంట్లో తల్లిదండ్రులతో మొదలైన నీతి పాఠాలు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో గట్టి పడిపోతుంటాయి. అలాగే మంచి, చెడుల విచక్షణా జ్ఞానం ప్రాథమిక విద్య స్థాయిలోనే పాదుకొల్పబడాలి. అలా ప్రాథమిక విద్య స్వచ్ఛమైన, ప్రశాంతమైన వాతావరణంలో జరగాలి. కాగా ప్రాథమిక స్థాయిలో కావించే విద్యా బోధన బాలబాలికల హృదయాలలో బీజాలుగా నాటుకొంటాయి. అందువల్ల వారికి నీతి, నియమాల పాఠాలతో పాటు మహనీయుల, మార్గదర్శకుల జీవితాల్లోని ఆదర్శ ఇతి వృత్తాలనూ వినిపించి వారిలో నైతిక విలువలు నాటుకొనేలా చేయాలి.

సత్యాన్ని పాటిస్తూ, పెద్దలను గౌరవిస్తూ, మంచి పౌరులుగా, సచ్ఛీలురుగా వారు తయారు కావడానికి రామాయణ, మహాభారత, భగవద్గీత, బైబిల్, ఖురాన్‌ల నుంచి కొన్ని ఘట్టాలను వినిపించి వారికి అన్ని మతాల, ధర్మాల పట్ల అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగాలి. తరగతి పుస్తకాలతో పాటు, పాఠ్యాంశాలతో పాటు పాఠ్యాంశాల్లో లేని కొన్ని నీతి, నియమాలనూ, సదాచారాలనూ, సత్ సాంప్రదాయాలనూ వారిలో పాదుకొల్ప వలసి ఉంది. ఎన్నో ధర్మ సూత్రాలను వారికి అర్ధమయ్యే రీతిలో బోధించి వారి మనస్సులలో స్థిరంగా కూర్చుండే విధంగా వారికి బోధించ వలసి ఉంటుంది.

ఏమైనా లేత మనసులపై ప్రభావాన్ని చూపే విషయాలు వారి భవిష్యత్ జీవితాలపై మంచి ప్రభావాన్ని చూపుతాయి. వారు పెరిగి పెద్ద వారైన తరువాత కూడా వారిలో ముద్రపడి తద్వారా గట్టి పడ్డ విధానాలే వారి జీవిత ఆశయాలౌతాయి. అవి సమాజానికి ఎంతగానో తోడ్పడతాయి. చిన్ననాడే వారిలో గట్టిపడిన విధానాలే అటు ఆత్మ (స్వంత) శాంతికీ, విశ్వశాంతికీ దోహదపడతాయి. అలా చిన్న పిల్లల్లో అతి సామాన్యమైన విషయాల నుండీ మహదాశయాల వరకూ బీజారోపణ జరగాలి. సత్పౌరులుగా, ఆదర్శ పురుషులుగా ఎదగడానికీ ప్రాథమిక విద్యా స్థాయిలోనే బీజారోపణ జరగాలి.

అందుకు ఈ ప్రాథమిక స్థాయిలోనే ఇంట్లోనూ, పాఠశాలలోనూ ప్రశాంతమైన, స్వచ్ఛమైన, సుమధురమైన వాతావరణం ఉండాలి. ఆదర్శవంతమైన విద్యాలయాలు, ఆదర్శ ఉపాధ్యాయులు ఉండాలి.

అప్పుడే మనం ఆశిస్తున్న ఈ ప్రాథమిక స్థాయి విద్య సుసంపన్నమై విలసిల్లుతుంది.

మరిప్పుడు మనం ఈ ప్రాథమిక స్థాయిలో ఆదర్శవంతమైన విద్యను, ప్రశాంత వాతావరణానికి నిలయమైన పాఠశాలలను సమకూర్చ గలుగుతున్నామా? అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులను అందించగలుగుతున్నామా?

## 33. పిల్లల్లో ఆణిముత్యాలు

పిల్లల్లో కొన్ని నిగూఢమైన సహజ లక్షణాలుంటాయి. వాటిని వెలికి తీయవలసిన బాధ్యత పెద్దలపై ఉంటుంది. అలా పిల్లల్లో ఉండే సహజ ప్రతిభావ్యుత్పత్తులను ఇళ్లల్లో తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు వెలికి తీసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు పరవాలి. సంగీతం, కళలు, క్రీడా రంగం, సాహసోపేతమైన పనులకు ఉపక్రమించే తీరు, పెద్దలనే అబ్బుర పరచే అద్భుత జ్ఞాపక శక్తికి సంబంధించిన సామర్థ్యాలుంటాయి. వివిధ రంగాలలో ప్రతిభావ్యుత్పత్తులతో ఎందరో బాలబాలికలు ముక్కు మీద వేలేసుకునేలా చేస్తున్నారు.

ఆయా ప్రభుత్వాలు అత్యద్భుతాలు ప్రదర్శించే బాలబాలికలకు ప్రోత్సాహకాలు అందిస్తూనే ఉన్నాయి. తద్వారా బాలబాలికల్లో ఉత్సాహం ద్విగుణీకృత మౌతుంది.

ఈ క్రమంలో ప్రతి యేడూ గణతంత్ర దినోత్సవం నాడు - సాహసం, తెగువ, సమయస్ఫూర్తి, అన్నింటినీ మించి ఆపదలో ఉన్న వారిని కాపాడాలనే మానవతా దృక్పథం ఉన్న, దేశానికి చెందిన బాలబాలికలను ఎంపిక చేసి దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్రపతి - ప్రధానిల సమక్షంలో "జాతీయ సాహసబాలల పురస్కారాలు" అందజేయ బడుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఆరేళ్ల బాలబాలికలు సహితం ఊహకందని అద్భుత, అనన్య సాహసాలను ప్రదర్శించారు. ఎందరో సాహసవంతులు చరిత్రలో నిలిచే ఎన్నో సాహస ఘట్టాలను ప్రదర్శించారు.

బడి పిల్లలతో వెళ్తున్న స్కూలు బస్సు నదిలో పడి పోయినప్పుడు అందులోంచి ఎలాగో బయటికొచ్చి పిల్లల్ని కాపాడారు హర్యానాకు చెందిన బబిత, అమన్‌జీత్‌లు.

ఓ బాలున్ని కిడ్నాప్ చేసి కట్టి రైలు పట్టాలపై పడేసినప్పుడు ఎలాగో తప్పుకున్నాడు ఆ బాలుడు - తప్పు కున్నప్పుడు ఆ బాలుడు అంటే హర్యానాకు చెందిన అంకిత్ రాయ్ ఓ కాలు కటై పోయింది.

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ముక్తార్థ్ శ్రీవాత్సవ అరడజను ఊరకుక్కల బారిన పడిన తన చెల్లెలిని కాపాడుకున్న సాహస బాలుడు.

తన అమ్మానాన్నలను హత్య చేసిన హంతకులను ఎదిరించి, వారి చెయ్యి కొరికేసి బయట పడింది ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సాహస బాలిక మెహర్ రేఘా.

తనపై అత్యాచారం చేయబోయిన వ్యక్తిని ధైర్యంగా ఎదిరించబోయి తప్పించుకునే ప్రయత్నంలో ప్రాణం కోల్పోయింది మిజోరం అమ్మాయి లాల్రెయింపు.

తుంగభద్రా నదిలో పడి కొట్టుకు పోతున్న వారిలో ఒకరిని రక్షించ గలిగాడు సునీల్ కుమార్.

దురాచారాన్ని ధైర్యంగా ఎదిరించబోయి పోలీసులకూ, టీచర్లకూ చెప్పింది రాజస్థాన్‌కు చెందిన అమ్మాయి కాంగ్రెస్ కర్వర్.

నీళ్ల ట్యాంకులో పడ్డ ఆరేళ్ల పాపను కాపాడారు అభిషేక్, సూరజ్‌లు

40 అడుగుల నీటి లోతులో చిక్కుకున్న పిల్లల్ని కాపాడాడు కేరళకు చెందిన సాహస బాలుడు బిజిన్ బాలు.

అలాగే మూడేళ్ల పసిబాలుడు చెరువులో పడ్డప్పుడు ఆ బాలున్ని కాపాడాడు మానస్ నిషాద్.

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రవీంద్ర హల్దర్, మణిపూర్‌కు చెందిన బోనీసింగ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రవి కుమార్ ఝురియా, అవధ్ కుమార్ ఝురియాలు సాహస కృత్యాలను ప్రదర్శించారు.

అలాగే ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన విజయనగరంలోని బాసంగికి చెందిన రాయపల్లి వంశీ, కరీంనగర్ జిల్లాకు చెందిన కవ్వంపల్లి రాజ్ కుమార్, కర్నూలు జిల్లాకు చెందిన చిగిని సాబ్, కాగా సబిత, అమర్‌జిత్, మిజోరంకు చెందిన లాల్రెయింపూ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యుక్తార్థ శ్రీవాత్సవలకు వారు కనబరచిన సాహస కృత్యాలకు మరణానంతరం అవార్డులు లభించాయి.

2008 జనవరి 24న భారత ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ అవార్డులను అందజేశారు. అవార్డులు పొందిన బాలలందరూ ఏనుగు అంబారీ ఎక్కి గణతంత్ర దినోత్సవం రోజున జరిగిన కవాతులో పాల్గొన్నారు.

## 34. బాల మేధావులు - ఉన్నత లక్ష్యాలు

చిన్న వయస్సులోనే అపార మేధా సంపదను కలిగిన బాలబాలికలున్నారు. అపారమైన మేధస్సును ప్రదర్శించిన తెలుగు తేజాలు ఉన్నారు. పదేళ్లకే మహామహుల చేత శభాష్ అనిపించుకున్న ప్రతిభా వంతులున్నారు.

అలాంటి వారిలో గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన గణిత మేధావి నిశ్చల్ నారాయణంను చెప్పుకోవచ్చును. గణితంపై ఆరు పుస్తకాలు రాసి, రాష్ట్రపతిచే ఆవిష్కరింప చేసిన బుడుగు నిశ్చల్. గణితంలో ప్రపంచ మేధావిగా నిలవాలన్నది ఈ బుడత ప్రథమ లక్ష్యం. అంతే కాదు పేదవిద్యార్థులకు నా చేతనైనంత సహాయం చేస్తానంటాడు.

ఈ బుడత ఆ మధ్య బెహరూన్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల జ్ఞాపక శక్తి పోటీల్లో ప్రథమ స్థానం నిలబెట్టుకున్నాడు.

******

**50** ఏళ్ల క్యాలెండర్‌ను గుక్క తిప్పకుండా చెప్తేస్తాడు వరుణ్. రానున్న దశాబ్దాలలో ఏ రోజు ఏ వారం వస్తుందో ఇట్టే చెప్పేస్తాడు సాయి వరుణ్. ఈ బుడతడు తొలుత ప్రముఖ సినీ నటులు, బంధవులు పుట్టిన రోజులు ఏ వారాల్లో వస్తాయో చెప్పాడు. వ్యవసాయ విశ్వ విద్యాలయం వార్షికోత్సవ వేడుకల్లో ఈ బుడత ప్రతిభను చూసి పలువురు సత్కరించారు.

పెద్దయ్యాక నేను పైలెట్‌నవుతానంటాడు. అంతే కాదు దేశ సేవ చేస్తానంటాడు సాయి వరుణ్.

******

ఈత కొలనులో చేపలా కదిలే జెస్సికా ప్యాట్రిక్ రాష్ట్ర స్థాయి జూనియర్ ఈత పోటీల్లో మూడు స్వర్ణాలు గెలుచుకున్న చిన్నారి. పదేళ్ల జెస్సికా అంతర్జాతీయంగా మన దేశ కీర్తి నిలబెడతానంటుంది. ఒలింపిక్ స్థాయిలో పతకాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

ఉన్నత లక్ష్యాలతో ఎదగాలనుకుంటుంది జెస్సికా.

## నేటి చదువులు - తల్లిదండ్రులకే పెద్ద పరీక్ష

ఇపుడు పిల్లల చదువులు ఎలా కొనసాగినా చదువులు మాత్రం సమ్మెటలయ్యాయి. ఇంట్లోనూ, స్కూలులోనూ కూడా బిడ్డలు నలిగి పోతున్నారు. మూడేళ్ల వయసులో స్కూల్లో చేర్చటంతో ఆరంభమవుతున్న ఈ రంపపు కోత ముప్పై ఏళ్లు నిండి యూనివర్సిటీలకు వెళ్తున్నా కూడా ఏ మాత్రం తగ్గటం లేదు. తల్లిదండ్రులు సామాజిక గాడిలో పడిపోతున్నారు. పిల్లల చదువు మధ్యతరగతికి ప్రతిష్ఠాత్మకంగా తయారవడంతో ఈ ఒత్తిడి అనూహ్యంగా పెరిగిపోయి, ఆత్మహత్యలతో సహా ఎన్నో పరిణామాలకు దారి తీస్తోంది.

స్కూలు వదలగానే ట్యూషన్లు మొదలవుతాయి. ప్రపంచంలో తమ పిల్లలు ముందుడేలా చూడాలన్న తాపత్రయం చాలా ఎక్కువైంది. చాలా వరకు పిల్లల్లో ఈ ఒత్తిడి ఉంటోంది.

మరి విద్యనే నమ్ముకుని పురోగమిస్తున్న మన దేశంలో ఈ ఒత్తిడిని తగ్గించడానికి అంతా కృషి చెయ్యవలసి ఉంది.

# సాయి దేశం - గాంధీ మార్గం

(పాఠశాల విద్యార్థులలో నైతిక విలువల ప్రచార సంస్థ)

## దశసూత్ర కార్యాచరణ ప్రణాళిక

1. ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల బాలబాలికలు మా సంస్థ కార్యాచరణకు కేంద్ర బిందువు.

2. భావి భారత పౌరులైన నేటి విద్యార్థులలో నైతిక విలువల బీజాలను, పాదుకొలుపుట.

3. భారతీయ సాంస్కృతి సాంప్రదాయాలు, తల్లిదండ్రులు గురువులు, పెద్దలు, బంధుమిత్రుల గౌరవం, భగవంతుని యెడ విశ్వాసం క్రమశిక్షణ, కర్తవ్య పరాయణత్వం, మాతృభాష, జాతీయ, అంతర్జాతీయ భాషా పరిజ్ఞానం పెంపొందించుట, ప్రోత్సహించుట.

4. రామాయణ, భారత, భగవద్గీత లాంటి మహా కావ్యాల సారాంశాలు, పురాణ పురుషుల, ఆదర్శ, ఆచరణ యోగ్యమైన, నైతిక విలువలకు ప్రోత్సాహం.

5. వర్తమాన సమాజంలోని, పౌరహక్కులు, బాధ్యతలు, ఆచారాలు, ప్రభుత్వ, పాఠశాల, చట్టాల యెడ గౌరవం భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, బాధ్యతల యెడ అవగాహన.

6. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా సామాన్య పరిజ్ఞానం పత్రికా పఠనం, పాఠ్యేతర పుస్తకాలు, పాఠ్యాంశాల పఠనాభిరుచి.

7. విద్యార్థి కేంద్రమైన, పాఠశాల, క్రమశిక్షణ, నియమ నిబంధనలు, తు.చ. తప్పకుండా పాటించుట. ఉపాధ్యాయుల యెడ, గౌరవం, వినయం, తోటి సహ విద్యార్థులతో సఖ్యత, పెంపొందించుట.

8. శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిచుటకై ఆహార, విహారాలు, భోజన అలవాట్లను, వ్యాయామం, మితాహరం, శాఖాహారం, యెడ వారికి సదవగాహన కలిగించుట.

9. పెద్దలు, వృద్ధులు, మహిళల, బంధువుల యెడ గౌరవం, పీడితుల, పిల్లల యెడ, జీవ జంతువుల యెడ ప్రేమ, స్వచ్ఛంద సమాజ సేవా భావ ప్రవృత్తిని పాదుకొల్పుట.

10. తన భావి జీవితాన్ని, తన అభిరుచికి అనుగుణంగా, తీర్చిదిద్దుకోవడానికై, ప్రేరణ కలిగించే, ఆదర్శ, పురుషులను, ఎంచుకొని, వారల జీవితానుభవాలను, వారల ఆత్మ కథను చదివి, వారి అడుగు జాడల్లో పయనించడానికై ప్రేరేపించుట.

సూచన – మా సంస్థ దశసూత్ర ప్రణాళికను, ఆచరించుటకై, ప్రతి పాఠశాలలో, ఆయా పాఠశాలల యాజమాన్య సహకారంలో మాచే ఎంపిక చేయబడిన, ఒక ఉపాధ్యాయుడుని మా సంస్థ ప్రతినిధిగా ఉంటారు.

## గత 14 సం॥గా మా సంస్థ ఆచరించిన ఆచరిస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలు

1. వృద్ధాశ్రమాలకు విరాళాల రూపంలో సముచిత ఆర్థిక సహాయం.
2. రి. ఉద్యోగుల, పాఠశాల, కమ్యూనిటి హాల్స్ ఇత్యాది, భవన నిర్మాణాల్లో విరాళాలు.
3. నేత్రదాన, రక్తదాన శిబిరాలు నిర్వహించుట.
4. వికలాంగుల, అనాధాశ్రమాలకు విరాళాలు అందజేయుట.
5. భారతీయ సంస్కృతి సాంప్రదాయాల హిందూ ధర్మ ప్రచారంలో, వివిధ, మందిరాలు, విగ్రహ స్థాపనలు, ఆరాధనోత్సవాలు, యజ్ఞయాగాదులు, ఆచరించుట.
6. కవి, పండితులు, రచయితల, రచనలను, ప్రచురించి, గ్రంధావిష్కరణలు, సముచిత ఆర్థిక సహాయం. సాహిత్య కవి సమ్మేళనలు, సన్మాన సత్కారాలు కావించుట.

7. సమాజంలో, వివిధ క్షేత్రాల్లో సేవ చేస్తు స్వచ్ఛంద, సమాజ సేవకులు, మందిర, మసీదు, చర్చిల్లోని, అర్చక, ఖాజీ, ఫాదరీలకు, సన్మానాలు ఆర్థిక సహాయం అందించుట.

8. వివిధ సమాజ రంగాల్లో సేవ చేసిన, చేస్తున్న డాక్టర్లు, ఉపాధ్యాయులు, సంఘ సేవకులు, గృహిణులు, కవి-పండిత ఇత్యాదికులు ఇంతవరకు సహస్రాధిక సత్కార సన్మానాలు పొందిన వారికి కూడా రాష్ట్రంలో, వివిధ ప్రాంతాలలో, చేయడం.

9. పచ్చదనం-పరిశుభ్రతకు సంబంధించిన అవగాహన సదస్సు చెత్త సేకరించడానికై డస్ట్‌బిన్‌ల వితరణ, పర్యావరణ సమతుల్యతకై, మొక్కలు నాటుట, గృహ పరిసరాలను పరిశుభ్రతకై ఎన్నో కార్యక్రమాలు.

10. స్ఫూర్తి ప్రదాతలైన, గాంధి, వివేకానంద లాంటి మహనీయుల, విగ్రహ ప్రతిష్టలు.

11. మాతృభాష తెలుగు భాష, ప్రచార ప్రసారానికై సభలు, సమావేశాలు నిర్వహించుట.

12. వివిధ రంగస్థల కళాకారులు, గాయకులు, భాగవతానృత్యాంగనాలు, సురభి నాటక సంస్థలోని కళాకారులకు ప్రోత్సాహానికై భూరి విరాళాలిచ్చి సాంప్రదాయ కళలను ప్రోత్సహించుట.

13. మా సంస్థ ద్వారా చెరుకూరి విద్యాలయం, కోరుకొండ, తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహించబడుచున్నది.

******



శ్రీ చెరుకూరి రామారావు

ఛైర్మన్, చెరుకూరి గ్రూప్

"కష్ట పడుతూ నీతి, నిజాయితీలతో ముందుకు సాగితే ఎప్పుడూ నీకు విజయమే కలుగు-తుంది" అని చిన్ననాడే చెరుకూరి రామారావు గారి తల్లిదండ్రులు అందించిన జీవన గమ్యం ఆయనను గొప్ప మలుపు దారిలోకి మళ్లించింది. ఆ దారిలోనే ఈ నాటికీ ఆయన ముందుకు సాగుతూనే ఉన్నారు. అలుపెరుగని జీవితం ఆయనది.



శ్రీమతి చెరుకూరి విజయలక్ష్మి

వైస్ ఛైర్మన్, చెరుకూరి గ్రూప్

ప్రజల పెట్టుబడితో ప్రజలకు లాభాన్ని చేకూర్చి వారితో పాటు తానూ అనుభవిస్తూ సమాజ శ్రేయస్సే తన శ్రేయస్సని భావించే ఆదర్శవాది వీరు.

నిత్య జీవితంలో తన వ్యాపార వ్యాసంగంలో మునిగి తేలుతూ ఎదటి వారిని గూర్చి, సమాజాన్ని గూర్చి ఆలోచించడానికి కొంత సమయాన్ని కేటాయిస్తారు. అదే వీరిలోని గొప్పతనం.

సమాజంలో నానాటికీ చోటు చేసుకుంటోన్న దుష్పరిణామాల, దుష్కృత్యాల, హింసాత్మక విధానాల పట్ల తీవ్రంగా చలించే మనస్తత్వం వీరిది. ముఖ్యంగా రోజురోజుకూ అగాధంలో పడి పోతోన్న బాలుర భవితవ్యాన్ని గూర్చి ఎప్పుడూ ఆరాట పడుతుంటారు. సమాజం తీరు పట్ల వీరిలో ఆవేదన ఉంది. తపన ఉంది. ఈ సమాజానికి ఏదో కొంత చేయాలనే ఆరాటం ఉంది. అందుకు తగిన కార్యసాధన ఉంది. చెప్పడమే కాదు చేసి చూపిస్తారు వీరు.

వీరి సతీమణి శ్రీమతి చెరుకూరి విజయలక్ష్మి గారు తన భర్తకు అన్ని విధాలుగా సహకరిస్తున్న విదుషీమణి.

ఇది వీరి మొదటి పుస్తకమే అయినా ఎంతో విలువైనది.

ఏనాటికైనా ఈ సమాజానికి గాంధీజీ చూపించిన అహింస, సత్యం, శాంతియుత విధానాలే, సత్యసాయి గారి ప్రబోధాలే శరణ్యం అని అంటారు వీరు.